
సత్యమేవ జయతే
సాక్షి
WWW.SAKSHI.COM
పేజీలు: 14 వెల: ₹ 6.50
సంపుటి: 17
సంచిక: 190
సోమవారం 24-3-2025
SIMULTANEOUSLY PRINTED AT CHENNAI | DELHI | VIJAYAWADA | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



'గ్రామం ప్రగతిపథంలో ఉంటే ఎవ్వరూ మురా కక్షల జోలికి వెళ్లరు'



ఇషాన్ కిషన్

ఇషాన్‌దార్ రైజర్స్

ఐపీఎల్ 18వ సీజన్‌ను సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టు ఘనవిజయంతో ప్రారంభించింది. రాజస్తాన్ రాయల్స్‌తో ఆదివారం ఉప్పల్ స్టేడియంలో జరిగిన మ్యాచ్‌లో సన్‌రైజర్స్ 44 పరుగుల తేడాతో గెలిచింది. ఇషాన్ కిషన్ (47 బంతుల్లో 106 నాటౌట్; 11 ఫోర్లు, 6 సిక్స్‌లు) మెరుపు సెంచరీ సాధించాడు. మరో మ్యాచ్‌లో ముంబై ఇండియన్స్‌పై చెన్నై సూపర్ కింగ్స్ విజయం సాధించింది. - 12లో



ఆ నోట్ల కట్టల వెనుక కుట్రలు

తన నివాసంలో అగ్నిప్రమాదం తర్వాత నోట్ల కట్టలు లభించలేదని, ఇదంతా కుట్రని ఢిల్లీ హైకోర్టు జడ్జి జస్టిస్ యశ్వంత్ వర్మ అన్నారు.
వివరాలు 6లో ▸




'భారత్ ఫస్ట్'కే అగ్రతాంబూలం

అమెరికా తదితర దేశాలతో జరిగే వాణిజ్య చర్చల్లో 'భారత్ ఫస్ట్' విధానానికే తొలి ప్రాధాన్యం ఇస్తామని విదేశాంగ మంత్రి జై శంకర్ చెప్పారు.
వివరాలు 6లో ▸



ఆ 'రిజర్వేషన్లు'రాజ్యాంగ ఉల్లంఘనే..

మత ప్రాతిపదికన రిజర్వేషన్లు కల్పించడాన్ని రాజ్యాంగం అనుమతించలేదని ఆర్‌ఎస్‌ఎస్ ప్రధాన కార్యదర్శి హొసబలె తెలిపారు.
వివరాలు 6లో ▸



పోప్‌కు పూర్తి స్వస్థత

ప్రాణాంతక నిమోనియాతో ఐదు వారాల పాటు పోరాడిన పోప్ ఫ్రాన్సిస్ (88) పూర్తి ఆరోగ్యం సంతరించుకున్నారు.
వివరాలు 6లో ▸

సిండికేటు లూటీ!

రాజధాని టెండర్లలో సన్నిహితులైన కాంట్రాక్టర్లతో ప్రభుత్వ పెద్దల కుమ్మక్కు

సిండికేట్‌కు పనులు కట్టబెట్టేలా బిడ్ కెపాసిటీని ఫిబ్రవరి 10న పెంచేసిన సర్కార్

- ఏడీసీఎల్ రూ.10,696.79 కోట్లతో 37 ప్యాకేజీల కింద చేపట్టిన పనులు కాంట్రాక్టర్లకు పంచిన వైనం
- తాజాగా సీఆర్‌డీఏ రూ.16,463.83 కోట్లతో 22 ప్యాకేజీల కింద చేపట్టిన పనులు అస్మదీయ కాంట్రాక్టర్ల పరం
- మొత్తం 59 ప్యాకేజీల పనులను తన సొంత మనుషులు అయిన కాంట్రాక్టర్లకే అప్పగింత
- వీటి విలువ రూ.27,159 కోట్లు
- కాంట్రాక్టు విలువ కంటే సగటున 3.94 నుంచి 4.34 శాతం అధిక ధరలకు కట్టబెట్టడం ద్వారా ఖజానాపై అదనపు భారం
- చంద్రబాబుకు సన్నిహితమైన బీఎస్సార్ ఇన్‌ఫ్రాకు రూ.6,216.47 కోట్లు, ఈనాడు కిరణ్ సోదరుడి వియ్యంకుడికి చెందిన ఆర్వీఆర్ ప్రాజెక్ట్స్‌కు రూ.6,031.79 కోట్ల విలువైన పనుల అప్పగింత



దోపిడీకి బాబు ఎంచుకున్న మార్గాలు..

1 అధిక ధరలకు కట్టబెట్టడం ద్వారా ఖజానాపై భారం రూ.1,049 కోట్లు

2 రివర్స్ టెండరింగ్ ద్వారా ఆదా అయ్యే మొత్తం రూ.3,000 కోట్లు

పనులు అప్పగిస్తూ ఒప్పందం చేసుకోగానే కాంట్రాక్టర్లకు రూ.2,820 కోట్ల మొబిలైజేషన్ అడ్వాన్స్

3 అందులో 8 శాతం అంటే రూ.2,256 కోట్లను కమీషన్‌లుగా రాబట్టుకునే ఎత్తుగడ

ప్రభుత్వ పెద్దల బంధువులు, సన్నిహితులకే అన్ని పనులు అప్పగింత

సాక్షి, అమరావతి: రాజధాని ప్రాంతంలో ఇన్‌సైడర్ ట్రేడింగ్‌కు పాల్పడి రైతుల నుంచి తక్కువ ధరలకు భూములు కాజేసిన ప్రభుత్వ పెద్దలు.. ఇప్పుడు తమకు సన్నిహితులైన కాంట్రాక్టర్లతో సిండికేట్‌ను ఏర్పాటు చేసి రాజధాని నిర్మాణ పనులను అధిక ధరలకు కట్టబెడుతున్నారు. మొన్న.. రూ.10,696.79 కోట్ల వ్యయంతో 37 ప్యాకేజీల కింద రాజధాని ముంపు నివారణ, రహదారుల నిర్మాణంలో మిగిలిన పనులకు అమరావతి డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్(ఏడీసీఎల్)

మిగతా 3వ పేజీలో ▶

వైఎస్సార్ జిల్లా పులివెందుల నియోజకవర్గం తాతిరెడ్డిపల్లెలో వర్షానికి నేలకూలిన అరటి పంట



అకాల వర్షం.. అపార నష్టం

తీవ్రంగా నష్టపోయిన అరటి రైతులు

- వైఎస్సార్, అనంతపురం జిల్లాల్లో సుమారు 4 వేల ఎకరాల్లో నేలకూలిన తోటలు
- ఒక్క లింగాల మండలంలోనే 2,460 ఎకరాల్లో పంట నష్టం.. అనంతపురం జిల్లాలో 1,400 ఎకరాల్లో దెబ్బతిన్న అరటి
- తీవ్రంగా నష్టం వాటిల్లడంతో ఇద్దరు రైతుల ఆత్మహత్యాయత్నం
- మొక్కజొన్న, బొప్పాయి పంటలకూ నష్టం
- నేడు వైఎస్సార్ జిల్లా లింగాల మండలంలో దెబ్బతిన్న పంటల్ని పరిశీలించనున్న మాజీ సీఎం వైఎస్ జగన్

2 లో

పచ్చటి అరటి తోటలు.. బారెడు గెలలతో కోతకు సిద్ధమయ్యాయి.. తమ ఆశలు పండించేలా ఉన్న తోటల్ని చూసి రైతు కళ్లల్లో ఆనందం తాండవించింది. ఇక అప్పులన్నీ తీరతాయని ధైర్యం వచ్చింది.
ఇది నిన్నటి దృశ్యం.

ఎటు చూసినా విరిగిన అరటి చెట్లు.. నేలవాలిన తోటలు. చేతికందే దశలో పంట నేలపాలై కంట నీరు పెట్టుకుంటున్న రైతులు. చేసిన అప్పులు ఎలా తీర్చాలో తెలియని దీనస్థితి.
ఇది నేటి పరిస్థితి.

న్యూస్‌రీల్

పాపికొండల్లో అరుదైన అతిథులు



వేసవి ప్రారంభంలోనే పాపికొండలు అటవీ ప్రాంతంలో అరుదైన వలస పక్షులు సందడి చేస్తున్నాయి. తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల పరిధిలో సుమారు 1,01,200 హెక్టార్ల పరిధిలో అటవీ ప్రాంతం విస్తరించి ఉంది.ఇక్కడ వన్యప్రాణులతోపాటు పక్షులు స్వేచ్ఛగా విహరిస్తూ ఉంటాయి.
వివరాలు 3లో ▸

రొమ్ము క్యాన్సర్ చికిత్సపై అవగాహన



కాకినాడ జీజీహెచ్ శస్త్రచికిత్స విభాగంలో రొమ్ము క్యాన్సర్ శస్త్రచికిత్స విధానాలపై అవగాహన కల్పిస్తూ ఆదివారం వర్క్‌షాప్ నిర్వహించారు. ఇందులో వైద్య విద్యార్థులు పాల్గొని మెలకువలు నేర్చుకున్నారు.
వివరాలు 5లో ▸

కిలో చికెన్‌కు రూ.10 మామూళ్లు!



చికెన్ దుకాణానికి తాళం వేస్తున్న యజమాని

నంద్యాల జిల్లా ఆళ్లగడ్డ నియోజకవర్గంలో ఎంత చికెన్ అమ్మినా తనకు కిలోకు రూ.10 చొప్పున మామూలు ఇవ్వాలని, అది కూడా గోవా నుంచి తాము తెప్పించే చికెన్‌ను మాత్రమే కొనుగోలు చేసి రిటైల్ వ్యాపారులకు విక్రయించాలని టీడీపీ ఎమ్మెల్యే అఖిల ప్రియ భర్త భార్గవరామ్ హుకుం జారీ చేశారు.
వివరాలు 10లో ▸

విశాఖలో నేటి ఐపీఎల్ మ్యాచ్‌కు గవర్నర్ రాక



ఢిల్లీ క్యాపిటల్స్, లక్నో సూపర్ జెయింట్స్ మధ్య విశాఖపట్నం ఏసీఏ–వీడీసీఏ స్టేడియంలో సోమవారం జరగనున్న ఐపీఎల్ క్రికెట్ మ్యాచ్‌ను గవర్నర్ అబ్దుల్ నజీర్ వీక్షించనున్నారు. ఇందుకోసం ఆయన ఆదివారం రాత్రి విశాఖపట్నానికి చేరుకున్నారు.
వివరాలు 14లో ▸

'రెడ్‌బుక్'కు సహకరించని వారిపై
బదిలీ వేటు!

విశాఖ సీపీ బాగ్చీ, సీఐడీ ఐజీ బ్రిజ్‌లాల్‌పై ప్రభుత్వ పెద్దల గుర్రు

త్వరలో సీనియర్ ఐపీఎస్ అధికారుల బదిలీ

డీజీ బాలసుబ్రహ్మణ్యంకు కీలక పోస్టు



సాక్షి, అమరావతి: రెడ్‌బుక్ కుట్రలకు సహకరించని పోలీస్ అధికారులకు పొగబెట్టేందుకు చంద్రబాబు ప్రభుత్వం సిద్ధపడుతోంది. విశాఖపట్నం పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చీ, సీఐడీ విభాగంలో ఐజీ వినీత్ బ్రిజ్‌లాల్‌లను అప్రాధాన్య పోస్టులకు బదిలీ చేసేందుకు సిద్ధపడుతోంది. దీర్ఘకాలిక సెలవు నుంచి తిరిగొచ్చిన డీజీ ఎన్. బాలసుబ్రహ్మణ్యంను కీలక పోస్టులో నియమించాలని భావిస్తోంది. అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు ముగియడంతో రాష్ట్రంలో సీనియర్ ఐపీఎస్ అధికారుల బదిలీకి ప్రభుత్వం ఉపక్రమించింది. ఐజీ నుంచి డీజీ స్థాయి అధికారుల

మిగతా 10వ పేజీలో ▶

మీ స్కోర్ ఎంత?



- రుణ అర్హతలకు క్రెడిట్ స్కోర్ ప్రామాణికం
- క్రెడిట్ రిపోర్ట్‌లో తప్పులతో తగ్గిపోవచ్చు
- లోపాలు, మోసపూరిత లావాదేవీ ఎంట్రీలు
- అందుకే ఏటా రుణ చరిత్రను తిరగేయాలి
- తప్పులుంటే సరిచూసుకోవాలి
- చివరిగా అంబుడ్స్‌మెన్‌ను ఆశ్రయించాలి

13 లో

ఓ వైపు ఎండలు.. మరోపక్క వానలు

- రాష్ట్రంలో భిన్న వాతావరణం
- రాయలసీమ జిల్లాల్లో పిడుగులు, వడగళ్ల వానలు
- ఉపరితల ఆవర్తనం, ద్రోణి ప్రభావమే కారణం

2 లో



రాష్ట్రంలో భిన్నమైన వాతావరణం నెలకొంది. కొన్ని ప్రాంతాల్లో వర్షాలు పడుతుండగా.. మరికొన్ని ప్రాంతాల్లో ఎండలు కొనసాగుతున్నాయి. రాయలసీమలోని అనంతపురం, వైఎస్సార్ కడప, శ్రీసత్యసాయి, అన్నమయ్య తదితర జిల్లాల్లో పలుచోట్ల శనివారం సాయంత్రం నుంచి పిడుగులతో కూడిన వడగళ్ల వానలు కురుస్తున్నాయి.

అమెరికాలో పేలిన తూటా

భారత సంతతి తండ్రీకూతుళ్ల మృతి
స్టోర్‌లో విధుల్లో ఉండగా కాల్పులు

అమెరికాలోని వర్జీనియా రాష్ట్రంలో ఓ నల్ల జాతి యువకుడు జరిపిన కాల్పుల్లో భారత సంతతికి చెందిన తండ్రి, కుమార్తె ప్రాణాలు కోల్పోయారు. నిందితుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అకోమాక్ కౌంటీలోని లాంక్‌ఫోర్డ్ ప్రధాన రహదారి పక్కనే ఉన్న డిపార్టుమెంటల్ స్టోర్‌లో ఈ నెల 21వ తేదీన ఉదయం 5:30 గంటల సమయంలో ఈ ఘటన జరిగింది. - వివరాలు 6లో

గాజా మృతులు 50 వేలు

తాజా దాడుల్లో 23 మంది మృతి
మృతుల్లో హమాస్ సీనియర్ నేత

గాజాలో ఇజ్రాయెల్ మారణహోమానికి బలైన వారి సంఖ్య 50 వేలు దాటింది! ఆదివారం గాజా ఆరోగ్య విభాగం ఈ మేరకు ప్రకటించింది. 'మృతుల్లో సగానికి పైగా మహిళలు, చిన్నారులే. 1.13 లక్షల మందికి పైగా క్షతగాత్రులుగా మారారు. ఇజ్రాయెల్ దాడుల వల్ల గాజా జనాభాలో 90 శాతం మంది నిలువనీడ కోల్పోయారు' అని ఆవేదన వెలిబుచ్చింది. - వివరాలు 6లో

ఇదంజగత్



తాడేపల్లిలో మహిళపై
అత్యాచారం.. హత్య

డీజీపీ కార్యాలయానికి కూతవేటు దూరంలో ఘటన

- మర్మాంగంలో సైతం గాయాలు అయినట్లు అనుమానం
- సెల్‌ఫోన్ ఆధారంగా వివరాలు సేకరిస్తున్న పోలీసులు
- జనవరి 31న కూడా ఇదే తరహాలో మరో మహిళ హత్య
- రెండు హత్యలు చేసింది ఒక్కరేనని పోలీసుల అనుమానం

10 లో



ఘటనాస్థలంలో మహిళ మృతదేహం

అనుమానం పెనుభూతమై...

ప్రియురాలిని, ఆమె తల్లిని కిరాతకంగా హత్యచేసిన ప్రియుడు

10 లో

వేరొకరితో చాటింగ్ చేస్తోందని ఘాతుకం.. రాజమహేంద్రవరంలో ఘటన



మసాయి మారా నేషనల్ రిజర్వ్ ఫారెస్టు రారాజు

స్టార్ లయన్

5 లో

130 మగ సింహాలు, 400 హైనాలను హతమార్చింది

14 ఏళ్ల పాటు 400 మైళ్ల అడవిని ఏలిన మృగరాజు

- హిప్పోతోనూ పోరాడి గెలిచిన చరిత్ర దీని సొంతం
- ప్రపంచ వ్యాప్తంగా కోట్లాది మంది అభిమానులు
- కంటిపై గాయంతో 'స్కార్ ఫేస్ లయన్'గా గుర్తింపు
- స్కార్ ఫేస్ లయన్‌పై 'కెన్యా' ప్రత్యేక డాక్యుమెంటరీ

'ఉపాధి' పనులు
ఢమాల్!

- గత ఏడాదితో పోలిస్తే ఐదు శాతం తగ్గుదల
- లోక్‌సభకు కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ వెల్లడి




ఏపీలో ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామీణ ప్రాంత పేదలకు పనుల కల్పన తగ్గిపోయింది. గత ఆర్థిక ఏడాదితో పోలిస్తే ఈ ఆర్థిక ఏడాదిలో 5 శాతానికి పైగా ఉపాధి కల్పన తగ్గింది. ఈ విషయాన్ని కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ లోక్‌సభలో ఇటీవల సమర్పించిన గణాంకాల్లో తెలిపింది. ప్రస్తుత 2024–25 సంవత్సరంలో గత ఏప్రిల్ నుంచి ఈ ఏడాది ఫిబ్రవరి నెలాఖరు వరకు 22.81 కోట్ల పనిదినాలు మాత్రమే రాష్ట్రంలో పేదలు పొందారు. - వివరాలు 3లో



సాక్షి, స్పెషల్ డెస్క్: అమ్మ చేతి గోరు ముద్దను నెయ్యి కమ్మదనం లేకుండా ఊహించలేం. నేతి రుచి తగలకపోతే భోజనమైనా, అల్పాహారమైనా, పిండి వంటలైనా సంతృప్తికరం, సంపూర్ణమూ కావంటే అతిశయోక్తి కాదు. వివిధ రకాల పచ్చళ్లు, పొడులకు కాస్త నెయ్యి జోడించి తింటే ఆ మజాయే వేరు. 3 వేల ఏళ్ల క్రితం నుంచే నెయ్యి వాడకం ఉందని చరిత్ర చెబుతోంది. అయితే నెయ్యి వినియోగంపై భిన్నాభిప్రాయాలున్నాయి. మంచిదని కొందరంటుంటే, మితిమీరి వాడితే రక్తనాళాల్లో అవరోధాలేర్పడతాయని మరి కొందరంటున్నారు. ఇంతకీ నిపుణులేమంటున్నారు? భారతీయులు సగటున రోజుకు 10 గ్రాముల వరకు నెయ్యి/వెన్న తీసుకోవచ్చని హైదరాబాద్‌లోని భారతీయ వైద్య పరిశోధనా మండలి (ఐసీఎంఆర్) అనుబంధ సంస్థ జాతీయ పోషకాహార సంస్థ (ఎన్‌ఐఎన్)లో లిపిడ్ కెమిస్ట్రీ డివిజన్ సైంటిస్ట్ (జి)గా ఉన్న డాక్టర్ అహ్మద్ ఇబ్రహీం తెలిపారు.

'సాక్షి' ఇంటర్వ్యూ వివరాలు ఆయన మాటల్లోనే..

రోజుకు 10 గ్రాములు చాలు!



నెయ్యిలో కొవ్వు పదార్థాలే ఎక్కువ.. విటమిన్ల మోతాదు తక్కువే

మొత్తంగా కొవ్వు పదార్థాలు రోజుకు 30 గ్రాములకు మించకూడదు

ఆవు నెయ్యిలో కన్నా గేదె నెయ్యిలో తక్కువ శాతం కొవ్వు

'సాక్షి' ఇంటర్వ్యూలో ఎన్‌ఐఎన్ శాస్త్రవేత్త డాక్టర్ అహ్మద్ ఇబ్రహీం

ఔషధ విలువలపై పరిశోధనలు జరగలేదు..

నెయ్యిలో ఎక్కువ వరకు కొవ్వు పదార్థాలే ఉంటాయి. విటమిన్ ఎ, ఇ, కె కూడా కొంతవరకు ఉంటాయి కానీ, అవి పరిగణనలోకి తీసుకోదగినంత ఎక్కువగా ఉండవు. అందుకని ఈ విటమిన్లను పొందటం కోసం నెయ్యిని వనరుగా చూడకూడదు. ఆవు నెయ్యిలో గేదె నెయ్యి కంటే తక్కువ శాతం కొవ్వు ఉంటుంది. మోనో అన్‌శాచురేటెడ్ ఫ్యాటీ యాసిడ్ అనే ఆరోగ్యకరమైన కొవ్వు పదార్థం ఆవు నెయ్యిలో కొంచెం ఎక్కువగా ఉంటుంది.. అంతే తేడా. నెయ్యిలో ఔషధ విలువల గురించి ఎన్‌ఐఎన్‌లో పరిశోధనలేమీ చెయ్యలేదు. అలాగే వేసవిలో ఎంత నెయ్యి తీసుకోవాలి? అనే విషయంపై కూడా పరిశోధనలేమీ జరగలేదు. అయితే నెయ్యిని నిర్దేశిత మోతాదుకు మించకుండా తీసుకోవాలి.

నెయ్యిలో పోషకాలు (100 గ్రాములకు)

శక్తి – 870 కిలోకేలరీలు
పిండి పదార్థం– 0 గ్రా.
కొవ్వు – 99.5 గ్రా.
శాచ్యురేటెడ్ ఫ్యాట్ – 61.9 గ్రా.
మోనో శాచ్యురేటెడ్ ఫ్యాట్ – 28.7 గ్రా.
పాలీ అన్‌శాచ్యురేటెడ్ ఫ్యాట్ – 3.69 గ్రా.
మాంసకృత్తులు – 0.3 గ్రా.
కొలెస్ట్రాల్ – 256 మిల్లీ గ్రాములు
కాల్షియం – 4 మిల్లీ గ్రాములు

వేర్వేరు వంట నూనెలు మంచిది

ఒకరు సగటున రోజుకు సుమారు 2,000 కిలో కేలరీల ఆహారం తీసుకోవాలి. అందులో 30% కేలరీల మేరకు కొవ్వు పదార్థాలు ఉండాలి. అందులో 'ఇన్‌విజిబుల్ ఫ్యాట్' సగం, 'విజిబుల్ ఫ్యాట్' సగం ఉండాలి. మనం రోజూ తినే అనేక ఆహార పదార్థాల్లో అంతర్లీనంగా కలిసి ఉండే కొవ్వు పదార్థాలనే 'ఇన్‌విజిబుల్ ఫ్యాట్' అంటున్నాం. 2,000 కిలో కేలరీల ఆహారం తీసుకునే వ్యక్తి రోజుకు సుమారు 30 గ్రాముల 'విజిబుల్ ఫ్యాట్' అంటే.. వంట నూనెలు, నెయ్యి/వెన్న వంటివి తీసుకోవచ్చు. వీటిలో మూడింట ఒక వంతు మాత్రమే నెయ్యి/వెన్న ఉండాలి. వంట నూనెలు ఒకే రకం కాకుండా అనేక రకాలను తీసుకోవటం చాలా మంచిది. ఒక్కో నూనెలో ఒక్కో రకం ఫ్యాటీ యాసిడ్ పాళ్లు అధికంగా ఉంటాయి. అందుకే అనేక రకాల నూనెలను రోజుకు 20 గ్రాముల వరకు తీసుకోవచ్చు. 10 గ్రాములకు మించకుండా నెయ్యి/వెన్న వంటి శాచ్యురేటెడ్ ఫ్యాట్ అధికంగా ఉన్న పదార్థాలను తీసుకోవచ్చు. అయితే, 30 గ్రాముల వరకు నూనెలు తీసుకునే వారు కూడా నెయ్యి తప్పకుండా తీసుకోవాలనేమీ లేదు. మొత్తం కలిపి కొవ్వు పదార్థాలు రోజుకు 30 గ్రాములకు మించకుండా తీసుకోవాలి. దీన్ని ఎన్‌ఐఎన్ విడుదల చేసిన 'భారతీయులకు ఆహార సంబంధ మార్గదర్శక సూత్రాలు'లోనూ పొందుపరిచాం.

పిల్లలు ఇలా తీసుకోవాలి

పిల్లలు వారి వయసు, బరువు ఆధారంగా ఎన్ని కేలరీలను రోజువారీ ఆహారం తీసుకోవాలో ఎన్‌ఐఎన్ నిర్దేశించింది.

- 10–12 ఏళ్ల మగ పిల్లలు రోజుకు 2,200 కేలరీల ఆహారం తినాలి. వీరు 24 గ్రాముల నూనెలు, 12 గ్రాముల నెయ్యి/వెన్న వాడొచ్చు.
- 10–12 ఏళ్ల ఆడ పిల్లలు రోజుకు 2,000 కేలరీల ఆహారం తినాలి. 22 గ్రాముల నూనెలు, 11 గ్రాముల నెయ్యి/వెన్న వాడొచ్చు.
- 13–15 ఏళ్ల మగ పిల్లలు రోజుకు 2,800 కేలరీల ఆహారం తినాలి. వీరు 30 గ్రాముల నూనెలు, 15 గ్రాముల నెయ్యి/వెన్న వాడొచ్చు.
- 13–15 ఏళ్ల ఆడ పిల్లలు రోజుకు 2,400 కేలరీల ఆహారం తినాలి. 27 గ్రాముల నూనెలు, 13 గ్రాముల నెయ్యి/వెన్న వాడొచ్చు.
- 16–18 ఏళ్ల మగ పిల్లలు రోజుకు 3,300 కేలరీల ఆహారం తినాలి. వీరు 37 గ్రాముల నూనెలు, 18 గ్రాముల నెయ్యి/వెన్న వాడొచ్చు.
- 16–18 ఏళ్ల ఆడ పిల్లలు రోజుకు 2,500 కేలరీల ఆహారం తినాలి. వీరు 28 గ్రాముల నూనెలు, 13 గ్రాముల నెయ్యి వాడొచ్చు.

వ్యాయామం చేసే వారికి నెయ్యితో మేలు!



నెయ్యి మన శరీరంలో ఉష్ణోగ్రతను సమస్థితిలో ఉంచుతుంది. మెదడును శక్తిమంతం చేస్తుంది. జ్ఞాపకశక్తిని పెంచుతుంది. వాతాన్ని, పైత్యాన్ని, కఫాన్ని సమస్థితిలో ఉంచుతుంది. చర్మానికి కాంతినిస్తుంది. లైంగిక సామర్థ్యాన్ని పెంచుతుంది. నేతిలోని బుటిరేట్ జఠరాగ్నిని ప్రజ్వలింపజేస్తుంది. విష దోషాల్ని, పేగుల్లో పుళ్ల, వాపుల్ని, గడ్డల్ని నివారిస్తుంది. నెయ్యి తినే అలవాటున్న వారిలో పేగు కేన్సర్ తక్కువగా వస్తుంది. భారతీయ గోసంతతి విదేశీ గోసంతతి కన్నా భిన్నమైనది. మన ఆవుల వెన్నలో అపకారక ఎల్‌డీఎల్ కొవ్వు కన్నా ఉపకారక హెచ్‌డీఎల్ కొవ్వు ఎక్కువగా ఉంటుంది. బాగా వ్యాయామం చేసే వారికి నెయ్యి మేలే చేస్తుంది. – డా. జీవీ పూర్ణచందు, ప్రముఖ ఆయుర్వేద వైద్యులు

క్లుప్తంగా...

నేటి నుంచి పార్లమెంట్‌లో 'అరకు' కాఫీ ఘుమఘుమలు



సాక్షి, అమరావతి: ఢిల్లీలోని పార్లమెంట్ భవన్‌లో సోమవారం అరకు కాఫీ స్టాల్స్ ప్రారంభం కానున్నాయి. అరకు కాఫీకి మరింత ప్రచారం కల్పించేందుకు లోక్‌సభ స్పీకర్ అవకాశం కల్పించారు. సంగం 1, 2 కోర్ట్ యార్డ్ వద్ద సోమవారం నుంచి ఈ నెల 28 వరకు స్టాల్స్ ఏర్పాటు చేసేందుకు అనుమతి ఇచ్చారు. దీంతో అరకు కాఫీ స్టాల్స్ ఏర్పాటు కోసం గిరిజన సంక్షేమ శాఖ మంత్రి జి. సంధ్యారాణి, గిరిజన కో–ఆపరేటివ్ సొసైటీ (జీసీసీ) అధికారులు ఆదివారం ఢిల్లీ వెళ్లారు.

రేపు, ఎల్లుండి కలెక్టర్ల సదస్సులు

సాక్షి, అమరావతి: ఈ నెల 25, 26వ తేదీల్లో జిల్లా కలెక్టర్ల సదస్సును వెలగపూడిలోని రాష్ట్ర సచివాలయంలో నిర్వహించనున్నారు. తొలి రోజు ఉదయం సీఎం చంద్రబాబు ప్రారంభోపన్యాసం చేస్తారు. అనంతరం జీఎస్‌డీపీ, విజన్, వాట్సాప్ పాలన, పథకాల పట్ల ప్రజల సంతృప్తి స్థాయితోపాటు వివిధ శాఖల వారీగా సంబంధిత అధికారులు ప్రజెంటేషన్లు ఇస్తారు. రెండో రోజు 2025–26 ఆర్థిక సంవత్సరంలో 15 శాతం వృద్ధి సాధన కార్యాచరణ ప్రణాళికలపై కలెక్టర్లు ప్రజెంటేషన్ ఇస్తారు. సాయంత్రం శాంతి భద్రతలపై సీఎం సమీక్షిస్తారు.

27న పోలవరానికి సీఎం

సాక్షి, అమరావతి: పోలవరం జాతీయ ప్రాజెక్టు పనులను ఈ నెల 27వ తేదీన సీఎం చంద్రబాబు పరిశీలించనున్నారు. ప్రాజెక్టు పనుల పురోగతిని క్షేత్ర స్థాయిలో పరిశీలించిన తర్వాత అధికారులతో సమీక్ష నిర్వహిస్తారు. నిర్దేశించిన గడువులోగా పనులు పూర్తి చేయడానికి తీసుకోవాల్సిన చర్యలపై అధికారులకు దిశానిర్దేశం చేస్తారు.

రోజంతా పడిగాపులు.. శనగ రైతుల పాట్లు

ఒక్క గింజ కూడా కొనకపోవడంతో రైతన్నల ఆగ్రహం



శనగలు కొనుగోలు చేస్తారని రైతు సేవా కేంద్రం వద్ద పడిగాపులు కాస్తున్న రైతులు

ఆలూరు రూరల్: శనగలు కొనుగోలు చేస్తారని సమాచారం అందడంతో కర్నూలు జిల్లా ఆలూరు మండలం హత్తిబెళగల్‌లో రైతులు ఆదివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు కొనుగోలు కేంద్రం వద్ద ఎదురు చూశారు. అయినా ఎవరూ రాకపోవడంతో నిరాశగా వెనుదిరిగారు. రబీ సీజన్‌లో రైతులు సాగు చేసిన శనగ పంటను మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో కొనుగోలు చేసేందుకు ఈ నెల 18వ తేదీన హత్తిబెళగల్‌లోని రైతు సేవా కేంద్రం వద్ద జేసీ నవ్య కొనుగోలు కేంద్రం ప్రారంభించారు. ఈ కేంద్రం ప్రారంభించిన నాటి నుంచి ఒక్క గింజ కొనుగోలు చేయలేదని గ్రామానికి చెందిన రైతులు షేక్షావలి, దేవేంద్రప్ప, శంభులింగయ్య, మల్లప్ప, సవరప్ప, వెంకటేష్, చాను సాబ్, చిదానంద ఆవేదన వ్యక్తం చేశారు. మార్కెఫెడ్ అధికారులను దీనిపై ప్రశ్నిస్తే.. నేడు.. రేపు.. అంటూ కాలం వెళ్లదీస్తున్నారని వాపోయారు. ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ చేసుకున్న రైతుల నుంచి కాకుండా.. బడా రైతుల నుంచి శనగలు కొనుగోలు చేసేందుకు అధికారులు సిద్ధమయ్యారన్న సమాచారంతో రైతులు సాయంత్రం దాకా కొనుగోలు కేంద్రం వద్ద పడిగాపులు కాశారు. అధికారుల నుంచి స్పందన లేకపోవడంతో రైతులు తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశారు.

అకాల వర్షం.. అపార నష్టం

తీవ్రంగా నష్టపోయిన అరటి రైతులు

వైఎస్సార్, అనంతపురం జిల్లాల్లో సుమారు 4 వేల ఎకరాల్లో నేలకూలిన తోటలు



అనంతపురం జిల్లా నీర్జాంపల్లిలో నేలకూలిన అరటి పంట



అనంతపురం జిల్లా ఎల్లుట్లలో నేలకొరిగిన అరటి తోటను పరిశీలిస్తున్న రైతులు

అమరావతి/లింగాల/అనంతపురం అగ్రికల్చర్: అకాల వర్షాలకు వైఎస్సార్, ఉమ్మడి అనంతపురం జిల్లాల్లో ఉద్యాన పంటలకు అపార నష్టం వాటిల్లింది. 4 వేలకు పైగా ఎకరాల్లో కోతకు సిద్ధంగా ఉన్న అరటి పంట నేలకొరిగింది. రెండు జిల్లాల్లోనూ వందలాది మంది రైతులు తీవ్రంగా నష్టపోయారు. వైఎస్సార్ జిల్లా లింగాల మండలంలోని పలు గ్రామాల్లో శనివారం రాత్రి ఈదురు గాలులతో కూడిన భారీవర్షం కురవడంతో 2,460 ఎకరాల్లో అరటి పంట కూలిపోయిందని, 827 మంది రైతులు తీవ్రంగా నష్టపోయినట్టు ప్రాథమికంగా అంచనా వేశామని ఉద్యాన శాఖ అధికారి రాఘవేంద్రారెడ్డి చెప్పారు. మండలంలోని తాతిరెడ్డిపల్లె, కోమన్నూతల, ఎగువపల్లె, వెలిదండ్ల, పెద్దకుడాల, కె.చెర్లోపల్లె, రామన్నూతనపల్లె, గుణకణపల్లె, లింగాల తదితర గ్రామాల్లో అరటి పంటలు నేలకూలాయి. పెద్దకుడాల గ్రామానికి చెందిన రామాంజనేయరెడ్డి అనే రైతు మాట్లాడుతూ.. 3 ఎకరాల్లో యాలకి (సుగంధాలు) అరటి సాగు చేయగా.. పంట చేతికొచ్చే సమయంలో పూర్తిగా నేలకొరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు.

ప్రాథమిక అంచనాల ప్రకారం జిల్లాల వారీగా పంట నష్టం ఇలా..

	విస్తీర్ణం (ఎకరాల్లో)	నష్టపోయిన రైతుల సంఖ్య
వైఎస్సార్		
అరటి	2,460	827
తమలపాకు	10	7
అనంతపురం		
అరటి	1,392.50	403
బొప్పాయి	5	2
మామిడి	1	1
శ్రీసత్యసాయి		
అరటి	272.50	114
కూరగాయలు	2	1
ప్రకాశం జిల్లా		
అరటి	32.50	9

అనంతపురం జిల్లాలో 1,400 ఎకరాల్లో అరటికి నష్టం

ఉమ్మడి అనంతపురం జిల్లాలో శనివారం సాయంత్రం నుంచి కురిసిన అకాల వర్షం అరటి, మొక్కజొన్న, బొప్పాయి పంటలను దెబ్బతీసింది. గంటకు 40 కిలోమీటర్ల వేగంతో వీచిన ఈదురుగాలులకు పంటలు నేలవాలాయి. పుట్లూరు, యల్లనూరు, శింగనమల, పెద్దవడుగూరు, యాడికి మండలాల్లో సుమారు 1,400 ఎకరాల్లో అరటి పంట పూర్తిగా ధ్వంసమైందని ఉద్యాన శాఖ డిప్యూటీ డైరెక్టర్ నరసింహారావు తెలిపారు. దీనివల్ల వందలాది మంది రైతులకు తీవ్ర నష్టం వాటిల్లింది. అదేవిధంగా 47 మందికి చెందిన 87.5 ఎకరాల్లో మొక్కజొన్న దెబ్బతిన్నట్లు వ్యవసాయశాఖ అధికారులు తెలిపారు. శ్రీసత్యసాయి జిల్లా తాడిమర్రి, ముదిగుబ్బ మండలాల్లో అరటి తోటలు దెబ్బతిన్నాయి.

గోరుచుట్టుపై రోకలి పోటులా..

గోరుచుట్టుపై రోకలి పోటులా అకాల వర్షం వైఎస్సార్, అనంతపురం జిల్లాల్లోని అరటి రైతులను దెబ్బతీసింది. గత నెలలో టన్ను అరటి ధర రూ.23 వేల నుంచి రూ.25 వేలు ఉండేది. ఇప్పుడు ధరలు పడిపోవడంతో పెట్టుబడులు దక్కుతాయో లేదోనని అరటి రైతులు దిక్కుతోచని స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు. అప్పులు చేసి పంటల్ని సాగుచేస్తే చేతికందాల్సిన పంట నేలనంటిందని వాపోతున్నారు. పురుగు మందులు, ఎరువుల ధరలు ఏటా పెరుగుతుంటే.. పంట సాగుచేసిన తమకు గిట్టుబాటు ధరలేక నష్టపోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అకాల వర్షాలతో పంటల్ని నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నారు.

నేడు వైఎస్ జగన్ పర్యటన

వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సోమవారం వైఎస్సార్ జిల్లా లింగాల మండలంలో పర్యటించనున్నారు. శనివారం రాత్రి భారీ ఈదురుగాలులతో కూడిన వర్షానికి తీవ్రంగా దెబ్బతిన్న అరటి తోటలను పరిశీలించేందుకు వైఎస్ జగన్ వస్తున్నారని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ బాబురెడ్డి తెలిపారు. తాతిరెడ్డిపల్లె, కోమన్నూతల, ఎగువపల్లె గ్రామాల్లో శనివారం ఉదయం 8.30 గంటల ప్రాంతంలో కూలిన అరటి తోటలను పరిశీలించి రైతులతో మాట్లాడతారన్నారు.

రైతుల్ని ఆదుకుంటాం: సీఎం

అకాల వర్షాలు ఈదురు గాలులకు పంటలు దెబ్బతిన్న రైతులను అన్నివిధాలుగా ఆదుకుంటామని సీఎం చంద్రబాబు హామీ ఇచ్చారు. పంటలు దెబ్బతిన్న జిల్లాల కలెక్టర్లతో సీఎం ఫోన్‌లో మాట్లాడారు. అకాల వర్షాలు, వడగళ్ల వానతో పంట నష్టపోయి అనంతపురం జిల్లా యల్లనూరు మండలం నీర్జంపల్లికి చెందిన ఇద్దరు అరటి రైతుల ఆత్మహత్యాయత్నం చేసుకున్న ఘటనపై సీఎం ఆరా తీశారు. ఆ ఇద్దరు రైతులకు మెరుగైన వైద్యం అందించాలని ఆదేశించారు.

ప్రభుత్వం ఆదుకోవాలి



కోటి ఆశలతో అప్పులు చేసి అరటి పంటను సాగు చేస్తే అకాల వర్షం, ఈదురు గాలులు కోలుకోలేని దెబ్బతీశాయి. ఈ వర్షానికి తీవ్రంగా నష్టపోయాం. మమ్మల్ని ప్రభుత్వం ఆదుకోవాలి.

– శ్రీనివాసులరెడ్డి, అరటి రైతు, ఎగువపల్లె

ఈ స్థితి వస్తుందనుకోలేదు



ఏటా ఏప్రిల్, మే నెలల్లో భారీ ఈదురు గాలులతో కూడిన వర్షాలు కురిసేవి. ఆలోగా రైతులు అరటి పంట దిగుబడి చేతికందేది. ఈ ఏడాది ముందుగానే భారీ ఈదురుగాలులతో కూడిన వర్షం కురవడంతో తీవ్రంగా నష్టపోయాం. ఇలాంటి పరిస్థితి ఎప్పుడూ చూడలేదు.

– రామాంజనేయరెడ్డి, అరటి రైతు, పెద్దకుడాల



వైఎస్సార్ జిల్లా తాతిరెడ్డిపల్లెలో ఈదురుగాలులతో కూడిన వర్షానికి పడిపోయిన అరటి పంట

అరటి రైతుల ఆత్మహత్యాయత్నం

- కొతకొచ్చిన పంట అకాల వర్షానికి నేలపాలవడంతో మనస్తాపం
- అధికారులు సరైన రీతిలో స్పందించలేదని ఆవేదన

యల్లనూరు/పులివెందుల రూరల్: వారం రోజుల్లో కోతకు సిద్ధంగా ఉన్న అరటి పంట అకాల వర్షానికి దెబ్బతినడంతో చేసిన అప్పులు ఎలా తీర్చాలో అర్థంకాక ఇద్దరు రైతులు పురుగు మందు తాగి ఆత్మహత్యకు యత్నించిన ఘటన అనంతపురం జిల్లా యల్లనూరు మండలం నీర్జాంపల్లిలో ఆదివారం చోటుచేసుకుంది. బాధిత కుటుంబాల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన చిన్న వెంగప్ప 9 ఎకరాలు, లక్ష్మీ నారాయణ మరో 10.5 ఎకరాల్లో అరటి తోటలు సాగు చేశారు. అప్పులు తెచ్చి ఒక్కొక్కరూ రూ.15 లక్షల వరకు పెట్టుబడి పెట్టారు. వారం రోజుల్లో పంట కోత కోయాల్సి ఉంది. ఒక్కో రైతుకు కనీసం రూ.20 లక్షల వరకు వస్తుందని ఆశపడ్డారు. కానీ.. శనివారం రాత్రి ఈదురుగాలులతో కూడిన అకాల వర్షానికి పంట దెబ్బతింది. వడగళ్లు అరటి గెలలపై పడటంతో కాయలకు మచ్చలు వస్తాయని, దీనివల్ల పంటను ఎవరూ కొనరని బాధిత రైతులు ఆవేదన చెందారు. పంట నష్టాన్ని పరిశీలించి తమకు న్యాయం చేయాలని ఆదివారం ఉదయం ఉద్యాన శాఖ అధికారులను ఫోన్‌లో కోరారు. సెలవు రోజు కావడంతో అధికారులు సరైన రీతిలో స్పందించలేదు. దీంతో రైతులిద్దరూ తాము తీవ్రంగా నష్టపోవడం ఖాయమనే నిర్ణయానికి వచ్చారు. అప్పులు తీర్చే దారిలేక మదనపడ్డారు. చివరకు ఆత్మహత్యలే గతి అని భావించి తోటలోనే పురుగు మందు తాగారు. చిన్నవెంగప్ప భార్య రాజమ్మ ఈ విషయాన్ని గమనించి గ్రామస్తులకు చెప్పగా.. ఇద్దరినీ పులివెందుల ఆస్పత్రికి తరలించారు. అక్కడ ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం అనంతపురం సర్వజనాస్పత్రికి రెఫర్ చేశారు. పంట నష్టం జరిగిన తోటలను ఆదివారం మధ్యాహ్నం అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, ఉద్యాన అధికారి ఉమాదేవి, తహసీల్దార్ రాజా పరిశీలించారు. కాగా.. రైతులు ఫోన్ చేసినా తాము స్పందించలేదనడంలో వాస్తవం లేదని, వెంటనే పొలాల వద్దకు వెళ్లి బాధిత రైతులను ఆస్పత్రికి తరలించడంలో సహాయపడ్డామని ఉద్యాన అధికారి ఉమాదేవి చెప్పారు.



ఎవరూ పట్టించుకోవడం లేదు

మొత్తం పదిన్నర ఎకరాల్లో అరటి పంట వేశాను. 15 వేల మొక్కలు నాటాను. ప్రస్తుతం ఐదు వేల చెట్లలో పంట కోతకు వచ్చింది. రెండు, మూడు రోజుల్లో కోసి విక్రయించేవాళ్లం. మా ఖర్మ ఏమైందో గానీ వడగళ్ల వాన వచ్చింది. పంట మొత్తం దెబ్బతింది. మా బాధ ఎవరితో చెప్పుకోవాలి?. ఒక్క అధికారి కానీ, ప్రజాప్రతినిధులు కానీ పట్టించుకున్న పాపాన పోలేదు.

– లక్ష్మీనారాయణ, ఆత్మహత్యాయత్నం చేసిన రైతు



తీవ్రంగా నష్టపోయాం

తొమ్మిది ఎకరాల్లో అరటి పంట వేశా. రూ.లక్షలు అప్పు చేసి పంట పెట్టా. 11 నెలలు పడ్డ కష్టానికి రెండు రోజుల్లో ఫలితమిచ్చేది. గెలలు విక్రయించడం ద్వారా వచ్చే డబ్బుతో కాస్తయినా అప్పులు తీర్చుకునేవాళ్లం. ఇప్పుడు ఏం చేయాలో తెలియట్లేదు. మా ఆశలపై నీళ్లు పడ్డాయి. ప్రభుత్వం ఆదుకోవాలి. లేకుంటే ఆత్మహత్యే శరణ్యం.

– చిన్నవెంగప్ప, ఆత్మహత్యాయత్నం చేసిన రైతు



అనంతపురం జిల్లా నీర్జాంపల్లిలో నేలకూలిన అరటిపంట

ఓ వైపు ఎండలు.. మరోపక్క వానలు

- రాష్ట్రంలో భిన్న వాతావరణం
- రాయలసీమ జిల్లాల్లో పిడుగులు, వడగళ్ల వానలు
- ఉపరితల ఆవర్తనం, ద్రోణి ప్రభావమే కారణం

సాక్షి, అమరావతి/నెట్‌వర్క్: రాష్ట్రంలో భిన్నమైన వాతావరణం నెలకొంది. కొన్ని ప్రాంతాల్లో వర్షాలు పడుతుండగా.. మరికొన్ని ప్రాంతాల్లో ఎండలు కొనసాగుతున్నాయి. రాయలసీమలోని అనంతపురం, వైఎస్సార్, శ్రీసత్యసాయి, అన్నమయ్య తదితర జిల్లాల్లో పలుచోట్ల శనివారం సాయంత్రం పిడుగులతో కూడిన వడగళ్ల వానలు కురుస్తున్నాయి. అన్నమయ్య జిల్లా మదనపల్లె మండలం వలసలపల్లెలో ఆదివారం 2.9 సెం.మీ. వర్షం పడింది. శ్రీ సత్యసాయి జిల్లాలో కొన్నిచోట్ల వడగళ్ల వర్షం కురిసింది. జిల్లాలోని అనేక ప్రాంతాల్లో వర్షాలు కురిశాయి. కోస్తా జిల్లాల్లోనూ పలుచోట్ల ఆదివారం సాయంత్రం చెదురుమదురు వర్షాలు కురిశాయి. కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల్లో జల్లులు పడ్డాయి. విజయవాడలోని గుణదల, ప్రసాదంపాడు తదితర ప్రాంతాల్లో మోస్తరు వర్షం పడింది. అనకాపల్లి జిల్లా మాడుగుల మండలంలో భారీ వర్షం కురిసింది. అల్లూరి సీతారామరాజు జిల్లా రాజవొమ్మంగి ప్రాంతంలో భారీ వర్షం కురిసింది. పార్వతీపురం మన్యం జిల్లా భామిని మండలంలో చిరు జల్లులు కురిశాయి. ఆదివారం సాయంత్రం వాతావరణం ఒక్కసారిగా చల్లబడడంతో ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. రెండు, మూడు రోజుల క్రితంతో పోలిస్తే ఉష్ణోగ్రతలు తక్కువగానే నమోదవుతున్నాయి.

ఆవర్తనం.. ద్రోణి ప్రభావంతోనే..

ఉపరితల ఆవర్తనం, ద్రోణి ప్రభావంతో ఈ పరిస్థితి నెలకొన్నట్టు వాతావరణ శాఖ తెలిపింది. విదర్భ నుంచి తమిళనాడు వరకు విస్తరించి ఉన్న ఉపరితల ఆవర్తనం సగటు సముద్ర మట్టానికి 1.5 కిలోమీటర్ల ఎత్తులో కొనసాగుతోంది. మరోవైపు బంగాళాఖాతంలో ఒక ద్రోణి విస్తరించి ఉంది. వీటి ప్రభావంతో వర్షాలు కురుస్తున్నాయి. ఉపరితల ఆవర్తనం వల్ల వీచే గాలులు, ద్రోణి ప్రభావంతో వీచే గాలులు కలిసినప్పుడు క్యుములోనింబస్ మేఘాలు ఏర్పడి కొన్ని ప్రాంతాల్లో పిడుగులతో కూడిన వర్షాలు, వడగళ్ల వానలు పడుతున్నట్టు వాతావరణ శాఖాధికారులు తెలిపారు. నాలుగైదు రోజులు ఇదే పరిస్థితి కొనసాగే అవకాశం ఉందని చెప్పారు.



దేశంలో విద్యుత్ వాహనాల తయారీ, అమ్మకాలను ప్రోత్సహించేందుకు కేంద్ర ప్రభుత్వం ఫేమ్ - 2 పథకాన్ని ప్రారంభించింది. 2019 ఏప్రిల్ నుంచి 2024 మార్చి వరకు అమలైన ఈ పథకం ద్వారా ఏపీలో మొత్తం 60,959 ఈవీల అమ్మకాలు జరిగాయి. వీటిలో టూ వీలర్లు 55,656, త్రీ వీలర్లు 5,245, ఫోర్ వీలర్లు 58. అత్యధిక వాహనాలు అమ్ముడైన జిల్లాలు విశాఖపట్నం, కృష్ణా, తూర్పు గోదావరి.

జిల్లా	అమ్ముడైన ఈవీలు
విశాఖపట్నం	11,618
కృష్ణా	8,593
తూర్పుగోదావరి	7,333
చిత్తూరు	6,753
గుంటూరు	4,980
పశ్చిమ గోదావరి	4,958
నెల్లూరు	3,556

ఆధారం: లోక్‌సభలో కేంద్ర ప్రభుత్వం

పాపికొండల్లో.. అరుదైన అతిథులు!


క్రస్టెడ్ సెర్పెంట్ ఈగల్


స్కేర్‌లెట్ మినివెట్


మలబార్ పైడ్ హార్న్‌బిల్

వేలాది పక్షి జాతుల నిలయంగా పాపికొండలు అటవీ ప్రాంతం అలరాలుతోంది. తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల పరిధిలో సుమారు 1,01,200 హెక్టార్లలో ఇది విస్తరించి ఉంది. వేసవిలోనూ ఇక్కడ చల్లటి వాతావరణం ఉండటంతో వలస పక్షులు సందడి చేస్తున్నాయి. ఈ ఏడాది పక్షుల గణనలో 46,700 వరకు వివిధ రకాల పక్షి జాతులున్నట్టు గుర్తించామని వైల్డ్ లైఫ్ మేనేజ్‌మెంట్ డివిజనల్ ఫారెస్ట్ అధికారులు తెలిపారు. తూర్పు గోదావరి జిల్లాలోని కోరింగ మడ అడవుల వద్ద క్రస్టెడ్ సర్పెంట్ ఈగల్(నల్ల పాముల గద్ద), మలబార్ పైడ్ హార్న్ బిల్, స్కేర్‌లెట్ మినివెట్, ఇండియన్ స్కిమ్మర్‌తో పాటు మరో ఆరు రకాల అరుదైన వలస పక్షులను గుర్తించినట్టు వైల్డ్ లైఫ్ ఫొటోగ్రఫీ అధికారి మహేష్ చెప్పారు.

– బుట్టాయగూడెం

సిండికేటు లూటీ!

▶ మొదటి పేజీ తరువాయి

నిర్వహించిన టెండర్లలో సిండికేట్ బాగోతం బట్టబయలైంది. నేడు.. రూ.16,463.83 కోట్ల వ్యయంతో 22 ప్యాకేజీల కింద భూసమీకరణ ద్వారా భూములిచ్చిన రైతులకు ప్లాట్లు ఇచ్చేందుకు లేఅవుట్ల అభివృద్ధి.. ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల క్వార్టర్స్.. మంత్రులు, జడ్జిలు, ఐఏఎస్ అధికారులకు బంగ్లాల నిర్మాణ పనులకు సీఆర్‌డీఏ (రాజధాని ప్రాంత అభివృద్ధి సంస్థ) ఖరారు చేసిన టెండర్లలోనూ ప్రభుత్వ పెద్దల లాలూచీ బాగోతం మరోసారి బట్టబయలైంది. ఏడీసీఎల్, సీఆర్‌డీఏ రెండు కలిసి రూ. రూ.27,160.62 కోట్ల కాంట్రాక్టు విలువతో 59 ప్యాకేజీల కింద పనులకు టెండర్లు పిలిచాయి. ఈ పనులను రూ.28,209.62 కోట్లకు సిండికేట్‌లోని ఎనిమిది కాంట్రాక్టు సంస్థలకు ప్రభుత్వ పెద్దలు పంచి పెట్టారు. కాంట్రాక్టు విలువ కంటే సగటున 3.94 నుంచి 4.34 శాతం అధిక ధరలకు కట్టబెట్టడం ద్వారా ఖజానాపై రూ.1,049 కోట్లు భారం మోపారు. అదే రివర్స్ టెండరింగ్ విధానం అమల్లో ఉండి ఉంటే కాంట్రాక్టర్ల మధ్య పోటీ పెరిగి కనీసం 8 శాతం తక్కువ ధరకే పనులు చేయడానికి ముందుకొచ్చేవారని.. దీనివల్ల ఖజానాకు రూ.2,500 కోట్ల నుంచి రూ.3 వేల కోట్ల మేర ఆదా అయ్యేదని అధికార వర్గాలు స్పష్టం చేస్తున్నాయి.

పూలింగ్ లేఅవుట్ల అభివృద్ధికి రూ.14,887.64 కోట్లు..

భూ సమీకరణ (ల్యాండ్ పూలింగ్) పథకం కింద రాజధానికి రైతులు 34 వేల ఎకరాలు ఇచ్చారు. ఆ పథకం కింద రైతులకు అభివృద్ధి చేసిన ప్లాట్లు ఇవ్వాలి. అందుకు రహదారులు, విద్యుత్, తాగునీటి సౌకర్యం వంటి కనీస సదుపాయాలు కల్పించడం ద్వారా లేఅవుట్లను అభివృద్ధి చేయాలి. రాజధానికి భూసమీకరణ కింద భూములిచ్చిన రైతులకు ప్లాట్లు ఇవ్వడానికే 17 వేల ఎకరాలు భూమి అవసరం. ఇందులో లేఅవుట్ల అభివృద్ధి పనులకు 18 ప్యాకేజీల కింద సీఆర్‌డీఏ టెండర్లు పిలిచింది. ఈ పనులన్నింటినీ కాంట్రాక్టు విలువ కంటే అధిక ధరకే సిండికేట్ కాంట్రాక్టర్లకు అప్పగించారు. రూ.14,887.64 కోట్లకు ఆ పనులను కాంట్రాక్టర్లకు అప్పగించారు. జీఎస్టీ, సీనరేజీ, న్యాక్ తదితర పన్నుల రూపంలో కాంట్రాక్టర్లకు అదనంగా ఇస్తామని సీఆర్‌డీఏ చెప్పిన మొత్తాన్ని కూడా కలిపితే ఈ పనుల వ్యయం రూ.17 వేల కోట్లకు చేరుతుంది. అంటే ఎకరం భూమిలో లేఅవుట్ అభివృద్ధి చేయడానికే సగటున రూ.కోటి చొప్పున వ్యయం చేస్తున్నట్లు స్పష్టమవుతోంది. ఇది మరింతగా పెరిగే అవకాశం ఉందని అధికార వర్గాలే చెబుతున్నాయి. వాస్తవానికి అత్యాధునిక సదుపాయాలతో లేఅవుట్‌ను అభివృద్ధి చేయడానికి ఎకరానికి రూ.50 లక్షలకు మించి వ్యయం కాదని స్పష్టం చేస్తున్నారు. ఇక సీఆర్‌డీఏ ద్వారా ప్రభుత్వమే రియల్ ఎస్టేట్ వ్యాపారానికి దిగుతూ చేపట్టిన హ్యాపీ నెస్ట్ ప్రాజెక్టు.. ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల క్వార్టర్స్.. మంత్రులు, జడ్జీలకు బంగ్లాలు.. ఐఏఎస్‌లకు బంగ్లాల నిర్మాణ పనులను నాలుగు ప్యాకేజీల కింద కాంట్రాక్టర్లకు అప్పగించారు.

- ప్రభుత్వ పెద్దలకు అత్యంత సన్నిహితుడైన కృష్ణారెడ్డికి చెందిన మేఘా సంస్థకు ల్యాండ్ పూలింగ్ స్కీం కింద లే అవుట్లు అభివృద్ధి చేసేందుకు సంబంధించిన ఐదు ప్యాకేజీల పనులను కట్టబెట్టారు. ఈ పనుల విలువ రూ.5,608.7 కోట్లు.
- ఈనాడు కిరణ్ సోదరుడి వియ్యంకుడు రాయల రఘుకు చెందిన ఆర్వీఆర్ ప్రాజెక్ట్స్‌కు ల్యాండ్ పూలింగ్ స్కీం కింద లేఅవుట్ల అభివృద్ధికి సంబంధించి నాలుగు పనులను ప్రభుత్వ పెద్దలు అప్పగించారు. ఈ పనుల విలువ రూ.2,813.66 కోట్లు.
- బెంగళూరులో రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసే బలుసు శ్రీనివాసరావు సీఎం చంద్రబాబుకు అత్యంత సన్నిహితుడు. ఆయనకు చెందిన బీఎస్సార్ ఇన్‌ఫ్రాకు ల్యాండ్ పూలింగ్ స్కీం కింద లేఅవుట్లకు సంబంధించి ఎనిమిది ప్యాకేజీల పనులను అప్పగించారు. వీటి విలువ రూ.3,945.47 కోట్లు.
- ప్రభుత్వ పెద్దలతో అత్యంత సన్నిహితంగా వ్యవహరించే ఏపీ రంగరాజు మేనేజింగ్ డైరెక్టర్‌గా ఉన్న ఎన్‌సీసీ సంస్థకు హ్యాపీ నెస్ట్‌తోపాటు ఎమ్మెల్యే, ఎమ్మెల్సీల క్వార్టర్స్ నిర్మాణం, ఓ ల్యాండ్ పూలింగ్ లేఅవుట్ పని అప్పగించారు. వీటి విలువ రూ.3,438.21 కోట్లు.



సిండి'కేటు' రాజ్యం..!

రాజధాని నిర్మాణ పనులకు టెండర్లు పిలవక ముందే సన్నిహిత కాంట్రాక్టు సంస్థలతో ప్రభుత్వ పెద్దలు చర్చలు జరిపారు. ఆ కాంట్రాక్టర్లతో సిండికేట్‌ను ఏర్పాటు చేశారు. రాష్ట్రంలో 2014–19 మధ్య షాపూర్‌జీ పల్లోంజీ కాంట్రాక్టు సంస్థ నుంచి ముఖ్యనేత తరఫున కమీషన్లు వసూలు చేసి ఆదాయపు పన్ను శాఖ అధికారులకు సాక్ష్యాధారాలతో పట్టుబడిన అధికారే ఇప్పుడూ ప్రభుత్వ పెద్దల తరఫున సిండికేట్ కాంట్రాక్టర్లతో చక్రం తిప్పుతున్నారు. సిండికేట్‌లోని కాంట్రాక్టర్ల ప్రతిపాదన మేరకే వారికి అధికంగా పనులు కట్టబెట్టేందుకు వీలుగా బిడ్ కెపాసిటీని 2 ఎస్ఎస్–బీ నుంచి 3 ఏఎస్–బీకి పెంచుతూ ఫిబ్రవరి 10న ప్రభుత్వ ఉత్తర్వులు జారీ చేయించారు. అంతకు ముందే అంచనాలను ఇష్టారాజ్యంగా పెంచుకోవడానికి, సిండికేట్ కాంట్రాక్టర్లకే పనులు దక్కేలా నిబంధనలతో టెండర్ జారీ చేయడానికి వీలుగా జ్యుడీషియల్ ప్రివ్యూ విధానాన్ని కూడా రద్దు చేశారు. కాంట్రాక్టు విలువ కంటే అధిక ధరలకు కాంట్రాక్టర్లకు పనులు కట్టబెట్టడానికి వీలుగా రివర్స్ టెండరింగ్ విధానానికి కూడా మంగళం పాడారు. తమ అక్రమాలకు అడ్డొచ్చే వ్యవస్థలు.. విధానాలను అన్నింటినీ రద్దు చేశాకే రాజధాని నిర్మాణ పనులకు టెండర్లు పిలిచారు.

నీకింత.. నాకింత..

సీఆర్‌డీఏ, ఏడీసీఎల్ 59 ప్యాకేజీల కింద పనులకు పిలిచిన టెండర్లను ప్రభుత్వం ఆమోదించింది. ఆ పనులను రూ.28,209.62 కోట్లకు ఎనిమిది కాంట్రాక్టు సంస్థలకు ప్రభుత్వ పెద్దలు పంచి పెట్టారు. ఆ పనులను అప్పగిస్తూ సీఆర్‌డీఏ, ఏడీసీఎల్ వాటితో ఒప్పందం చేసుకున్న వెంటనే కాంట్రాక్టు విలువలో పది శాతం అంటే రూ.2,820.96 కోట్లను ఆ సంస్థలకు మొబిలైజేషన్ అడ్వాన్సుగా ముట్టజెబుతాయి. అందులో 8 శాతం అంటే.. రూ.2,256 కోట్లను ప్రభుత్వ పెద్దలు తొలి విడత కమీషన్లుగా రాబట్టుకోనున్నారు. ఇందుకోసమే గత ప్రభుత్వం రద్దు చేసిన మొబిలైజేషన్ అడ్వాన్సుల విధానాన్ని పునరుద్ధరించారనే అభిప్రాయం బలంగా వ్యక్తమవుతోంది. సిండికేట్ కాంట్రాక్టర్ల నుంచి కమీషన్లు వసూలు చేసే బాధ్యతను గతంలో ఆదాయపు పన్ను శాఖకు చిక్కిన అధికారికే ప్రభుత్వ పెద్దలు అప్పగించినట్లు చర్చ సాగుతోంది.

ఎనిమిది సంస్థలకే పనులన్నీ..

- సీఎం చంద్రబాబుకు సన్నిహితుడైన మాజీ ఎమ్మెల్యే కృష్ణయ్యకు చెందిన బీఎస్సీపీఎల్‌కు రూ.779.82 కోట్లు.
- ఎమ్వీఆర్ ఇన్‌ఫ్రా (నారా లోకేశ్ తోడల్లుడు విశాఖ ఎంపీ భరత్ సన్నిహితుడికి చెందిన సంస్థ)కు రూ.796.04 కోట్లు.
- ఆర్వీఆర్ ప్రాజెక్ట్స్ రూ.6,031.79 కోట్లు.
- ఎన్‌సీసీ సంస్థ రూ.6,124.08 కోట్లు.
- బీఎస్సార్ ఇన్‌ఫ్రా రూ.6,216.47 కోట్లు.
- మేఘా రూ.7,022.38 కోట్లు.
- ఎల్ అండ్ టీ సంస్థకు రూ.809.88 కోట్లు.
- కేఎమ్వీ ప్రాజెక్ట్స్‌కు రూ.429.23 కోట్ల విలువైన పనులను కట్టబెట్టారు.

- మంత్రి నారా లోకేశ్ ప్రాతినిధ్యం వహిస్తున్న మంగళగిరి నియోజకవర్గంలో ఆయన తరఫున ఎన్నికల్లో క్రియాశీలకంగా పనిచేసిన కనక మేడల వరప్రసాద్‌కు చెందిన కేఎమ్వీ ప్రాజెక్ట్స్‌కు ఐఏఎస్ అధికారుల బంగ్లాల నిర్మాణ పనులు కట్టబెట్టారు.
- సీఎం చంద్రబాబుతో ఆది నుంచీ సన్నిహితంగా వ్యవహరిస్తున్న ఎల్ అండ్ టీ సంస్థకు ల్యాండ్ పూలింగ్ స్కీం కింద లేఅవుట్ అభివృద్ధి చేసే ఒక ప్యాకేజీ పనిని అప్పగించారు.

సొసైటీల ద్వారానే ఎరువుల సరఫరా

మెరుగైన రీతిలో ఎరువుల సరఫరా కోసమే ఐవీఆర్‌ఎస్ సర్వే

'సాక్షి' కథనంపై స్పందించిన వ్యవసాయ శాఖ

సాక్షి, అమరావతి: ప్రభుత్వ ఆదేశాల మేరకు రైతు సేవా కేంద్రాల(పూర్వపు ఆర్బీకేలు) ద్వారా ఎరువుల సరఫరాను నియంత్రిస్తున్నామని వ్యవసాయ శాఖ డైరెక్టర్ సేనాపతి ఢిల్లీరావు వెల్లడించారు. రైతు సేవా కేంద్రాల(ఆర్ఎస్‌కే) సిబ్బందిని వ్యవసాయ విస్తరణ సేవలకు వినియోగించుకోనున్నట్లు తెలిపారు. ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాల (పీఏసీఎస్) ద్వారానే ఎరువుల సరఫరా కొనసాగించాలని ప్రభుత్వం నిర్ణయించిందని పేర్కొన్నారు. ఇక నుంచి పూర్తి స్థాయిలో పీఏసీఎస్‌ల ద్వారా మాత్రమే ఎరువులను సరఫరా చేస్తామని స్పష్టంచేశారు. సొసైటీలు లేని ప్రాంతాల్లో మాత్రమే ఎంపిక చేసిన ఆర్ఎస్‌కేల్లో పరిమిత స్థాయిలో ఎరువుల సరఫరా ఉంటుందని తెలిపారు. 'ఎరువుల్లేవు.. అంతా సమస్యల దరువే' అనే శీర్షికన 'సాక్షి'లో ఆదివారం వచ్చిన కథనంపై ఆయన స్పందిస్తూ ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రస్తుతం రాష్ట్రంలో 5.78లక్షల టన్నుల ఎరువులు అందుబాటులో ఉన్నాయని, వాటిలో యూరియా 65వేల టన్నులు, డీఏపీ 6వేల టన్నులు మాత్రమే ఉన్నాయని తెలిపారు. రైతుల అభిప్రాయాలు తెలుసుకుని క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి మెరుగైన రీతిలో ఎరువుల సరఫరాకు చర్యలు తీసుకునేందుకే ఐవీఆర్ఎస్ సర్వే చేపట్టినట్లు వివరించారు.

ప్రత్యేక నిఘా

కృత్రిమ కొరత సృష్టిస్తూ ఎమ్మార్పీకి మించి విక్రయించే వారిపై ప్రత్యేక నిఘా పెట్టామన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 34 ప్రత్యేక బృందాల ద్వారా తనిఖీలు చేపట్టి నాణ్యత లేని రూ.14.86 కోట్ల విలువైన 27వేల టన్నుల ఎరువుల అమ్మకాలను నిలిపివేశామని, నాసిరకంగా ఉన్న రూ.1.47కోట్ల విలువైన 205 టన్నుల ఎరువులను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. అదేవిధంగా 16 మంది డీలర్లపై ఈసీ చట్ట ప్రకారం 6ఏ కేసులు నమోదు చేశామని, 15 లైసెన్సులను సస్పెండ్ చేశామని, ఒక లైసెన్స్‌ను పూర్తిగా రద్దు చేశామని వివరించారు. ఒక డీలర్‌పై ఎఫ్ఐఆర్ కూడా నమోదు చేశామన్నారు. డైనమిక్ బఫర్ నిల్వలను 1.50 లక్షల టన్నుల నుంచి 2 లక్షల టన్నులకు పెంచామని తెలిపారు.

'ఉపాధి' పనులు ఢమాల్!

- గత ఏడాదితో పోలిస్తే ఐదు శాతం తగ్గుదల
- లోక్‌సభకు కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ వెల్లడి



సాక్షి, అమరావతి: రాష్ట్రంలో ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామీణ ప్రాంత పేదలకు పనుల కల్పన తగ్గిపోయింది. గత ఆర్థిక ఏడాదితో పోలిస్తే ఈ ఆర్థిక ఏడాదిలో ఐదు శాతానికి పైగా పనుల కల్పన తగ్గినట్లు కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ లోక్‌సభలో ఇటీవల సమర్పించిన గణాంకాల్లో వెల్లడించింది. ప్రస్తుత 2024–25 ఆర్థిక సంవత్సరంలో గత ఏప్రిల్ నుంచి ఈ ఏడాది ఫిబ్రవరి నెలాఖరు వరకు 22.81 కోట్ల పనిదినాలు మాత్రమే రాష్ట్రంలో పేదలు పొందగా.. 2023 ఏప్రిల్ నుంచి 2024 ఏప్రిల్ మధ్య మాత్రం 24.01 కోట్ల పనిదినాలు అప్పటి ప్రభుత్వం కల్పించినట్లు కేంద్రం పేర్కొంది. అలాగే, ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో వైఎస్ జగన్ ముఖ్యమంత్రిగా ఉన్న 2024 ఏప్రిల్, మే నెలల్లో అంతకుముందు ఏడాదికంటే ఎక్కువ పనిదినాలే పేదలకు లభించాయి. 2023 ఏప్రిల్–మే నెలల్లో పేదలు 11.68 కోట్ల పనిదినాలు పొందగా.. 2024 ఏప్రిల్–మే నెలలో 12.72 కోట్ల పనిదినాలు లభించాయి. అయితే, కూటమి ప్రభుత్వం వచ్చాక అకస్మాత్తుగా రాష్ట్రంలో ఉపాధి పనులు తగ్గిపోయాయి. మొత్తంగా ఐదు శాతం తగ్గుదల నమోదైనట్లు గణాంకాలు చెబుతున్నాయి. మరోవైపు.. ఉపాధి కూలీలకు దాదాపు రూ.700 కోట్ల వరకు వేతన బకాయిలు కూడా పేరుకుపోయాయి. ఈ ఏడాది జనవరి 9 నుంచి రాష్ట్రంలో ఉపాధి కూలీలకు వేతన బకాయిల చెల్లింపులు జరగలేదని కార్మిక సంఘ నేతలు ఆరోపిస్తున్నాయి.

ఇఫ్తార్ విందుకు రూ.1.50 కోట్లు

సాక్షి, అమరావతి: రంజాన్ సందర్భంగా ఈ నెల 27న విజయవాడలో నిర్వహిస్తున్న ఇఫ్తార్ విందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు హాజరు కానున్నారు. ఇందుకోసం రాష్ట్ర మైనార్టీ సంక్షేమ శాఖ రూ.1.50 కోట్లు విడుదల చేస్తూ ఆదివారం మెమో జారీ చేసింది. ఆ నిధులతో విజయవాడలో రాష్ట్ర స్థాయిలోను, అన్ని జిల్లా స్థాయిల్లోను ఇఫ్తార్ విందు నిర్వహించేలా ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర మైనార్టీ సంక్షేమ శాఖ కార్యదర్శి కె.హర్షవర్ధన్ సంబంధిత అధికారులను ఆదేశించారు.

చంద్రబాబు పాల్గొనే ఇఫ్తార్ విందును బహిష్కరించండి

సీఎం చంద్రబాబు పాల్గొనే ఇఫ్తార్ విందును బహిష్కరించాలని జమియత్ ఉలమా–ఎ–హింద్ జాతీయ అధ్యక్షుడు మౌలానా సయ్యద్ హర్షద్ మదని పిలుపునిచ్చారు. ఈ మేరకు ముస్లిం సమాజానికి ఆదివారం ఆయన లేఖ విడుదల చేశారు. వక్ఫ్‌బోర్డును నాశనం చేసే ఆలోచనతో కేంద్రం ప్రవేశపెట్టిన వక్ఫ్ సవరణ బిల్లును వ్యతిరేకించలేని చంద్రబాబు తీరుపై మండిపడ్డారు. వారి రాజకీయ ప్రయోజనాల కోసం ముస్లింలను వాడుకుంటున్నారని ఆరోపించారు. వారు నిర్వహించే ఇఫ్తార్, ఈద్ వేడుకలకు హాజరుకాకుండా ముస్లింలు నిరసన తెలపాలని పిలుపునిచ్చారు.

పంచాయతీల్లో చలివేంద్రాలు ఏర్పాటు చేయండి

పంచాయతీరాజ్ శాఖ కమిషనర్

సాక్షి, అమరావతి: వేసవి నేపథ్యంలో గ్రామ పంచాయతీల్లోని కూడళ్లు, జనసంచారం ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో చలివేంద్రాల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ వీఆర్ కృష్ణతేజ మైలవరపు ఆదివారం అన్ని జిల్లాల జెడ్పీ సీఈవోలు, డీపీవోలకు ఆదేశాలిచ్చారు. విలేజ్ హెల్త్ క్లినిక్‌లలో ఓఆర్ఎస్ ప్యాకెట్లు, ఐస్‌ప్యాక్‌లు అందుబాటులో ఉంచాలన్నారు. అయితే ఇందుకు అవసరమైన నిధుల గురించి ఆదేశాల్లో ప్రస్తావించకపోవడం గమనార్హం. ఉపాధి పనులు తెల్లవారుజామునే మొదలెట్టి, ఎండ పెరగక ముందే ముగించేలా చర్యలు తీసుకోవాలన్నారు.



'దోస్త్'కు 'కటీఫ్'!

డిగ్రీలో ప్రవేశాలకు సంబంధించిన ఆన్‌లైన్ వ్యవస్థ ఎత్తివేతకు రంగం సిద్ధం!

ఇంటర్ పరీక్షలు పూర్తయినా ఇంతవరకు కన్వీనర్‌ను నియమించని వైనం

ఎత్తివేతకు ఉన్నత విద్యా మండలి కూడా సుముఖంగా ఉందనే అనుమానాలు

ప్రైవేటు కాలేజీల ఒత్తిడే కారణమంటున్న విద్యార్థి సంఘాలు

సాక్షి, హైదరాబాద్: డిగ్రీ కోర్సుల్లో ప్రవేశానికి సంబంధించిన ఏకీకృత ఆన్‌లైన్ వ్యవస్థ 'దోస్త్'(డిగ్రీ ఆన్‌లైన్ సర్వీసెస్, తెలంగాణ)ను ఎత్తివేసేందుకు రంగం సిద్ధమైందా? ఇంటర్ పరీక్షలు పూర్తయినా ఇంతవరకూ దోస్త్ కన్వీనర్ నియామకం చేపట్టకపోవడం ఈ అనుమానాలకు తావిస్తోంది. రాష్ట్రవ్యాప్తంగా అన్ని డిగ్రీ కళాశాలలను ఒకే గొడుగు కిందకు తెచ్చేలా ప్రవేశపెట్టిన 'దోస్త్'పై మొదట్నుంచీ ఉన్నత విద్యా మండలిలో భిన్నాభిప్రాయాలు ఉన్నాయి. ఈ విధానం లోపభూయిష్టంగా ఉందని కొందరు ఉన్నతాధికారులు బాహాటంగా వ్యాఖ్యానిస్తున్నారు. కొన్నిరోజులు ఇందులో మార్పులు తేవాలనే అభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. ఇటీవల అసలీ విధానం ఎత్తివేస్తే బాగుంటుందనే వాదనలూ బలపడ్డాయి. దీనిపై మండలి చైర్మన్ ప్రొఫెసర్ వి.బాలకిష్టారెడ్డి కూడా స్పష్టత ఇవ్వలేకపోతున్నారు. కన్వీనర్ నియామకంపై వివరణ కోరగా.. 'కొన్ని మార్పులు అవసరమని, ప్రభుత్వ నిర్ణయం మేరకు వ్యవహరిస్తాం'అని చెప్పారు. అడ్మిషన్ల విధానాన్ని తమ గుప్పిట్లో పెట్టుకోవడానికి నాన్ 'దోస్త్'కాలేజీలతో పాటు పలు ప్రైవేటు కాలేజీలు చేస్తున్న ఒత్తిడే 'దోస్త్'కొనసాగింపుపై పునరాలోచనకు కారణమనే విమర్శలు విన్పిస్తున్నాయి.

ఏమిటీ 'దోస్త్'?

'దోస్త్'ను 2016–17లో తీసుకొచ్చారు. ఈ విధానంలో ఒకే ఒక్క దరఖాస్తుతో రాష్ట్రంలోని ఏ కాలేజీలోనైనా మెరిట్ ప్రకారం డిగ్రీలో ప్రవేశం పొందేందుకు అవకాశం ఉంది. గతంలో ప్రతి కాలేజీకి విడివిడిగా దరఖాస్తు చేసుకోవాల్సి వచ్చేది. దరఖాస్తు ఫీజు కూడా విడివిడిగా చెల్లించాలి. కానీ 'దోస్త్'అమల్లోకి వచ్చిన తర్వాత కేవలం రూ. 200 ఫీజుతో అన్ని కాలేజీలకు అప్లై చేసుకునే వెసులుబాటు లభించింది. ఆన్‌లైన్‌తో పాటు మొబైల్ యాప్ కూడా అందుబాటులోకి రావడంతో విద్యార్థులు సులభంగా, తక్కువ ఖర్చుతో డిగ్రీ ప్రవేశాలు పొందే అవకాశం చిక్కింది.

మరేమిటి ఇబ్బంది?

ఆన్‌లైన్ వ్యవస్థ మారుమూల గ్రామీణ ప్రాంత విద్యార్థులను గందరగోళ పరుస్తోందనే విమర్శలున్నాయి. అవగాహన లేమివల్ల దరఖాస్తులు నింపడంలో పొరపాట్లు దొర్లుతున్నాయి. మరోవైపు మెరిట్ ప్రకారం సీట్ల కేటాయింపు వల్ల విద్యార్థికి కొన్నిసార్లు దూరంగా ఉన్న కాలేజీల్లో సీట్లు వస్తున్నాయి. ఫలితంగా సీటు వచ్చినా విద్యార్థి చేరడం లేదు. ఇంకోవైపు ప్రైవేటు కాలేజీలు ముందే విద్యార్థుల చేత తమ కాలేజీలో చేరేలా ప్రాధాన్యత ఆప్షన్లు పెట్టిస్తున్నాయి. ప్రైవేటు కాలేజీల వ్యవహారం, విద్యార్థులు కేటాయించిన కాలేజీల్లో చేరకపోవడం వల్ల 'దోస్త్'ప్రవేశాల ప్రక్రియను పలు దఫాలుగా నిర్వహించాల్సి వస్తోంది. దీంతో అకడమిక్ సంవత్సరం ఆలస్యమవుతోందని అధికారులు చెబుతున్నారు.

అసలు వాస్తవాలేంటి?



రాష్ట్రంలో ప్రతి ఏటా సగటున 3.90 లక్షల మంది ఇంటర్ పాసవుతున్నారు. వీరిలో 45 శాతం మంది మాత్రమే డిగ్రీ కోర్సుల్లో చేరుతున్నారు. కానీ రాష్ట్రంలో 1,055 కాలేజీల్లో 4.62 లక్షల డిగ్రీ సీట్లున్నాయి. ఇంటర్ ఉత్తీర్ణులంతా డిగ్రీలో చేరినా ఇంకా 70 వేలకుపైగా సీట్లు మిగిలిపోక తప్పని పరిస్థితి. 416 గ్రామీణ కాలేజీల్లో ప్రవేశాలు 30 శాతం మించడం లేదు. వంద కాలేజీల్లో కొన్ని బ్రాంచీల్లో జీరో అడ్మిషన్లు నమోదవుతున్నాయి. హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ వంటి రాజధానికి ఆనుకుని ఉన్న కాలేజీల్లో మాత్రం ప్రవేశాలు 70 శాతం ఉంటున్నాయి. 'దోస్త్'జాబితాలో ఉన్న కాలేజీల్లో డిగ్రీకి రూ.5 వేల నుంచి రూ.12 వేల వరకు ఫీజులున్నాయి. కానీ అందులో లేని 60 కాలేజీల్లో ('దోస్త్'పై కోర్టును ఆశ్రయించిన కాలేజీలు) నాణ్యత, వసతులు పేరిట రూ.1.25 లక్షల వరకు ఫీజు ఉంటోంది. ఈ నేపథ్యంలోనే నాణ్యత లేని కాలేజీల్లో గత ఏడాది లక్షకుపైగా సీట్లు తగ్గించారు. ఇదే క్రమంలో అసలు 'దోస్త్'ఎత్తివేయాలని, ఫీజులు, ప్రవేశాలపై తమకు స్వేచ్ఛ ఇవ్వాలని ప్రైవేటు కాలేజీలు ప్రభుత్వంపై ఒత్తిడి పెంచాయి. అంతేకాకుండా ఈ దిశగా ఈసారి బలమైన లాబీయింగ్ చేసినట్టు తెలుస్తోంది. ఫలితంగా 'దోస్త్'ఎత్తివేతకు రంగం సిద్ధమైందనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఒకవేళ ఆన్‌లైన్ విధానం కొనసాగించినా అవసరమైన మార్పులు చేయాలని మండలి భావిస్తున్నట్టు సమాచారం.

డిగ్రీలో ప్రవేశాల సంఖ్య ఇలా..

సంవత్సరం	ప్రవేశాలు
2021-22	255132
2022-23	212818
2023-24	205495
2023-25	196442

అందరికీ ఒకే విధానం ఉండాలి



'దోస్త్'పరిధిలో ఉన్న కాలేజీలకు ఫీజులపై నియంత్రణ ఉంది. మిగతా కాలేజీలు మాత్రం ఇష్టానుసారంగా ప్రవేశాలు చేపడుతున్నాయి. ఇలా భిన్నమైన విధానాలు ఎందుకు? అందరికీ ఆమోదయోగ్యమైన ఒకే విధానం అమలు చేయాలి.

– గౌరి సతీష్ (ప్రైవేటు డిగ్రీ, పీజీ కాలేజీ యాజమాన్యాల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు)

బలహీనవర్గాలకు అన్యాయం జరగొద్దు



ఆన్‌లైన్ విధానంలో లోపాలుంటే సరిచేయాలి. ఫీజులు, ప్రవేశాలపై అధికారాన్ని కార్పొరేట్ కాలేజీలకు అప్పగించ కూడదు. వారి ఒత్తిళ్లకు లొంగి బడుగు, బలహీనవర్గాలకు ఉన్నత విద్యను దూరం చేసే ప్రయత్నాలు మానుకోవాలి.

– టి.నాగరాజు (ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి)

అందరి ఆమోదం మేరకే మార్పులు చేయాలి



పేద విద్యార్థులకు ఉన్నత విద్యను దూరం చేసే చర్యలు సరికాదు. దోస్త్‌లో లోపాలుంటే వాటిని ముందుగా విద్యార్థి, మేధావి వర్గానికి వివరించాలి. అందరి ఆమోదం మేరకు మార్పులు చేయాలి.

– మాచర్ల రాంబాబు (ఏబీవీపీ రాష్ట్ర కార్యదర్శి)

ఆదుకునేవారు లేక అనాథగా మాజీ సర్పంచ్

రామారెడ్డి: కొందరు ప్రజాప్రతినిధుల్లా పర్సంటేజీలకు ఆశపడలేదు..ఆస్తులు అంతస్తులు కూడగట్టుకోలేదు ఆ మాజీ మహిళా సర్పంచ్. గ్రామాభివృద్ధి కోసం తన సొంత నిధులను కూడా వెచ్చించింది. ప్రస్తుతం ఆదుకునేవారు లేక అనాథగా మారింది. రామారెడ్డి మండలం కన్నాపూర్ సర్పంచ్‌గా బాల్‌రాజవ్వ 2006 నుంచి 2011 వరకు పనిచేసింది నీటి సమస్య పరిష్కారానికి బోరుబావులను తవ్వించింది. ఇటీవల కాలంలో భర్త చనిపోయాడు. ఉన్న ఇల్లు కాస్త కాలిపోవడంతో గ్రామ కచేరీ ఆ మాజీ సర్పంచ్‌కు నివాస గృహంగా మారింది. ఆ ఊరి ప్రజలే అన్నం పెట్టి సాదుతున్నారు. భర్త చనిపోయిన తర్వాత బాల్‌రాజవ్వ మానసిక పరిస్థితి బాగాలేదని గ్రామస్తులు చెబుతున్నారు. బాల్‌రాజవ్వ ఇద్దరు కూతుళ్లలో ఓ కూతురు చనిపోగా, మరో కూతురు ఉన్నా, పట్టించుకోవడం లేదని గ్రామస్తులు తెలిపారు. ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు, కలెక్టర్ అండగా నిలిచి బాల్‌రాజవ్వకు సొంత ఇల్లు నిర్మించి ఇవ్వాలని కోరుతున్నారు. ఆమెకు ప్రభుత్వమే వైద్యం అందించాలని కోరుతున్నారు.


అనాథగా మారిన కన్నాపూర్ మాజీ సర్పంచ్ బాల్‌రాజవ్వ



అబద్ధాల కంటే కూడా సత్యానికి నిర్ధారణలు ఎక్కువ హాని చేస్తాయి.
- ఫ్రెడరిక్ నీషే

సాక్షి
సోమవారం, 24 మార్చి 2025

యవ్వనోత్సవం

జీవితంలో బాల్యం ఆటపాటల్లో శరవేగంగా గడచిపోతుంది. శరీరంలో శక్తులన్నీ ఉడిగిపోయి నప్పుడు మీదపడే వార్ధక్యం కుంటినడకన సాగుతుంది. బాల్యంలో ఊహ తెలిసే దశకు వచ్చినప్పుడు త్వరగా యువకులుగా మారిపోవాలని కోరుకోవడం సహజం. నడివయసు కూడలికి వచ్చేసరికి యవ్వనం కొద్దిరోజుల్లోనే కరిగిపోతుందనే బెంగ మనసును పీడించడం కూడా అంతే సహజం. జీవితంలోని బాల్య వార్ధక్యాల మధ్య వచ్చే యవ్వనం ఒక కీలక దశ. అంతేకాదు, ఉత్పాదక దశ కూడా! బాల్య వార్ధక్య దశల్లో జీవనభారాన్ని మోసే శక్తి ఉండదు. ఒంట్లోని జవసత్త్వాలు ఉండే యవ్వనంలోనే జీవితాన్ని ఎంతోకొంత తీర్చిదిద్దుకోవడానికి కుదురుతుంది. జీవితంలో అందుబాటులో ఉన్న స్వేచ్ఛా సౌఖ్యాలను తనివితీరా అనుభవించడానికి వీలవుతుంది.

యవ్వనాన్ని సార్థకం చేసుకోగలిగిన మనుషులు లోకంలో తక్కువగానే ఉంటారు. చాలామంది యవ్వనాన్ని నిరర్థకంగా గడిపేసి, వార్ధక్యంలో గడచిపోయిన రోజులను తలచుకుంటూ వగచి వలపోస్తారు. 'లడక్‌పన్ ఖేల్ మే ఖోయా/ జవానీ నీంద్‌భర్ సోయా/ బుఢాపా దేఖ్‌కర్ రోయా' అన్నాడు హిందీ సినీకవి శైలేంద్ర. బాల్యాన్ని ఆటపాటల్లో పోగొట్టుకుని, యవ్వనాన్ని ఒళ్లెరుగని నిద్రలో పోగొట్టుకుని, వార్ధక్యంలో వాటిని తలచుకుని రోదించే మనుషుల తీరును ఆయన మూడు ముక్కల్లో తేల్చేశాడు. ఇదే విషయాన్ని శంకరాచార్యుడు 'బాల స్తావ త్క్రీడాసక్తః తరుణ స్తావ త్తరుణీసక్తః/ వృద్ధ స్తావ చ్చింతాసక్తః పరమే బ్రహ్మణి కోఽపి న సక్తః' అని ఏనాడో చెప్పాడు.

బాల్య వార్ధక్యాలను ఎక్కువ కాలం కొనసాగించాలని ఎవరూ కోరుకోరు గాని, యవ్వనాన్ని వీలైనంతగా పొడిగించుకోవాలని, కుదిరితే గిదిరితే జీవితాంతం నిత్యయవ్వనులుగా కొనసాగాలని కోరుకోనివారు ఉండరు. నిత్యయవ్వనం మానవమాత్రులకు అసాధ్యమని అందరికీ తెలుసు. ఇది తీరే కోరిక కాదని తెలిసినా, కోరుకుంటారు. తీరని కోరికలను కూడా కోరుకోవడమే కదా మానవ స్వభావం. శుక్రాచార్యుడి శాపం వల్ల ముదిమి పొందిన యయాతి తన కొడుకు పురుడి ద్వారా పునఃయవ్వనం పొందాడు. సుకన్యను చేపట్టిన చ్యవనుడు అశ్వినీ దేవతల అనుగ్రహంతో పునఃయవ్వనం పొందాడు. జరా మరణాలను జయించి అమరులు కావడానికి దేవతలు అమృతం తాగారు. అమృతం కోసం దానవులతో కలసి క్షీరసాగర మథనం చేశారు. అమృతం దానవులకు దక్కకుండా ఉండటానికి శ్రీమహావిష్ణువు జగన్మోహిని అవతారం దాల్చి, దేవతలకు అమృతం పంచిపెట్టాడు. మన పురాణాల్లో ఉన్న ఈ గాథలు అందరికీ తెలిసినవే! ఇలాంటి గాథలు ప్రాచీన గ్రీకు పురాణాల్లోనూ ఉన్నాయి. గ్రీకుల యవ్వన దేవత హీబీ దేవతలకు 'ఆంబ్రోజా' అనే దివ్య ఫలహారాన్ని, 'నెక్టర్' అనే అమృతం వంటి పానీయాన్ని పంచిపెట్టిందట! 'ఆంబ్రోజా', 'నెక్టర్'ల మహిమ వల్లనే దేవతలు నిత్య యవ్వనులు కాగలిగారని గ్రీకు పురాణాల కథనం.

'జీవితం మధుశాల యవ్వనం రసలీల/ రేపటి మాటేల? నవ్వుకో ఈవేళ' అన్నారు వేటూరి. 'పాడు జీవితము యవ్వనము మూడునాళ్ల ముచ్చటలోయి/ అయ్యయ్యో నీదు పరుగులెచ్చట కోయి' అన్నారు ఆరుద్ర. జీవితం క్షణభంగురం అని వేదాంతులు చెబుతారు. కోరికలు దుఃఖ హేతువులని, వాటిని జయించాలని ప్రవచనాలు చెబుతారు. ఎవరు ఎన్ని చెప్పినా, జీవితాన్ని ఆస్వాదించడానికి యవ్వనం ముఖ్య సాధనమనే ఎరుక కలిగినవారే ఏ క్షణానికి ఆ క్షణమే యవ్వనోద్ధృతితో జీవితాన్ని నిండుగా ఆస్వాదిస్తారు. వెర్రి వేదాంతుల మాటలను తలకెక్కించుకునే అర్భకులు– క్షణభంగుర సిద్ధాంతం బుర్రలో బొంగరంలా గింగిరాలు తిరుగుతుంటే, యవ్వనాన్ని అనవసరంగా వృథా చేసుకుని, నిష్ప్రయోజకులుగా బతుకు చాలిస్తారు.

పునఃయవ్వనం పొందినవాళ్లు మనకు పురాణాల్లోను, కాల్పనిక సాహిత్యంలోను తప్ప నిజజీవితంలో కనిపించరు. నిత్యయవ్వనం మానవాళి సామూహిక ఆకాంక్ష. దీనిని నెరవేర్చడానికే ఆధునిక వైద్య పరిశోధకులు కూడా శక్తివంచన లేకుండా పరిశోధనలు సాగిస్తున్నారు. వారి వైద్య పరిశోధనలు ఫలించినట్లయితే, పునఃయవ్వనం పొందడానికి జనాలు ఎగబడి మరీ పోటీలు పడతారు. పరిశోధనలు ప్రాథమిక దశలో ఉండగానే, కొందరు అపర కుబేరులు ఖర్చుకు వెనుకాడకుండా తమ యవ్వనాన్ని పొడిగించుకునేందుకు పడరాని పాట్లు పడుతున్న ఉదంతాలు అడపా దడపా కథనాలుగా వెలువడుతూనే ఉన్నాయి.

యవ్వనం ఉడిగి వయసుమళ్లి వార్ధక్యం ముంచుకు రావడాన్ని సహజ పరిణామంగానే చాలా కాలంగా భావిస్తూ వస్తున్నారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ ఇప్పటి వరకు వార్ధక్యాన్ని వ్యాధిగా గుర్తించ లేదు గాని, వార్ధక్యం కూడా ఒక వ్యాధేనని కొందరు వైద్యపరిశోధకుల వాదన. వార్ధక్యాన్ని నివారించి, వయసును వెనక్కు మళ్లించే దిశగా వైద్య పరిశోధనలు ఇటీవలి కాలంలో ముమ్మరంగా సాగుతున్నాయి. వయసును వెనక్కు మళ్లించడానికి అమృతం వంటిదేదీ అవసరం లేదని, అసలైన యవ్వన కీలకం మానవ దేహంలోనే ఉందని తాజాగా జపాన్‌లోని ఒసాకా విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలు గుర్తించారు. మానవ శరీరంలో ఒత్తిడికి లోనయ్యే కణాలకు 'ఏపీ2ఏ1' అనే ప్రొటీన్ సరఫరాను నిలిపివేసినట్లయితే, శరీరంలోని ప్రతి కణం పునఃయవ్వనాన్ని పొందగలుగుతుందని చెబుతున్నారు. 'ఏపీ2ఏ1' ప్రొటీన్‌ను నియంత్రించడానికి చేపట్టే చికిత్స పద్ధతులే పునఃయవ్వన చికిత్స పద్ధతులు కాగలవని అంటున్నారు. వారి ప్రయోగాలే గనుక ఫలిస్తే, ముందుండేది ముసళ్ల పండుగ కాదు, మానవాళికి అది యవ్వనోత్సవమే అవుతుంది.

ఉత్తర - దక్షిణ సంకటం

కామెంట్



కరణ్ థాపర్

ఊహించినట్లే జరుగుతోంది. 'డీలిమిటేషన్' భూతం మనల్ని వెంటాడుతోంది. జనాభా లెక్కలు దగ్గర పడిన కొద్దీ అది మనకు ఇంకా చేరువ అవుతోంది. అయినా మోదీ ప్రభుత్వం ఈ సమస్యను తేలిగ్గా తీసుకుంటోంది. కానీ 'నియోజక వర్గాల పునర్విభజన' భయాలు అలా కొట్టేయదగినవి కావు. ఎందుకని?

కారణం వెరీ సింపుల్. ఇందులో బుర్ర బద్దలు కొట్టుకోవల్సిందేమీ లేదు. నియోజక వర్గాలు జనాభాపరంగా సైజులో సమానంగా ఉండాలి. ఇప్పుడలా లేవు. కాబట్టి దేశ వ్యాప్తంగా నియోజక వర్గాలు ఒకే సైజులో ఉండేట్లు వాటిని పునర్విభజించాల్సిన అవసరం ఏర్పడింది. దీంతో, జనసంఖ్య వేగంగా పెరిగిన రాష్ట్రాల్లో ఇతర రాష్ట్రాల్లో కంటే ఎక్కువ నియోజక వర్గాలు ఏర్పడతాయి. మొత్తం లోక్‌సభ సీట్ల సంఖ్యను 543 వద్దే స్థిరంగా ఉంచేట్లయితే, జనాభా నియంత్రణ పటిష్ఠంగా అమలు చేసిన రాష్ట్రాల్లో సహజంగానే నియోజకవర్గాల సంఖ్య తగ్గుతుంది. ఆ మేరకు ఇతర రాష్ట్రాల్లో సీట్లు పెరుగుతాయి. ఒకరి నష్టం మరొకరికి లాభం అవుతుంది.

సంఖ్య పెరిగినా ఒరిగేదేంటి?

మిలన్ వైష్ణవ్, జేమీ హింట్సన్‌ల అధ్యయనం సూచించిందిదే! అన్ని దక్షిణాది రాష్ట్రాల్లోనూ పార్లమెంటు నియోజకవర్గాలు తగ్గుతాయి. ఉదాహరణకు కేరళ, తమిళనాడు చెరో 8 సీట్లు కోల్పోతాయి. ఆంధ్ర, తెలంగాణలు రెంటికీ కలిపి చూస్తే అవీ ఇన్ని స్థానాలు నష్టపోతాయి. కర్ణాటక నుంచి 2 స్థానాలు ఎగిరిపోతాయి. జనాభాను నియంత్రించిన ఇతర రాష్ట్రాలూ ఇలాగే దెబ్బతింటాయి. పశ్చిమ బెంగాల్ నాలుగు, ఒడిశా మూడు, పంజాబ్, ఉత్తరాఖండ్, హిమాచల్ ప్రదేశ్ ఒక్కో నియోజకవర్గం పోగొట్టుకుంటాయి.

ఇక అనేక ఉత్తరాది రాష్ట్రాల స్థితి ఇందుకు భిన్నంగా ఉంటుంది. ఉత్తర ప్రదేశ్ జాబితాకు 11 స్థానాలు అదనంగా కలుస్తాయి. బిహార్ 10, రాజస్థాన్ 6, మధ్యప్రదేశ్ 4 సీట్లు పెంచుకుంటాయి. ఫలితంగా, 543లో 226 సీట్లతో ఇప్పటికే ఆధిపత్యం చలాయిస్తున్న 'హిందీ హార్ట్‌ల్యాండ్' డీలిమిటేషన్ అనంతరం తన ప్రాబల్యాన్ని విశేషంగా 259కి పెంచుకుంటుందని యోగేంద్ర యాదవ్ తేల్చారు. దక్షిణాది రాష్ట్రాలు అన్నిటికీ కలిపి ప్రస్తుతం 129 సీట్లు ఉన్నాయి. పునర్విభజన అనంతరం ఇవి 26 సీట్లు కోల్పోతాయని యోగేంద్ర యాదవ్ లెక్క గట్టారు. దీంతో పార్లమెంటులో వాటి ప్రాతినిధ్యం, పలుకుబడి గణనీయంగా క్షీణిస్తాయని వేరే చెప్పనక్కర్లేదు.

డీలిమిటేషన్ సమయంలో దీన్ని దృష్టిలో పెట్టుకుని లోక్ సభ సీట్ల సంఖ్య పెంచే వీలుందని అంటున్నారు. ఇది కొంచెం నయం.



కానీ అలా చేస్తే సమస్య తీవ్రత తగ్గుతుందా? మొత్తం స్థానాల సంఖ్య పెంచినా, ప్రతి రాష్ట్ర నియోజకవర్గాలూ అదే నిష్పత్తిలో పెరుగుతాయి. అదీ ఉత్తరాదికే అనుకూలిస్తుంది. ఉత్తరాది–దక్షిణాది నిష్పత్తి ప్రకారం చూస్తే, దక్షిణాది రాష్ట్రాలకు ఒరిగేదే ఉండదు. వాటి సీట్ల సంఖ్య పెరిగినా ప్రయోజనం ఉండదు. వాటి ప్రాతినిధ్యం, పలుకుబడి పూర్వస్థితికి అంటే ఇప్పటి స్థాయికి చేరుకోవు. కాబట్టి, ఈ చర్య కూడా దక్షిణాది భయాలను తొలగించేది కాదు. పరిస్థితి ఏమీ మారదు.

ఆ మధ్య 'టైమ్స్ ఆఫ్ ఇండియా' ఓ లెక్క వేసింది. సమస్యను ఈ గణాంక విశ్లేషణ తేటతెల్లం చేస్తుంది. ఇప్పటికిప్పుడు ఐదు దక్షిణాది రాష్ట్రాలకు కలిపి మొత్తం 543లో 129 సీట్లు ఉన్నాయి. అంటే 24 శాతం. ప్రస్తుత లోక్ సభ సీట్ల సంఖ్యను 790కి పెంచారే అనుకుందాం. అప్పుడు ఈ రాష్ట్రాల నియోజకవర్గాలు 152కి పెరుగుతాయి. నిజమే. కానీ మొత్తంలో వాటి వాటా కేవలం 19 శాతానికి కుదించుకు పోతుంది. తమిళనాడు విషయం చూస్తే, దాని వాటా ఇప్పుడున్న 7.2 నుంచి 5.4 శాతానికి పడిపోతుంది.

ఏ విధంగా చూసినా దక్షిణాది రాష్ట్రాల క్షోభ అర్థం చేసుకోదగినదే!

ఉత్తరాది బాధ

కానీ రెండో వైపు నుంచి చూస్తే, ఉత్తరాదిదీ సంకట స్థితే!

ఆర్. జగన్నాథన్ గణాంక విశ్లేషణ ప్రకారం, మారిన జనాభా నేపథ్యంలో కేరళ పార్లమెంటు సభ్యుడు సగటున 18 లక్షల మందికి ప్రాతినిధ్యం వహిస్తున్నాడు. అదే రాజస్థాన్ ఎంపీ సగటున 33 లక్షల మందికి ప్రాతినిధ్యం వహిస్తాడు. ఈ రకంగా చూసుకుంటే తమకు ఉండవలసిన వారి కంటే చాలా తక్కువ మంది ఎంపీలు ఉన్నారని, ఇది అన్యాయమని హిందీ బెల్టు కూడా వాదించగలదని జగన్నాథన్ అభిప్రాయపడుతున్నారు. ఇది నిజంగా భారత ప్రజాస్వామ్యానికే డైలమా!

అసలు సమస్య ఇది: నియోజకవర్గాల పునర్విభజన చేస్తే ఉత్తరాది ఆందోళన పరిష్కారం అవుతుంది. అయితే, ఈ చర్య దక్షిణాదికి క్షోభ కలిగిస్తుంది. యోగేంద్ర యాదవ్ వాదిస్తున్నట్లు డీలిమిటేషన్‌ను వాయిదా వేయడం – లేదా శాశ్వతంగా రద్దు చేయడం ద్వారా యథాతథ స్థితి కొనసాగించవచ్చు. దక్షిణాది భయాలు తొలగిపోతాయి. మరి ఉత్తరాది వారు తమకు జరుగుతుందని భావిస్తున్న అన్యాయం మాటేమిటి? అది అలాగే మిగిలిపోతుంది. కాబట్టి, ఎలా చేసినా ఏదో ఒక పక్షం నష్టపోవడం తప్పదు.

మరి దీనికి పరిష్కారం లేదా? ఇది చిటికేసినంత సులభంగా పరిష్కరించే సమస్య అయితే కాదు. నిజం చెప్పాలంటే, మన ప్రజాస్వామ్యం ఎదుర్కొంటున్న అతి పెద్ద సవాళ్లలో కచ్చితంగా ఇదొకటి. వాస్తవానికి వ్యవస్థలో పెను ఉపద్రవానికి దారి తీయగల ఒక నిర్మాణలోపం ఇది. దీన్ని తేలిగ్గా తీసిపారేయడమో, దాటవేయడమో సరైన వైఖరి కాదు. సవాలును సవాలుగా స్వీకరించి అమీతుమీ తేల్చుకోవాల్సిందే. ఇదంత సులభం కాకపోవచ్చు. పోనీ మరొక ప్రత్యామ్నాయం ఉందా?

వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్

- ◆ దక్షిణాది రాష్ట్రాలు నియోజకవర్గాల పునర్విభజన అనంతరం ఇవి 26 సీట్లు కోల్పోతాయని లెక్క. దీంతో పార్లమెంటులో వాటి ప్రాతినిధ్యం, పలుకుబడి గణనీయంగా క్షీణిస్తాయి.
- ◆ ఒక అంచనా ప్రకారం, మొత్తం స్థానాల సంఖ్య 790కి పెరిగినా, అదీ ఉత్తరాదికే అనుకూలిస్తుంది. ఉత్తరాది–దక్షిణాది నిష్పత్తి ప్రకారం చూస్తే, దక్షిణాది రాష్ట్రాలకు ఒరిగేం ఉండదు.
- ◆ కేరళ పార్లమెంటు సభ్యుడు సగటున 18 లక్షల మందికి ప్రాతినిధ్యం వహిస్తుండగా, రాజస్థాన్ ఎంపీ సగటున 33 లక్షల మందికి ప్రాతినిధ్యం వహిస్తున్నాడు. ఇది అన్యాయమని హిందీ బెల్టు కూడా వాదించగలదు.

సోషల్ మీడియా

ఉపాధి భాషలు



ఎవరో అంటుండగా విన్నాను: "ఉత్తర భారతదేశ విద్యార్థులు కన్నడం, తమిళం నేర్చుకోవటాన్ని ప్రోత్సహించాలి. ఎందుకంటే వారిలో ఎక్కువ మంది ఉపాధి కోసం బెంగళూరు, చెన్నై వస్తున్నారు కాబట్టి." నిజమే కదా! ఇందులో లాజిక్ ఉంది.

– డాక్టర్ ప్రిషా సర్గమ్, హ్యూమనిస్ట్


చూస్తే సరిపోదు!



'గీతా ప్రెస్'ను సందర్శించే భాగ్యం నాకు కలిగింది! ఇది భారతదేశంలోని అతి పెద్ద, పురాతన ముద్రణాలయాలలో ఒకటి. ఇలాంటి పుస్తక సంస్థలు సాంస్కృతిక పరిరక్షణను, జ్ఞానవ్యాప్తిని ఎలా చేయగలవో అర్థం చేసుకోవటానికి సాధారణ ప్రయత్నాలు సరిపోవు. విస్తృత అధ్యయనమే జరగాలి.

– వివేక్ రంజన్ అగ్నిహోత్రి, సినీ దర్శకుడు

లోకం తీరు



ఇండియాలో నైతికంగా వర్తించేవారిని జనం మూర్ఖులు అనుకుంటారు. లోకం అలా ఉంది.

– అనిరుద్ధ మాల్పానీ, వైద్యుడు

కనీసం చాలు



వ్యాపారాలను కనీస మూలధనంతో నడిపేందుకు ఏఐ, బ్లాక్ చెయిన్, డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లు తోడ్పడితే కనుక, భవిష్యత్తులో దేశ ఆర్థిక వ్యవస్థను శక్తిమంతం చేయటంలో ఇప్పటి వరకు తమకున్న భాగస్వామ్యం నుండి సంప్రదాయ వ్యాపార భారీ పెట్టుబడి విధానాలు దూరం జరుగుతాయి.

– ఆశీష్ కుమార్ చౌహాన్, ఎన్ఎస్ఇ సీఈవో

స్లో పాయిజన్



మనం చూసే దాని లోనే కాదు, మనం చూసేందుకు అనుమతి లేని దానిలో కూడా ప్రమాదం ఉంది. మీడియా స్వాతంత్ర్యం మరణించటం అన్నది రాత్రికి రాత్రి జరిగేది కాదు. అది దేశభక్తి, ఆర్థిక విధానం, సాంస్కృతిక రక్షణల ముసుగులో జరిగే వాటి వల్ల క్రమంగా చనిపోతుంది.

– మాన్సి అనిల్ కుమార్, కాలమిస్ట్

మనకేమైంది?



బెంగళూరులోని వీల్ ఫ్యాక్టరీలో వీల్ మేకింగ్‌కు అవసరమైన ఇరుసుల ఉత్పత్తి ఆగిపోవటంతో భారతీయ రైల్వే చైనా నుంచి 70,000 ఇరుసులను దిగుమతి చేసుకోబోతోంది! 'మేక్ ఇన్ ఇండియా'కు ఏమైంది?

– మినీ నాయర్, రచయిత్రి

ఎడారి వర్ణచిత్రం



ఆఫ్రికాలోని నమీబియా ఎడారిలో ఇటీవలి వారాల్లో కురిసిన భారీ వర్షాలు అద్భుత స్వర్గలోక దృశ్యాన్ని ఆవిష్కరించాయి. మూడేళ్లుగా పూర్తిగా ఎండిపోయి ఉన్న నేలను కప్పినట్లు పది కిలోమీటర్ల మేర లక్షల కొద్దీ మొక్కలు భూమి చీల్చుకుని వచ్చి, రంగురంగుల పూలను విరబూశాయి.

– జోహాన్ వాన్, కేప్‌టౌన్ ఆంట్రప్రెన్యూర్

మానవవాద విప్లవకారుడు


సందర్భం



డా॥ దేవరాజు మహారాజు

ఒక వ్యక్తి శక్తిగా ఎలా మారగలడో తెలుసుకోవాలంటే ఎం.ఎన్. రాయ్ జీవితాన్ని అధ్యయనం చేయాలి. భారతీయుడైన రాయ్, మెక్సికన్ కమ్యూనిస్ట్ పార్టీ స్థాపకుడు (1917) కావడమేమిటీ? ఆయనలోని నిరంతర భావజాల సంఘర్షణ ఆయనను ఏదో ఒక ఆలోచనా ధోరణికి కట్టుబడి ఉండనివ్వలేదు. ర్యాడికల్ డెమోక్రటిక్ పార్టీ స్థాపనతో పాటు భారత రాజ్యాంగ చిత్తుప్రతిని తయారు చేసి ప్రచురించారు. భారత దేశానికి స్వాతంత్ర్యం లభించిన సమయానికే ఆయన 'నూతన మానవ వాదానికి మేనిఫెస్టో'ని (న్యూ హ్యూమనిస్ట్ మేనిఫెస్టో) రూపొందించి విడుదల చేశారు.

తను స్థాపించిన ఇండియన్ రినైజాన్స్ ఇనిస్టిట్యూట్ ద్వారా దేశాన్నే కదిలించారు. డెహ్రాడూన్‌లో ఆయన నివాసమున్న చోటు నుండే ఆ సంస్థను నిర్వహించారు. అది ఆ కాలంలో 'హ్యూమనిస్ట్ హౌస్'గా పేరు పొందింది. ఉత్తర భారత దేశం నుండే కాకుండా దక్షిణాది రాష్ట్రాల నుండి కూడా ఆయన అనుచరులు, అభిమానులు అక్కడికి తరలి వెళ్ళారు. మతతత్వ భావనకు వ్యతిరేకంగా పనిచేయడమే తన సంస్థ ప్రథమ కర్తవ్యమన్నారు రాయ్. అందుకే 'ఎడ్యుకేట్ ద ఎడ్యుకేటెడ్' – విజ్ఞానవంతుల్ని వివేకవంతుల్ని చేద్దామన్న ఆలోచనని వ్యాప్తి చేశారు.



ఎం.ఎన్. రాయ్

1887 మార్చ్ 21న పశ్చిమ బెంగాల్‌లో రాయ్ పుట్టినప్పుడు పెట్టిన పేరు నరేంద్ర నాథ్ భట్టాచార్య. క్యాలిఫోర్నియాలో ఉండగా అక్కడి నిఘా విభాగాల దృష్టి మరల్చడానికి మానవేంద్ర నాథ్ రాయ్‌గా పేరు మార్చుకున్నారు. 14వ ఏటే అనుశీలన్ సమితిలో చేరారు. అది రహస్యంగా పని చేసే ఒక విప్లవ సంఘం. కొద్ది కాలానికే ఆ సంఘం నిషేధానికి గురయ్యింది. ఆ తర్వాత జతిన్ ముఖర్జీ నిర్వహణలో నడిచే జుగాంతర్ గ్రూపులో చేరారు. 'జతిన్ ముఖర్జీని కలవడమే తన జీవితంలో ఒక గొప్ప మలుపు' అని తన గ్రంథం (చైనాలో నా అనుభవాలు)లో రాసుకున్నారు. బ్రిటిష్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా జుగాంతర్ సభ్యులు ఎన్నో కార్యక్రమాలు చేస్తుండేవారు. ఆ కాలంలో రాయ్ జర్మన్ల సహాయంతో ఇండోనేషియాకు వెళ్ళి వస్తుండేవారు. ఆయుధాలు సమకూర్చుకుని, బ్రిటిష్ పాలకుల్ని తరిమి కొట్టాలన్నది ఆయన ఉద్దేశం.

రహస్యంగా అమెరికాలో ఉన్నప్పుడు స్టాన్‌ఫోర్డ్ యూనివర్సిటీ విద్యార్థిని ఎవిలిన్ ట్రెంట్‌తో స్నేహం పెరిగి పెండ్లి చేసుకున్నారు. తప్పనిసరై అక్కడి నుండి మెక్సికో చేరుకున్నారు. అక్కడ ఆయనకు తగిన భద్రత, గుర్తింపు లభించాయి. అందుకే ఆయన 'జ్ఞాపకాల పుస్తకం'లో – మెక్సికో తనకు కొత్త జన్మ నిచ్చిందని రాసుకున్నారు. అక్కడ ఉన్న రోజుల్లోనే మెక్సికన్ కమ్యూనిస్ట్ పార్టీని స్థాపించారు. ఆ తర్వాత మూడేళ్ళకు 1920లో మరో ఆరుగురు నాయకులతో కలిసి భారత కమ్యూనిస్ట్ పార్టీని స్థాపించగలిగారు.

మానవేంద్ర నాథ్ రాయ్ తర్వాత కాలంలో వ్లాదిమిర్ లెనిన్, జోసెఫ్ స్టాలిన్‌ను కలిసి కమ్యూనిస్ట్ ఇంటర్నేషనల్‌లో భాగస్వాములయ్యారు. 1926లో దాని విధి విధానాల రూపకల్పనలో పాలు పంచుకున్నారు. ఆ విధి విధానాల్ని చైనా కమ్యూనిస్ట్ పార్టీ అవలంబించేట్లు ఒప్పించ డానికి రాయ్ 1927లో చైనా వెళ్ళారు. కానీ, ఆ ప్రయత్నం విఫలమైంది. రాయ్ ఒప్పించలేక పోయారని కాబోలు, 1929లో ఆయనను కమ్యూనిస్ట్ ఇంటర్నేషనల్ నుండి బహిష్కరించారు. 1930లో రాయ్ భారత్‌కు తిరిగి రాగానే, ఆయన కోసం గాలిస్తున్న బ్రిటిషు ప్రభుత్వం 1924 నాటి కాన్పూర్ బోల్షివిక్ కుట్ర కేసుతో అరెస్ట్ చేసి ఆరేళ్ల జైలు శిక్ష విధించింది.

జైలు నుండి విడుదలై వచ్చాక రాయ్ నాలుగేళ్ళ పాటు ఇండియన్ నేషనల్ కాంగ్రెస్‌లో సభ్యుడిగా ఉండి బయటపడ్డారు. 1946లో డెహ్రాడూన్‌లో భారతీయ సాంస్కృతిక పునర్వికాస కేంద్రాన్ని స్థాపించారు. ఆ సంస్థ ఆధునిక భౌతిక దృక్కోణంలో మానవవాదాన్ని ప్రచారం చేసింది. చార్వాక, లోకాయత, బౌద్ధ దర్శనాల అధ్యయనానికి వేదిక అయ్యింది.

రాయ్ జీవితం నుండి, ఆయన ప్రతిపాదించిన ర్యాడికల్ హ్యూమనిజం నుండి దేశంలోని సోషలిస్టులు, కమ్యూనిస్టులు, కాంగ్రెస్ వాదులు, పార్టీరహిత కార్యకర్తలు ఎంతోమంది ప్రేరణ పొందారు. 1954 జనవరి 25న తన 67వ ఏట గుండెపోటుతో ఆయన కన్నుమూశారు. 'ఉత్పత్తి చేస్తున్న వారికి ఆర్థిక స్వాతంత్ర్య సాధన' అన్నది రాయ్ ఆశయాలలో ఒకటి.

వ్యాసకర్త కేంద్ర సాహిత్య అకాడెమీ పురస్కార గ్రహీత

సమ సమాజమా? సంక్షేమ రాజ్యమా?

అభిప్రాయం



డానీ

సామ్యవాద సమాజాన్ని నిర్మించడానికి ఇండియా కమ్యూనిస్టు పార్టీలు రెండు మార్గాలను ఎంచుకున్నాయి. మొదటిది– సాయుధ పోరాటం. రెండోది– పార్లమెంటరీ ఎన్నికలు. ఆ యా పార్టీల నాయకులు అభిమానులు ఒప్పుకోవచ్చు ఒప్పుకోకపోనూవచ్చు గానీ, అవి ఎంచుకున్న రెండు మార్గాలూ ఇప్పుడు దాదాపు మూసుకునిపోయాయి.

''దేశాలు స్వాతంత్ర్యాన్ని, జాతులు విముక్తిని, ప్రజలు విప్లవాన్ని కోరుకుంటున్నారు'' అంటూ కమ్యూనిస్టు పార్టీలు ఓ యాభై ఏళ్ళ క్రితం చాలా గట్టిగా మాట్లాడేవి. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. ఉద్యమాల్లో పాతవాళ్ళు తగ్గిపోతున్నారు; కొత్తవాళ్ళు రావడం లేదు. ఇది నేటి వాస్తవ స్థితి. దీనికి కారణం ఆ యా పార్టీలు అనుసరించిన విధానాలా? మరొకటా? అనే చర్చల వల్ల ఇప్పుడు ప్రయోజనం లేదు. చరిత్రలో జరిగిందేదో జరిగి పోయింది. జరగాల్సిందేమిటీ? అనేదే చర్చనీయాంశం కావాలి.

ప్రత్యామ్నాయ మార్గాలు

సోషలిస్టు కలను సాకారం చేసుకోవడానికి అభిమానులు వందేళ్ళు ఎదురుచూడటమే మహత్తర విషయం. దీర్ఘకాల పోరాటం కనుక ఇంకో వందేళ్ళు ఆగాలి అని ఎవరయినా చెప్పవచ్చు. వందేళ్ళు గడిచిపోయాయి కనుక సహజంగానే ఒక ప్రశ్న తలెత్తుతుంది. సమ సమాజం కుదరకపోతే దానికి దగ్గరి ప్రత్యామ్నాయాలు ఏమిటీ? అనేది. దానికి వెంటనే స్ఫురించే సమాధానం సంక్షేమ రాజ్యం. నార్డిక్ దేశాలయిన స్వీడన్, నార్వే, డెన్మార్క్, ఫిన్లాండ్, ఐస్‌లాండ్ సంక్షేమ దేశాలని చాలామందికి తెలుసు. పశ్చిమ యూరప్‌లో జర్మనీ, ఫ్రాన్స్, నెదర్లాండ్స్, బెల్జియం, స్విట్జర్లాండ్ కూడా తమవైన పద్ధతుల్లో సంక్షేమ రాజ్యాలని బయటికి అంత తెలీదు. వీటిల్లో జర్మనీ రాజకీయార్థిక పరిణామాలతో ఇండియాకు పోలికలున్నాయి.

మొదటి ప్రపంచ యుద్ధం తరువాత 1919 నుండి 1933 వరకు జర్మనీలో కొనసాగిన 'వైమర్ రిపబ్లిక్'ను స్థూలంగా ప్రజాస్వామ్యయుత పాలన అనవచ్చు. 1933 నుండి 1945 వరకు అడాల్ఫ్ హిట్లర్ 'నేషనల్ సోషలిస్ట్ జర్మన్ వర్కర్స్ పార్టీ' పేరిట 'నాజీ' పాలన సాగించాడు. కార్పొరేట్ మతతత్వ నియంతృత్వానికి గరిష్ఠ రూపం... నాజీజం. రెండవ ప్రపంచ యుద్ధంలో హిట్లర్ ఓడిపోయిన తరువాత జర్మనీ 'మిత్రరాజ్యాల' అధీనంలో వలస దేశంగా మారిపోయింది. ఆ దేశాన్ని నాలుగు ముక్కలు చేసి యూకే, ఫ్రాన్స్, అమెరికా, రష్యాలు తలో భాగాన్ని తమ అధీనంలోనికి తీసుకున్నాయి.



ఓ నాలుగేళ్ళు ప్రత్యక్ష వలస పాలన సాగాక జర్మనీ రెండుగా విడిపోయింది. అమెరికా, యూకే, ఫ్రాన్స్‌ల ప్రాబల్యంలోని పశ్చిమ ప్రాంతం 1949 మే 23న 'ఫెడరల్ రిపబ్లిక్ ఆఫ్ జర్మనీ' (ఎఫ్ఆర్‌జీ)గా అవతరించింది. అదే ఏడాది అక్టోబరు 7న రష్యా ప్రాబల్యంలోని తూర్పు ప్రాంతం 'జర్మన్ డెమోక్రాటిక్ రిపబ్లిక్'గా ఏర్పడింది. అప్పట్లో పశ్చిమ జర్మనీని పెట్టుబడిదారీ దేశంగానూ, తూర్పు జర్మనీని సోషలిస్టు దేశంగానూ చెప్పు కునేవారు.

కారణాలు ఏవైనాగానీ, తూర్పు జర్మనీవాళ్ళకు పశ్చిమ జర్మనీ మీద గొప్ప మోజు వుండేది. వాళ్ళు పెద్ద ఎత్తున పశ్చిమ జర్మనీకి వలస పోయేవారు. దీనిని అరికట్టడానికి బెర్లిన్ నగరాన్ని రెండు ముక్కలు చేసి 1961 ఆగస్టు నెలలో అడ్డంగా భారీ గోడ కట్టింది తూర్పు జర్మనీ. దీనికి 'ఫాసిస్టు వ్యతిరేక రక్షణ గోడ' అని గొప్ప పేరు పెట్టారు. అయినా జీడీఆర్ నుండి వలసలు ఆగలేదు. హంగేరీ, జెకోస్లోవేకియాల మీదుగా పశ్చిమ జర్మనీకి చేరుకోవడం మొదలెట్టారు. 1980ల చివర్లో తూర్పు జర్మనీతో పాటు పోలాండ్, హంగేరి, చెకోస్లావియా, రొమేనియా, బల్గేరియా తదితర తూర్పు యూరోప్ దేశాల్లోనూ సోషలిస్టు పాలకులకు వ్యతిరేకంగా నిరసనలు మొదలయ్యాయి. ఇవి ముదిరి 1989 నవంబరు 9న బెర్లిన్ గోడను కూల్చేశారు. ఆ తరువాత ఆరు దేశాలు సంయుక్తంగా చర్చించి 1990 అక్టోబరు 3న తూర్పు జర్మనీని ఫెడరల్ రిపబ్లిక్ ఆఫ్ జర్మనీలో విలీనం చేశాయి.

జర్మనీ, ఇండియాల సామ్యం...

రెండు జర్మనీల విలీనం అంటే విధానపరంగా పెట్టుబడిదారీ, సోషలిస్టు సమాజాల సంకీర్ణం అని అర్థం. ఇప్పటి జర్మనీలో ఈ రెండు ధోరణులేగాక ఉదారవాదం, మతవాదం తదితర అనేక ధోరణులు కనిపిస్తాయి. ఇటీవల జరిగిన ఎన్నికల్లో మితవాదులు పుంజుకున్నప్పటికీ మధ్యేవాదులకు అధికారం దక్కింది. మనలాగే ప్రజాస్వామిక, నాజీయిస్టు, వలస, సోషలిస్టు, పెట్టుబడిదారీ దశలన్నింటినీ చవిచూసిన జర్మనీ ఇప్పుడు పశ్చిమ యూరప్‌లో ఒక మెరుగయిన సంక్షేమ రాజ్యంగా కొనసాగుతోంది. ఇండియా, జర్మనీ స్థూల జాతీయోత్పత్తులు కూడా దాదాపు సమానం.

ఇప్పటి ఇండియా ప్రభుత్వ స్వభావం మీద ఫాసిస్టా? కొత్త ఫాసిస్టా? సగం ఫాసిస్టా? అంటూ చర్చ సాగుతోంది. మన దేశంలో కార్పొరేట్ మతతత్వ నియంతృత్వం కొనసాగుతోందనే అభిప్రాయం బలపడుతోంది. దేశంలోని సహజ వనరుల్ని, మౌలికరంగాలను ఎలాగూ కార్పొరేట్ల పరం చేసేస్తారు. మనం గతంలో ఎన్నడూ ఊహించనంతటి భీకర విస్థాపన సాగు తుంది. దానిని ఇప్పట్లో ఎవరూ ఆపలేరు. సోషలిజం సాధించగల సత్తాగల పార్టీ ఒక్కటీ కనుచూపు మేరలో కనిపించడం లేదు. ఈ పరిస్థితుల్లో ఆచరణాత్మకంగా ఒక సంక్షేమ రాజ్యాన్ని ఆశించడం ఒక్కటే సమంజసంగా ఉంటుంది. మనం ఆ దిశగా ఆలోచించాలి. దానికోసం ప్రయత్నించాలి.

వ్యాసకర్త సమాజ విశ్లేషకులు | 90107 57776

గమనిక: మార్చి 23 సంచికలోని 'రంగంలోకి అంగడి చదువు' వ్యాసంలో పొరపాటు దొర్లింది. 'ఆంధ్ర మహాభాగవత కర్త బమ్మెర పోతన' అని చదువుకోగలరు. – ఎడిటర్

గ్రహం అనుగ్రహం

శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిర ఋతువు, ఫాల్గుణ మాసం, **తిథి:** బ.దశమి రా.12.33 వరకు, తదుపరి ఏకాదశి, **నక్షత్రం:** ఉత్తరాషాఢ రా.12.25 వరకు, తదుపరి శ్రవణం, **వర్జ్యం:** ఉ.8.07 నుండి 9.44 వరకు, తిరిగి తె.4.24 నుండి 5.58 వరకు (తెల్లవారితే మంగళవారం), **దుర్ముహూర్తం:** ప.12.31 నుండి 1.19 వరకు, తదుపరి ప.2.55 నుండి 3.44 వరకు, **అమృతఘడియలు:** సా.5.53 నుండి 7.30 వరకు; **రాహుకాలం:** ఉ.7.30 నుండి 9.00 వరకు, **యమగండం:** ఉ.10.30 నుండి 12.00 వరకు, **సూర్యోదయం:** 6.05, **సూర్యాస్తమయం:** 6.07.



యూకే నుంచి మద్యం దిగుమతులు


ఆల్కహాలిక్ పానీయాల దిగుమతుల్లో మనం ఎక్కువగా బ్రిటన్ మీదే ఆధారపడుతున్నాం. 2015–16 నుంచి 2024–25 (2024 నవంబర్) మధ్య మొత్తం 4.3 బిలియన్ డాలర్ల దిగుమతులు జరిగితే అందులో సగానికిపైగా యూకే నుంచే వచ్చాయి. అమెరికా నుంచి వచ్చినవి 2.5 శాతమే. ఇక ఎగుమతుల విషయానికొస్తే.. అత్యధికం యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, సింగపూర్, నెదర్లాండ్స్‌కు వెళ్తున్నాయి.

దేశం	దిగుమతులు (శాతం)
యూకే	52.33
సింగపూర్	10.4
స్పెయిన్	10.15
ఫ్రాన్స్	5.1
యూఏఈ	4.8
బెల్జియం	2.54
అమెరికా	2.49

ఆధారం: కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ

ప్రపంచ వ్యాప్తంగా కోట్లాది మంది అభిమానులు | స్కార్ ఫేస్ లయన్‌పై కెన్యా ప్రభుత్వం ప్రత్యేక డాక్యుమెంటరీ

'స్టార్' లయన్



'అనగనగా ఓ పెద్ద అడవి. ఆ అడవికి రాజు సింహం'.. ఎన్నో తరాలుగా పిల్లలకు చెప్పే కథే ఇది!

ఇక్కడ కూడా అడవిలో రారాజుగా వెలుగొందిన ఓ మృగరాజు గురించి ప్రత్యేకంగా చెప్పుకోవాలి. ఎన్నో యుద్ధాలు చేసి రాజ్యాన్ని, బలగాన్ని విస్తరించి, తన రాజ్యాన్ని 14 ఏళ్ల పాటు ఆఫ్రికా ఖండంలోనే ఓ పెద్ద అడవిని ఏక ఛత్రాధిపత్యంతో ఏలింది ఈ సింహం. కుడి కంటిపై గాటుతో భయంకరంగా కనిపించే ఈ సింహం 2021 జూన్ 11న వృద్ధాప్యంతో ప్రాణాలు విడిచింది. ఈ గాటు వల్లనే దానికి 'స్కార్ ఫేస్ లయన్'గా పేరుపొందింది. ఐదేళ్ల క్రితం ఓ సింహం గడ్డిలో పొర్లాడుతూ భయంకరమైన గర్జన చేస్తూ చనిపోయిన వీడియో ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా వైరల్ అవుతోంది. అది ఎక్కడ జరిగిందో అని చాలా మంది ఆరా తీయగా.. కెన్యాలోని మసాయి మారా నేషనల్ పార్కులోదిగా తేల్చారు. అప్పుడే ఈ లయన్ కింగ్ ప్రత్యేకత తెలిసింది. అడవుల్లో సింహాలు గరిష్టంగా 12 ఏళ్లు బతికితే.. ఇది మాత్రం 14 సంవత్సరాలు జీవించింది. ఇదేం పెద్ద గొప్పకాకున్నా..బతికినంత కాలం రారాజుగానే ఉండి, సహజ మరణం పొందడమే విశేషం. ఈ లయన్ కింగ్ జీవితం, పోరాటాలు, సాహసాలపై కెన్యా ప్రభుత్వం పలు సందర్భాల్లో వీడియోలు తీసి, ఓ డాక్యుమెంటరీగా రూపొందించింది. అందులోని కొన్ని భాగాలు ఇప్పుడు మనదాకా వచ్చాయి. ఈ 'స్టార్ లయన్ కింగ్' ప్రత్యేకత ఏంటంటే..

– సాక్షి, అమరావతి

120 సింహాల గుంపునకు నాయకత్వం

కంటిపై గాటుతో కనిపించే ఈ మృగరాజు జీవితాంతం సవాళ్లతో పోరాడింది. స్థానిక సింహాలనే కాదు.. వేటగాళ్ల దాడులను సైతం దీటుగా ఎదుర్కొంది. ఎదురే లేని రారాజుగా నిలిచిందని అటవీ పరిరక్షకులు చెబుతుంటారు. పోరాటాల్లో తగిలిన తీవ్రమైన గాయాల నుంచి త్వరగా కోలుకోవడంతో పాటు ప్రతికూల పరిస్థితుల్లోనూ గర్వంగా నిలబడింది. అడవిలో ఓర్పుకు చిహ్నంగా మారింది. సాధారణంగా సింహాల గుంపులో 5 నుంచి 20 వరకు ఉంటాయి. కానీ ఈ మృగరాజు మాత్రం 120 సింహాలతో కూడిన పెద్ద గుంపుతో తిరిగేది. అందుకే మసాయి మారాలోని ఇతర జీవులకు ఈ కింగ్ అంటే హడల్.

'స్కార్ ఫేస్ లయన్'గా మారింది ఇలా..

2012లో ఓ గుంపులోని ఆల్ఫా లయన్‌తో జరిగిన పోరాటంలో కుడి కంటికి, దాని పైభాగంలో లోతైన గాయమైంది. అదే పెద్ద గాటుగా మారిపోయింది. దాంతో దానికి 'స్కార్ ఫేస్ లయన్'గా సందర్శకులు పేరు పెట్టారు. ఈ సింహం 2021 జూన్ 11న వృద్ధాప్యంతో మరణించింది. మసాయి మారా రిజర్వ్ ఫారెస్ట్ సందర్శనకు వచ్చే వారికి ఈ స్కార్ ఫేస్ లయన్ డాక్యుమెంటరీని చూపిస్తారంటే దాని ప్రత్యేకతను అర్థం చేసుకోవచ్చు. ప్రపంచవ్యాప్తంగా కోట్ల మంది అభిమానులను సంపాదించుకున్న ఈ మృగరాజు వీడియోలు ఇప్పుడు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్నాయి.

పుట్టింది 2007
మరణం 2021 జూన్ 11

వేట
130 మగ సింహాల మరణం
400 హైనాలు
ఒక హిప్పోపోటమస్
లెక్కలేనన్ని అలిగేటర్స్ (మొసళ్లు)

సొంత కుటుంబం 120 సింహాలు
జీవించిన కాలం 14 సంవత్సరాలు
ఆఫ్రికాలోనే అత్యంత సెలబ్రిటీ లయన్‌గా గుర్తింపు

మరో సింహానికి అవకాశం ఇవ్వకుండా..

ఆఫ్రికా ఖండంలో అతి పెద్ద నేషనల్ పార్కుల్లో ఒకటి కెన్యాలోని మసాయి మారా నేషనల్ పార్కు. 400 చదరపు కిలోమీటర్లు విస్తరించిన ఈ అరణ్యంలో 2007లో పుట్టిందీ సింహం. మూడేళ్లకే అరివీర భయంకరిగా మారింది. అడవుల్లో సహజంగా మగ సింహాల మధ్య ఆధిపత్య పోరు ఉంటుంది. ఈ పోరులో గెలిచిన సింహం శత్రు గుంపులోని ఆడ సింహాలను, ఆ ప్రాంతాన్ని సొంతం చేసుకుంటుంది. ఇంత పెద్ద అడవిలో ఈ లయన్ మరో మగ సింహానికి అలాంటి అవకాశమే ఇవ్వలేదు. ప్రతి యుద్ధంలో గెలిచింది. ఆడ సింహాలన్నింటినీ సొంతం చేసుకుంది. 14 ఏళ్ల జీవిత కాలంలో 130 మగ సింహాలను హతమార్చింది. 400కు పైగా హైనాలను హతమార్చింది. ఖడ్గమృగాలు, బలీయమైన మొసళ్లను చంపేసింది. సాధారణంగా సింహాలు హిప్పో (నీటి ఏనుగు)ల జోలికి పోవు. కానీ ఈ స్కార్ ఫేస్ లయన్ ఓ మగ హిప్పోతో ఒంటరిగా పోరాడి గెలిచింది. ఇవి అధికారికంగా అటవీ సంరక్షకులు గుర్తించిన సంఖ్య మాత్రమే.



క్లుప్తంగా...

రూ.5,400 కోట్లతో టీటీడీ బడ్జెట్!

నేడు పాలకమండలి సమావేశం



తిరుమల: తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) ధర్మకర్తల మండలి సమావేశం చైర్మన్ బీఆర్ నాయుడు అధ్యక్షతన సోమవారం ఉదయం 10 గంటలకు తిరుమల అన్నమయ్య భవన్‌లో నిర్వహించనున్నారు. రూ.5,400 కోట్లతో బడ్జెట్ ప్రవేశపెట్టే అవకాశం ఉంది. అలాగే జమ్మూలోని శ్రీవారి ఆలయంలో 22మంది సెక్యూరిటీ సిబ్బందిని నియమించేందుకు కూడా నిర్ణయం తీసుకోనున్నారు. వీటితోపాటు పలు అంశాలను చర్చించి ఆమోదించనున్నారు.

త్వరలో విజయవాడలో క్రెడాయ్ ఏపీ కార్యాలయం



మాట్లాడుతున్న శ్రీనివాస్

కొమ్మాది(విశాఖ): విజయవాడ కేంద్రంగా త్వరలో క్రెడాయ్ ఏపీ నూతన కార్యాలయం ఏర్పాటు చేయనున్నట్టు క్రెడాయ్ ఏపీ నూతన చైర్మన్ బుడ్డిగ శ్రీనివాస్ తెలిపారు. విశాఖ, బీచ్ రోడ్డు రుషికొండలోని ఓ ప్రైవేటు రిసార్టులో ఆదివారం క్రెడాయ్ ఏపీ (2025–27) చాప్టర్ నూతన కార్యవర్గం ఎన్నిక జరిగింది. రెండేళ్ల కాలపరిమితి కలిగిన కార్యవర్గానికి చైర్మన్‌గా బుడ్డిగ శ్రీనివాస్, అధ్యక్షుడిగా బాయన శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శిగా దాసరి రాంబాబు, ఉపాధ్యక్షులుగా జీ.వి.ఎస్.టి నాయుడు, సాయిరాం రెడ్డి ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ రాష్ట్రంలో జిల్లాల వారీగా 20 చాప్టర్స్‌తో, 1200 మంది సభ్యులుతో క్రెడాయ్ జాతీయ అత్యున్నత సంస్థగా రూపొందిందని తెలిపారు. స్థిరాస్తి వ్యాపారాభివృద్ధికి కృషి చేస్తామని చెప్పారు.

వృద్ధుడి సజీవ దహనం

వైఎస్సార్ జిల్లాలో ఘటన



మంటల్లో కాలిపోయిన పూరిల్లు

సిద్దవటం : పూరి గుడిసెకు నిప్పంటుకోవడంతో అంధుడైన ఓ భిక్షగాడు అగ్నికి ఆహుతయ్యాడు. ఈహృదయ విదారక ఘటన ఆదివారం ఉదయం వైఎస్సార్ జిల్లా సిద్దవటం మండలం మూలపల్లెలో జరిగింది. ప్రకాశం జిల్లాకు చెందిన పిల్లి రాజారెడ్డి(72) దాదాపు పదేళ్లుగా మూలపల్లెలోని అయ్యవారురెడ్డి సత్రం వెనుక పూరి గుడిసెలో ఉంటూ భిక్షాటన చేసుకుంటూ జీవిస్తున్నాడు. ఆదివారం నీళ్లు కాచుకునేందుకు నిప్పు రాజేశాడు. మంట అతని పంచెకు అంటుకోవడంతో దానిని విప్పేసి గుడిసెలోకి విసిరాడు. ఈ క్రమంలో గుడిసెకు నిప్పంటుకుంది. రాజారెడ్డికి కళ్లు కానరాక.. బయటకు ఎలా వెళ్లాలో తెలియక గుడిసెలోనే ఓ పక్కన కూర్చుండిపోయాడు. మంటలు ఒక్కసారిగా పెద్దవవడంతో వేడి భరించలేక పెద్దగా కేకలు వేశాడు. అయితే స్థానికులు గుమికూడారు గానీ.. గుడిసెలోకి వెళ్లే సాహసం చేయలేకపోయారు. కొద్దిసేపటికి రాజారెడ్డి అగ్నికీలలకు ఆహుతయ్యాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని వెలికి తీసి పంచనామా అనంతరం అక్కడే పూడ్చివేశారు.

ఉక్కు కాంట్రాక్ట్ కార్మికుల ఉపాధి రక్షణ యాత్ర



కూర్మన్నపాలెం(విశాఖ): విశాఖ ఉక్కు కాంట్రాక్ట్ కార్మికులు ఆదివారం ఉపాధి రక్షణ యాత్ర చేపట్టారు. ఈ యాత్ర గాజువాక మెయిన్‌రోడ్, పాత గాజువాక, శ్రీనగర్ మీదుగా కూర్మన్నపాలెంలోని ఉక్కు కార్మికుల దీక్షా శిబిరం వరకూ సాగింది. సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్.నర్సింగరావు, ఉక్కు ఇంటెక్ ప్రధాన కార్యదర్శి మంత్రి రాజశేఖర్, ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి డి.ఆదినారాయణ, తదితరులు పాల్గొన్నారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ విశాఖ ఉక్కుపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తమ ఆలోచనా విధానాలను మార్చుకోవాలని, లేకుంటే తీవ్ర పరిణామాలు తప్పవని హెచ్చరించారు. ప్లాంట్‌లో 25 ఏళ్లుగా విధులు నిర్వహిస్తున్న కాంట్రాక్ట్ కార్మికులను తొలగించడం అన్యాయమన్నారు. ఈ తొలగింపు ప్రైవేటీకరణలో భాగమేనని వారు ఆరోపించారు.

మయూరాల వయ్యారం...!



వేసవి ప్రారంభం కావడంతో అటవీ ప్రాంతాల్లో నుంచి నెమళ్లు జనావాసాల్లోకి వస్తున్నాయి. గ్రామాల సమీపంలోకి వచ్చి సందడి చేస్తున్నాయి. గుంపులు, గుంపులుగా మేత, మంచినీటి కోసం సంచరిస్తున్నాయి. అన్నమయ్య జిల్లా మదనపల్లె మండలం ఎగువమిట్టామర్రి సమీపంలోని మొరంకిందపల్లెలో ఆదివారం నెమళ్లు వచ్చి సందడి చేసిన దృశ్యాలను ట్రెక్కింగ్ గ్రూప్ సభ్యులు తమ కెమెరాల్లో బంధించారు.

– మదనపల్లె సిటీ

'అమరజీవి'కీ పసుపు రంగు



అమరజీవి పొట్టి శ్రీరాములు కూడా మా వాడే అన్న భావన కలిగేలా ఆయన విగ్రహానికి పసుపు రంగు పులమడం టీడీపీ నేతల అతికి ఉదాహరణగా నిలుస్తోంది. తిరుపతి జిల్లా, గూడూరు ఆస్పత్రిరోడ్డులో ఏర్పాటు చేసిన అమరజీవి పొట్టి శ్రీరాములు విగ్రహం ఇటీవల మరమ్మతులకు గురైంది. పునరుద్ధరించే ప్రక్రియలో ఇలా పసుపు రంగు వేసినట్లు తెలిసింది. ఇటీవల పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాకు తానే పేరు పెట్టానని సీఎం చంద్రబాబు బహిరంగంగా చెప్పగా.. టీడీపీ నేతలు కూడా అధినేతను అనుసరిస్తున్నారని స్థానికులు విమర్శిస్తున్నారు.

– చిల్లకూరు

కుప్పకూలిన 120 అడుగుల తేరు

- యువకుడు మృతి



బొమ్మనహళ్లి: బెంగళూరు నగర జిల్లా పరిధిలోని ఆనేకల్ తాలూకాలోని హుస్కూరు గ్రామం జాతరలో విషాదం చోటుచేసుకుంది. మద్దూరమ్మ దేవి రథోత్సవంలో ఎత్తైన తేరు కుప్పకూలిపోయింది. శనివారం సాయంత్రం ఈ దుర్ఘటన జరిగింది. ఏటా మాదిరిగానే దొడ్డనాగమంగళ గ్రామస్తులు సుమారు 120 అడుగుల ఎత్తైన తేరును తయారు చేసి ఎద్దులు కట్టి మద్దూరమ్మ జాతరకు తీసుకుని వస్తుండగా ఈదురు గాలులకు అదుపుతప్పి ఓ వైపునకు ఒరిగిపోయింది. దాని కింద చిక్కి లోహిత్ (24) అనే యువకుడు చనిపోగా, ఇద్దరు పురుషులు, ఇద్దరు మహిళలకు తీవ్ర గాయాలయ్యాయి. బాధితులను రక్షించి ఆస్పత్రికి తరలించారు.



ఆలయం వెలుపల ఏపీ హైకోర్టు జడ్జిలు జస్టిస్ సురేశ్‌రెడ్డి, జస్టిస్ వి.సుజాత



తెలంగాణ హైకోర్టు జడ్జి జస్టిస్ శ్రీ సుధ



మద్రాసు హైకోర్టు జడ్జి జస్టిస్ భవానీ సుబ్రహ్మణ్యం

తిరుమల శ్రీవారిని ఆదివారం ఏపీ హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ సురేశ్ రెడ్డి, జస్టిస్ వి.సుజాత, తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ శ్రీసుధ, మద్రాసు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ భవానీ సుబ్రహ్మణ్యం దర్శించుకున్నారు. అనంతరం ఆలయ రంగనాయకుల మండపంలో వేద పండితులు ఆశీర్వదించగా, అధికారులు లడ్డూ ప్రసాదాలతో సత్కరించారు.

– తిరుమల

అమ్మవారి సేవలో ఏపీ హైకోర్టు జడ్జి



తిరుచానూరు శ్రీ పద్మావతీ అమ్మవారిని ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కె.సురేశ్ రెడ్డి కుటుంబ సమేతంగా ఆదివారం దర్శించుకున్నారు. అనంతరం ముఖమండపంలో అర్చకులు ఆశీర్వచనం, అమ్మ వారి పసుపు, కుంకుమలతో పాటు తీర్థ ప్రసాదాలను అందజేశారు.

– తిరుపతి రూరల్

గాంధేయవాది పసల కృష్ణ భారతి అస్తమయం



పసల కృష్ణ భారతికి పాదాభివందనం చేస్తున్న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ (ఫైల్)

తాడేపల్లిగూడెం (టీవోసీ): గాంధేయవాది, స్వాతంత్ర సమరయోధుల కుటుంబానికి చెందిన పసల కృష్ణభారతి (92) ఆదివారం హైదరాబాద్‌లోని స్వగృహంలో కన్నుమూశారు. పశ్చిమ గోదావరి జిల్లా తాడేపల్లిగూడేనికి చెందిన ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధులు పసల కృష్ణమూర్తి–అంజలక్ష్మి దంపతుల రెండో కుమార్తె కృష్ణ భారతి. జీవితాంతం గాంధేయవాదిగా ఉంటూ, గాంధీ ప్రవచించిన విలువలతోనే జీవించారు. పలు విద్యా సంస్థలకు నిధులు అందించారు. దళితుల్లో విద్యావ్యాప్తికి విశేష కృషి చేశారు. గోశాలలకు భారీ విరాళాలు సమకూర్చారు. అవివాహితగా ఉన్న కృష్ణ భారతికి నలుగురు అన్నదమ్ములు, ముగ్గురు అక్క చెల్లెళ్లు. బ్రిటిష్ ప్రభుత్వ పాలనలో ఆంక్షలను ధిక్కరించి భీమవరం సబ్ కలెక్టర్ కార్యాలయంపై జెండా ఎగురవేసిన ఘటనలో కృష్ణమూర్తి దంపతులకు 1932లో కఠిన కారాగారవాసం విధించారు. ఈ ఘటన సౌత్ బర్డోలీ తిరుగుబాటుగా పేరు పొందింది. అప్పటికే గర్భిణి అయిన అంజలక్ష్మి జైలులో బిడ్డకు జన్మనిచ్చింది. కారాగారంలో జన్మించిన శ్రీకృష్ణుడిని, స్వతంత్ర భారతి ఆకాంక్షను గుర్తు చేస్తూ కృష్ణమూర్తి దంపతులు ఆ బిడ్డకు కృష్ణ భారతి అని పేరు పెట్టారు. 2022 జూలైలో భీమవరంలో జరిగిన అల్లూరి సీతారామరాజు విగ్రహావిష్కరణ కార్యక్రమంలో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ కృష్ణ భారతిని సత్కరించి, ఆమెకు పాదాభివందనం చేశారు.

రేపు కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం

తిరుమల: శ్రీవారి ఆలయంలో 30న ఉగాది ఆస్థానాన్ని పురస్కరించుకుని మార్చి 25 మంగళవారం కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం జరగనుంది. ఈ కార్యక్రమాన్ని ఆరోజు ఉదయం 6 నుంచి 11 గంటల వరకు అర్చకులు ఆగమోక్తంగా నిర్వహించనున్నారు. ఈ కారణంగా 25న వీఐపీ బ్రేక్ దర్శనాలు, అష్టదళ పాదపద్మారాధన సేవను టీటీడీ రద్దు చేసింది. 24న ప్రొటోకాల్ ప్రముఖులకు మినహా వీఐపీ బ్రేక్ దర్శనాలకు సిఫార్సు లేఖలు స్వీకరించబోమని టీటీడీ స్పష్టం చేసింది.

వేద విద్య దినదినాభివృద్ధి చెందాలి: అహోబిల మఠాధిపతి

వేద విద్య దినదినాభివృద్ధి చెందాలని అహోబిల మఠాధిపతి రంగనాథ యతీంద్ర మహాదేశికన్ స్వామి అన్నారు. తిరుమలలో ఉన్న ధర్మగిరి వేద విజ్ఞాన పీఠాన్ని ఆయన ఆదివారం సందర్శించి విద్యార్థులకు అనుగ్రహ భాషణం చేశారు.

ఎస్టీ రైతులపై పోలీసుల దాడి

- చెరువు మట్టి తరలింపునకు వ్యతిరేకంగా అన్నదాతల నిరసనపై జులుం
- అడ్డొచ్చిన ఆందోళనకారులను ఈడ్చిపడేసిన ఖాకీలు
- పోలీసుల పహారాతో యథేచ్ఛగా తరలింపు
- వైఎస్సార్ జిల్లాలో పోలీసులు, కాంట్రాక్టర్ల బరితెగింపు



ఎస్టీ కాలనీ రైతులతో వాగ్వాదం చేస్తున్న పోలీసులు

ఖాజీపేట: చెరువులోని మట్టిని తరలించడంవల్ల తమ భూములకు నష్టం కలుగుతుందని ఎస్టీ రైతుల పోరాటం ఓవైపు.. ప్రభుత్వం అనుమతిచ్చింది కాబట్టి చెరువు మట్టిని ఎట్టి పరిస్థితుల్లోనైనా తీసుకుపోతాం అని కాంట్రాక్టర్ల బెదిరింపులతో ఆదివారం వైఎస్సార్ జిల్లా ఖాజీపేట మండలం నాగసానిపల్లె ఎస్టీ కాలనీలో ఉద్రిక్తత పరిస్థితులు ఏర్పడ్డాయి. కానీ, ఎస్టీ కాలనీ వాసులపై దాడిచేసి అడ్డొచ్చిన వారిని ఈడ్చిపడేసి పోలీసులు కాంట్రాక్టర్లకు దన్నుగా నిలిచారు. వివరాలివీ.. జాతీయ రహదారి నిర్మాణం కోసం నాగసానిపల్లె చెరువులో నుంచి మట్టిని తరలించేందుకు ప్రభుత్వం అనుమతిచ్చింది. సుమారు రెండు లక్షల క్యూబిక్ మీటర్ల మట్టిని తరలించుకునేందుకు అధికారులు ఓకే అన్నారు. అయితే, ఈ మట్టిని తరలించడంవల్ల చెరువుపై ఆధారపడ్డ రైతుల భూములకు నష్టం కల్గుతుందని.. సాగునీటికి ఇబ్బందులు ఏర్పడతాయని ఎస్టీ రైతులు నాలుగు రోజులుగా ధర్నా చేస్తున్నారు. అలాగే, చెరువు మట్టిని తరలించొద్దని ఎస్టీ రైతులు రహదారికి అడ్డుగా మట్టి వేసి నిరసనకు దిగారు. కానీ, ప్రత్యేక బలగాలతో వచ్చిన పోలీసులు శాంతియుతంగా నిరసన తెలుపుతున్న వారిపై ఒక్కసారిగా దాడికి తెగబడ్డారు. అడ్డొచ్చిన వారిని ఈడ్చిపడేశారు. నిర్దాక్షిణ్యంగా చొక్కాలు పట్టుకుని బలవంతంగా జీపు ఎక్కించే ప్రయత్నం చేశారు. మహిళలని కూడా చూడకుండా పోలీసులు వారిపై దౌర్జన్యం చేశారు. దీంతో నాగమ్మ అనే ఎస్టీ మహిళకు గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం ఆమెను కడప రిమ్స్‌కు తరలించారు. అలాగే, బలరాంనాయక్ అనే రైతుపై కూడా పోలీసుల దాడిచేయడంతో అతనికీ గాయాలయ్యాయి. పైగా అతని మెడలోని బంగారు గొలుసు మాయమైంది. వీరితోపాటు మరో ముగ్గురికి గాయాలైనట్లు గ్రామస్తులు తెలిపారు. ఇదిలా ఉంటే.. మట్టిని తరలించుకునేందుకు వీలుగా గ్రామంలో పోలీస్ పహారా ఏర్పాటుచేశారు. స్థానిక ప్రజలెవరూ అడ్డురాకుండా పోలీసులు తీవ్రస్థాయిలో గ్రామస్తులను హెచ్చరించారు. బయటకొస్తే కేసులు పెడతామని బెదిరించారు. అనంతరం కాంట్రాక్టర్లు రోడ్డుపై అడ్డుగా ఉన్న మట్టిని తొలగించి చెరువులోని మట్టిని యథేచ్ఛగా తరలించారు.

పోలీసుల దౌర్జన్యం దారుణం..



మట్టి తరలింపుతో మా పొలానికి నీళ్లువచ్చే అవకాశంలేదు కాబట్టి నిరసన తెలుపుతున్నాం. అయితే, కాంట్రాక్టర్లకు మద్దతుగా పోలీసులు మాపై దౌర్జన్యం, దాడిచేయడం దారుణం. నా మెడలో గొలుసు పోయింది. పోలీసులు కాంట్రాక్టర్లకు మేలుచేయడం మంచి పద్ధతికాదు.

– బలరాంనాయక్, నాగసానిపల్లె ఎస్టీ కాలనీ

రైతులు నష్టపోయినా ఫర్వాలేదా!?



చెరువులో మట్టిని తరలించడంవల్ల మాకు పూర్తిగా నష్టం కల్గుతుందని మేం పోరాడుతున్నాం. కానీ, పోలీసులు మాత్రం కాంట్రాక్టర్ల మేలు కోరడం బాధాకరం. అంటే.. రైతులు నష్టపోయినా వారికి ఫర్వాలేదా!?

– కృష్ణానాయక్, రైతు, నాగసానిపల్లె ఎస్టీ కాలనీ

రొమ్ము క్యాన్సర్ చికిత్సపై అవగాహన

ఆపరేషన్లు ప్రత్యక్ష ప్రసారం



నెల్లూరులో ఆపరేషన్ చేస్తున్న డాక్టర్లు

కాకినాడ క్రైం/నెల్లూరు (అర్బన్): కాకినాడ జీజీహెచ్ శస్త్రచికిత్స విభాగంలో రొమ్ము క్యాన్సర్ శస్త్రచికిత్స విధానాలపై అవగాహన కల్పిస్తూ ఆదివారం వర్క్‌షాప్ నిర్వహించగా, నెల్లూరు జీజీహెచ్ (ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి)లో ఆధునిక పద్ధతిలో 8 రకాల లాపరోస్కోపిక్ సర్జరీలు నిర్వహించారు. వివరాల్లోకి వెళితే.. కాకినాడ జీజీహెచ్ శస్త్రచికిత్స విభాగంలో రొమ్ము క్యాన్సర్ శస్త్రచికిత్స వర్క్‌షాప్‌కు సర్జరీ హెచ్‌వోడీ డాక్టర్ ఎస్.శ్రీనివాసరావు అధ్యక్షత వహించారు. డాక్టర్ ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ డాక్టర్ డీఎస్‌వీఎల్ నరసింహం ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కాకినాడ, రాజమహేంద్రవరం, అమలాపురం, విశాఖపట్నం, శ్రీకాకుళం వైద్య కళాశాలలకు చెందిన విద్యార్థులు ఈ వర్క్‌షాప్‌లో పాల్గొని, చికిత్సకు సంబంధించిన మెలకువలు నేర్చుకున్నారు. ఆపరేషన్‌ను ప్రత్యక్ష ప్రసారం ద్వారా నిపుణులు బోధించారు. డాక్టర్ నరసింహం, డాక్టర్ శ్రీనివాసరావు మాట్లాడుతూ, పుస్తకాల్లో నేర్చుకున్న అంశాలకు వర్క్‌షాపులు వీక్షణ రూపాన్నిస్తాయన్నారు. భవిష్యత్తులో మరిన్ని వర్క్‌షాపులు జరగాలని ఆకాంక్షించారు. ప్రముఖ క్యాన్సర్ నిపుణులు, హైదరాబాద్ అపోలో ఆస్పత్రికి చెందిన డాక్టర్ సౌమ్య, కాకినాడ మెడికవర్ ఆస్పత్రికి చెందిన డాక్టర్ ప్రశోభ్, డాక్టర్ నరేంద్ర బోధకులుగా వ్యవహరించారు. వర్క్‌షాప్‌కు వంద మందికి పైగా పీజీ వైద్య విద్యార్థులు హాజరయ్యారు.

నెల్లూరు జీజీహెచ్‌లో 8 లాపరోస్కోపిక్ సర్జరీలు

నెల్లూరు జీజీహెచ్ (ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి)లో ఆదివారం ఆధునిక పద్ధతిలో, కొత్త టెక్నాలజీతో ఏకధాటిగా 8 రకాల లాపరోస్కోపిక్ సర్జరీలు చేశారు. అబ్‌స్ట్రెట్రిక్స్, గైనకాలజీ విభాగంలో హెచ్‌వోడీ డాక్టర్ గీతాలక్ష్మి పర్యవేక్షణలో ఫెడరేషన్ ఆఫ్ అబ్‌స్ట్రెట్రిక్స్, గైనకాలజీ సొసైటీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో రెండు రోజులుగా ఎండోస్కోపిక్, లాపరోస్కోపిక్ ఆపరేషన్లపై జరుగుతున్న వర్క్‌షాపు ఆదివారంతో ముగిసింది. పీజీ వైద్య విద్యనభ్యసిస్తున్న వారి కోసం ఆదివారం ఉదయం 8 నుంచి సాయంత్రం 6 గంటల వరకు 4 లాపరోస్కోపీ హిస్టెరెక్టమీ సర్జరీలు, రెండు డయాగ్నోస్టిక్ లాపరోస్కోపీలు, రెండు హిస్టెరోస్కోపీలు, మరొకరికి సంతాన లేమికి కారణమైన గర్భాశయ నాళ నీరు గడ్డ (హైడ్రోసాల్పిన్), కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు ఒకే రోజు నిర్వహించడం విశేషం. ఈ ఆపరేషన్లు చేస్తూ కంప్యూటర్ ద్వారా స్క్రీన్‌పై పీజీ వైద్య విద్యార్థులకు వివరించారు.

గాజా మృతులు 50 వేలు

తాజా దాడుల్లో 23 మంది మృతి ● మృతుల్లో హమాస్ సీనియర్ నేత

డెయిర్ అల్–బలాహ్: గాజాలో ఇజ్రాయెల్ మారణహోమానికి బలైన వారి సంఖ్య 50 వేలు దాటింది! ఆదివారం గాజా ఆరోగ్య విభాగం ఈ మేరకు ప్రకటించింది. ''మృతుల్లో సగానికి పైగా మహిళలు, చిన్నారులే. 1.13 లక్షల మందికి పైగా క్షతగాత్రులుగా మారారు. ఇజ్రాయెల్ దాడుల వల్ల గాజా జనాభాలో 90 శాతం మంది నిలువనీడ కోల్పోయారు'' అని ఆవేదన వెలిబుచ్చింది. శనివారం అర్ధరాత్రి నుంచి ఇజ్రాయెల్ చేపట్టిన తాజా వైమానిక దాడుల్లో హమాస్ రాజకీయ విభాగం సీనియర్ నేత సహా 23 మంది చనిపోయారు. ఖాన్‌యూనిస్ సమీపంలో దాడుల్లో పాలస్తీనా పార్లమెంట్ సభ్యుడు, తమ రాజకీయ విభాగం సభ్యుడు సలాహ్ బర్దావిల్, ఆయన భార్య చనిపోయినట్లు హమాస్ వర్గాలు ప్రకటించాయి. టెంట్లో ప్రార్థనలు చేస్తున్న సమయంలో వీరిపై దాడి జరిగిందని పేర్కొన్నాయి. హమాస్ రాజకీయ వ్యవహారాలపై తరచూ మీడియాకు బర్దావిల్ ఇంటర్వ్యూలిస్తుంటారు. ఖాన్ యూనిస్‌పై జరిగిన దాడిలో దంపతులతో పాటు వారి ఐదుగురు సంతానం చనిపోయారు. మరో దాడిలో దంపతులు, ఇద్దరు కుమార్తెలు



ప్రాణాలు కోల్పోయినట్టు యూరోపియన్ ఆస్పత్రి వర్గాలు తెలిపాయి. మరో దాడిలో చనిపోయిన మహిళ, చిన్నారి మృతదేహాలను ఆస్పత్రికి తీసుకొచ్చినట్టు కువైటీ ఆస్పత్రి నిర్వాహకులు చెప్పారు.

మారణహోమమే

హమాస్ సాయుధులు 2023 అక్టోబర్ 7న ఇజ్రాయెల్‌పై మెరుపు దాడులు చేసి 1,200 మందిని చంపడం, 250 మందికి పైగా బందీలుగా తీసుకెళ్లడం తెలిసిందే. అప్పటి నుంచి గాజాపై ఇజ్రాయెల్ భీకర యుద్ధానికి దిగింది. ఆ ప్రాంతాన్ని శ్మశానసదృశంగా మార్చేసింది. జనవరిలో కుదిరిన కాల్పుల విరమణ రెండు నెలల ముచ్చటే అయింది. వారం రోజులుగా మళ్లీ గాజాపై దాడులతో ఇజ్రాయెల్ విరుచుకుపడుతోంది.

పోప్ ఫ్రాన్సిస్‌కు పూర్తి స్వస్థత

ఆస్పత్రి నుంచి వాటికన్ నివాసానికి

వాటికన్ సిటీ: ప్రాణాంతక నిమోనియాతో ఐదు వారాల పాటు పోరాడిన పోప్ ఫ్రాన్సిస్ (88) పూర్తి ఆరోగ్యం సంతరించుకున్నారు. జెమెల్లీ ఆసుపత్రి నుంచి ఆదివారం వాటికన్‌లోని నివాసానికి చేరుకున్నారు. ఆదివారం ఉదయం వందలాది మంది ఆస్పత్రి దగ్గర గుమిగూడి ఆయనకు వీడ్కోలు పలికారు. ఆసుపత్రి ప్రధాన ప్రవేశం ఎదురుగా ఉన్న బాల్కనీ నుంచి వారికి పోప్ అభివాదం చేశారు. ఆయనను చూడటానికి రోగులు కూడా బయటికొచ్చారు. అనంతరం పోప్‌ఆక్సిజన్ పైపులను ధరించి తెల్ల ఫియట్ కారులో వాటికన్ చేరుకున్నారు. తన నివాసానికి వెళ్లడానికి ముందు ఆనవాయితీ మేరకు సెయింట్ మేరీ మేజర్ బాసిలికాకు వెళ్లి ప్రార్థనలు చేశారు. పోప్‌కు శుభాకాంక్షలు తెలిపేందుకు సెయింట్ పీటర్స్ స్క్వేర్ వద్ద ప్రజలు భారీగా గుమిగూడారు. ఊపిరితిత్తులు, శ్వాసకోశ కండరాలు దెబ్బతినడంతో పోప్ ఇప్పటికీ మాట్లాడేందుకు ఇబ్బంది పడుతున్నారని వైద్యులు తెలిపారు. ''వృద్ధులైన రోగుల్లో ఇవి మామూలే. గొంతు త్వరలో సాధారణ స్థితికి చేరుకుంటుంది. అప్పటిదాకా శ్రమ పడకూడదు. ఎక్కువమందిని కలవకూడదు'' అని సూచించారు. దాంతో ఆయన కార్యక్రమాలన్నింటినీ రద్దు చేశారు. పోప్ దీర్ఘకాలిక ఊపిరితిత్తుల వ్యాధితో ఫిబ్రవరి 14న ఆస్పత్రిలో చేరడం తెలిసిందే. రెండు ఊపిరితిత్తుల్లో నిమోనియా ఉన్నట్లు నిర్ధారించి 38



రోజులపాటు చికిత్స అందించారు. 12 ఏళ్ల పదవీకాలంలో పోప్‌కు ఇదే అతిపెద్ద విరామం. ఒకానొక దశలో ఆయన వారసుడు ఎవరన్న చర్చ కూడా జరిగింది. అంత పెద్ద వయసులో డబుల్ నిమోనియాతో బాధపడే రోగులు ఆరోగ్యంగా బయటపడటం చాలా అరుదు. కానీ పోప్ మాత్రం ఇంత సమస్యలోనూ నిబ్బరంగా వ్యవహరించారు. ఎలా ఉందన్న వైద్యులతో బతికే ఉన్నానంటూ చెణుకులు విసిరారు.

అమెరికాలో పేలిన తూటా...

భారత సంతతి తండ్రీకూతుళ్ల మృతి

స్టోర్‌లో విధుల్లో ఉండగా నల్లజాతీయుని కాల్పులు

న్యూయార్క్: అమెరికాలోని వర్జీనియా రాష్ట్రంలో ఓ నల్లజాతి యువకుడు జరిపిన కాల్పుల్లో భారత సంతతికి చెందిన తండ్రి, కుమార్తె ప్రాణాలు కోల్పోయారు. నిందితుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అకోమాక్ కౌంటీలోని లాంక్‌ఫోర్డ్ ప్రధాన రహదారి పక్కనే ఉన్న డిపార్టుమెంటల్ స్టోర్‌లో ఈ నెల 21వ తేదీన ఉదయం ఐదున్నర గంటల సమయంలో ఈ ఘటన చోటుచేసుకుంది. గుజరాత్ నుంచి వలస వెళ్లిన ప్రదీప్‌కుమార్ పటేల్ (56), ఆయన కుమార్తె ఊర్మీ (24) ఈ స్టోర్‌లో పనిచేస్తున్నారు. జార్జి ఫ్రెజీర్ డెవాన్ వార్టన్ (44) అనే నల్ల జాతీయుడు ఉదయాన్నే స్టోర్‌కు వచ్చి తండ్రి కుమార్తెలతో ఘర్షణకు దిగాడు. విచక్షణ కోల్పోయి వారిద్దరిపై తుపాకీతో కాల్పులు జరిపి పరారయ్యాడు. తీవ్రంగా గాయపడిన పటేల్ అక్కడికక్కడే మరణించారు. అపస్మారక స్థితికి చేరుకున్న ఊర్మీని పోలీసులు సమీపంలోని సెంతారా నార్‌ఫోక్ జనరల్ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందింది. వార్టన్‌ను పోలీసులు అరెస్టు చేసి అకోమాక్



జైలుకు తరలించారు. అతడిపై ఫస్ట్ డిగ్రీ మర్డర్ కేసు నమోదు చేశారు. ఎందుకు కాల్పులు జరిపాడన్నది ఇంకా తెలియరాలేదు. అయితే అతడు రాత్రంతా స్టోర్ ఎదుటే పడిగాపులు కాశాడని, తండ్రి కుమార్తె ఉదయం స్టోర్ తెరవగానే వారితో గొడవకు దిగాడని తెలిసింది. రాత్రి స్టోర్ ఎందుకు మూసేశారని ప్రశ్నిస్తూ కాల్పులు జరిపినట్లు సమాచారం. పటేల్, ఊర్మీ పని చేస్తున్న స్టోర్ యజమాని భారత సంతతికి చెందిన పరేశ్ పటేల్ వారి బంధువేనని స్థానిక మీడియా వెల్లడించింది. పటేల్ తన భార్య హంసాబెన్, చిన్న కూతురు ఊర్మీతో కలిసి ఆరేళ్ల క్రితం విజిటర్ వీసాపై అమెరికాకు వచ్చారు. మరో ఇద్దరు కుమార్తెలు కెనడాలో, అహ్మదాబాద్‌లో ఉంటారు.

జస్టిస్ వర్మపై దర్యాప్తు... కీలక దశకు

త్వరలో సీజేఐకి నివేదిక ● ఆరోపణలు తేలితే ఉద్వాసన!

న్యూఢిల్లీ: ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ యశ్వంత్ వర్మ నివాసంలో నగదు దొరికిన ఘటనపై దర్యాప్తు కోసం భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సంజీవ్ ఖన్నా ఏర్పాటు చేసిన త్రిసభ్య కమిటీ చురుగ్గా వ్యవహరిస్తోంది. తొలి దశ దర్యాప్తును ఇప్పటికే పూర్తిచేసింది. విచారణ కీలకమైన రెండో దశకు చేరినట్లు తెలిసింది. ఈ దశలో లభించే సాక్ష్యాధారాలే జస్టిస్ వర్మ భవిష్యత్తును నిర్ణయించబోతున్నాయి. త్రిసభ్య కమిటీలో పంజాబ్, హరియాణా హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ షీల్ నాగు, హిమాచల్‌ప్రదేశ్ హైకోర్టు సీజే జస్టిస్ జీఎస్ సంధావాలియా, కర్నాటక హైకోర్టు సీజే జస్టిస్ అనూ శివరామన్ ఉన్న విషయం తెలిసిందే. కమిటీ దర్యాప్తును సీజేఐ స్వయంగా పర్యవేక్షిస్తున్నట్లు సమాచారం. తొలి దశ దర్యాప్తులో ఫిర్యాదు ఆధారంగా కొందరు సాక్షులను మాత్రమే ప్రశ్నించారు. అందులో తేలిన అంశాల ఆధారంగా రెండో దశలో మరింత లోతుగా విచారిస్తున్నారు. విచారణ పూర్తవగానే సీజేఐకి కమిటీ నివేదిక సమర్పించనుంది. ఇందుకు గడువేమీ నిర్దేశించలేదు. జస్టిస్ వర్మ ఇంట్లో భారీగా నగదు దొరికిందన్న వార్తలు దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించడం తెలిసిందే. కాలిపోయినట్లు చెబుతున్న నోట్ల కట్టల వీడియోలు, ఫొటోలను ఢిల్లీ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఉపాధ్యాయకు పోలీసు కమిషనర్ అందజేశారు. వాటిని ఆయన సుప్రీంకోర్టుకు సమర్పించారు. ఇందుకు సంబంధించి శనివారం రాత్రి సుప్రీంకోర్టు వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేసిన వీడియోలు, ఫొటోలు సంచలనం సృష్టించాయి. సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. ఈ నెల 14న జస్టిస్ వర్మ నివాసంలో అగ్నిప్రమాదం సందర్భంగా తమ సిబ్బందికి అక్కడ నోట్ల కట్టలేవీ దొరకలేదని ఢిల్లీ ఫైర్ సర్వీసెస్ చీఫ్ అతుల్ గార్గ్ తొలుత ప్రకటించారు. తానలా అనలేదంటూ మర్నాడే వివరణ ఇచ్చారు. నోట్ల కట్టల విషయం నిజమేనని తేలితే జస్టిస్ వర్మను పదవి నుంచి తొలగించాలని కేంద్ర ప్రభుత్వానికి సీజేఐ సిఫార్సు చేయవచ్చు. అనంతరం పార్లమెంట్‌లో అభిశంసన తీర్మానం ఆమోదించడం ద్వారా హైకోర్టు న్యాయమూర్తి పదవి నుంచి ఆయనను శాశ్వతంగా తొలగించవచ్చు.



జస్టిస్ వర్మ నివాసంలో అగ్నిప్రమాదానికి సంబంధించి శనివారం సుప్రీంకోర్టు విడుదల చేసిన వీడియోలో చోటుచేసుకున్న దృశ్యాలు

సీజేఐ ఖన్నాపై ప్రశంసల వర్షం

జస్టిస్ యశ్వంత్ వర్మ ఇంట్లో దొరికిన నగదుకు సంబంధించిన వీడియోలు, ఫొటోలు, కీలక డాక్యుమెంట్లను సుప్రీంకోర్టు ప్రజా బాహుళ్యంలోకి తీసుకురావడం గొప్ప విషయమని న్యాయ నిపుణులు అన్నారు. ఈ నిర్ణయం తీసుకున్న సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సంజీవ్ ఖన్నాపై ప్రశంసల వర్షం కురిపించారు. ''ఇది చాలా అరుదైన ఘటన. ఇలాంటి ఉదంతాల్లో వివరాలను సాధారణంగా గోప్యంగా ఉంచుతుంటారు. కానీ వాటిని వెబ్‌సైట్‌లో అందరికీ అందుబాటులో తేవడం ద్వారా గొప్ప సంస్కరణకు సీజేఐ శ్రీకారం చుట్టారు. ఆయనకు మా సెల్యూట్'' అని సీనియర్ అడ్వొకేట్లు సంజయ్ హెగ్డే, ఇందిరా జైసింగ్, ఆదిష్ సి.అగర్వాల్ తదితరులు అభినందించారు. జస్టిస్ వర్మపై అంతర్గత విచారణకు త్రిసభ్య కమిటీ ఏర్పాటును కూడా ప్రశంసించారు. జస్టిస్ వర్మ ఇంట్లో దొరికిన డబ్బు కట్టల వీడియోను చూసి ఆందోళన చెందానని ఆదిష్ చెప్పారు. పెద్ద మొత్తంలో నగదు కాలిపోయిన స్థితిలో దొరకడం పట్ల పలు అనుమానాలు తలెత్తుతున్నాయన్నారు. ఈ విషయంలో నిజానిజాలు నిగ్గుతేలాలని సీనియర్ న్యాయవాది మార్కండేయ ఖట్జూ అన్నారు.

నాపై కుట్రలు: జస్టిస్ వర్మ

- నా ఇంట్లో ఎలాంటి నగదూ దొరకలేదు
- కాలిపోయాయంటున్న నోట్లతో సంబంధం లేదు
- నా ప్రతిష్టను దెబ్బతీసేందుకే నిరాధార ఆరోపణలు

న్యూఢిల్లీ: తన అధికారిక నివాసంలో అగ్నిప్రమాదం తర్వాత నోట్ల కట్టలేవీ లభించలేదని, తనకు వ్యతిరేకంగా కుట్రలు జరుగుతున్నాయని ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ యశ్వంత్ వర్మ తేల్చిచెప్పారు. పెద్ద ఎత్తున నగదు లభ్యమైనట్లు జరుగుతున్న ప్రచారంలో ఎంతమాత్రం వాస్తవం లేదన్నారు. నిరాధార ఆరోపణలతో తన ప్రతిష్టను దెబ్బతీయాలని చూస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు ఢిల్లీ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి డి.కె.ఉపాధ్యాయకు ఆయన లేఖ రాశారు. ఆ నోట్లతో తమకు ఎలాంటి సంబంధం లేదని పేర్కొన్నారు. అవి అక్కడికెలా వచ్చాయో తనకు తెలియదన్నారు. ''అగ్నిప్రమాదం జరిగిన రోజు నేను ఇంట్లో లేను. ప్రమాదం తర్వాత స్టోర్‌రూంలో కాలిన కరెన్సీ నోట్ల కట్టలను అధికారులు తొలగించడం గానీ, స్వాధీనం చేసుకోవడం గానీ జరగలేదని నా కుమార్తె, సిబ్బంది చెప్పారు. కాలిన నోట్లను అధికారులు నా కుటుంబసభ్యులకు చూపలేదు. ఆ నోట్లను వారు బయటకు తీసుకెళ్లినట్లు నా కుటుంబీకులు చూడలేదు. నాకు గానీ, నా కుటుంబీకులకు గానీ స్టోర్‌రూంలో నగదు భద్రపర్చే అలవాటు లేదు. ఆ గదిలో మంటల్లో పాక్షికంగా కాలిన నగదు దొరికినట్లు చెప్పడం పూర్తిగా అర్థరహితం, అసంబద్ధం. దీని వెనక కుట్ర ఉంది'' అని ఆరోపించారు. అందరూ స్వేచ్ఛగా తిరిగే స్టోర్‌రూంలో ఎవరైనా భారీగా నగదు దాస్తారా అని ప్రశ్నించారు. ప్రమాదం జరిగినప్పుడు లేని నోట్లు తర్వాత అక్కడెలా ప్రత్యక్షమయ్యాయో దర్యాప్తు అధికారులే తేల్చాలన్నారు. ''మేం బ్యాంకు ఖాతాల నుంచే ఆర్థిక లావాదేవీలు చేస్తుంటాం. నగదు అవసరమైనప్పుడు బ్యాంకు నుంచి విత్‌డ్రా చేస్తుంటాం. వాటికి అన్ని లెక్కలూ ఉన్నాయి'' అని చెప్పారు.



ప్రేమచిహ్నం చెంత... అందాల రాణులు

ఆదివారం తాజ్‌మహల్ ముందు పోజిస్తున్న మిస్ యూనివర్స్ విక్టోరియా, మిస్ ఇండియా (యూనివర్స్) రియా సింఘా

మతాధారిత రిజర్వేషన్లు...

రాజ్యాంగ ఉల్లంఘనే

ఆరెస్సెస్ ప్రధాన కార్యదర్శి దత్తాత్రేయ హొసబలె

బెంగళూరు: మత ప్రాతిపదికన రిజర్వేషన్లు కల్పించడాన్ని రాజ్యాంగం అనుమతించలేదని రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆర్‌ఎస్‌ఎస్) ప్రధాన కార్యదర్శి దత్తాత్రేయ హొసబలె తెలిపారు. ఇలాంటి రిజర్వేషన్లు రాజ్యాంగానికి, రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ ఆశయాలకు విరుద్ధమన్నారు. ప్రభుత్వ కాంట్రాక్టుల్లో ముస్లింలకు 4 శాతం కేటాయించాలంటూ కర్ణాటక ప్రభుత్వం ఇటీవల తీసుకున్న నిర్ణయంపై చర్చ జరుగుతున్న వేళ ఆయన ఈ వ్యాఖ్యలు చేయడం గమనార్హం. ఆర్‌ఎస్‌ఎస్ అత్యున్నత నిర్ణాయక విభాగం అఖిల భారతీయ ప్రతినిధి సభ మూడు రోజుల భేటీ ముగిసిన అనంతరం ఆదివారం హొసబలె బెంగళూరులో మీడియాతో మాట్లాడారు. అవిభాజ్య ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర గతంలో ముస్లింలకు రిజర్వేషన్లు కల్పించేందుకు చేసిన ప్రయత్నాలను హైకోర్టులతో పాటు సుప్రీంకోర్టు అడ్డుకున్నాయని గుర్తుచేశారు. మొగల్ చక్రవర్తి ఔరంగజేబ్‌ను ఆదర్శమూర్తిగా మార్చారే తప్ప, పరమత సహనాన్ని బోధించిన ఆయన పెద్ద సోదరుడు దారా షికోను పట్టించుకోవడం లేదన్నారు. భారతీయ సంప్రదాయానికి వ్యతిరేకంగా నడుచుకున్న వారిని



కీర్తించడం దురదృష్టకరమని వ్యాఖ్యానించారు. 'దురాక్రమణదారు మనస్తత్వం కలిగిన వారు దేశానికి ప్రమాదకరం, భారతీయ సంప్రదాయాన్ని గౌరవించే వారికి మనం మద్దతుగా నిలుద్దాం'అని హొసబలె పిలుపునిచ్చారు. ఆర్‌ఎస్‌ఎస్ కొన్ని అంశాలపై తన అభిప్రాయాలను కేంద్ర ప్రభుత్వానికి తెలియజేయాలని భావిస్తున్నారా అన్న ప్రశ్నకు హొసబలె.. ప్రతిదీ సజావుగానే నడుస్తున్నందున ఆ అవసరమే లేదని స్పష్టం చేశారు. 'ప్రభుత్వానికి నిత్యం జరిగే అంశాల గురించి సంఘ్ ఏమీ చెప్పదు. ప్రజలేవైనా కొన్ని విషయాలపై ఆందోళన వ్యక్తం చేసిన సమయాల్లో మాత్రమే ఆ పనిచేస్తుంది. వివిధ సంస్థలు, రంగాల్లో పనిచేస్తున్న ఆర్‌ఎస్‌ఎస్ కార్యకర్తలే ఈ పనిని నెరవేరుస్తారు. వీటిపై చర్చించే యంత్రాంగం మాకుంది'అంటూ హొసబలె వివరించారు. ''అయోధ్య రామాలయ నిర్మాణం ఆర్‌ఎస్‌ఎస్ ఘనత కాదు.యావత్తు హిందూ సమాజం ఘనత. హిందువనే గుర్తింపు సిగ్గుపడే విషయం కాదు. అది గర్వకారణం. హిందువంటే మతపరమైన గుర్తింపే కాదు. జాతీయత, ఆధ్యాత్మికత, నాగరికతకు కూడా సంబంధించిన గుర్తింపు'' అన్నారు.

ఏప్రిల్ 28న కెనడాలో ఎన్నికలు

పార్లమెంట్ రద్దుకు ప్రధాని కార్నీ సిఫార్సు

ఒట్టావా: కెనడాలో ఎన్నికల నగారా మోగింది. ఏప్రిల్ 28న ముందస్తు పోలింగ్ జరపనున్నట్లు ఆదివారం కెనడా ప్రధానమంత్రి కార్నీ ప్రకటించారు. ట్రంప్ అధ్యక్షుడయ్యాక అగ్రరాజ్యం అమెరికాతో సంబంధాలు తీవ్రంగా దెబ్బతిన్న వేళ ఆయనీ ప్రకటన చేయడం గమనార్హం. జస్టిన్ ట్రూడో పదవి నుంచి వైదొలగడంతో రెండు వారాల క్రితమే కార్నీ ప్రధానిగా బాధ్యతలు చేపట్టారు. ముందస్తు ఎన్నికలపై ఊహాగానాలు వెలువడుతున్న వేళ ఆదివారం ఆయన గవర్నర్ జనరల్‌తో భేటీ అయి పార్లమెంట్‌ను రద్దు చేయాలని కోరారు. అక్టోబర్ 20న ఎన్నికలు జరగాల్సి ఉంది. అధికార లిబరల్ పార్టీకి అనుకూల పవనాలు వీస్తుండటంతో కార్నీ ముందస్తు నిర్ణయం తీసుకున్నట్లు చెబుతున్నారు.

కశ్మీర్‌లోని కథువాలో ఎన్‌కౌంటర్

జమ్మూ: జమ్మూకశ్మీర్‌లోని కథువా జిల్లాలో ఉగ్రవాదులు, భద్రతా బలగాల మధ్య ఆదివారం ఎదురుకాల్పులు చోటుచేసుకున్నాయి. అంతర్జాతీయ సరిహద్దులకు సమీపంలోని సన్యాస్ గ్రామ నర్సరీలో దాక్కున్న ఐదుగురు ఉగ్రవాదుల బృందాన్ని కట్టెలు ఏరుకునేందుకు వెళ్లిన స్థానిక మహిళలు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. అక్కడికి చేరుకున్న బలగాలపైకి ఉగ్రవాదులు కాల్పులకు దిగారు. బలగాలు దీటుగా స్పందిస్తున్నాయని అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా గాయపడిన ఏడేళ్ల చిన్నారిని ఆస్పత్రికి తరలించామన్నారు. కాల్పులు కొనసాగుతున్నాయని, అదనంగా బలగాలను అక్కడికి రప్పించామని తెలిపారు.

'భారత్ ఫస్ట్'కే అగ్రతాంబూలం: జై శంకర్

న్యూఢిల్లీ: అమెరికా తదితర దేశాలతో జరిగే వాణిజ్య చర్చల్లో లాభనష్టాల అంచనా కంటే 'భారత్ ఫస్ట్' విధానానికే తొలి ప్రాధాన్యమిస్తామని విదేశాంగ మంత్రి ఎస్.జై శంకర్ స్పష్టం చేశారు. భారత్‌కూ సుంకాల మోత తప్పదన్న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హెచ్చరికలపై ఆయన స్పందించారు. ''అమెరికాతో వాణిజ్య చర్చలు కొనసాగుతున్నాయి. అయితే ఈ విషయంలో కచ్చితంగా మన దేశ ప్రయోజనాలకే ప్రాధాన్యమిస్తాం'' అన్నారు. ఆదివారం బిజినెస్ ఇండియా మైండ్‌రష్–2025 కార్యక్రమంలో ఆయన మాట్లాడారు.

భగత్, లోహియాకు మోదీ నివాళులు

న్యూఢిల్లీ: విప్లవ వీరులు భగత్ సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌లకు ప్రధాని మోదీ ఆదివారం ఘనంగా నివాళులర్పించారు. దేశ స్వాతంత్ర్యం కోసం అత్యున్నత త్యాగాలు చేసిన భగత్ సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌లను ఈ రోజు జాతి స్మరించుకుంటోంది. స్వేచ్ఛ, న్యాయం కోసం వారి నిర్భయమైన ప్రయత్నం మనందరికీ స్ఫూర్తినిస్తూనే ఉంటుంది'అని మోదీ 'ఎక్స్'లో పేర్కొన్నారు. దేశానికి బానిస సంకెళ్ల నుంచి విముక్తి కల్పించేందుకు విప్లవ బాట పట్టిన ఈ ముగ్గురినీ బ్రిటిష్ పాలకులు లాహోర్ కుట్ర కేసులో ఉరి శిక్ష విధించారు. ఢిల్లీలోని సెంట్రల్ లెజిస్లేటివ్ అసెంబ్లీలోకి భగత్ సింగ్ బాంబు విసిరారు. బ్రిటిష్ పాలనపై వ్యతిరేకతను తెలియజేయడమే తప్ప, ఎవరినీ చంపడం వారి ఉద్దేశం కాదు. అయినప్పటికీ పాలకులు వీరికి 1931 మార్చి 23వ తేదీన ఉరిశిక్ష అమలు చేశారు. అప్పటికి వీరి వయస్సు 25 ఏళ్ల లోపే. అదేవిధంగా, సోషలిస్ట్ నేత రాం మనోహర్ లోహియా జయంతిని పురస్కరించుకుని ప్రధాని మోదీ ఆయనకు నివాళులర్పించారు. సామాజిక న్యాయ సాధనకు ఆయన జీవితాన్ని అంకితం చేశారన్నారు.

కేరళ బీజేపీ చీఫ్‌గా రాజీవ్ చంద్రశేఖర్!

తిరువనంతపురం: బీజేపీ నేత, కేంద్ర మాజీ మంత్రి రాజీవ్ చంద్రశేఖర్(60) కేరళ బీజేపీ అధ్యక్షుడిగా నియమితులు కానున్నారు. ఈ పోస్టు కోసం ఆయనొక్కరే దరఖాస్తు చేసుకోవడంతో ఎన్నిక ఏకగ్రీవం కానుంది. సోమవారం జరిగే పార్టీ రాష్ట్ర కౌన్సిల్ సమావేశం అనంతరం ఇందుకు సంబంధించిన ప్రకటన అధికారికంగా వెలువడనుంది. పార్టీ కేంద్ర పరిశీలకుడిగా సమావేశానికి హాజరుకానున్న ప్రహ్లాద్ జోషి ఈ నియామకాన్ని ధ్రువీకరించనున్నారు. పార్టీ రాష్ట్ర విభాగం అధ్యక్ష పదవి కోసం ఆదివారం రాజధాని తిరువనంతపురంలోని పార్టీ కార్యాలయంలో రాజీవ్ చంద్ర శేఖర్ రెండు సెట్ల నామినేషన్ పత్రాలను దాఖలు చేశారు.

రష్యా డ్రోన్ల దాడిలో తొమ్మిది మంది మృతి


కీవ్: ఓవైపు కాల్పుల విరమణ చర్చలకు సిద్ధమవుతూనే ఉక్రెయిన్‌పై రష్యా దాడులను కొనసాగిస్తోంది. తాజాగా ఆదివారం తెల్లవారుజామున జరిపిన డ్రోన్ల దాడిలో తొమ్మిది మంది మృతి చెందారు. పదుల సంఖ్యలో గాయపడ్డారు. ఖార్కివ్, సుమి, చెర్నిహివ్, ఒడెసా, డొనెట్స్క్ ప్రాంతాలతోపాటు రాజధాని కీవ్‌పైనా ఐదు గంటలకు పైగా రష్యా దాడులు కొనసాగాయని ఉక్రెయిన్ అధికారులు తెలిపారు. గగనతల రక్షణ వ్యవస్థల నుంచి తప్పించుకునేందుకు తక్కువ ఎత్తులో ఎగిరిన రష్యా డ్రోన్లు నివాస భవనాలపై పడ్డాయి. కీవ్‌పై జరిపిన డ్రోన్ దాడిలో ఐదేళ్ల చిన్నారి సహా ముగ్గురు మృతి చెందారు. మరో 10 మంది గాయపడ్డారు. డ్రోన్ శిథిలాలు పడటంతో డ్నిప్రో జిల్లాలోని రెండు నివాస భవనాలకు మంటలు అంటుకున్నాయి. 9 అంతస్తుల భవనంపై అంతస్తులో మంటలు చెలరేగడంతో ఒక మహిళ మృతి చెందింది. పొదిల్ జిల్లాలో 25 అంతస్తుల భవనంలోని 20వ అంతస్తులో అగ్నిప్రమాదం సంభవించింది. హోలోసివ్‌స్కీలో గోదాము, కార్యాలయ భవనంలో మంటలు చెలరేగి ఒకరు మృతి చెందారు. డొనెట్స్క్ ప్రాంతంపై జరిపిన దాడుల్లో నలుగురు చనిపోయారు.

ఈ వారమే లోక్‌సభ ముందుకు వక్ఫ్ బిల్లు..!

సాక్షి, న్యూఢిల్లీ: బీజేపీ నేతృత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుంటున్న వక్ఫ్ సవరణ బిల్లు–2024ను ఈ వారంలోనే లోక్‌సభలో ప్రవేశపెట్టే అవకాశాలున్నాయి. ఏప్రిల్ 4వ తేదీతో పార్లమెంట్ సమావేశాలు ముగియనున్న దృష్ట్యా, అంతకుముందే ఈ వారంలోనే బిల్లును ప్రవేశపెట్టి, ఆమోదింపజేసుకోవాలని కేంద్రం యోచిస్తున్నట్లు తెలుస్తోంది. వక్ఫ్ సవరణ బిల్లుపై ఏర్పాటైన పార్లమెంటరీ కమిటీ నివేదికను ఇప్పటికే స్పీకర్ ఓం బిర్లాకు అందించింది. వక్ఫ్ బోర్డుల్లో కనీసం నలుగురు ముస్లిమేతరులను చేర్చుకోవచ్చని భూ వివాదాలపై దర్యాప్తు అధికారాన్ని కలెక్టర్ల నుంచి సీనియర్ రాష్ట్ర ప్రభుత్వ నియామకాలకు బదిలీ చేయాలని కమిటీ సిఫార్సు చేసింది. ముస్లిమేతరులు వక్ఫ్ బోర్డుల్లో సభ్యులుగా ఉండేందుకు వీలు కల్పించడం, కలెక్టర్లకు అదనపు అధికారాల వంటివాటిని ప్రతిపక్షాలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి.

అనంత దూరంలోని... ఆ గెలాక్సీలో ఆక్సిజన్!

అనంతమైన విశ్వంలో మన భూమిపై తప్ప ఇంకెక్కడా ప్రాణవాయువు(ఆక్సిజన్) ఉండకపోవచ్చని శాస్త్రజ్ఞులు ఇప్పటిదాకా భావించేవారు. కానీ మనకు అత్యంత సుదూరంలో ఉన్న ఒక నక్షత్ర మండలం (గెలాక్సీ)లో ఆక్సిజన్ ఆనవాళ్లను గుర్తించారు. అంతేగాక భారీ లోహాల జాడను సైతం కనిపెట్టారు. ఈ గెలాక్సీ భూమి నుంచి ఏకంగా 1,340 కోట్ల కాంతి సంవత్సరాల దూరంలో ఉంది! విశ్వం ఏర్పడిన తొలినాళ్లలోనే ఇది ఏర్పడి ఉండవచ్చని పరిశోధకులు భావిస్తున్నారు. విశ్వం పుట్టుకకు కారణమైన బిగ్‌బ్యాంగ్ 1,380 కోట్ల ఏళ్ల క్రితం సంభవించిందన్న వాదనలు ఇప్పటికే ఉన్నాయి. ఈ నక్షత్ర మండలానికి జేడ్స్–జీఎస్–జెడ్14–0 అని నామకరణం చేశారు. నిజానికి దీన్ని 2024 జనవరిలోనే ప్రాథమికంగా గుర్తించారు. జేమ్స్ వెబ్ స్పేస్ టెలిస్కోప్ ఈ గెలాక్సీ ఉనికిని వెలుగులోకి తెచ్చింది. కాకపోతే దానిపై ప్రాణవాయువు



ఉన్నట్లు కనిపెట్టడం కీలక పరిణామమని సైంటిస్టులు చెబుతున్నారు. ఆ ఆక్సిజన్ ఏ రూపంలో, ఎంత పరిమాణంలో ఉందన్నది తేల్చడానికి పరిశోధనలు కొనసాగిస్తున్నారు. పరిమాణంలో అత్యంత భారీగా ఉన్న ఈ నక్షత్ర మండలం కాంతివంతమైనది కూడా. మన భూగోళమున్న గెలాక్సీకి సమీపంలో ఇప్పటిదాకా మరో 700 గెలాక్సీలను జేమ్స్ వెబ్ టెలిస్కోప్ గుర్తించింది.

– సాక్షి, నేషనల్ డెస్క్

ట్విట్టర్ పిట్టకు రూ.30 లక్షలు!

సామాజిక మాధ్యమం ట్విట్టర్ లోగో బ్లూబర్డ్ గుర్తుంది కదా. ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్ ఆ సంస్థను కొనుగోలు చేశాక ఎక్స్‌గా పేరు మార్చినా ఇంకా అంతా ట్విట్టర్ అనే పిలుస్తారంటే దాని ప్రభావం అర్థం చేసుకోవచ్చు! ట్విట్టర్ కార్యాలయంపై 2012 నుంచి 2023 వరకూ సగర్వంగా వేలాడిన బ్లూ బర్డ్ లోగో తాజా వేలంలో రూ.30లక్షలకు అమ్ముడు పోయింది. 560 పౌండ్ల బరువున్న ఈ లోగోను ఓ అజ్ఞాత వ్యక్తి కొనుగోలు చేశాడు. మస్క్ 2022లో ట్విట్టర్‌ను టేకోవర్ చేయగానే శాన్‌ఫ్రాన్సిస్కో ప్రధాన కార్యాలయం నుంచి ట్విట్టర్ ఐకానిక్ బ్లూ బర్డ్‌ను తొలగించడం తెలిసిందే. ప్రధాన కార్యాలయాన్ని కూడా టెక్సాస్‌కు మార్చారు. ట్విట్టర్‌కు సంబంధించిన వస్తువులు, ఆఫీస్ ఫర్నీచర్‌తో పాటు లోగోను కూడా 2023 ఆగస్టులో మస్క్ వేలం వేశారు. అప్పుడు దాన్ని దక్కించుకున్న ఆర్‌ఆర్ సంస్థ తాజాగా తిరిగి వేలం వేసింది.

సాక్షి 24|7 తమిళనాడు
TAMILNADU
సోమవారం । 24 । మార్చి । 2025

అవార్డుల ప్రదానం



చెన్నైలో ఆదివారం న్యూస్ 18 తమిళనాడు కట్రల్ (నేర్చుకోవడం) అవార్డుల వేడుక జరిగింది. ఇందులో ఉత్తమ మహిళాకళాశాల అవార్డును చెన్నైలోని రాణి మేరి కళాశాలకు రాష్ట్ర ఉన్నత విద్యా శాఖ మంత్రి కోవి చెలియన్ అందజేశారు.

– సాక్షి, చెన్నై

న్యూస్‌రీల్

ఆన్‌లైన్ పేకాటలో నష్టం

– నవ వరుడు ఆత్మహత్య

తిరువొత్తియూరు: తిరుచ్చిలో ఆన్‌లైన్ పేకాట ఆడి నగదును పోగొట్టుకున్న నవ వరుడు ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వివరాలు.. తిరుచి నార్త్ తారనల్లూరు ప్రాంతానికి చెందిన కనకరాజు (27) బీఎస్ఎన్ఎల్‌లో పనిచేస్తున్నాడు. ఇతని భార్య ధనలక్ష్మి (22). ఈమె ఒక బ్యూటీ పార్లర్‌లో పనిచేస్తున్నారు. వీరు ఇద్దరు ప్రేమించి గత 9 నెలల క్రితం వివాహం చేసుకున్నారు. ఈ క్రమంలో శుక్రవారం ఉదయం కనకరాజు పనికి బయలుదేరి వెళ్లాడు. ధనలక్ష్మి బ్యూటీ పార్లర్‌కు వెళ్లారు. రాత్రి 7 గంటల సమయంలో పని ముగించుకుని ధనలక్ష్మి ఇంటికి తిరిగి వచ్చింది. ఆ సమయంలో ఇంటిలో ఉన్న ఫ్యాన్‌కు ఉరివేసుకుని కనకరాజు వేలాడుతున్నారు. దీంతో ధనలక్ష్మి ఇరుగుపొరుగు వారి సహాయంతో అతన్ని కిందకు దింపి సమీపంలో ఉన్న ఓ ప్రైవేటు ఆసుపత్రికి తీసుకెళ్లింది. అక్కడ కనకరాజును పరిశీలించిన డాక్టర్లు అతను చనిపోయిన మృతి చెందినట్లు తెలిపారు. గాంధీ మార్కెట్ పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేస్తూ ఉన్నారు. విచారణలో సెల్‌ఫోన్ ద్వారా ఆన్‌లైన్ ఆడే అలవాటు కనకరాజ్‌కు ఉందని, ఈ ఆటలో ఎక్కువ నగదు పోగొట్టుకోవడంతో ఆత్మహత్య చేసుకున్నట్లు తెలియ వచ్చింది.

అన్నామలైకు తమిళ విశ్వాసం లేదు



కర్ణాటక డిప్యూటీ సీఎం డీకే శివకుమార్

సాక్షి, చెన్నై : బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలైకు తమిళనాడు, తమిళ ప్రజలపై ఎలాంటి విశ్వాసం అన్నది లేదని కర్ణాటక డిప్యూటీ సీఎం శివకుమార్ విమర్శించారు. లోక్ సభ నియోజవర్గ పునర్విభజనకు వ్యతిరేకంగా చెన్నైలో జరిగిన జేఏసీ సమావేశానికి హాజరైన శివకుమార్ ఆదివారం ఉదయం తిరుగు ప్రయాణం అయ్యారు. చెన్నై విమానాశ్రయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ, అన్నామలైపై విరుచుకుపడ్డారు. లోక్‌సభ నియోజకవర్గాల విషయంలో గానీ, తమిళనాడు ప్రజల సంక్షేమం విషయంలో గానీ బీజేపీ తమిళనాడు అధ్యక్షుడు అన్నామలైకు చిత్తశుద్ధి, విశ్వాసం లేదని మండిపడ్డారు. లోక్‌సభ పునర్విభజన అన్నది తమిళనాడుకే కాదు దక్షిణభారత దేశానికి పెనునష్టాన్ని కలిగిస్తుందన్నారు. అందుకే వ్యతిరేకిస్తున్నామన్నారు. లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజన వ్యవహారంపై అన్నామలై వ్యాఖ్యలు చేయడం కాదని, ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. అన్నామలైకు ఏమీ తెలియదని, కేవలం ఆయన ఆ పార్టీ అధిష్టానానికి విశ్వాస పాత్రుడని, వారిని మెప్పించేందుకు సొంత రాష్ట్ర ప్రజలకు అన్యాయం చేస్తున్నారని విమర్శించారు. సొంత రాష్ట్రం,సొంత రాష్ట్రం ప్రజల పై ఆయన విశ్వాసం చూపించాల్సిన అవసరం ఉందని, అయితే ఆయనకు రవ్వంత విశ్వాసం కూడా లేదని మండిపడ్డారు.

విద్యార్థుల కోసం ఐసీఎస్ఐ తోడ్పాటు



మీడియాతో ఐసీఎస్ఐ ప్రతినిధులు

సాక్షి, చెన్నై: విద్యార్థులకు తోడ్పాటును అందించే విధంగా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కంపెనీ సెక్రటరీస్ ఆఫ్ ఇండియా(ఐసీఎస్ఐ) కొత్త కార్యక్రమాన్ని ప్రారంభించింది. చెన్నైలో ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఆఫ్ కంపెనీ సెక్రటరీస్ ఆఫ్ ఇండియా బలమైన ఉనికిని కలిగి ఉండటమే కాకుండా ధర్మమూర్తి రావు బహదూర్ కలవాలా కున్నన్ చెట్టి హై కాలేజ్, , శ్రీమతి దేవ్‌కుమార్ నానాలాల్ భట్ వైష్ణవ్ కాలేజ్ ఫర్ ఉమెన్, ఆల్ఫా ఆర్ట్స్ –సైన్స్ కాలేజ్, తమిళనాడు డాక్టర్ అంబేద్కర్ లా యూనివర్సిటీలో అధ్యయన కేంద్రాలను కలిగి ఉన్నట్టు ప్రకటించారు. చెన్నైలోని తమిళనాడు డాక్టర్ అంబేద్కర్ లా యూనివర్సిటీలో విద్యా సహకారాన్ని అందించేవిధంగా 7,952 మంది విద్యార్థులు , తమిళనాడులో 13,808 మంది విద్యార్థులు ఎగ్జిక్యూటివ్ ప్రొఫెషనల్ స్థాయిలో ఐసీఎస్ఐలో నమోదు చేసుకున్నారని వివరించారు. ఆదివారం చెన్నైలో జరిగిన సమావేశంలో ఐసీఎస్ఐ అధ్యక్షుడు ధనంజయ్ శుక్లా, పవన్ జి. చందక్ మాట్లాడుతూ , ఎగ్జిక్యూటివ్ , ప్రొఫెషనల్ ప్రోగ్రామ్ విద్యార్థుల కోసం కేంద్రీకృత ఉచిత ఆన్‌లైన్ తరగతులు, ఆన్‌లైన్ సందేహ నివృత్తి తరగతులను ప్రారంభించామన్నారు. ఇది ప్రపంచ ధోరణికి అనుగుణంగా , స్థిరమైన, బాధ్యతాయుతమైన పెట్టుబడి వైపు అవసరమైన మార్గదర్శకత్వాన్ని అందించే సూత్రాలలో మొదటిదిగా పేర్కొన్నారు. ఈ మేరకు స్టూడెంట్స్ ఎడ్యుకేషన్ ఫండ్ ట్రస్ట్ ద్వారా ప్రతిభావంతులైన , ఆర్థికంగా బలహీనమైన విద్యార్థులకు 100 శాతం ఫీజు మినహాయింపును అందిస్తున్నామన్నారు. . ఎస్సీ,ఎస్టీ విద్యార్థులకు రాయితీలు, అమరవీరుల కుటుంబాలకు రాయితీలు అంటూ ప్రత్యేక విద్యా సహకారం అందిస్తున్నామని వివరించారు.

పాంబన్ రెడీ!

పాంబన్ రైల్వే వంతెన మార్గం రెడీ అయింది. ఏప్రిల్ నుంచి రైలు సేవలు ఈ మార్గంలో సాగనున్నాయి. దేశంలోనే తొలి వర్టికల్ లిఫ్ట్ రైల్వే సీ బ్రిడ్జిగా రూపుదిద్దుకున్న ఈ వంతెనను ప్రధాని నరేంద్ర మోదీ ప్రారంభించనున్నారు. ఈ రైల్వే మార్గంలో సమగ్ర పరిశీలనను ముగించిన దక్షిణ రైల్వే అధికారులు ప్రారంభోత్సవ ఏర్పాట్లను మొదలు పెట్టారు.



కొత్త వంతెనపై ట్రయల్ రన్

- ఏప్రిల్‌లో రైలు సేవలు
- పీఎం మోదీ రాక
- దక్షిణ రైల్వే అధికారుల సమగ్ర పరిశీలన
- ఏర్పాట్లపై కసరత్తు

సాక్షి, చెన్నై: ఆధ్యాత్మికంగా, పర్యాటకంగా రామనాథపురం జిల్లా రామేశ్వరం ప్రసిద్ధి చెందిన విషయం తెలిసిందే. ఇక్కడికి నిత్యం రామనాథ స్వామి దర్శనార్థం భక్తులు, పర్యాటక అందాల్ని తిలకించేందుకు దేశ విదేశీయులు తరలి వస్తుంటారు. కాశీని ఏ మేరకు పవిత్రంగా భావిస్తారో, అదే తరహాలో రామేశ్వరంలోని సముద్ర తీరంలోని అగ్ని తీర్థం పవిత్ర స్నానాలకు ప్రసిద్ధి చెందింది. ఇక్కడ స్నానం చేసినానంతరం భక్తులు ఆలయంలోని ఉన్న మరో బావి నీళ్ల చల్లుకుని రామనాథ స్వామి దర్శనార్థం వెళ్లడం జరుగుతోంది. ఇటీవల ఓ పరిశోధనలతో రామేశ్వరం పరిసరాల్లో 1962 కాలంలో 62 తీర్థాలు ఉన్నట్టు తేల్చి, ఇందులో 30 తీర్థాలను ప్రస్తుతం గుర్తించారు. వీటిని పునరుద్ధరించి ఆధ్యాత్మిక, పర్యాటకంగా ఈ పరిసరాలను తీర్చిదిద్దేందుకు కేంద్రం ప్రత్యేక కార్యచరణపై దృష్టి పెట్టింది.

సముద్రంలో ప్రయాణం..

మండపం నుంచి పాంబన్ మీదుగా రామేశ్వరానికి రైలు ప్రయాణం అన్నది సముద్రం మధ్యలో జరుగుతుంది. చెన్నై నుంచే కాదు, ఉత్తరాది రాష్ట్రాల నుంచి సైతం రామేశ్వరంకు పలు రైళ్ల సేవలు జరుగుతున్నాయి. ఇక్కడి రైల్వే మార్గం పయనం ఎంతో ఆహ్లాదకరంగానే కాదు, ఓ కొత్త అనుభూతిని కల్గిస్తుంది. మండపం నుంచి రామేశ్వరం వైపుగా రైలు సాగేందుకు పాంబన్ దీవుల్ని తాకుతూ రైల్వే వంతెన నిర్మించి 110 ఏళ్లు దాటింది. 1964లో



పాంబన్ పాత, కొత్త వంతెన

కడలి సృష్టించిన కల్లోలానికి పాంబన్ సమీపంలోని ధనుస్కోడి నామ రూపాలు లేకుండా పోయినా, ఈ వంతెన ఏ మాత్రం చెక్కు చెదరలేదు. 1914లో నిర్మించిన ఈ వంతెన అప్పటి ఇంజినీర్ల ప్రతిభకు దర్పణం. నౌకలు వచ్చే సమయంలో లోతైన ప్రాంతం వద్ద రెండుగా ఈ వంతెన తెరచుకుంటుంది. అప్పటి సాంకేతిక పరిజ్ఞానం మేరకు నిర్మించిన ఈ వంతెనకు ఇటీవల కాలంగా తరచూ ఏదో ఒక సమస్య తప్ప లేదు. అనేక చోట్ల వంతెన బీటలు వారడం వంటి పరిణామాలతో ప్రస్తుతం ఉన్న వంతెనకు పక్కనే కొత్తగా మరో వంతెన నిర్మాణానికి తగ్గ చర్యల మీద రైల్వే యంత్రాంగందృష్టి పెట్టి పనులను ముగించింది. రూ. 550 కోట్లతో ఈ వంతెన నిమిత్తం సముద్రంలో 140 పిల్లర్స్‌ను ఏర్పాటు చేశారు. నౌకలు వచ్చే సమయంలో వంతెన రెండుగా తెరచుకునే ప్రాంతం 22 మీటర్ల ఎత్తులో ఉండే విధంగా, వంతెన మార్గం 20 మీటర్ల ఎత్తులో ఉండే రీతిలో నిర్మాణాలు జరిగాయి. ఆధునిక యుగంలోని ఇంజనీర్ల ప్రతిభకు దర్పణంగా నిలిచే విధంగా దేశంలోనే తొలి వర్టికల్ లిఫ్ట్ రైల్వే సీ బ్రిడ్జిగా రూపుదిద్దుకున్న ఈ మార్గంలో ట్రయల్ రన్ పలు మార్లు విజయవంతమైంది. ప్రస్తుతం ఈమార్గంలో రైలు నడిపేందుకు సర్వం సిద్ధం చేశారు.

రామేశ్వరం టూ ధనుష్కోడి రైల్వే సంగతేంటో..



గల్లంతైన ధనుష్కోడి రైల్వే స్టేషన్ (ఫైల్)

రామేశ్వరం, మండపం, పాంబన్, ధనుస్కోడి పరిసరాల నుంచి కచ్చదీవులు, శ్రీలంక సముద్ర తీర దీవులు కూత వేటు దూరంలోనే ఉన్నాయి. ఈ పరిసరాలను కలిపే విధంగా ప్రయాణికుల నౌకను నడిపేందుకు ప్రయత్నాలు సైతం జరుగుతోన్నాయి. అలాగే 1964లో కడలి సృష్టించిన కల్లోలానికి నామ రూపాలు లేకుండా పోయిన ధనుస్కోడిని మళ్లీ పునరుద్ధరించి పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దే విధంగా కసరత్తులు చేపట్టారు. ఇందులో భాగంగా గతంలో గల్లంతైన రామేశ్వరం నుంచి ధనుస్కోడికి రైల్వే మార్గం పునరుద్ధరించే విధంగా కొత్త మార్గానికి సిద్ధమయ్యారు. ఈ మార్గంలో 17.2 కి.మీ దూరం రూ. 733 కోట్లతో 2018–19లో రైల్వే ప్రాజెక్టును కేంద్ర రైల్వే శాఖ ప్రకటించింది. అటవీశాఖకు చెందిన 28 హెక్టార్లు, తమిళనాడు ప్రభుత్వానికి చెందిన 43 హెక్టార్లు, ప్రైవేటుకు చెందిన 3.66 హెక్టార్లను ఈ రైల్వే మార్గం, రైల్వే స్టేషన్లు తదితర పనులకు స్థల సేకరణకు నిర్ణయించారు. ముందుగా రూ. 385 కోట్లను ప్రకటించారు. ఈ పనులకు లోక్‌సభ ఎన్నికలకు ముందుగా ప్రధాని నరేంద్ర మోదీ శంకుస్థాపనకూడా చేశారు. అయితే ఈ పనులు అడుగైనా ముందుకు సాగక పోవడం గమనార్హం. పాంబన్ వంతెన ప్రారంభోత్సవ వేళ ధనుష్కోడి రైల్వే మోక్షానికి పీఎం ప్రకటన చేసేనా అన్న ఎదురు చూపులు పెరిగాయి. అదే సమయంలో ఈ రైల్వే మార్గానికి స్థల వివాదం కూడా కారణంగా ఓ కారణంగా కనిపిస్తోంది.

పీఎం మోదీ పర్యటన

ఈ రైల్వే మార్గాన్ని ప్రారంభించేందుకు ప్రధాని నరేంద్ర మోదీ రానున్నారు. గత ఏడాదే ప్రారంభోత్సవం అని ఏర్పాటు చేసినా, రైల్వే మార్గంలో చిన్న చిన్న సాంకేతిక మార్పుల దృష్ట్యా, వాయిదాల పర్వంతో ముందుకు సాగింది. ప్రస్తుతం అన్ని రకాల పనులు ముగిశాయి. రైలు మండపం నుంచి పాంబన్ దీవుల మీదుగారామేశ్వరంలోకి దూసుకెళ్లేందుకు సర్వం సిద్ధమైంది. దీంతో ప్రధాని నరేంద్ర మోదీ చేతుల మీదుగా ఈ వంతెన ప్రారంభోత్స కసరత్తులలో దక్షిణ రైల్వే వర్గాలు నిమగ్నమయ్యాయి. శని, ఆదివారాలలో రైల్వే అధికారులు పాంబన్ వంతెనలో పరిశీలనలు, ప్రధాని నరేంద్ర మోదీ పర్యటనకు సంబంధించిన ఏర్పాట్ల కసరత్తులలో బీజీ అయ్యారు. దక్షిణ రైల్వే అదనపు జీఎం కౌశల్ కిషోర్, మధురై రైల్వే డివిజన్ అధికారిశరత్ శ్రీవత్సవ్‌తో



పీఎం రాక ఏర్పాట్లను పరిశీలిస్తున్న అధికారులు

కూడిన అధికారుల బృందం ఏర్పాట్ల మీద దృష్టి పెట్టింది. వీరితో పాటూ రామనాథపురం ఎస్పీ సతీష్, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఇంటెలిజెన్స్, భద్రతా విభాగాల అధికారులు ఈ పరిశీలనలో నిమగ్నమయ్యారు. శనివారం తొలి రోజుగా రామేశ్వరంలో పర్యటించారు. ఇక్కడిప్రజా పనుల శాఖ హెలిపాడ్‌లో పరిశీలన చేశారు. పాంబన్ వంతెన మార్గాన్ని సమగ్రంగా పరిశీలించారు. ఆదివారం రెండవ రోజుగా ఇక్కడ పరిశీలన చేశారు. రామేశ్వరం బస్టాండ్ సమీపంలోని ఓ ఆలయ మైదానం ఆవరణలో వేదిక ఏర్పాటుకు స్థలం ఎంపిక చేశారు. ఇక్కడ పరిశీలన చేశారు. మరోమారు పాంబన్ వంతెన మార్గంలో పర్యటించారు. ప్రజా పనుల శాఖ హెలీపాడ్‌ను రెండవ సారి సందర్శించారు. కుందుకాల్ పరిధిలోని వివేకానంద స్మారకం పరిసరాలను పరిశీలించారు. అన్ని రకాల పనులు ముగిసిన నేపథ్యంలో ప్రధాని నరేంద్ర మోదీ రాక కోసం ఎదురు చూస్తున్నారు. ఏప్రిల్ మొదటి లేదా, మూడో వారంలో ఈ మార్గంలో రైలు సేవలు పూర్తి స్థాయిలో చేపట్టేందుకు నిర్ణయించారు. ఈ విషయంగా కౌశల్ కిషోర్ పేర్కొంటూ, మరో రెండు వారాలలో ఈ వంతెన ప్రారంభం అవుతందన్నారు. రైలు సేవ ఏప్రిల్ మొదటి వారం లేదా మూడో వారంలో జరిగే విధంగా పరిశీలన, చర్చిస్తున్నామన్నారు. పాత వంతెనను తొలగించే విషయంగా ఎలాంటి నిర్ణయం తీసుకోలేదన్నారు. కొత్త రైల్వే వంతెన ప్రారంభోత్సవం తర్వాతే ఇతర పనులుఅని వ్యాఖ్యానించారు. రామేశ్వరం రైల్వే స్టేషన్ ఆధునీకరణ పనులు త్వరితగతిన ముగుస్తాయన్నారు. కాగా, ఈ వంతెన ప్రారంభోత్సవం నిమిత్తం ప్రధాని నరేంద్ర మోదీ ఏప్రిల్ 6వ తేదీ రామేశ్వరంకు వస్తారన్న చర్చ జరుగుతోంది. ఏప్రిల్ 5వ తేదీన శ్రీలంకకు వెళ్లే ప్రధాని ఆతర్వాత తిరుగు పయనంలో రామేశ్వరం పర్యటనకు రావచ్చు అన్నసంకేతాలు ఉన్నాయి. అయితే కాశీ తర్వాత రామేశ్వరాన్ని అత్యంత పవిత్రంగా మోదీ భావిస్తుంటారు. ఈ దృష్ట్యా, ఆయన శ్రీలంక పర్యటన ముగించుకుని ఇక్కడకు వచ్చేనా లేదా, ఆ పర్యటనకు వెళ్లే ముందే వచ్చి ప్రారంభిస్తారా.. ?లేదా అన్నది ఒకటి రెండు రోజులలో తేలనుంది.

ప్రభుత్వ ఉద్యోగుల దీక్ష

- రాష్ట్రవ్యాప్తంగా నిరసనలు
- సమ్మె తప్పదని హెచ్చరిక



వేలూరు కలెక్టరేట్‌లో నిరాహార దీక్ష చేస్తున్న జాక్టో జియో ప్రతినిధులు



తిరువళ్లూరులో..

సాక్షి, చెన్నై : తమ డిమాండ్ల సాధన నినాదంతో ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయులు జాక్టో – జియో వేదికగా ప్రభుత్వ ఉద్యోగులు ఆదివారం నిరాహార దీక్ష నిర్వహించారు. సెలవు రోజైనా తమ తమ కార్యాలయాల వద్ద నిరసనకు దిగారు. పాత పెన్షన్ విధానం తదితర డిమాండ్ల సాధన లక్ష్యంగా ఉద్యోగ, ఉపాధ్యాయులు ఆందోళనలు చేస్తూ వస్తున్న విషయం తెలిసిందే. ఇప్పటికే ఉద్యోగ,ఉపాధ్యాయులు సమ్మె గంట మోగిస్తామన్న హెచ్చరికలు చేసిన విషయం తెలిసిందే. వీరితో మంత్రులతోకూడిన కమిటీ జరిపిన చర్చలు ఫలించ లేదు. గత వారం రెండు రోజుల పాటూ ఆందోళనలు నిర్వహించారు. అదే సమంయలో విధులకు రాని వారిని గుర్తించి ఒక రోజు వేతనంకోతకు ప్రభుత్వం ఉత్తర్వులు సైతం జారీ చేసింది. ఈ పరిస్థితుల్లో తమ పోరాటాన్ని మరింత ముందుకు తీసుకెళ్లేందుకు ఉద్యోగ,ఉపాధ్యాయ సంఘాలు నిర్ణయించారు. రాష్ట్రవ్యాప్తంగా ఆదివారం సెలవు రోజైనప్పటికి తమ తమకార్యాలయాల వద్దకు ఒక రోజు నిరాహార నిర్వహించారు. ఇప్పటికైనా పాలకులు స్పందించకుంటే సమ్మె గంట తప్పదన్న హెచ్చరికలు జారీచేశారు. చెన్నైలోని ఎళిలగం వద్ద భారీ నిరసన దీక్షను ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలు నిర్వహించాయి.

వేలూరులో..

వేలూరు: జాక్టో జియో ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం వేలూరు కలెక్టరేట్‌లో నిరాహార దీక్ష నిర్వహించారు. ఈ దీక్షకు జిల్లా ఆర్గనైజర్‌లు జోషి,జయకాంతన్‌లు అధ్యక్షత వహించగా, జాక్టో జియో ప్రతినిధులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ప్రతినిధులు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా పలు శాఖల్లో సుమారు 30 శాతానికి పైగా ఖాళీగా ఉన్న ఉన్న పోస్టులను భర్తీ చేయాలని, 21 మాసాల పెండింగ్ వేతనాన్ని ప్రభుత్వ ఉద్యోగులు, టీచర్‌లకు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ దీక్షా కార్యక్రమంలో జాక్టో జియో ప్రతినిధులు సత్యకుమార్, అన్నయ్య, శ్రీనివాసన్, జనార్ధనన్, రమేష్, రామన్ సభ్యులు పాల్గొన్నారు.

తిరువళ్లూరులో..

తిరువళ్లూరు: ఎన్నికల్లో డీఎంకే ఇచ్చిన హమీల్లో భాగంగా ప్రభుత్వ ఉద్యోగులు ఉపాధ్యాయుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ జిల్లా కేంద్రాల్లో జాక్టోజియో ఆధ్వర్యంలో నిరాహార దీక్ష చేపట్టాలని పిలుపు నిచ్చింది. ఇందులో భాగంగానే ఐక్యవేదిక పిలుపు మేరకు తిరువళ్లూరులో నిరాహార దీక్షను ఆదివారం ఉదయం పది గంటల నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు చేపట్టారు. ఈ ఆందోళనకు జిల్లా కోర్డినేటర్‌లు దివ్య, షేక్‌గఫూర్, రాజాజీ, పన్నీసెల్వం, గణేషన్, బాలసుందరం తదితరులు అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథులుగా రాష్ట్ర కో– ఆర్డినేటర్ శంకర పెరుమాల్, జ్ఞానశేఖరన్ హాజరై ప్రసంగించారు.

విల్లుపురం కల్తీ సారా కేసులో పురోగతి

- ఆరుగురు పోలీసులకు నిర్బంధ పదవీ విరమణ
- విల్లుపురంలో డీఐజీ ఉత్తర్వులు



డీఐజీ దిశమిత్తల్

సేలం: విల్లుపురం జిల్లాలోని మరక్కనం సమీపంలోని తీరప్రాంత మత్స్యకార గ్రామం ఎక్కియార్ కుప్పంలో 2023 మే 13వ తేదీ రాత్రి 50 మందికి పైగా వ్యక్తులు మిథనాల్ కలిపిన విషపూరిత మద్యం కొనుగోలు చేసి సేవించారు. తరువాతి కొన్ని నిమిషాల్లో, కొంతమందికి వాంతులు, తల తిరగడం, కంటి చికాకు వంటి లక్షణాలు కనిపించాయి. తరువాత వారిని చికిత్స కోసం పుదుచ్చేరిలోని జిప్మర్, విల్లుపురంలోని ముండియంబాక్కంలోని ప్రభుత్వ వైద్య కళాశాల ఆసుపత్రిలో చేర్చారు. అయితే ఎక్కియార్‌కుప్పంకు చెందిన ముగ్గురు వ్యక్తులు శంకర్ (55), సురేష్ (49), ధరణివేల్ (50) అదే రోజు రాత్రి చికిత్స ఫలించక మరణించారు. వరుసగా 14 మంది మరణించారు, వారిలో రాజమూర్తి (60), మలర్విళి (70), విజయన్ (55), కేశవవేలు (70), విజయన్ (55), అబ్రహం (46), శరత్‌కుమార్ (55), మన్నంకట్టి (47), మరక్కానంకు చెందిన శంకర్ (51) ఉన్నారు, అదేవిధంగా, మరక్కానం ప్రాంతంలో విక్రయించే విషపూరిత మద్యం కొనుగోలు చేసి తాగిన తరువాత చెంగల్పట్టు జిల్లాకు చెందిన 8 మంది మరణించారు. ఈ సంఘటన తమిళనాడు అంతటా సంచలనం సృష్టించిన విషయం తెలిసిందే. ఈ సంఘటనకు సంబంధించి విషపూరిత మద్యం అమ్మకాలను నిరోధించడంలో విఫలమైనందుకు అప్పటి జిల్లా సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ శ్రీనాథ, డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ పళని, 2 ఇన్‌స్పెక్టర్లు, 3 సబ్–ఇన్‌స్పెక్టర్లు, 2 పోలీసులను సస్పెండ్ చేశారు. అంతేకాకుండా, మద్యం వ్యాపారులతో సంబంధాలు కలిగి ఉన్నందుకు 10 మందికి పైగా పోలీసు అధికారులను సస్పెండ్ చేశారు. ఆ తర్వాత ఈ కేసును సీబీసీఐడీ పోలీసులు హత్య కేసుగా మార్చి, దర్యాప్తు చేశారు.

ఆరుగురు పోలీసు అధికారులకు నిర్బంధ పదవీ విరమణ

ఈ పరిస్థితిలో, మరక్కానం విషపూరిత మద్యం మరణ ఘటనకు సంబంధించి మద్యం వ్యాపారులతో సంబంధం ఉన్నందుకు సస్పెన్షన్‌కు గురైన ఆరుగురు పోలీసులకు నిర్బంధ పదవీ విరమణ ఇస్తూ విల్లుపురం డివిజన్ పోలీస్ డీఐజీ దిశమిత్తల్ ఆదేశించారు. వీరిలో ఇప్పటికే ఉద్యోగం నుంచి తొలగించబడి ప్రస్తుతం రోషనై పోలీస్ స్టేషన్‌లో క్లర్క్‌గా పనిచేస్తున్న వేలు, అరగండనల్లూర్ పోలీస్ స్టేషన్‌లో క్లర్క్‌గా పనిచేస్తున్న సెంథిల్‌కుమార్, కాంచనూర్ పోలీస్ అధికారి ముత్తుకుమార్, విక్రవాండి పోలీస్ అధికారి గుణశేఖరన్, సత్యమంగళం పోలీస్ అధికారి ప్రభు, కోట్టకుప్పం మద్యం నిషేధ పోలీసు స్టేషన్‌లో పనిచేస్తున్న అరుణ్ నిర్బంధ పదవి విరమణ ఇవ్వడం గమనార్హం.

ఐపీఎల్ పండుగ!



చిదంబరం స్టేడియం

- చెన్నైలో సందడిగా తొలి మ్యాచ్
- బస్సులలో ఉచితం
- అర్ధరాత్రి వరకు రైళ్ల సేవలు
- అభిమానుల భద్రతే లక్ష్యంగా ఐపీఎల్ సింగం

సాక్షి, చెన్నై : చెన్నైలో ఐపీఎల్ సీజన్ క్రికెట్ సందడి మొదలైంది. చేపాక్కం చిదంబరం స్టేడియంలో అన్ని మ్యాచ్‌ల వీక్షణకు అభిమానులు ఉరకలు తీస్తున్నారు. ఆదివారం తొలి మ్యాచ్ చెన్నై సూపర్ కింగ్స్ – ముంబై జట్ల మధ్య జరగడంతో అభిమానుల సందడితో స్టేడియం నిండింది. వివరాలు.. తమిళనాట క్రికెట్ అభిమానులు మరీ ఎక్కువే. జాతీయ స్థాయి పోటీలతో పాటుగా ఐపీఎల్ మ్యాచ్‌లను ప్రత్యక్షంగా తిలకించేందుకు స్టేడియం వైపుగా ఎగబడుతూరు. ఇక, చెన్నై సూపర్‌కింగ్స్ జట్టు తమదే అన్నట్టు అభిమానులు ఉత్సాహాన్ని చూపిస్తుంటారు. చెన్నై సూపర్‌కింగ్స్ మ్యాచ్‌లను తిలకించేందుకు మరింత ఉత్సాహం చూపిస్తుంటారు. క్రికెటర్ ధోనిని తమ ఇంటి బిడ్డగా భావించి 'తల' అన్న బిరుదును కూడా ఇచ్చేశారు. ప్రస్తుత ఐపీఎల్ సీజన్ శనివారం నుంచి ప్రారంభమైంది. ఇందులో చెన్నై వేదికగా తొలి మ్యాచ్ ఆదివారం రాత్రి జరిగింది. రుతు గైక్వాడ్ నేతృత్వంలో చెన్నై సూపర్ కింగ్స్‌ను ముంబై ఇండియన్స్ మధ్య చేపాక్కం చిదంబరం స్టేడియం వేదికగా జరిగింది. ఈ సీజన్‌లో కూడా ఎంఎస్ ధోని సూపర్ కింగ్స్‌కు ఆడటం అభిమానులలో మరింత ఉత్సాహాన్ని నింపింది. మ్యాచ్‌కు ముందుగా ధోని ఓ మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూగా పేర్కొంటూ ఓ సమాచారం వైరల్‌గా మారడం అభిమానుల్ని కేరింతలు కొట్టించింది. సీఎస్‌కేకు ఎంత కాలం ఆడుతానో, అంత కాలం ఆడుతాను.. వీల్‌చైర్‌లో ఉన్నా .. ఆడిచ్చేస్తారంటూ చేసిన చమత్కరించడం వైరల్‌గా మారింది.

సంబరాలతో తొలి మ్యాచ్..

చేపాక్కం స్టేడియంలో 50 వేల మంది మ్యాచ్‌ను తిలకించేందుకు అవకాశం ఉంది. బ్లాక్ మార్కెటింగ్ కట్టడి దిశగా టికెట్ల విక్రయాలన్నీ ఆన్‌లైన్ ద్వారానే నిర్వహించారు. అయినా, బ్లాక్ మార్కెటింగ్‌జోరుగానే సాగిందన్న ఆరోపణలు ఉన్నాయి. చెన్నైలో తొలి మ్యాచ్ ఆదివారం జరిగింది. స్టేడియంలో పరుగుల వరద కురిపించే రీతిలో క్రికెటర్లు దూసుకెళ్లారు. వీరిలో మరింత ఉత్సాహాన్ని నింపే విధంగా స్టేడియంలో అభిమానులు కేరింతలు కొట్టారు. టీవీలలో వీక్షించడం కన్నా ప్రత్యక్షంగా మ్యాచ్‌లను చూసేందుకు వేలాది మంది పరుగులు తీశారు. మెరీనా బీచ్ తదితర ప్రాంతాలలో ఎల్ఈడీ స్క్రీన్లను సైతం ఏర్పాటు చేశారు. స్టేడియంలో మ్యాచ్ కారణంగా చేపాక్కం పరిసరాలలో ఇప్పటికే ట్రాఫిక్ మార్పులు చేశారు. అభిమానులు సాయంత్రం ఐదున్నర గంటలలోపు అనుమతించారు. చేపాక్కం వైపుగా వాహన రద్దీని తగ్గించే విధంగా అటు వైపుగా వెళ్లే అభిమానులు మ్యాచ్ టికెట్టును చూపించి చెన్నై నగర రవాణా సంస్థ బస్సులలో ఉచితంగా ప్రయాణించే అవకాశం కల్పించారు. అలాగే, అభిమానుల కోసం అర్ధరాత్రి వరకు మెట్రో, ఈఎంయూ రైళ్ల సేవలు జరిగాయి.

ఐపీఎల్ సింగం



స్టేడియం వద్ద భద్రత

ఐపీఎల్‌ను వీక్షించేందుకు వచ్చే వారి భద్రత నిమిత్తం చెన్నై పోలీసు యంత్రాంగం చెన్నైలో ఐపీఎల్ సింగం పేరిట క్యూఆర్ కోడ్‌ను పరిచయం చేసింది. మ్యాచ్‌లను వీక్షించేందుకు వచ్చే ప్రజల భద్రతను నిర్ధారించడం లక్ష్యంగా చెన్నై సింగం – ఐపీఎల్ క్యూఆర్ కోడ్ అనే ఆధునిక సౌకర్యాన్ని కల్పించారు. చేపాక్కం స్టేడియంలో తదుపరి ఈనెల 28, ఏప్రిల్ 5, 11, 25, 30, మే 12 తేదీలలో మ్యాచ్‌లు జరగనున్నాయి. క్రికెట్ మ్యాచ్‌లను వీక్షించడానికి పెద్ద సంఖ్యలో క్రీడాభిమానులు తరలి రావడం జరుగుతుంది. వీరి భద్రతా, ప్రయోజనార్థం కమిషనర్ అరుణ్ నేతృత్వంలో ఈ క్యూర్ కోడ్ రూపల్పన చేశారు. క్రికెట్ మ్యాచ్‌లు జరిగే రోజుల్లో ట్రాఫిక్ రద్దీని నివారించడంతో పాటూ భద్రతే లక్ష్యంగా సిద్ధం చేసిన ఈ క్యూర్‌కోడ్ ఆధారంగా పోలీసులను ప్రజలు ఆశ్రయించే అవకాశం కల్పించారు. ఏదేని సమస్య, ఇబ్బంది ఎదురైనా తక్షనం ఆ క్యూర్ కోడ్‌ను స్కాన్ చేసి ఫిర్యాదు చేస్తే చాలు పోలీసులు తక్షనం రంగంలోకి దిగి సేవలను అందిస్తారు. భద్రతను కల్పిస్తారు. ఈ క్యూర్ కోడ్ సౌకర్యాన్ని అందరూ ఉపయోగించుకోవాలని కమిషనర్ అరున్ సూచించారు.

క్లుప్తంగా

నాటు బాంబులు వేసిన కేసులో నిందితుడికి యావజ్జీవం

• పూందమల్లి కోర్టు తీర్పు

తిరువొత్తియూరు: విచారణ సమయంలో పోలీసు సబ్‌ఇన్‌స్పెక్టర్, పోలీసు కానిస్టేబుల్‌పై నాటు బాంబులు విసిరిన కేసులో నిందితుడికి యావజీవ శిక్ష విధిస్తూ పూందమల్లి కోర్టు తీర్పు ఇచ్చింది. వివరాలు.. మైలాపూర్ ముత్తు రామన్ వీధికి చెందిన ప్రేమచంద్ 2001లో నగదు ఇచ్చి పుచ్చుకోవడంలో ఏర్పడిన గొడవలో అతని ఇంటికి హద్దు మీరీ చొరబడిన నలుగురికి చెందిన ముఠా, పోలీసులు విచారణ చేస్తున్న సమయంలో నాటు బాంబులను వేయడంతో అది పేలి అక్కడ వున్న సబ్ - ఇన్‌స్పెక్టర్, పోలీస్ కానిస్టేబుల్ తదితరులకు గాయాలయ్యాయి. ఈ కేసులో జగదీశన్, సుందర్, మురుగేష్, చిన్న భూపాలన్, హుస్సేన్, దరంచంద్, అప్పు అనే ఏడుగురిని పోలీసులు అరెస్టు చేసి జైలులో పెట్టారు. ఈ కేసులో సుందర్, చిన్న భూపాలన్, దరంచంద్‌కు 2016లో 10 సంవత్సరాలు జైలు శిక్ష విధిస్తూ పూందమల్లి కోర్టు ఆదేశాలు ఇచ్చింది. కాగా ప్రధాన నిందితుడు మురుగన్‌కు తాజాగా యావజ్జీవ శిక్ష, రూ. 11 వేలు జరిమానా విధిస్తూ న్యాయమూర్తి శనివారం తీర్పు ఇచ్చారు. కాగా హుస్సేన్, అప్పు కేసు విచారణలో ఉన్న సమయంలోనే మృతి చెందారు. జగన్ పరారీలో ఉన్న నేరస్తుడిగా ఉన్నారు.

ఫోన్‌లో వీడియో చూస్తూ బస్సు నడిపిన డ్రైవర్ సెస్పెన్షన్

అన్నానగర్: తిరుచ్చి సెంట్రల్ బస్ స్టేషన్ నుంచి శనివారం రాత్రి కరూర్ కు ప్రభుత్వ బస్సు బయలుదేరింది. 25 మందికి పైగా ప్రయాణించారు. బస్సు తిరుచ్చి మీదుగా వెళుతుండగా, డ్రైవర్ శరవణన్ ఓ చేతిలో సెల్‌ఫోన్‌లో వీడియో చూస్తూ బస్సును నడుపుతున్నాడు. బస్సులోని శివ అనే ప్రయాణికుడు లేచి సెల్ ఫోన్‌లో వీడియో చూస్తూ బస్సును నడపవద్దని మందలించాడు. ఈ డ్రైవరు సెల్‌ఫోన్ చొక్కా జేబులో పెట్టుకున్నాడు. కాసేపటి తర్వాత మళ్లీ సెల్‌ఫోన్ తీసుకుని వీడియో చూస్తూ బస్సును నడిపాడు. దీనికి సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఈ విషయమై కరూర్ ప్రాంతీయ రవాణా సంస్థ అధికారులు డ్రైవర్ శరవణన్‌ను విచారించారు. తర్వాత సస్పెండ్ చేస్తూ కరూర్ రీజినల్ జనరల్ మేనేజర్ శివశంకరన్ ఆదేశాలు జారీ చేశారు.

విద్యుత్ షాక్‌తో బాలిక మృతి

తిరువొత్తియూరు: సెల్‌ఫోన్‌కు చార్జర్ పెడుతున్న సమయంలో 14 ఏళ్ల బాలిక విద్యుత్ షాక్ తో మృతి చెందిన ఘటన ఎన్నూర్‌లో చోటు చేసుకుంది. వివరాలు.. ఎన్నూరు సమీపంలోనివాసముంటున్న ముకుందన్ ఆటో మెకానిక్. ఇతని కుమార్తె అనిత (14) స్థానిక ప్రభుత్వ పాఠశాలలో పదో తరగతి చదువుతోంది. శనివారం రాత్రి ఇంటిలో అనిత మాత్రం ఒంటరిగా ఉంటోంది. ఆ సమయంలో ఆమె తన సెల్‌ఫోనుకు చార్జింగ్ పెడుతూ స్విచ్ వేసేందుకు యత్నించగా కరెంట్ షాక్‌కు గురై మరణించింది. స్థానిక పోలీసులు కేసువిచారణ చేస్తున్నారు.

పోలీసు శాఖ మాజీ సూపరింటెండెంట్ దంపతులకు 4 ఏళ్ల జైలు

తిరువొత్తియూరు: ఆదాయానికి మించి ఆస్తులు చేకూర్చుకున్న కేసులో పోలీసు శాఖ మాజీ సూపరింటెండెంట్‌కు, ఆయన భార్యకు చెరో నాలుగేళ్ల జైలు శిక్ష, లక్ష రూపాయలు జరిమానా విధిస్తూ మధురై హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. వివరాలు.. తిరుచ్చిలో సెంట్రల్ పోలీసు శాఖ సూపరింటెండెంట్‌గా ఉంటూ విశ్రాంతి పొందిన వారు గోవిందస్వామి (66) 2006 నుంచి 2012 వరకు తూత్తుకుడిలో పని చేశారు. ఈ సమయంలో ఆదాయానికి మించి ఎక్కువగా రూ. కోటి 10 లక్షల రూపాయలకు ఆస్తులు సమకూర్చుకున్నట్లు గోవిందస్వామి అతని భార్య గీత తదితరులపై సీబీఐ కేసు నమోదు చేసింది. ఈ కేసును మదురై సీబీఐ కోర్టు విచారణ చేసి ఆ ఇద్దరినీ విడుదల చేస్తూ 2018లో తీర్పు ఇచ్చింది. ఈ తీర్పు రద్దు చేయాలని కోరుతూ మధురై హైకోర్టు శాఖలో సీబీఐ అప్పీల్ చేసింది. నేరం రుజువు కావడంతో గోవిందస్వామి, అతని భార్య గీతకు శిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు.

రూ.26 లక్షల మోసం

– ముగ్గురు అరెస్ట్

తిరువొత్తియూరు: చెన్నై, అన్నానగర్‌లో మహిళ వద్ద రూ 26 లక్షలు, నగలు మోసం చేసిన ముగ్గురిని పోలీసులు అరెస్టు చేశారు. చెన్నై, అన్నానగర్ 8వ వీధిలో యామిని నివాసం ఉంటున్నారు. ఈమెకు 2013లో సుమతి, రాజదురై, మలార్ అనే ముగ్గురు వ్యక్తులు పరిచయం అయ్యారు. యామిని వారి వ్యక్తిగత అవసరాల కోసం పలు విడతలుగా మొత్తం రూ.26.5 లక్షలు నగదు అప్పు గాను, 17 సవర్లు బంగారు నగలు ఇచ్చి సహాయం చేసింది. అనంతరం యామిని డబ్బులు, బంగారు నగలు తిరిగి ఇవ్వాలని కోరగా.. ముగ్గురు వ్యక్తులు పలు కారణాలు చెప్పి తిరిగి ఇవ్వకుండా మోసం చేస్తున్నారు. ఈ విషయమై యామిని కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. కోర్టు ఆదేశాల మేరకు అన్నానగర్ పోలీస్ స్టేషన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. విచారణలో యామిని వద్ద నగలు, నగదు మోసం చేసినట్లు తెలిసింది. దీంతో బంగారు నగలు, నగదు అప్పుగా తీసుకుని మోసం చేసిన తిరువేకాడు ప్రాంతానికి చెందిన సుమతి (43), మైలాడుతురైకి చెందిన రాజదురై (54), తాండయార్‌పేట ప్రాంతానికి చెందిన మలార్ (42)లను పోలీసులు అరెస్టు చేశారు. వారి వద్ద విచారణ చేస్తున్నారు.

సారు.. బంగారం

• తూత్తుకుడి నుంచి చెన్నైకి చిన్నారుల విమాన ప్రయాణం
• సొంత ఖర్చులతో తీసుకెళ్లిన ప్రధానోపాధ్యాయుడు



విద్యార్థులతో ప్రధానోపాధ్యాయులు నెల్సన్ పాన్‌రాజ్

సేలం: తూత్తుకుడి సమీపంలోని బండారం పట్టిలో తూత్తుకుడి–నజరేత్ తిరుమండల ట్రస్ట్ పేరుతో ప్రభుత్వ ఎయిడడ్ ప్రాథమిక పాఠశాల పనిచేస్తోంది. ఈ పాఠశాలలో 50 మందికి పైగా విద్యార్థులు చదువుతున్నారు. ఈ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నెల్సన్ పాన్‌రాజ్ తన సొంత ఖర్చులతో పాఠశాల కోసం భవనం, కంప్యూటర్లతో సహా వివిధ అభివృద్ధి ప్రాజెక్టులను నిర్వహిస్తున్నాడు. పాఠశాలలో రవాణాపై పాఠం చెబుతుండగా, ఒక విద్యార్థి విమానం ఎలా ప్రయాణించగలరు అని భయంతో అడిగాడు. అంతేకాదు, తన స్వస్థలానికి దగ్గర్లోనే ఓ రైల్వే స్టేషన్ ఉంది. కానీ తాము ఎప్పుడూ రైలులో ప్రయాణించలేదని చెప్పిన విద్యార్థుల కోరికను తీర్చాలని ప్రధానోపాధ్యాయుడు పాన్‌రాజ్ నిర్ణయించుకున్నారు. తన సొంత ఖర్చులతో విద్యార్థులను విమానంలో తీసుకెళ్తానని చెప్పిన ప్రధానోపాధ్యాయుడు నెల్సన్ పాన్‌రాజ్ 3 నెలల క్రితం తూత్తుకుడి విమానాశ్రయం నుంచి చెన్నైకి రిజర్వేషన్ చేసుకున్నాడు. ఆ ప్రకారం శనివారం 18 మంది విద్యార్థులను తూత్తుకుడి నుంచి విమానంలో చెన్నైకి తీసుకువచ్చారు. ఆయన చెన్నైలోని వండలూర్ పార్క్, మెట్రో రైల్, వంటి పలు ప్రాంతాలను విద్యార్థులకు చుట్టి చూపించారు. వారు ఆదివారం సాయంత్రం చెన్నై నుంచి ముత్తునగర్ రైలులో తూత్తుకుడికి వెళ్లారు. అత్యంత పేదరికంలో ఉన్న పరిస్థితుల్లో విమానంలో ప్రయాణించడం చాలా సంతోషంగా ఉందని చెబుతున్న విద్యార్థులు, విమానంలో ప్రయాణించే స్తోమత తమకు లేకపోయినా, సొంత ఖర్చులతో చెన్నైకి తీసుకెళ్లి రైలులో తీసుకెళ్లిన మంచి ఉపాధ్యాయుడు పాన్‌రాజ్‌కు హృదయపూర్వకంగా కృతజ్ఞతలు తెలిపారు.

1.20 లక్షల వ్యయంతో..

ప్రధానోపాధ్యాయుడు నెల్సన్ పాన్‌రాజ్ మాట్లాడుతూ, తాను 2014 నుంచి బండారం పట్టి ప్రధానోపాధ్యాయుడిగా పనిచేస్తున్నానని, ఏటా తన స్వంత ఖర్చుతో విద్యార్థులను పాఠాలకు తీసుకెళ్తానని అన్నారు. విద్యార్థులు రవాణా విషయం చదువుతున్నప్పుడు, రైళ్లు విమానాల అంశం ప్రస్తావనకు వచ్చింది. పిల్లలూ, మనం విమానంలో వెళ్ళవచ్చా? నేను రైలులో వెళ్లవచ్చా? వాళ్లు అడిగారు. అదే నాకు అతిపెద్ద కష్టం. తాము తూత్తుకుడి విమానాశ్రయం నుంచి 18 మంది విద్యార్థులను విమానంలో చెన్నైకి తీసుకువచ్చినట్టు, అందుకుగాను తనకు రూ.లక్ష 20 వేలు ఖర్చయినట్టు తెలిపారు. అయితే విద్యార్థులు సంతోషంగా ఉండటం తనకు సంతోషంగా ఉందని ఆయన ఆనందంగా తెలిపారు.

శాంతిభద్రతలను కాపాడటంలో ప్రభుత్వం విఫలం

కొరుక్కుపేట: మధురై తిరుపరంగున్రం పక్కనే ఉన్న థానకంకులంకు చెందిన కాళీశ్వరన్ అనే రౌడీ అర్ధరాత్రి ఇంటి గేటు వద్ద దారుణంగా హత్యకు గురయ్యాడు. దీనిని పీఎంకే అధ్యక్షులు డాక్టర్ అన్బుమణి రామదాసు తీవ్రంగా ఖండించారు. ఆయన మాట్లాడుతూ.. తమిళనాడులో ప్రణాళికాబద్ధంగా హత్యలు జరగని రోజు లేదన్నారు. హత్యలు జరిగినప్పుడల్లా, వ్యక్తిగత కారణాలతో జరిగాయని, హంతకులను త్వరగా అరెస్టు చేశామని చెప్పి సమస్యను పక్కదారి పట్టించడం డీఎంకే ప్రభుత్వానికి అలవాటు అని విమర్శించారు. కాళీశ్వరన్ విషయంలో తన ప్రాణాలకు ముప్పు ఉందని తెలిసి కూడా జైలు నుంచి విడుదలైన అతన్ని కాపాడడంలో డీఎంకే ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. డీఎంకే అధికారంలోకి వచ్చిన నాలుగేళ్లలో తమిళనాడులో సగటున రోజుకు 4.52 హత్యల చొప్పున 6,597 హత్యలు జరిగాయి. ఈ సంఖ్య ఆందోళనకరంగా ఉన్నప్పటికీ, తమిళనాడులో డీఎంకే ప్రభుత్వం హత్య, దోపిడీ వంటి నేరాలను నిరోధించలేక, శాంతిభద్రతలను కాపాడలేకపోతోందని ఆరోపించారు. తమిళనాడులో శాంతిభద్రతల పరిరక్షణకు డీఎంకే ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి అని కోరారు.

రోగులతో సెల్‌ఫోన్‌లో మాట్లాడిన మంత్రి

• చికిత్స విధానాలను అడిగి తెలుసుకున్న వైనం

కొరుక్కుపేట: రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి సుబ్రమణియన్ ఆదివారం ఉదయం కోయంబత్తూరులోని బుగలూరు ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా సందర్శించారు. రోగులకు అందుతున్న వైద్యం వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో తమిళనాడు ప్రభుత్వం తరపున ఎమర్జెన్సీ కార్డియాకారెస్ట్ చికిత్స పొందుతున్న రోగుల రిజిష్టర్‌లో పేర్కొన్న పేషెంట్ల పేర్లు , వివరాలను అతను నమోదు చేశాడు. అనంతరం ఆ సెల్‌ఫోన్ల ద్వారా సంబంధిత రోగులను సంప్రదించి వారితో మాట్లాడారు. చికిత్స అనంతరం ఇంట్లో విశ్రాంతి తీసుకుంటున్న రోగులను పరామర్శించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యుల చికిత్స ఎలా ఉండేది? ఇప్పుడు మీ ఆరోగ్యం ఎలా మెరుగుపడిందని కూడా అడిగారు. ఆ తర్వాత వారు తదుపరి చికిత్స తీసుకుంటున్నారో లేదో నిర్ధారించుకోవాలని ఆయన రోగులను కోరారు.

సీఎం స్టాలిన్‌ను కలిసిన ఎంపీ విజయ్ వసంత్

కొరుక్కుపేట: ముఖ్యమంత్రి ఎం.కె.స్టాలిన్ పార్లమెంటరీ నియోజకవర్గాల పునర్విభజనకు వ్యతిరేకంగా తొలి సంయుక్త కమిటీ సమావేశాన్ని శనివారం విజయవంతంగా నిర్వహించిన విషయం తెలిసిందే. ఈనేపథ్యంలో ఎంపీ విజయ్ వసంత్ చెన్నైలోని గిండీలోని ఓ హోటల్‌లో సీఎంను కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. అలాగే ఈ సమావేశానికి హాజరైన ఆయన తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కర్ణాటక రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కె.శివకుమార్‌ను స్వయంగా కలుసుకుని శాలువా కప్పి స్వాగతం పలికారు. సమావేశానికి హాజరైనందుకు ఆయన కృతజ్ఞతలు, అభినందనలు తెలిపారు. డీఎంకే గొప్ప ముందడుగు వేసిందని కొనియాడారు.

విద్యార్థులు పరిశోధనలపై ఆసక్తి చూపాలి


వివిధ వేషాధారణల్లోని విద్యార్థులను అభినందిస్తున్న ప్రతినిధులు

వేలూరు: విద్యార్థులు చిన్న వయస్సు నుంచే పరిశోధనలపై ఆసక్తి చూపాలని వేలూరు కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ సునీల్‌కుమార్ అన్నారు. కాట్పాడి గాంధీనగర్‌లోని తులీర్ పాఠశాలలో 22వ వార్షికోత్సవ కార్యక్రమం హెచ్‌ఎం కనగ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా విద్యార్థులు వివిధ వేషాధారణల్లో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం బహుమతుల ప్రదానోత్సవ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిదిగా హాజరై ప్రసంగించారు. పాఠశాల దశ నుంచే విద్యార్థులు పరిశోధనలపై ఆసక్తి చూపాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మొదటి జోన్ చైర్మన్ పుష్పలత, తమిళనాడు ఒకేషనల్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సేనా జనార్ధనన్, తులీర్ పాఠశాల ట్రస్ట్ చైర్మన్ పయణి పాల్గొన్నారు.

చెస్ పోటీలతో సృజనాత్మకత


పోటీలను ప్రారంభిస్తున్న రాష్ట్ర ఉపాధ్యక్షులు మణిగండస్వామి

వేలూరు: విద్యార్థులు చిన్న వయస్సు నుంచే చెస్ పోటీల్లో పాల్గొనడం ద్వారా సృజనాత్మకతను పెంపొందించుకోవచ్చని తమిళనాడు చెస్ సంఘం ఉపాధ్యక్షులు మణిగండస్వామి అన్నారు. రాష్ట్ర స్థాయి చెస్ పోటీలు రాణిపేట జిల్లా అమ్మూరులో ఆదివారం ఉదయం జరిగింది. ఇందుకు ఆ సంఘం జిల్లా కార్యదర్శి వినోద్, వేలూరు చెస్ అకాడమి కోశాధికారి మనోహరన్ అధ్యక్షత వహించారు. ఈ పోటీలను ప్రారంభించిన ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం కలుసుకున్న విద్యార్థులు ఓటమి చెందినా నిరుత్సాహం చెందకుండా పట్టుదలతో ప్రయత్నం చేయాలన్నారు. కృషి, పట్టుదల ఉంటే ఉన్నత శిఖరాలకు చేరుకోవచ్చాన్నారు. జిల్లాస్థాయి పోటీల్లో విజయం సాధించే విద్యార్థులు రీజనల్ స్థాయిలో నిర్వహించే పోటీల్లో పాల్గొని అనంతరం రాష్ట్ర స్థాయి పోటీల్లో కలుసుకుంటారన్నారు. అనంతరం పోటీల్లో గెలుపొందిన వారికి సర్టిఫికెట్లుతో పాటూ బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో చెస్ ఆకాడమీ జిల్లా అధ్యక్షులు శరవణన్, కోశాధికారి విజయకుమార్, ఇందుమది, అబ్దుల్ కరీమ్, మురగేశన్, వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు.

అండర్-15 టేబుల్ టెన్నిస్ విజేతలుగా సాహిల్, దివ్


బాలిక విభాగంలో విజేత, రన్నర్‌లతో శరత్ కమల్


బాలుర విభాగంలో విజేతలతో శరత్‌కమల్

సాక్షి, చెన్నై : డ్రీమ్ స్పోర్ట్స్ ఛాంపియన్ షిప్ అండ్ 15 టోర్నమెంట్‌లో చండీగఢ్‌కు చెందిన సాహిల్ రావత్, ముంబైకి చెందిన దివ్యాంశి భౌమిక్ టైటిల్‌ను గెలుచుకున్నారు. విజేతలకు బహుమతిగా రూ. 1 లక్ష నగదు బహుమతిని అందజేశారు. స్థానికంగా జరుగుతున్న ఈ మ్యాచ్‌ల ఫైనల్ హోరాహోరీగా జరిగింది. బాలుర విభాగంలో చండీగఢ్‌కు చెందిన సాహిల్ రావత్ ఏడు సెట్లతో జమ్మూ - కాశ్మీర్‌కు చెందిన రిత్విక్ గుప్తాపై విజయం సాధించాడు. బాలికల విభాగంలో ముంబైకి చెందిన దివ్యాన్షి భౌమిక్, పశ్చిమ బెంగాల్‌కు చెందిన శ్రేయ ధర్‌పై ఆధిపత్యం చెలాయించి టైటిల్‌ను కైవశంచేసుకున్నారు. టోర్నమెంట్ విజేతలకు ఒలింపియన్లు శరత్ కమల్, శ్రీజ అకులలు బహుమతులను అందజేశారు. విజేతకు రూ.లక్ష, రన్నరప్‌కు రూ. 50 వేలు చొప్పున అందజేశారు.

అజిత్, ధనుష్ కాంబోపై అప్‌డేట్


నటుడు అజిత్, ధనుష్

తమిళ సినిమా: నటుడు ధనుష్ ఇప్పుడు నటనతో పాటూ దర్శకత్వం పైన ఎక్కువ ఆసక్తి చూపిస్తున్నారని చెప్పవచ్చు. ఈయన ఇటీవల వరుసగా మూడు చిత్రాలకు దర్శకత్వం వహించడం విశేషం. అందులో ధనుష్ స్వీయ దర్శకత్వంలో కథానాయకుడిగా నటించిన రాయన్ చిత్రం కమర్షియల్ గా మంచి విజయాన్ని సాధించింది. ఇది ఈయన కథానాయకుడిగా నటించిన 50వ చిత్రం కావడం గమనార్హం. అదేవిధంగా కొత్త తారలతో నిలవుక్కు ఎన్ మేల్ ఎన్నడి కోపం అనే యూత్ ఫుల్ ఎంటర్ టైనర్ చిత్రానికీ దర్శక ,నిర్మాత బాధ్యతలను నిర్వహించారు. తాజాగా కథానాయకుడిగా నటిస్తూ దర్శకత్వం వహిస్తున్న చిత్రం ఇడ్లీ కడై. ఇందులో నటి నిత్యామీనన్ నాయికగా నటించారు. ఈ చిత్రం చివరి దశకు చేరుకుంది. కాగా ఈయన కథానాయకుడిగా నటిస్తున్న మరో ద్విభాషా చిత్రం కుబేర. ఈ చిత్రం త్వరలో తెరపైకి రావడానికి ముస్తాబవుతోంది. అదేవిధంగా ప్రస్తుతం ఓ హిందీ చిత్రంలో నటిస్తున్నారు. ఇందులో ఆయనకు జంటగా బాలీవుడ్ బ్యూటీ కృతిసనన్ నటిస్తున్నారు. కాగా త్వరలో డాన్ పిక్చర్స్ పతాకంపై ఆకాష్ భాస్కరన్ నిర్మించే చిత్రంలో కథానాయకుడుగా నటించరున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో తదుపరి అజిత్ హీరోగా నటించే చిత్రానికి దర్శకత్వం వహించబోతున్నట్లు ఇటీవల సామాజిక మాధ్యమాల్లో ప్రచారం జోరందుకుంది. దీని గురించి డాన్ పిక్చర్స్ సంస్థ అధినేత ఆకాష్ భాస్కరన్ ధృవపరిచారు. ఆయన ఓ భేటీలో పేర్కొంటూ తాను త్వరలో ధనుష్ కథానాయకుడిగా చిత్రం నిర్మించనున్నట్లు చెప్పారు. అదేవిధంగా అజిత్ హీరోగా ధనుష్ దర్శకత్వం వహించే చిత్రానికి సంబంధించి కూడా చర్చలు జరుగుతున్నాయని, అజిత్ కోసం ధనుష్ కథను సిద్ధం చేస్తున్నారని, త్వరలోనే అజిత్‌ను కలిసి కథను వినిపించనున్నట్లు చెప్పారు. కాగా ఈ చిత్రానికి సంబంధించిన పాజిటివ్ రిజల్ట్ వస్తుందనే తాను భావిస్తున్నట్లు నిర్మాత ఆకాష్ భాస్కర్ పేర్కొన్నారు. ఇకపోతే అజిత్ కథానాయకుడిగా నటించిన గుడ్ బ్యాడ్ అగ్లీ చిత్రం నిర్మాణ కార్యక్రమం పూర్తి చేసుకొని ఏప్రిల్ 10వ తేదీన తెరపైకి రావడానికి సిద్ధమవుతోంది. అదేవిధంగా ఈయన నటించే తదుపరి చిత్రం ఏమిటన్నది ఆసక్తిగా మారింది. దీంతో ధనుష్ దర్శకత్వంలో నటించడానికి పచ్చ జెండా ఊపుతారా అన్న ఆసక్తి కూడా నెలకొంది.


మమిత బైజు మాయలో కోలీవుడ్

కోలీవుడ్ టాక్స్

తమిళసినిమా: చిత్ర పరిశ్రమ విజయం వెనుక పరుగులు తీస్తుందంటారు. అయితే నటి మమిత బైజూ విషయంలో ఇది భిన్నంగా జరుగుతోందని చెప్పవచ్చు. మలయాళంలో ప్రేమలు చిత్రంతో ఒక్కసారిగా వెలుగులోకి వచ్చిన బాలీవుడ్ బ్యూటీ మమిత బైజు. దీంతో తమిళం, తెలుగు చిత్రపరిశ్రమ దృష్టి కూడా ఈ అమ్మడిపై పడింది. అలా కోలీవుడ్లో జీవీ ప్రకాష్‌కుమార్‌కు జంటగా రెబల్ చిత్రం ద్వారా ఈమె ఎంట్రీ ఇచ్చింది. అయితే మమిత బైజు మ్యాజిక్ ఈ చిత్రానికి పనిచేయలేదు. చిత్రం పూర్తిగా నిరాశపరిచింది. అయితే మమిత బైజూపై ఆ ప్రభావం ఏ మాత్రం పడకపోవడం విశేషం. ఇప్పుడు కోలీవుడ్లో ఈ కేరళా కుట్టికి అవకాశాలు వరుసకడుతున్నాయి. ఆ విధంగా ముందుగా విజయ్ కథానాయకుడుగా నటిస్తున్న జననాయక్ చిత్రంలో నటించే అవకాశాన్ని ఈ అమ్మడు దక్కించుకుంది. పూజాహెగ్డే కథానాయకిగా నటిస్తున్న ఈ చిత్రంలో ఆమె ముఖ్య భూమిక పోషిస్తున్నట్లు సమాచారం. రెబల్ చిత్రం తర్వాత మమిత బైజు నటించిన ఒక్క చిత్రం కూడా విడుదల కాలేదు. కాబట్టి కోలీవుడ్లో ఇంకా ఈ అమ్మడు సక్సెస్ పరంగా బోణీ కొట్టలేదని చెప్పాలి. అలాంటిది ఇప్పుడు ప్రముఖ స్టార్స్ సరసన జతకట్టే అవకాశాలు వరుసకడుతున్నాయి. నటుడు సూర్య, టాలీవుడ్ దర్శకుడు వెంకీ అట్లూరి దర్శకత్వంలో నటించే చిత్రంలో కథానాయకిగా నటించే అవకాశం మమిత బైజూనే వరించినట్లు సమాచారం. అదేవిధంగా ధనుష్ సరసన ఒక చిత్రంలో నటించే అవకాశాన్ని ఈ బ్యూటీ దక్కించుకున్నట్లు తెలిసింది. తాజాగా మరో క్రేజీ చిత్రంలో నటించే అవకాశం మమిత బైజూ గుమ్మం తలుపు తట్టినట్లు సమాచారం. స్టార్ డైరెక్టర్ శంకర్ వారసురాలుగా పరిచయమైన అదితి శంకర్ కథానాయకి వరుస విజయాలతో పయనిస్తున్న విషయం తెలిసిందే. ప్రస్తుతం ఈమె తెలుగు చిత్రంలో నటిస్తున్నారు. తాజాగా శంకర్ వారసుడు అర్జిత్ శంకర్ త్వరలో కథానాయకుడిగా తెరంగేట్రం చేయబోతున్నట్లు ఇప్పటికే ప్రచారం జరుగుతున్న విషయం తెలిసిందే. దీనికి డాన్సింగ్ స్టార్ ప్రభుదేవా దర్శకత్వం వహించబోతున్నట్లు ప్రచారం సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతుంది. తాజాగా ఈ చిత్రంలో అర్జిత్ శంకర్‌కు జంటగా మలయాళ బ్యూటీ మమిత బైజూను ఎంపిక చేసినట్లు సమాచారం.


మమిత బైజు

కార్తీకి జోడీగా కల్యాణి ప్రియదర్శన్?


కార్తీ


కల్యాణి ప్రియదర్శన్

తమిళసినిమా: ప్రస్తుతం కోలీవుడ్లో బిజీగా నటిస్తున్న కథానాయకుల్లో కార్తీ ఒకరు. ఇటీవల నటించిన మెయ్యళగన్ చిత్రం మంచి విజయాన్ని అందుకోవడంతో పాటు విమర్శకుల నుంచి ప్రశంసలు అందుకుంది. కాగా ప్రస్తుతం సర్దార్-2, వాద్దియార్ చిత్రాల్లో నటిస్తున్న కార్తీ త్వరలో లోకేష్ కనకరాజ్ దర్శకత్వంలో ఖైదీ-2 చిత్రంలోనూ నటించడానికి సిద్ధమవుతున్నట్లు సమాచారం. అదేవిధంగా డాణాక్కారన్ చిత్రం ఫేమ్ తమిళ్ దర్శకత్వంలో ఒక చిత్రం చేయడానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. దీన్ని డ్రీమ్ వారియర్ పిక్చర్స్ సంస్థ నిర్మించనున్నట్లు సమాచారం. ఇది 1960 ప్రాంతంలో రామేశ్వరం నేపథ్యంలో సాగే సముద్రపు దొంగల ఇతివృత్తంగా ఉంటుందని తెలిసింది. చిత్ర షూటింగ్ మే నెలలో ప్రారంభం కానున్నట్లు సమాచారం కాగా ఇందులో ఒక ముఖ్యపాత్రను వడివేలు పోషించనున్నట్లు తెలిసింది. కాగా కథానాయకిగా మలయాళ బ్యూటీ కల్యాణి ప్రియదర్శన్ నటింపజేయడానికి చర్చలు జరుగుతున్నట్లు తాజా సమాచారం. ఈమె ప్రముఖ మలయాళ దర్శకుడు ప్రియదర్శన్ వారసురాలు అన్న విషయం తెలిసిందే. ఇప్పటికే మలయాళం, తెలుగు, తమిళ భాషల్లో నటించి బహుభాషా కథానాయకగా గుర్తింపు పొందిన ఈమె తమిళంలో మానాడు వంటి చిత్రాల్లో నటించారు. ప్రస్తుతం రవిమోహన్ సరసన జీనీ చిత్రంలో నటిస్తున్నారు. తాజాగా కార్తీతో జత కడతానికి సిద్ధం అవుతున్నారన్నమాట. ఈ క్రేజీ చిత్రానికి సంబంధించిన పూర్తి వివరాలు త్వరలోనే వెలువడే అవకాశం ఉంది..

వదంతులు ప్రచారం చేయకండి!


శింబుతో దర్శకుడు అశ్వద్ మారిముత్తు

తమిళసినిమా: సామాజిక మాధ్యమాల్లో నిరాధార వార్తలు ప్రచారం కావడం పరిపాటి. ఎవరో చిన్న లీక్ ఇస్తే దాన్ని కథలుకథలుగా అల్లి ప్రచారం చేస్తుంటారు. దీంతో చాలామంది ప్రముఖులు బాబోయ్ నిజాలు తెలుసుకొని ప్రచారం చేయండి అంటూ మొత్తుకుంటుంటారు. ఇప్పుడు దర్శకుడు అశ్వద్ మారిముత్తు పరిస్థితి ఇలాంటిదే. ఓ మై కడవలే చిత్రంతో దర్శకునిగా పరిచయమై తొలి చిత్రంతోనే హిట్ కొట్టారు. ఆ తర్వాత తాజాగా ప్రదీప్ రంగనాథన్ హీరోగా డ్రాగన్ చిత్రాన్ని చేశారు. ఈ చిత్రం ఇటీవల విడుదలై సంచలన విజయాన్ని నమోదు చేసుకుంది. దీంతో అశ్వద్ మారిముత్తు తర్వాత చిత్రం ఏమిటి అనే ఆసక్తి ఇటు చిత్ర పరిశ్రమలోను, అటు ప్రేక్షకుల్లోనూ నెలకొంది. తాజాగా శింబు కథానాయకుడిగా చిత్రం చేయడానికి సిద్ధమవుతున్నట్లు ప్రచారం జరుగుతోంది. అదే సమయంలో మరోస్టార్ హీరోతోనూ అశ్వద్ మారిముత్తు చిత్రం చేయనున్నట్లు ప్రచారం వైరల్ అవుతోంది. దీంతో అశ్వద్ మారిముత్తు దీనిపై స్పందిస్తూ తన ఇన్‌స్టాగామ్‌లో ఒక పోస్ట్ పెట్టారు. అందులో 'నా తర్వాత చిత్రాల గురించి నిరాధార వార్తలు ప్రచారం అవుతున్నాయి. అందులో వాస్తవం లేదు. దయచేసి నా లైనప్ చిత్రాల గురించి వదంతులు ప్రచారం చేయకండి. నేను దర్శకత్వం వహించే చిత్రాల వివరాలను స్వయంగా నేనే ప్రకటిస్తాను' అని పేర్కొన్నారు. ఈయన శింబు హీరోగా చేయనున్న చిత్రానికి సంబంధించిన చర్చలు ముమ్మురంగా జరుగుతున్నట్లు సమాచారం. ఇది శింబు నటించే 49వ చిత్రం కావడం గమనార్హం. త్వరలోనే దీనికి సంబంధించిన అధికారిక ప్రకటన వెలువడే అవకాశం ఉంది.

క్లుప్తంగా

అరుంగళం అడవికి నిప్పు



తిరుత్తణి: అరుంగుళం అడవికి గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టడంతో మంటలు చెలరేగాయి. తిరువలంగాడు యూనియన్‌లోని అరుంగుళం రోడ్డు మామండూరు వద్ద కాపు అడవిలో ఎర్రచందనం చెట్లు ఉన్నాయి. శనివారం సాయంత్రం గుర్తు తెలియని వ్యక్తులు అడవికి నిప్పు పెట్టారు. చెన్నై–తిరుపతి జాతీయ రహదారికి అత్యంత దగ్గరలోని అడవిలో మంటలు వ్యాపించడంతో స్థానికులు అటవీశాఖ సిబ్బందికి సమాచారం ఇచ్చారు. అటవీశాఖ సిబ్బంది, స్థానికులు గంటపాటు శ్రమించి మంటలను అదుపు చేశారు.

పాకిస్థాన్ నుంచి మాట్లాడుతున్నానంటూ బాంబు బెదిరింపు

కొరుక్కుపేట: చెన్నై ఎగ్మూర్ పోలీస్ కంట్రోల్ రూంకు ఈ నెల 20వ తేదీ ఉదయం 9.30 గంటలకు ఓ గుర్తు తెలియని వ్యక్తి ఫోన్ చేశాడు. 5 నిమిషాల్లో మీ లొకేషన్‌లో బాంబు పేలుతుందని చెప్పి ఫోన్‌ను డిస్‌కనెక్ట్ చేశాడు. ఆ తర్వాత పోలీసులు నిర్దేశిత నంబర్‌కు ఫోన్ చేసి మాట్లాడారు. అప్పుడు ఎదురుగా మాట్లాడిన అదే వ్యక్తి నేను పాకిస్థాన్ నుంచి మాట్లాడుతున్నాను అంటూ నీచమైన పదాలతో దూషించాడు. అతను మాట్లాడిన ఫోన్ నంబర్‌లో మాట్లాడిన స్థలాన్ని గుర్తించారు. ఫోన్‌లో బెదిరింపులకు పాల్పడింది ఉడుమలైపేటకు చెందిన లింగ భూపతి అని తేలింది. ఎగ్మూర్ పోలీసులు అతడిని అదుపులోకి తీసుకున్నారు. లింగ భూపతి పెట్రోల్ బంకులో పనిచేస్తున్నాడని, జీతం సరిగా ఇవ్వకపోవడంతో పని ఆగిపోయాడని పోలీసుల విచారణలో తేలింది. అయితే అక్కడ పనిచేస్తున్న మేనేజర్ పళనిస్వామి నంబరుకు ఫోన్ చేయాల్సింది 100కు ఫోన్ చేశానని చెప్పాడు. పోలీసులు అతడిని అరెస్ట్ చేసి జైల్లో పెట్టారు.

మురుగు కాలువలో పడి కార్మికుడి మృతి

అన్నానగర్: మురుగుకాలువలో పడి ఓ కార్మికుడు మృతిచెందాడు. చెన్నైలోని ఎరుక్కంజేకు చెందిన సతీష్‌కుమార్ (35). ఇతను చెన్నై మున్సిపల్ వాటర్ బోర్డులో కాంట్రాక్ట్ లేబర్‌గా పనిచేస్తున్నాడు. తండయార్‌పేట, నేతాజీ నగర్ సున్నం కాలువ సమీపంలోని పెద్ద మురుగు పైపు మరమ్మతు చేసే పనిలో సతీష్‌కుమార్‌తో పాటు నలుగురు కార్మికులు నిమగ్నమయ్యారు. తర్వాత అందరూ వెళ్లిపోయారు. ఈస్థితిలో శనివారం రాత్రి ఆ ప్రాంతంలోని మురుగుకాలువలో సతీష్ కుమార్ శవమై కనిపించాడు. మద్యం మత్తులో కాలువలో పడి మృతిచెంది ఉండవచ్చని తెలుస్తోంది. ఆర్‌కె.నగర్ పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్టాన్లీ ప్రభుత్వాస్పత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

క్రేన్ బెల్ట్ పడి కార్మికుడు దుర్మరణం

అన్నానగర్: బన్రూటి సమీపంలోని క్వారీలో క్రేన్ బెల్ట్ తెగిపడడంతో బిహార్ కార్మికుడు దుర్మరణం చెందాడు. బిహార్ రాష్ట్రం మెదలి అంజలి గ్రామానికి చెందిన చార్లెస్ అస్లాం (22). ఇతను నెల్లై జిల్లాకు చెందిన బన్రూటి దగ్గర పళవూరై పక్కన పుత్తేరి ప్రాంతంలోని క్వారీలో పనిచేస్తున్నాడు. అదే క్వారీలో అతని బంధువు సహా ఉత్తరాది రాష్ట్రానికి చెందిన వారు పనిచేస్తున్నారు. ఈ స్థితిలో శనివారం చార్లెస్ అస్లాం క్రేన్‌తో క్వారీ నుంచి రాళ్లను ఎత్తివేసే పనిలో నిమగ్నమయ్యాడు. అనుకోకుండా క్రేన్ బెల్ట్ తెగి పడిపోయింది. ఈ ప్రమాదంలో చార్లెస్ అస్లాం అక్కడికక్కడే మృతిచెందాడు. విషయం తెలుసుకున్న పళవూరు పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని నాగర్‌కోయిల్‌లోని ఆచారిపాళ్యం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పోలీసులు విచారణ జరిపి రాళ్ల క్వారీ యజమాని కన్యాకుమారి జిల్లాకు చెందిన సజిన్ విలవంగోటకు చెందిన ఉద్యోగి ప్రకాష్, అనీస్ అనే ముగ్గురు వ్యక్తులపై కేసు నమోదు చేశారు.

మహిళా హెడ్ కానిస్టేబుల్ ఆత్మహత్య



సెల్వి(ఫైల్)

సేలం: పులియాంతోపులో మహిళా హెడ్‌కానిస్టేబుల్ ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. చెన్నై పులియాంతోపు పోలీసు క్వార్టర్స్‌లో నివసిస్తున్న సెల్వి (35). ఈమె కీల్పాక్కం మహిళా పోలీసు స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్నారు. ఈమె భర్త నల్లసామి శివగంగైలో గ్రామపంచాయతీ ఉపాధ్యక్షుడు. ఒక హత్య కేసులో భర్త నల్లసామికి సంబంధం ఉన్నట్టు అనుమానం ఉన్నట్టు తెలిసింది. ఈ విషయంగా భర్తతో ఫోన్‌లో గొడవ పడింది. దీంతో మానసిక ఒత్తిడికి గురైన మహిళా సెల్వి ఇంట్లో శనివారం రాత్రి ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఆదివారం ఉదయం సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి వెళ్లి మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని శవపంచనామా నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

సీబీఐ వలలో చీఫ్ ఇంజినీర్

- మరికొందరు అధికారుల కూడా..
- పుదుచ్చేరిలో చర్చ



దీనదయాళన్



ఇంజినీరింగ్ అధికారులు బస చేసిన హోటల్

సాక్షి, చెన్నై : తమిళనాడు నుంచి కారైక్కాల్‌కు వెళ్లిన సీబీఐ అధికారుల బృందం వలలో పుదుచ్చేరి ప్రజా పనుల శాఖ చీఫ్ ఇంజనీరుతో పాటూ మరికొందరు అధికారులు పడ్డారు. వీరిలో ప్రధానంగా చీఫ్ ఇంజినీర్ దీనదయా ళన్ ను ఆదివారం సీబీఐ టార్గెట్ చేసింది. వివరాలు.. కేంద్ర పాలిత ప్రాంతం పుదుచ్చేరి ప్రజా పనుల శాఖ చీఫ్ ఇంజినీర్‌గా దీనదయాలన్ పనిచేస్తున్నారు. శనివారం ఆయన తన కుమార్తె వివాహ ఆహ్వాన పత్రికలను అందించేందుకు కారైక్కాల్ వెళ్లారు. ఇక్కడి ప్రభుత్వ సీగల్స్ హోటల్‌లో బస చేశారు. సాయంత్రం తర్వాత ఆయన కోసం ఒకరి తర్వాత మరొకరు అంటూ కారైక్కాల్ ప్రజా పనుల శాఖ ఇంజినీర్లు, ఉద్యోగులు రాక మొదలెట్టారు. కొందరు కాంట్రాక్టర్లు కూడా వచ్చారు. అదే సమయంలో ఆ హోటల్ పరిసరాలలో వేచి ఉన్న తమిళనాడు నుంచి వెళ్లిన సీబీఐ అధికారుల బృందం దీనదయాలన్‌తో పాటూ ఇంజినీర్లను టార్గెట్ చేసింది. అందర్నీ రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకుంది. అదే సమయంలో పుదుచ్చేరిలోని బుస్సీ రోడ్డులో ఉన్న ప్రజా పనుల శాఖ కార్యాలయాన్ని సీబీఐ అధికారుల సీజ్ చేశారు. కారైక్కాల్‌లోని ఇంజినీరింగ్ అధికారుల కార్యాలయాలలో సోదాలకు దిగారు. రాత్రంతా సోదాలు, హోటళ్లో హడావుడి సాగింది. ఆదివారం ఉదయాన్నే సీబీఐ అధికారులు చీఫ్ ఇంజనీరు దీనదయాలన్‌తో పాటూమరికొందరిని అరెస్టు చేశారు. వీరిని కారైక్కాల్ కోర్టు న్యాయమూర్తి ఎదుట హాజరు పరిచారు. సోమవారం కాల పట్టు సెంట్రల్‌జైలుకు తరలించనున్నారు.

లంచంలో వాటాలు

సీబీఐకు అధికారులకు అందిన రహస్య సమాచారంతోనే ఈ దాడి జరిగినట్టు సంకేతాలు వెలువడ్డాయి. కారైక్కాల్‌లో రూ. 6 కోట్లు విలువైన రోడ్డు పనులను తమిళనాడులోని తిరువారూర్ జిల్లా మన్నార్‌కుడికి చెందిన ఓ ప్రైవేటు సంస్థ చేపట్టినట్టు సమాచారం. ఈ పనులకు గాను లంచం పుచ్చుకునేందుకు ఆ హోటల్‌లో దీనదయాళన్ బస చేసినట్టు వెలుగు చూసింది. రూ. 25 లక్షలు లంచం పుచ్చుకున్న తదుపరి, దానిని వాటాలు వేసుకునే పనిలో ఇతర ఇంజినీర్లు నిమగ్నమైన సమయంలో సీబీఐ రంగంలోకి దిగి రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నట్టు సమాచారం. ఈ వ్యవహారంకేంద్ర పాలిత ప్రాంతం పుదుచ్చేరిలోని అధికార వర్గాలలో చర్చనీయాంశంగా మారింది. కుమార్తె పెళ్లికి ఆహ్వాన పత్రిక అందించేందుకు వెళ్లి, లంచంపుచ్చుకునే క్రమంలో సీబీఐకు దీనదయాళన్ చిక్కడం హాట్ టాపిక్‌గా మారింది. కారైక్కాల్, పుదుచ్చేరిలలోని ప్రజా పనుల శాఖ అధికారుల నివాసాలలో సీబీఐ సోదాలు కొనసాగుతున్నాయి.

శ్రీలంక అమ్మన్ ఆలయానికి విగ్రహాలు

సేలం: తంజావూరు జిల్లా స్వామిమలైకి చెందిన ఒక స్థపతి, శ్రీలంక అమ్మన్ ఆలయానికి 2,500 కిలోల బరువున్న 28 పంచలోహ విగ్రహాలను తయారు చేశారు. తంజావూరు జిల్లా 'ది కాస్ట్ ఫ్రాన్స్ క్రియేటివ్' యజమాని వరదరాజ్, కుంభకోణం సమీపంలోని స్వామిమలై పక్కన ఉన్న తిమ్మకుడిలో గత 25 సంవత్సరాలుగా ప్రపంచవ్యాప్తంగా ఉన్న వివిధ దేవాలయాలకు అవసరమైన వివిధ రకాల లోహ విగ్రహాల తయారీలో అనేక విజయాలు సాధించారు. ఇటీవలే ప్రపంచంలోనే అతిపెద్ద నటరాజ విగ్రహాన్ని ఒకే తారాగణంలో తయారు చేయడం ద్వారా ఆయన ఘనత సాధించారు. ఈ విగ్రహం ప్రస్తుతం వేలూరు జిల్లాలోని నారాయణి పీఠం స్వర్ణ దేవాలయంలో ప్రతిష్ఠించారు. ఇదిలా ఉండగా శ్రీలంకలోని బట్టికలోవాలో కొత్తగా నిర్మించిన కామాక్షి అమ్మన్ ఆలయ నిర్వాహకులు, ఆలయానికి అవసరమైన 28 పంచలోహ విగ్రహాలను తయారు చేసే పనిని 2 సంవత్సరాల క్రితం 'ది కాస్ట్ ఫ్రాన్స్ క్రియేటివ్' యజమాని వరదరాజ్‌కు అప్పగించారు. దీని తరువాత, గత 2 సంవత్సరాలుగా, స్థపతి వరదరాజ్ నేతృత్వంలో 28 పంచలోహ స్వామి విగ్రహాలను అందంగా తయారు చేశారు. వీటిని రెండు రోజుల్లో ఓడ ద్వారా శ్రీలంకకు పంపించే ఏర్పాటు చేస్తున్నట్టు స్థపతి వరదరాజన్ తెలిపారు.



శ్రీలంకకు ఓడలో తరలించడానికి సిద్ధంగా ఉన్న పంచలోహ విగ్రహాలు



విగ్రహాల తయారీలో స్థపతి వరదరాజన్

రంకెలేసిన ఉత్సాహం

- 700 ఎద్దులు, 300 వీరులతో జల్లికట్టు

సేలం: పుదుకోట్టై జిల్లా అన్నవాసల్ ధర్మసంవర్ధిని సమేత శ్రీవిరుత్తపురేశ్వర ఆలయ ఉత్సవం సందర్భంగా ఆదివారం జల్లికట్టు పోటీలు ఘనంగా నిర్వహించారు. తిరుచ్చి, తంజావూరు, మదురై, పుదుక్కోట్టై సహా వివిధ జిల్లాల నుంచి 700 ఎద్దులు, 350 వీరులు ఇందులో పాల్గొన్నారు. ప్రమాణం చేసిన తర్వాత, వీరులు మైదానంలోకి ప్రవేశించారు. అనంతం వాడివాసల్ నుంచి దూసుకొచ్చిన ఎద్దులను నిలువరించేందుకు ప్రయత్నించారు. ఈ పోటీలలో గెలుపొందిన వీరులు, ఎద్దుల యజమానులకు కుక్కర్, డైనింగ్ టేబుల్ సహా బహుమతులను నిర్వాహకులు అందజేశారు.



ఎద్దులను నిలువరిస్తున్న వీరులు

హేళన చేస్తే సహించం



కనిమొళి

సాక్షి, చెన్నై : తమిళ ప్రజలను, తమిళనాడును హేళన చేస్తే సహించబోమనికేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌ను డీఎంకే ఎంపీ కనిమొళి కరుణానిధిహెచ్చరించారు. చెన్నైలోజరిగిన ఓ కార్యక్రమంలో ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ డీఎంకేను టార్గెట్ చేశారు. డైవర్షన్ రాజకీయాలను డీఎంకే చేస్తున్నట్టు మండిపడ్డారు. స్వలాభం కోసం, రాజకీయ ఆదాయం కోసం ప్రజల మనోభావాలను అడ్డం పెట్టుకుని రెచ్చగొట్టే ప్రయత్నాలు చేస్తున్నారని మండిపడ్డారు. రాహుల్‌గాంధీ ఏమో జనాభా ఆధారంగా పునర్విభజన అంటూ ప్రచారం చేస్తుంటే, వారితో కలిసిఅడుగులువేస్తున్న డీఎంకే ఏమో మరోబాటను అనుసరించడం సిగ్గు చేటు అని మండిపడ్డారు. కర్ణాటక డిప్యూటీ సీఎంను కావేరి నీళ్ల కోసం, కేరళ సీఎంను ముల్‌లైపెరియార్ డ్యాం విషయం గురించి నిలదీయకుండా కొత్త నాటకాలను ఆడుతున్నారని విమర్శించారు. విద్యార్థులతో చెలగాటం, తమిళ ప్రజలమనోభావాలను అడ్డం పెట్టుకుని రాజకీయ ఆదాయం అంటూ డీఎంకే ఆడుతున్న నాటకానికి తెర దించే సమయం ఆసన్నమైందన్నారు. ఇందుకు సమాధానం ఇచ్చే విధంగా కనిమొళి ఆదివారం స్పందించారు.తమిళనాడు, తమిళ ప్రజలను కించపరిచే విధంగా , హేళన చేసే రీతిలో వ్యాఖ్యలుచేస్తే సహించబోమని హెచ్చరించారు. తమిళ ప్రజల హక్కు కోసం తాము పోరాడుతున్నామన్నారు. తమిళనాడు ప్రజలు మరో మారు త్వరలో కేంద్రానికి గుణపాఠం చెప్పబోతున్నారన్న విషయాన్ని గుర్తెరిగితే మంచిదని హితవు పలికారు. తమిళనాడుకు తీవ్ర అన్యాయం తలబెట్టింది కాకుండా, కొత్త నాటకాలు ఆడుతున్నదెవరో అందరికీ తెలుసని ప్రశ్నించారు.

అప్పట్లో సాక్షి వ్యాసాలు.. సంచలనం



వక్త డాక్టర్ రెంటాల వెంకటేశ్వరరావును సత్కరిస్తున్న మధు, జేకే రెడ్డి

కొరుక్కుపేట: 1910 –1930ల ప్రాంతంలో వచ్చిన సాక్షి వ్యాసాలు అప్పట్లో ఒక సంచలనం అని రాజమండ్రికి చెందిన విశ్రాంత ఆచార్యులు డాక్టర్ రెంటాల శ్రీవెంకటేశ్వరరావు వ్యాఖ్యానించారు. ఈ మేరకు వేద విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో తరతరాల తెలుగు కవిత ఉపన్యాస ధారావాహిక 159వ ప్రసంగంగా పానుగంటి వారి విశ్వరూపం – సాక్షి అనే అంశంపై ఆదివారం రాత్రి ఘనంగా జరిగింది. దీనికి ఆస్కా ప్రాంగణం వేదికైంది. వక్తగా విచ్చేసిన డాక్టర్ రెంటాల శ్రీవెంకటేశ్వరరావు ఉపన్యసిస్తూ.. 1910 –30ల ప్రాంతంలో వచ్చిన సాక్షి వ్యాసాలు అప్పట్లో ఒక సంచలనం సృష్టించిందన్నారు. ఆంధ్రపత్రిక సారస్వతను బంధం కోసం చదువరులు ఎంతో ఆత్రుతగా ఎదురుచూసే వారని తెలిపారు. నిరక్షరాస్యులు సైతం చదివించుకుని మరీ విని ఆనందించేవారట అని పేర్కొన్నారు. సాక్షి వ్యాసాలలోని హాస్యం, వ్యంగ్యం, ఆర్తి, జ్ఞాన సంపద, బోధ ఇవన్నీ పాఠకుల్ని మంత్రముగ్ధుల్ని చేస్తాయన్నారు. రచయిత పానుగంటి లక్ష్మీనరసింహారావు అందులో తడమని విషయం లేదంటే పెద్ద అతిశయోక్తికాదని, ఆ కాలంలో ప్రధాన వినోదసాధనంగా ప్రచారంలో ఉన్న నాటకం మీద అనేక వ్యాసాలురాశారని గుర్తుచేశారు. రచన గురించి, ప్రదర్శన గురించి కూడా రాశారన్నారు. జాతిమీద విరుచుకుపడిపోతున్న పాశ్చాత్య నాగరకతను ప్రతిఘటించడానికి ఆయన శాయశక్తులా ప్రయత్నించారని ఆయన ఈసంఆదర్భంగా వ్యాఖ్యానించారు. ఇంగ్లిషు వైద్యం కింద పడి నలిగిపోతున్న ఆయుర్వేద విశిష్టతను ఎలుగెత్తి చాటారని ఆయన ఈసందర్భంగా కొనియాడారు. ముఖ్యంగా సంఘంలోని పెడధోరణుల గురించి ఎంతో రాశారు. స్వభాష పట్ల ప్రేమలేకపోవడం గురించి తీవ్ర అసహనాన్ని వ్యక్తంచేశారని తెలిపారు. సాక్షి ఒక కాలమ్ అంటే నమ్మశక్యం కాదు. ఒక కాలమ్ రచన కాలపరీక్షను తట్టుకుని వంద సంవత్సరాలుగా పఠనపాఠనాలకు నోచుకోవడం చిన్నవిషయం కాదని కొనియాడారు. సాక్షి ప్రధాన ఆకర్షణ ఆయన వాడిన శైలి. అది ప్రాణ ధురంధరమైన శైలి అని తెలిపారు. ముందుగా వేద విజ్ఞాన వేదిక కార్యదర్శి కందనూరు మధు స్వాగతోపన్యాసం చేయగా అధ్యక్షులు జేకే రెడ్డి వక్తను సభకు పరిచయం చేసి ఘనంగా సత్కరించారు. ప్రార్థనా గీతాన్ని ఊరా ఆంజనేయులు ఆలపించారు. కార్యక్రమంలో తెలుగు సాహితీ ప్రియులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

ఈయూ ఇండియా ఎకానమీ ప్రాజెక్టుపై అధ్యయనం

సాక్షి, చెన్నై : తమిళనాడులో ఈయూ ఇండియా రిసోర్స్ ఎఫిషియేన్సీ అండ్ సర్క్యులర్ ఎకానమీ ప్రాజెక్ట్ ప్రారంభించారు. దీనిపై విదేశీప్రతినిధుల బృందం ఆదివారం అధ్యయనం చేపట్టింది. తమిళనాడు స్థిరమైన ప్లాస్టిక్ వ్యర్థాల నిర్వహణ , ఆర్థిక పరివర్తనలో గణనీయమైన పురోగతి సాధించే ప్రయత్నానికి మరింత మద్దతు ఇవ్వడానికి, ఈయూ ఇండియా రిసోర్స్ ఎఫిషియేన్సీ అండ్ సర్క్యులర్ ఆర్థిక వ్యవస్థ ఇనిషియేటివ్ ప్రాజెక్ట్ ఇటీవల చేపట్టారు. ఈ ప్రాజెక్ట్ తమిళనాడులోని ప్లాస్టిక్‌లు , వస్త్రాలపై దృష్టి పెడుతుంది. యూరోపియన్ యూనియన్ , జర్మన్ ఫెడరల్ మినిస్ట్రీ ఫర్ ది ఎన్విరాన్‌మెంట్, నేచర్ కన్జర్వేషన్, న్యూక్లియర్ సేఫ్టీ, అండ్ కన్స్యూమర్ ప్రొటెక్షన్ సంయుక్తంగా నిధులు సమకూర్చే ఈ ప్రాజెక్టును జీఐజెడ్ ఇండియా, భారత ప్రభుత్వ పర్యావరణ, అటవీ, వాతావరణ మార్పుల మంత్రిత్వ శాఖ , తమిళనాడు ప్రభుత్వ అధికారులైన పర్యావరణ, వాతావరణ మార్పు , అటవీ శాఖ , తమిళనాడు కాలుష్య నియంత్రణ బోర్డు తమిళనాడు గ్రీన్ క్లైమేట్ కంపెనీలు సహకారం అందించనున్నాయి. యూరోపియన్ యూనియన్ రాయబారి హెర్వే డెల్ఫిన్ , చెన్నై డిప్యూటీ కాన్సుల్ జనరల్, భారతదేశంలోని ఫెడరల్ రిపబ్లిక్ ఆఫ్ జర్మనీ, పాండిచ్చేరి – చెన్నైలోని ఫ్రాన్స్ కాన్సులేట్ జనరల్, ప్లాస్టిక్ ఒడిస్సీ సహ వ్యవస్థాపకుడు, గోవా, కేరళ రాష్ట్రాల కాలుష్య నియంత్రణ బోర్డు చైర్మన్లు ఎటియన్నే రోల్లాండ్–పీగ్యు, సైమన్ బెర్నార్డ్, మహేష్ కె. పాటిల్,శ్రీకళతో కూడిన బృందం వర్క్‌షాపులో ప్రాజెక్టుపై చర్చించారు. సమగ్ర అధ్యయనం, సమీక్ష, బలోపేతానికి చర్యలు తీసుకున్నారు.



విదేశీ ప్రతినిధుల రాక

రేషన్ దుకాణంలో ఏనుగు

తిరువొత్తియూరు: నీలగిరి జిల్లా కూడలూరు–మైసూరు జాతీయ రహదారిలోని తొరపల్లి గ్రామంలో రేషన్ దుకాణం నడుస్తోంది. ఆదివారం తెల్లవారుజామున అడవి ఏనుగు ఒకటి ఆహారం కోసం వెతుక్కుంటూ ఆ గ్రామంలోకి చొరబడింది. ఏనుగు రేషన్ షాపు తలుపులు పగులగొట్టి లోపల ఉన్న బియ్యం బస్తాలను బయటకు లాగి వేసింది. బియ్యంను రుచి చూసింది. ఇది చూసిన ప్రజలు అటవీశాఖ అధికారులకు సమాచారం అందించారు. అటవీశాఖ అధికారులు వచ్చి ఏనుగును అడవిలోకి తరిమివేశారు. రేషన్ దుకాణంలో ఏనుగు చొరబడి బియ్యం బస్తాలు తీసి తినే దశ్యాలు ఆ ప్రాంతంలోని నిఘా కెమెరాలో రికార్డైంది. దీనికి సంబంధించిన వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది.

రౌడీ దారుణ హత్య

అన్నానగర్: పలు కేసులు ఉన్న రౌడీ దారుణ హత్యకు గురయ్యాడు. మదురైకి చెందిన అనుప్పాండికి చెందిన కాళీశ్వరన్ (36). ఇతనిపై పలు కేసులు ఉన్నాయి. ఇతనికి ఇద్దరు భార్యలు. గత కొన్ని రోజులుగా కాళీశ్వరన్ మదురై తిరునగరు సమీపం వెంగళమూర్తి నగర్‌లోని రెండో భార్య మీనాక్షి ఇంట్లో ఉంటున్నాడు. శనివారం రాత్రి 10 గంటల సమయంలో దుకాణానికి వెళ్తున్నానని భార్యకు చెప్పి బయటకు వెళ్లాడు. ఇంటి నుంచి నడుచుకుంటూ వెళ్తున్నాడు. ఈసమయంలో రెండు ద్విచక్ర వాహనాలపై మారణాయుధాలతో వచ్చిన గుర్తుతెలియని వ్యక్తులు కాళీశ్వరన్ నరికి హత్య చేశారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని కాళీశ్వరన్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మదురై ప్రభుత్వాస్పత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నేటి నుంచి శాఖల వారీగా చర్చ



అధికారులతో మంత్రి దురై మురుగన్ సమీక్ష

సాక్షి, చెన్నై: అసెంబ్లీలో సోమవారం నుంచి శాఖల వారీగా నిధుల కేటాయింపు, చర్చలు జరగనున్నాయి. తొలి రోజున నీటి పారుదల శాఖపై చర్చ సాగనుంది. 2025–26 సంవత్సరానికి గాను ఆర్థిక బడ్జెట్, రైతు సంక్షేమాన్ని కాంక్షించే వ్యవసాయ బడ్జెట్ అసెంబ్లీ ముందుకు చేరిన వషయం తెలిసిందే. బడ్జెట్‌పై 20వ తేదీ వరకు చర్చ జరిగింది. 21వ తేదిన సభలో ఆర్థిక మంత్రి తంగం తెన్నరసు అనుబంధ బడ్జెట్‌ను దాఖలు చేశారు. శని, ఆదివారాల సెలవు తర్వాత సోమవారం నుంచి సభ మళ్లీ వేడెక్కనుంది.

సభలో శాఖల వారీగా నిధుల కేటాయింపులు, ప్రగతి ప్రాజెక్టులు , వివిధ అంశాలపై చర్చలు హోరెత్తనున్నాయి. తొలి రోజు సోమవారం నీటి పారుదల శాఖకు నిధుల కేటాయింపులు, కొత్తరిజర్వాయర్లు తదితర అంశాల ప్రకటనలు వెలువడనున్నాయి. ఇప్పటికే ఆ శాఖ మంత్రి దురై మురుగన్ అన్నికసరత్తులు పూర్తి చేశారు. ఆదివారం అధికారులతో సమీక్షను సైతం నిర్వహించారు. నీటి పారుదల శాఖకు ప్రభుత్వం సంవృద్ధిగానేనీటిని కేటాయించడమే కాకండా కొత్త రిజర్వాయర్లు,నీటి పథకాలు తదితర అంశాలపై అసెంబ్లీలో ప్రకటన వెలువడే అవకాశాలుఉన్నాయి. ఇక ఈనెల 24వ తేదిన నీటి పారుదల శాఖ , 25న నగరాభివృద్ధి శాఖ, 26న గ్రామీణాభివృద్ధి, 27న ప్రత్యేక పథకాలు, క్రీడలు,యువజన సంక్షేమ శాఖ, 28న ఖాదీ, గ్రామీణ పరిశ్రమలు, అటవీ, పర్యావరణ శాఖలకు నిధులు కేటాయింపుల చర్చ, సమీక్షలు జరగనున్నాయి. ఈనెల 29,30 శని ఆదివారాలు, 31న రంజాన్ సెలవు తర్వాత సభ ఏప్రిల్ 1వ తేది పునర్ ప్రారంభం కానుంది.

డిమాండ్ల పరిష్కారానికి వినూత్న నిరసన



వినూత్న నిరసన తెలుపుతున్న రేషన్ గిడ్డంగి కార్మికులు

తిరుత్తణి: డిమాండ్ల పరిష్కారానికి రేషన్ గిడ్డంగి కార్మికులు ఆదివారం ఉదయం వినూత్న నిరసన చేశారు. తిరుత్తణి మున్సిపాలిటీ పరిధిలోని ఎగువ తిరుత్తణిలో తమిళనాడు రేషన్ గిడ్డంగిలో 50కు పైగా తాత్కాలిక కార్మికులు రేషన్ బస్తాలు దింపడం, రేషన్ దుకాణాలకు వాహనాల్లో ఎక్కించుకుని తీసుకెళ్లి దించే పనులు చేస్తున్నారు. 2007 నుంచి విధులు నిర్వహిస్తున్న వారికి రోజూవారి పద్ధతిలో కూలి అందజేస్తున్నారు. 7,500 మంది కూలీలు పనిచేస్తుండగా ప్రస్తుతం రాష్ట్రంలోని రేషన్ గిడ్డంగుల్లో 3,500 మంది మాత్రమే విధులు నిర్వహిస్తున్నారు. దీంతో పనిభారం పెరిగి ఇబ్బందులు పడుతున్నారు. ఉద్యోగాలు పర్మినెంట్ చేయాలని, కార్మికుల సంఘం ఎన్నికలు నిర్వహించాలి, ఖాళీలను స్థానికులను నియమించాలనే డిమాండ్ల పరిష్కారానికి కార్మికుల సంఘం ఆధ్వర్యంలో వినూత్న నిరసన చేశారు.ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వీరరాఘవన్ ఆధ్వర్యంలో 50కు పైగా కార్మికులు నుదిటిపై నామం పెట్టుకుని భిక్షాటన చేస్తూ వినూత్న నిరసన తెలిపారు.

విద్యార్థులను పెంచడంపై అవగాహన



పూలమాల వేసి విద్యార్థులకు స్వాగతం పలుకుతున్న ఎమ్మెల్యే చంద్రన్

తిరుత్తణి: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచే లక్ష్యంతో అవగాహన ప్రచారం చురుగ్గా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా తిరుత్తణి యూనియన్‌లోని ఎస్.అగ్రహారం ప్రభుత్వ మాధ్యమిక పాఠశాలలో శతజయంతి ఉత్సవాలు ఆదివారం నిర్వహించారు. కార్యక్రమానికి పాఠశాల హెచ్‌ఎం ఎయిళసు అధ్యక్షత వహించారు. తిరుత్తణి ఎమ్మెల్యే చంద్రన్ పాల్గొని ప్రభుత్వ పాఠశాలలో 1వ తరగతి అడ్మిషన్లు పొందేందుకు ఉత్సాహం చూపిన ఐదుగురు విద్యార్థులను మేళతాళాలతో ఉపాధ్యాయులు, గ్రామీణులు కలిసికట్టుగా ఊరేగింపుగా పాఠశాలకు తీసుకొచ్చారు. పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో 1వ తరగతిలో చేరిన విద్యార్థులకు పూలమాలలు వేసి బొమ్మలు అందజేసి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా గ్రామీణులు పండ్లు, విద్య ఉపకరణాలు సహా వరుస పాఠశాలకు తీసుకొచ్చారు. మధ్యాహ్నం గ్రామీణులకు బిరియానీ పంపిణీ చేశారు. సాయంత్రం పాఠశాలలో శత జయంతి, వార్షిక వేడుకలు కోలాహలంగా నిర్వహించారు. మండల విద్యాశాఖ అధికారులు చలపతి, జోస్మిన్, తిరుత్తణి తూర్పు మండల డీఎంకే కార్యదర్శి రాజేంద్రన్, మున్సిపల్ కౌన్సిలర్ శ్యామ్‌సుందర్, కలైసెల్వి, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామీణులు పాల్గొన్నారు.

మరింత క్రియాశీలకంగా వ్యవహరించాలి



మాట్లాడుతున్న మాజీ మంత్రి రమణ

తిరువళ్లూరు: ఎన్నికలకు ఏడాది వ్యవధి మాత్రమే వున్న క్రమంలో బూత్ కమిటీలు, ఐటీ యువజన విభాగాలను క్రియాశీలకం చేసి చురుగ్గా వ్యవహరించాలని తిరువళ్లూరు జిల్లా అన్నాడీఎంకే కన్వీనర్ రమణ పిలుపునిచ్చారు. తిరువళ్లూరులోని బూత్ కమిటీలతో ప్రత్యేక సమావేశాన్ని ఆదివారం ఉదయం నిర్వహించారు. ఎడపాళ్యంలో జరిగిన కార్యక్రమంలో స్థానిక కౌన్సిలర్ సుమిత్ర వెంకటేషన్, మాజీ మంత్రి రమణ హాజరయ్యారు. రమణ మాట్లాడుతూ ఎన్నికలకు కేవలం ఏడాది మాత్రమే వ్యవధి ఉందన్నారు. ఇప్పటినుంచి బూత్ కమిటీలు, యువజన ఐటీ వింగ్ నేతలు మరింత యాక్టివ్ కావాలని ఆదేశించారు. ఓటర్ల జాబితాతో ఇంటింటికీ వెళ్లి సరి చూసుకోవాలని, అన్నాడీఎంకే మద్దతుదారులు, న్యూట్రల్ ఓటర్లను పార్టీ నేతలు ఇకపై వారానికి రెండు రోజులు కలవాలని ఆయన సూచించారు. పార్టీ అధికారంలోకి రావడానికి నేతలు కార్యకర్తలు సమన్వయంతో ముందుకుసాగాలని ఆయన పిలుపునిచ్చారు. అధికారంలోకి వచ్చిన వెంటనే కష్టపడి పనిచేసే వారికి తగిన గుర్తింపునిస్తామని హామీ ఇచ్చారు. మున్సిపల్ మాజీ చైర్మన్ కమాండో భాస్కరన్, ఎయిలరసన్, పార్టీ నగర కార్యదర్శి కందస్వామి, మాజీ ప్రభుత్వ న్యాయవాది రామ్‌కుమార్, పార్టీ నేతలు వెంకటేషన్, బాలాజీ పాల్గొన్నారు.


కళా ప్రదర్శనకు బృందాల ఎంపిక



వీధి నాటకం ప్రదర్శిస్తున్న కళాకారులు

తిరువళ్లూరు: రాష్ట్ర రాజధానిలో జరగనున్న చెన్నై మహాసంగమం జాతరలో ప్రదర్శన ఇవ్వడానికి కళా బృందాలను ఎంపిక చేసే కార్యక్రమాన్ని రెండు రోజుల పాటు తిరువళ్లూరులో నిర్వహించారు. ప్రతి ఏటా చెన్నైలో కనుమ పండుగ రోజున చెన్నై మహాసంగమం జాతర నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. జాతరలో ముఖ్యమంత్రితో పాటు పలువురు హాజరుకానున్నారు. కాగా ఉత్సవాల్లో వీధినాటకం, కరక్కాట్టం, ఒయిళాట్టం, పరైమేళం, డప్పుతో పాటు ఇతర ప్రదర్శన జరగనుంది. ఈ ప్రదర్శనలో పాల్గొనే కళాకారులు, బృందాలను జిల్లా స్థాయిలో ఎంపిక చేసే కార్యక్రమం తిరువళ్లూరులో జరిగింది. మొత్తం 36 బృందాలు పాల్గొనగా వీరిలో ఐదు బృందాలను ఎంపిక చేసి తిరుచ్చిలో జరిగే రీజనల్ పోటీలకు పంపారు. తిరుచ్చిలో ఎంపికయ్యే బృందాలు చెన్నైలో ప్రదర్శన ఇవ్వనున్నారు. తిరువళ్లూరులో జరిగిన వీధినాటకం, కరక్కాట్టం, ఒయిళాట్టం, పరైఇసై అందరినీ ఆకట్టుకుంది.

ఘనంగా ప్రపంచ పిచ్చుకల దినోత్సవం



పిచుక ఆకారంలో నిల్చున్న విద్యార్థులు

సేలం: ప్రపంచ పిచ్చుకల దినోత్సవం సందర్భంగా ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు పిచ్చుకల రక్షణపై అవగాహన కల్పించే రీతిలో రెక్కలు చాచి పిచ్చుక ఎగురుతున్నట్లు ప్రదర్శన ఇచ్చి ప్రజల్లో అవగాహన కల్పించారు. ప్రపంచ పిచ్చుకల దినోత్సవాన్ని మార్చి 22 ప్రపంచవ్యాప్తంగా జరుపుకున్నారు. ఇటీవల పిచ్చుకల సంఖ్య తగ్గుతోంది. పట్టణీకరణ సహా వివిధ కారణాల వల్ల పిచ్చుకలు అంతరించిపోయే దశలో ఉన్నాయి. ప్రపంచ పర్యావరణ సమతుల్యతను కాపాడడంలో పిచ్చుకలు ముఖ్యమైన పాత్ర పోషిస్తాయి. ఈ నేపథ్యంలో, మైలదుదురై జిల్లాలోని శీర్గాళి సమీపంలోని తాండవంకులం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ప్రపంచ పిచ్చుకల దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఇందులో టీవీఎస్ ప్రైవేట్ ఫౌండేషన్, ప్రభుత్వ ఉన్నత పాఠశాల సంయుక్తంగా ప్రపంచ పిచ్చుకల దినోత్సవాన్ని జరుపుకున్నాయి. ఇందులో వ్యవసాయ సలహాదారు ఎబినేజర్ ప్రత్యేక అతిథిగా పాల్గొని పిచ్చుక ప్రత్యేకతలు, దాని చురుకుదనం, ఎగిరే వేగం గురించి విద్యార్థులకు వివరించారు. పాఠశాల విద్యార్థులు పిచ్చుక ఆకారంలో నిలబడి, ఆపై తమ రెక్కలను విప్పి ఎగురుతూ, పిచ్చుకల వాస్తవిక ప్రదర్శన ఇచ్చారు. ప్రస్తుతం ఈ దృశ్యాలు సామాజిక మాధ్యమాలలో వైరల్ అవుతున్నాయి.

యువకుడి అవయవదానం



యాదవ్ (ఫైల్)

సేలం: సత్యమంగళం సమీపంలో జరిగిన బైకు ప్రమాదంలో తలకు తీవ్ర గాయమై బ్రెయిన్ డెడ్ అయిన కళాశాల విద్యార్థి అవయవాలను దానం చేసిన తర్వాత ప్రభుత్వ లాంఛనాలతో దహన సంస్కారాలు నిర్వహించారు. ఈరోడ్ జిల్లాలోని పున్జై పులియంపట్టి సమీపంలోని నెహ్రూ నగర్ ప్రాంతానికి చెందిన నాగరాజ్, విజయలక్ష్మి దంపతుల కుమారుడు యాదవ్ (19). అతను కోయంబత్తూరులోని ఒక ప్రైవేట్ కళాశాలలో డిగ్రీ రెండవ సంవత్సరం విద్యార్థి. ఈ పరిస్థితిలో ఇతను 19వ తేదీన కోయంబత్తూరు నుంచి ద్విచక్ర వాహనంపై ప్రయాణిస్తుండగా ప్రమాదం జరిగింది. ప్రమాదంలో గాయపడిన ఇతన్ని కోయంబత్తూరులోని ఒక ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించారు. బ్రెయిన్ డెడ్ అయ్యాడని వైద్యులు తెలిపారు. తమ కుమారుడి అవయవాలను దానం చేయాలని తల్లిదండ్రులు నిర్ణయించారు. తరువాత యువకుడి అవయవాలను దానం చేశారు. అవయవాలను వైద్య బృందంతో కోయంబత్తూరులోని ఆస్పత్రులకు తరలించారు. అనంతరం మృతదేహాన్ని అతని స్వగ్రామానికి తీసుకొచ్చారు. ప్రభుత్వం తరపున సత్యమంగళం తాలూకా జిల్లా మేజిస్ట్రేట్ నివాళులర్పించారు. ఆ తర్వాత, కళాశాల విద్యార్థి యాదవ్ అంత్యక్రియలు పూర్తి ప్రభుత్వ లాంఛనాలతో జరిగాయి. పున్జై పులియంపట్టి శ్మశానవాటికలో ఖననం చేశారు.

క్లుప్తంగా...

పింఛన్ సొమ్ము అందక వితంతువు మృతి

- ఇంటి పన్ను బకాయి ఉందని డబ్బు ఇవ్వని పంచాయతీ కార్యదర్శి
- నంద్యాల జిల్లాలో దారుణ ఘటన



రుద్రవరం: అధికారి నిర్లక్ష్యంతో పేద వితంతువు ప్రాణాలు వదిలిన వైనం ఆదివారం నంద్యాల జిల్లాలోని మండల కేంద్రం రుద్రవరంలో చోటు చేసుకుంది. మృతురాలి కుటుంబీకులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన లక్ష్మీదేవికి(45) గత కొన్నేళ్ల నుంచి వితంతు పింఛన్ అందుతోంది. ఒక్కగానొక్క కుమారుడు రామ్మోహన్ వాటర్ సర్వీసింగ్ సెంటర్‌లో పని చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. అనారోగ్యంతో ఉన్న లక్ష్మీదేవి పింఛన్ సొమ్ముతో ప్రతి నెల మందులు కొనుగోలు చేస్తోంది. అయితే ఇంటి పన్ను బకాయి ఉందని ఈ నెల 1న అధికారులు పింఛన్ ఇవ్వలేదు. ప్రస్తుతం ఆరోగ్యం సరిగా లేదని వైద్యం చేయించుకోవాలని వచ్చే నెలలో పన్ను బకాయి చెల్లిస్తామని బతిమలాడినా అధికారులు కనికరించక పోగా.. బయట ఎక్కడైనా వడ్డీకి తీసుకెళ్లి వైద్యం చేయించుకోమన్నారు. బీపీ, షుగర్, ఆయాసం ఉన్న ఆమె వైద్యం చేయించుకోకపోవడం, మందులు వేసుకోకపోవడంతో పరిస్థితి విషమించింది. శనివారం అర్ధరాత్రి అపస్మారక స్థితికి చేరుకోవడంతో కుటుంబీకులు 108లో నంద్యాల ప్రభుత్వ వైద్యశాలకు తరలిస్తుండగా మార్గంమధ్యలో మృతి చెందింది. రుద్రవరం మేజర్ పంచాయతీ కార్యదర్శి సుబ్బారావు నిర్లక్ష్యంతో తన తల్లి చనిపోయిందని లక్ష్మీదేవి కుమారుడు రామ్మోహన్ వాపోయాడు. ఈ విషయంపై పంచాయతీ కార్యదర్శి సుబ్బారావును వివరణ కోరగా, అలాంటిదేమి లేదని సొమ్ము ఇచ్చేందుకు వెళ్లినప్పుడు ఆమె ఆసుపత్రిలో ఉందని, దీంతో వచ్చే నెల రెండు నెలల పింఛన్ సొమ్ము తీసుకొమ్మని చెప్పామని తెలిపారు.

ఎంపీడీవో పదోన్నతిలో ఏవోలకు 50% కోటా

ఉద్యోగుల సంఘం డిమాండ్



రాష్ట్ర నూతన అధ్యక్షుడు ఆర్‌వీవీ రమేష్‌తో బండి శ్రీనివాసరావు తదితర నాయకులు

గుంటూరు ఎడ్యుకేషన్: పంచాయతీరాజ్ శాఖలో ప్రభుత్వం అమల్లోకి తేనున్న పరిపాలన సంస్కరణల్లో భాగంగా మండల పరిషత్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ (ఎంపీడీవో) బాధ్యతల్లోకి ప్రమోషన్ల విషయంలో 50 శాతాన్ని అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్లకు (ఏవో) కేటాయించాలని ఏపీ పంచాయతీరాజ్ మినిస్టీరియల్ ఉద్యోగుల సంఘం పూర్వ అధ్యక్షులు బండి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. ఆదివారం ఇక్కడి సంఘ రాష్ట్ర సర్వసభ్య సమావేశం జరిగింది. ఎంపీడీవో పదోన్నతికి సంబంధించి డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ విధానాన్ని తొలగించడంతో అందుబాటులోకి వచ్చే పోస్టులు, పదోన్నతులు తదితర అంశాలపై సమావేశం చర్చించింది. కాగా ప్రస్తుత అధ్యక్షుడు బండి శ్రీనివాసరావు ఎంపీడీవోగా పదోన్నతి పొందడంతో రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షునిగా వ్యవహరిస్తున్న తూర్పు గోదావరి జిల్లాకు చెందిన ఆర్‌వీవీ రమేష్‌ను నూతన రాష్ట్ర అధ్యక్షునిగా 13 ఉమ్మడి జిల్లాలకు చెందిన అధ్యక్ష, కార్యదర్శులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

ఏఈవో సమస్యల పరిష్కారానికి కృషి

జేఏసీ చైర్మన్ కె.వి. శివారెడ్డి

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని వ్యవసాయ విస్తరణ అధికారుల సమస్యల పరిష్కారానికి ఏపీ జేఏసీ కృషి చేస్తోందని రాష్ట్ర జేఏసీ చైర్మన్ కె.వి.శివారెడ్డి తెలిపారు. విజయవాడలోని ఏపీ ఎన్జీవో సంఘ భవనంలో ఆదివారం వ్యవసాయ విస్తరణ అధికారుల సంఘం రాష్ట్ర కార్యవర్గ సమావేశం, డైరీ ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన శివారెడ్డి మాట్లాడుతూ పీఆర్సీ కమిషన్ వెంటనే నియమించాలని, పెండింగ్‌లో ఉన్న ప్రభుత్వ ఉద్యోగుల బకాయిలను వెంటనే చెల్లించాలని కోరారు. సంఘం ప్రధాన కార్యదర్శి విద్యాసాగర్ మాట్లాడుతూ వ్యవసాయ విస్తరణ అధికారుల సమస్యలపై ఏపీ జేఏసీ నిరంతరం ప్రభుత్వంతో చర్చిస్తోందని తెలిపారు.

ప్రధానికి జగన్ లేఖ రాశారు... బాబు నోరెత్తరేం..!

డీలిమిటేషన్‌పై ప్రశ్నించిన సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

సాక్షి, బళ్లారి: దేశంలో డీలిమిటేషన్ అంశంపై మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రధాని మోదీకి లేఖ రాసి ఏపీకి జరిగే అన్యాయం గురించి సమగ్రంగా వివరించారని, అయితే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఈ విషయంలో నోరు విప్పడం లేదని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ ఆదివారం పేర్కొన్నారు. కేంద్రానికి భయపడి నోరు విప్పడం లేదా? అని చంద్రబాబు, పవన్ కళ్యాణ్‌ను ఇక్కడ జరిగిన విలేకరుల సమావేశంలో ప్రశ్నించారు. డీలిమిటేషన్ పేరుతో ఉత్తర భారతదేశంలో లోక్‌సభ సీట్లు పెంచేందుకు కేంద్రం ఎత్తుగడ వేస్తోందని, ఈ విషయంలో దక్షిణాది రాష్ట్రాలకు తీవ్ర అన్యాయం జరిగే ప్రమాదం ఉందని విమర్శించారు. పోలవరం ఎత్తును కేంద్రం తగ్గించినా, చంద్రబాబు, పవన్ నోరు మెదపడం లేదని మండిపడ్డారు.

తాడేపల్లిలో మహిళపై అత్యాచారం.. హత్య

డీజీపీ కార్యాలయానికి కూతవేటు దూరంలోనే ఘటన

మర్మాంగంలో సైతం గాయాలు అయినట్లు అనుమానం



తాడేపల్లి రూరల్: విజయవాడ-గుంటూరు జాతీయ రహదారి మధ్య డీజీపీ కార్యాలయానికి కూతవేటు దూరంలో ఓ మహిళ అత్యాచారం, ఆపై హత్యకు గురైంది. స్థానికుల కథనం మేరకు.. కొలనుకొండ జాతీయ రహదారి నుంచి గుంటూరు చానల్ మీదుగా ఇప్పటం వెళ్లే రహదారిలో జాతీయ రహదారికి 100 మీటర్ల దూరంలో ఈ దారుణం జరిగింది. మహిళ మృతదేహానికి ఎడమ చేతి వైపున గొంతుపై బలంగా పొడిచినట్లు గాయం కనిపిస్తోంది. మహిళ మొహంపై పూర్తిగా రక్తం ఉండడంతో ఆమె ముఖఛాయలు సరిగా కనిపించడం లేదు. మర్మాంగం వద్ద రక్తం కారుతున్నట్లు పోలీసులు చెబుతున్నారు. ఆ మహిళను ఎవరైనా అక్కడకు తీసుకు వచ్చి, ఆమెతో ఏకాంతంగా గడిపి.. ఒక్కసారిగా కత్తితో దాడిచేసి చంపినట్లు తెలుస్తోంది. మహిళ రెండు కాళ్లు మోకాలు నుంచి కిందకు వంచి ఉన్నాయి. పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లే సరికి హత్య జరిగి సుమారు 40 నిమిషాలు అయ్యుండొచ్చని భావిస్తున్నారు. తాడేపల్లి సీఐ కల్యాణ్ రాజు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించి అది హత్యగా నిర్ధారించారు. సంఘటన స్థలం వద్ద సెల్‌ఫోన్, హ్యాండ్ బ్యాగ్ లభించాయని.. వాటిని పరిశీలించి ఆ మహిళ ఎవరో గుర్తిస్తామని తెలిపారు. కాగా, డీజీపీ కార్యాలయం సమీపంలో, జాతీయ రహదారి పక్కనే ఓ హోటల్‌లో నిత్యం పోలీసులు ఉంటున్నప్పటికీ ఈ సంఘటన జరగడం చర్చనీయాంశమైంది. జనవరి 31వ తేదీన కూడా గుంటూరు ఛానల్ నుండి నులకపేటకు వచ్చే రహదారిలో ఇదే గ్రామంలో డీజీపీ కార్యాలయానికి రెండు కిలోమీటర్ల దూరంలో ఇదే తరహాలో ఓ మహిళ హత్యకు గురైంది. ఆ మహిళ ఎవరో ఇప్పటి వరకు ఆచూకీ లభించలేదు. ఈ రెండు హత్యలు ఒకేలా జరగడంతో ఒకే వ్యక్తి చేసి ఉంటాడని పోలీసులు అనుమానిస్తున్నారు.

వెలిగే ఉన్న సెల్ ఫోన్ టార్చిలైట్

సంఘటనా స్థలం వద్ద మహిళ మృతదేహం కనిపించేలా సెల్‌ఫోన్‌లో టార్చిలైట్ వెలిగే ఉంది. హత్య చేసిన వ్యక్తే ఈ పని చేసి ఉంటాడనే అనుమానం వ్యక్తమవుతోంది. మహిళ సెల్‌ఫోన్‌కు ఎటువంటి రక్తపు మరకలు కనిపించ లేదు. లేదా హత్య జరగక ముందే ఆ మహిళ సెల్ ఫోన్‌లోని టార్చ్ లైట్‌ను ఆన్ చేసి ఉంచిందా.. అనే దిశలో కూడా పోలీసులు ఆలోచిస్తున్నారు. ఇప్పుడు ఈ సెల్‌ఫోన్ కీలకంగా మారడంతో పోలీసులు దానిని స్వాధీనం చేసుకుని ఆధారాలు సేకరించే పనిలో పడ్డారు. మహిళ హ్యాండ్ బ్యాగ్‌లో కండోమ్స్ మాత్రమే పోలీసులకు లభించాయి. మరో కోణంలో.. ఇప్పటికే పలు ప్రాంతాల్లో కేసులు నమోదైన విటుల ద్వారా కూడా వివరాలు సేకరించి ఆ మహిళను గుర్తించే ప్రయత్నం చేస్తామని సీఐ తెలిపారు.

ప్రియురాలిని, ఆమె తల్లిని కిరాతకంగా హత్యచేసిన ప్రియుడు

- వేరొకరితో చాటింగ్ చేస్తోందని ఘాతుకం
- ఇద్దరికీ మెడమీద బలంగా కత్తిపోట్లు
- ఇంటికి తాళం వేసి పరార్
- పోలీసుల అదుపులో నిందితుడు



హత్యకు గురైన సల్మా, సానియా



సల్మా, సానియా (ఫైల్)

రాజమహేంద్రవరం రూరల్: ఆమెకు 16.. అతడికి 20.. ఇద్దరి మనస్సులూ కలిశాయి. ఆరు నెలలుగా గాఢంగా ప్రేమించుకుంటున్నారు. ఇంతలోనే కొద్దిరోజులుగా ప్రియురాలు వేరొకరితో చాటింగ్ చేస్తోందనే అనుమానంతో ఇద్దరి మధ్య గొడవలు మొదలయ్యాయి. దీంతో.. ప్రియురాలిని, ఆమె తల్లిని ప్రియుడు కూరలు కోసే కత్తితో కిరాతకంగా హత్యచేసి, ఇంటికి తాళంవేసి, పరారయ్యాడు. రాజమహేంద్రవరంలో ఆదివారం తెల్లవారు జామున ఈ సంఘటన చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం.. ఏలూరు ఏఎస్‌ఆర్ స్టేడియం ప్రాంతానికి చెందిన మహ్మద్ సల్మా (38), ఆమె కుమార్తె మహ్మద్ సానియా ఎలియాస్ సానా (16) మూడునెలలుగా రాజమహేంద్రవరంలోని హుకుంపేటలో ఉంటున్నారు. స్థానిక జాంపేట ప్రాంతానికి చెందిన మహ్మద్ అబ్దుల్ మజీద్‌కు సల్మా రెండో భార్య. ఆయన మూడేళ్ల క్రితం మృతిచెందాడు. ఆయన మొదటి భార్యకు ముగ్గురు కుమారులు. వారు జాంపేటలో నివసిస్తున్నారు. మహ్మద్ సానియా ఈవెంట్లకు యాంకర్‌గా వెళ్తుంటుంది. సల్మా, సానియాలకు తోడుగా వారి ఇంట్లో మజీద్ మొదటి భార్య చిన్న కుమారుడు ఉమర్ ఉంటున్నాడు. ఆరునెలల క్రితం కాకినాడ జిల్లా పిఠాపురంలో ఓ ఈవెంట్‌కు వెళ్లిన సమయంలో ప్రస్తుతం హైదరాబాద్‌లో ఉంటున్న శ్రీకాకుళం జిల్లా వాసి పల్లి శివకుమార్ లైట్ బాయ్‌గా అక్కడకొచ్చాడు. ఆ సమయంలో వీరిద్దరి మధ్య ఏర్పడ్డ పరిచయం ప్రేమగా మారింది.

ఫోన్‌లో ఎవరితోనో చాటింగ్ చేస్తోందని..



నిందితుడు శివకుమార్

ఈ నేపథ్యంలో.. వారం రోజుల క్రితం హైదరాబాద్ నుంచి శివకుమార్ సానియా ఇంటికి వచ్చాడు. ఆ సమయంలో సానియా ఎవరితోనో ఫోన్‌లో చాటింగ్ చేస్తోందని గమనించాడు. దీంతో ఇద్దరి మధ్య గొడవలు ప్రారంభమయ్యాయి. శనివారం రాత్రి కూడా ఇద్దరూ గొడవ పడుతుంటే మొదటి భార్య కుమారులైన మహ్మద్ అలీ, ఉమర్‌లు శివకుమార్‌తో మాట్లాడి వెళ్లారు. తిరిగి ఆదివారం మధ్యాహ్నం ఒంటిగంట సమయంలో ఇంటికి కూర పట్టుకుని ఉమర్ వచ్చాడు. తాళం వేసి ఉండటంతో కిటికీలో నుంచి చూడగా సల్మా, సానియా రక్తపు మడుగులో కనిపించారు. వెంటనే 100 నంబర్‌కు ఫోన్‌చేసి పోలీసులకు విషయం చెప్పాడు. బొమ్మూరు ఇన్‌స్పెక్టర్ కాశీ విశ్వనాథ్, తన సిబ్బందితో తాళాలు పగులగొట్టి లోపల పరిశీలించారు. మెడమీదే బలమైన కత్తిపోటు గాయాలుండడంతో ఇద్దరూ అక్కడికక్కడే మృతిచెందినట్లు నిర్ధారించారు. సంఘటన స్థలాన్ని జిల్లా ఎస్పీ డి. నరసింహ కిషోర్, శాంతిభద్రతల ఏఎస్పీ ఏవీ సుబ్బరాజు, డీఎస్పీలు బి. విద్య, శ్రీకాంత్ పరిశీలించారు. ఉమర్‌ను ఎస్పీ వివరాలడిగి తెలుసుకున్నారు. మహ్మద్ అలీ ఫిర్యాదు మేరకు ఇన్‌స్పెక్టర్ కాశీ విశ్వనాథ్ కేసు దర్యాప్తు చేస్తున్నారు. పరారైన నిందితుడు శివకుమార్‌ను ఆదివారం మధ్యాహ్నం కొవ్వూరు ప్రాంతంలో కొవ్వూరు రూరల్ ఎస్సై శ్రీహరి పట్టుకున్నారు.

‘రెడ్‌బుక్’కు సహకరించని వారిపై బదిలీ వేటు!

▶ మొదటి పేజీ తరువాయి

బదిలీ ప్రక్రియ చేపట్టనుంది. ఇందులో భాగంగా..

- విశాఖపట్నం పోలీస్ కమిషనర్ శంఖబత్ర బాగ్చీని బదిలీచేయాలని ప్రభుత్వం సూత్రప్రాయంగా నిర్ణయించింది. ఆయనపట్ల టీడీపీ ప్రభుత్వ పెద్దలు తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. విశాఖపట్నం వంటి కీలక నగరంలో నిబంధనలకు విరుద్ధంగా పోలీస్ వ్యవస్థను రాజకీయ అవసరాలకు వాడుకోవాలని అమరావతిలోని ప్రభుత్వ పెద్దలు ఒత్తిడి చేస్తున్నారు. కానీ, అందుకు శంఖబత్ర బాగ్చీ సహకరించడంలేదని ఆయనపై గుర్రుగా ఉన్నారు. ఈ నేపథ్యంలోనే ఆయన్ని బదిలీ చేయాలని ప్రభుత్వ పెద్దలు సూత్రప్రాయంగా నిర్ణయించినట్లు సమాచారం. ఆయన స్థానంలో విశాఖపట్నం సీపీగా ప్రస్తుత గుంటూరు రేంజ్ ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠిని నియమించాలని భావిస్తున్నారని తెలుస్తోంది. గత ఎన్నికల్లో ఉమ్మడి గుంటూరు జిల్లాలో టీడీపీ అక్రమాలకు ఆయన ఏకపక్షంగా కొమ్ముకాసిన విషయం తెలిసిందే. ఇక తిరుమల లడ్డూ ప్రసాదం పవిత్రతకు కళంకం ఆపాదిస్తూ రాష్ట్ర ప్రభుత్వం సృష్టించిన వివాదంపై దర్యాప్తు కోసం నియమించిన సిట్‌లో ఆయన్నే సభ్యునిగా చేర్చారు. ఈ నేపథ్యంలో.. నిబంధనలతో నిమిత్తం లేకుండా టీడీపీ పెద్దల ఆదేశాలను అమలుచేస్తారనే నమ్మకంతోనే సర్వశ్రేష్ఠ త్రిపాఠిని విశాఖ పోలీస్ కమిషనర్‌గా నియమించాలని ప్రభుత్వం భావిస్తున్నట్లు తెలుస్తోంది. దీనిపై తుది నిర్ణయంతీసుకోవాల్సి ఉంది.



వినీత్ బ్రిజ్‌లాల్



శంఖబత్ర బాగ్చీ

- అలాగే, నిబంధనల మేరకు మాత్రమే పనిచేసే అధికారిగా గుర్తింపు పొందిన సీఐడీ విభాగంలో ఐజీగా ఉన్న వినీత్ బ్రిజ్‌లాల్‌ను కూడా బదిలీచేయాలని ప్రభుత్వం భావిస్తోంది. రెడ్‌బుక్ కుట్రలో భాగంగా కాకినాడ పోర్టు నుంచి రేషన్ బియ్యం అక్రమ రవాణా అంటూ ప్రభుత్వం పెట్టిన అక్రమ కేసు దర్యాప్తు కోసం నియమించిన సిట్ ఇన్‌చార్జ్‌గా ఈయన ఉన్నారు. దర్యాప్తుతో నిమిత్తం లేకుండా తాము చెప్పినట్లు నివేదిక ఇవ్వాలని ప్రభుత్వ పెద్దలు, పోలీసు ఉన్నతాధికారుల ఒత్తిడికి ఆయన ఏమాత్రం లొంగలేదు. నిబంధనల మేరకు దర్యాప్తు చేస్తా.. లేదంటే రాజీనామా చేసి వెళ్లిపోతానని వినీత్ స్పష్టంచేసి సెలవు పెట్టి వెళ్లిపోయారు. దీంతో.. అప్పటికప్పుడు ఆయన్ను బదిలీచేస్తే అభాసుపాలవుతామని ప్రభుత్వ పెద్దలు వెనుకంజ వేశారు. అందుకే ప్రస్తుతం సీనియర్ ఐపీఎస్ అధికారుల బదిలీ పేరుతో ఆయన్ని సీఐడీ విభాగం నుంచి తప్పించి అప్రాధాన్య పోస్టుకు పరిమితం చేయాలని చూస్తున్నారు.
- ఇక దీర్ఘకాలిక సెలవు ముగించుకుని వచ్చిన డీజీ ఎన్. బాలసుబ్రహ్మణ్యంను ప్రభుత్వం కీలక పోస్టులో నియమించనుంది. ఆయనకు పోలీసు శాఖలో పోస్టు ఇస్తారా లేదా ఇతర శాఖలో ముఖ్య కార్యదర్శిగా నియమిస్తారా అన్నది తేలాల్సి ఉంది. ఐటీ శాఖలో ఆయన్ను నియమించే అవకాశాలున్నాయని తెలుస్తోంది. దీనిపై తుది నిర్ణయం తీసుకోవాల్సి ఉంది.
- మరోవైపు.. తెలంగాణ కేడర్ నుంచి ఏపీకి కేటాయించిన డీజీ స్థాయి అధికారులు అంజనీకుమార్, అభిలాష్ బిష్త్ ఇంకా రాష్ట్రంలో రిపోర్టు చేయలేదు. మరో ఐపీఎస్ అభిషేక్ మహంతి న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. వారు ఏపీలో రిపోర్ట్ చేసిన అనంతరం వారిని ఏ పోస్టుల్లో నియమిస్తారన్నది చర్చనీయాంశంగా మారింది. పోలీసు శాఖలోని వివిధ విభాగాల్లో ఉన్న అదనపు డీజీ, ఐజీ స్థాయి అధికారులను కూడా బదిలీ చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. సీనియర్ ఐపీఎస్ అధికారులను ఈ వారంలోనే బదిలీ చేసే అవకాశాలున్నాయని పోలీసుశాఖ వర్గాలు చెబుతున్నాయి.

ఏసీబీ కేసు రెడ్‌బుక్ పాలనకు పరాకాష్ట

- మాజీ మంత్రి విడదల రజిని మండిపాటు
- ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు ప్రోద్బలంతోనే తప్పుడు కేసు
- జర్మనీలో ఉండే నా మరిది, మామపై కూడా కేసులా?
- ఎన్ని కేసులు పెట్టినా భయపడేది లేదని స్పష్టీకరణ



చిలకలూరిపేట : తనపై ఏసీబీ కేసు నమోదు చేయడం కూటమి ప్రభుత్వ రెడ్‌బుక్ పాలనకు పరాకాష్ట అని మాజీ మంత్రి విడదల రజిని మండిపడ్డారు. దీని వెనుక కర్త, కర్మ, క్రియ మొత్తం నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు అని ఆగ్రహం వ్యక్తం చేశారు. పల్నాడు జిల్లా చిలకలూరిపేటలో ఆదివారం ఆమె తన నివాసంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఫిర్యాదు చేసిన వ్యక్తి ఎవరో తనకు తెలియదని, ఆయనతో ఎప్పుడూ మాట్లాడలేదని, ఆయన వ్యాపారం ఏమిటో కూడా తెలియదన్నారు. తన వ్యాపార ప్రయోజనాల కోసం ఎంపీ వద్దకు వెళ్లిన వ్యక్తితో ఆయనే ఫిర్యాదు చేయించి, కేసు పెట్టించారని చెప్పారు. కూటమి ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి తనను అప్రతిష్ఠపాలు చేసే కుట్రలు జరుగుతున్నాయని ఆరోపించారు. ఇందులో భాగంగానే కట్టుకథ అల్లి, టీడీపీకి చెందిన ఓ ఎమ్మెల్సీ కుమారుడైన పోలీసు అధికారితో విజిలెన్స్ విచారణ చేసినట్లు తతంగం నడిపి ఏసీబీతో కేసు నమోదు చేయించారని ధ్వజమెత్తారు. ఎంపీ శ్రీకృష్ణదేవరాయలకు మొదటి నుంచీ తానంటే కోపమని, ఆయన వైఎస్సార్ సీపీలో ఉన్నప్పుడే గురజాల డీఎస్పీ, సీఐలతో తన కాల్ డేటా దొంగిలించే ప్రయత్నం చేశారని ధ్వజమెత్తారు. అప్పట్లో తాను ఇదే విషయాన్ని నాటి సీఎం వైఎస్ జగన్ దృష్టికి తీసుకెళ్లగా సంబంధిత డీఎస్పీ, సీఐలను సస్పెండ్ చేయించారని గుర్తు చేశారు. మహిళా పక్షపాతి అయిన వైఎస్ జగన్ అప్పుడే ఆ ఎంపీని పిలిచి మందలించారని చెప్పారు. ఎంపీ తరహాలో భూములను కారుచౌకగా కొట్టేసేందుకు తాను రాజకీయాల్లోకి రాలేదన్నారు. విద్యుత్ ధర్నాలో పాల్గొంటే అవినీతిలో ఘనాపాటి అయిన స్థానిక ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు తనపై ఎస్సీ, ఎస్టీ ఎట్రాసిటీ కేసు నమోదు చేయించడం దారుణం అన్నారు. జర్మనీలో ఉన్న తన మరిది, వృద్ధుడైన తన మామపై కూడా తప్పుడు కేసులు పెట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్ని కేసులు పెట్టినా భయపడేది లేదని, న్యాయ వ్యవస్థపై తమకు నమ్మకం ఉందని.. ప్రజల మద్దతు, పార్టీ అధినేత వైఎస్ జగన్ ఆశీస్సులతో అన్నింటినీ ఎదుర్కొంటామని స్పష్టం చేశారు.

పారిశ్రామికవేత్త విజయశేఖరరెడ్డి కన్నుమూత



విజయశేఖరరెడ్డి భౌతిక కాయం వద్ద నివాళులర్పిస్తున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

- వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్ నివాళి
- శ్రద్ధాంజలి ఘటించిన వైఎస్ కుటుంబ సభ్యులు

సాక్షి, కడప : వైఎస్సార్ జిల్లా పులివెందులలో ప్రముఖ పారిశ్రామికవేత్త చవ్వా విజయశేఖరరెడ్డి శనివారం రాత్రి గుండె సంబంధిత సమస్యతో తుది శ్వాస విడిచారు. వైఎస్ కుటుంబ సభ్యులకు ఆయన సమీప బంధువు. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదివారం పులివెందులకు వెళ్లి విజయశేఖరరెడ్డి భౌతిక కాయానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం విజయశేఖరరెడ్డి భార్య సునీత, కుమారుడు దుష్యంత్‌రెడ్డి తదితరులను ఓదార్చారు. విజయశేఖరరెడ్డి మరణం తీరని బాధను కలిగించిందని దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. అంతకు ముందు వైఎస్ జగన్ సతీమణి వైఎస్ భారతిరెడ్డి విజయశేఖరరెడ్డి భౌతిక కాయం వద్ద పుష్పగుచ్ఛం ఉంచి నివాళులర్పించారు. విజయశేఖరరెడ్డికి కుమారుడితో పాటు కుమార్తె మధులిక ఉన్నారు. వైఎస్ కుటుంబ సభ్యులతోపాటు దివంగత డాక్టర్ ఇ.సి.గంగిరెడ్డి సతీమణి సుగుణమ్మ, కుమారుడు డాక్టర్ దినేష్‌రెడ్డి, ఎంపీ అవినాష్ రెడ్డి, వైఎస్ సోదరులు వైఎస్ ఆనంద్‌రెడ్డి, వైఎస్ ప్రకాష్‌రెడ్డి, వైఎస్ ప్రతాప్‌రెడ్డి, వైఎస్ మనోహర్‌రెడ్డి, వైఎస్ జోసఫ్‌రెడ్డి, వైఎస్ ప్రమీలమ్మ, తదితరులు నివాళులర్పించారు.

సమష్టిగా పోరాడతాం

- వైఎస్సార్ మజ్దూర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ప్రసాద్‌రెడ్డి
- ఆర్టీసీ వైఎస్సార్ ఎంప్లాయీస్ ఫెడరేషన్‌లో వైఎస్సార్ మజ్దూర్ అసోసియేషన్ విలీనం



ఒక్కటైన ఆర్టీసీ వైఎస్సార్ మజ్దూర్ అసోసియేషన్, వైఎస్సార్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ నేతలు

తిరుపతి అర్బన్: ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలపై సమష్టిగా పోరాటం చేస్తామని ఆర్టీసీ వైఎస్సార్ మజ్దూర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ప్రసాద్‌రెడ్డి చెప్పారు. తిరుపతి ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం ఆర్టీసీ వైఎస్సార్ మజ్దూర్ అసోసియేషన్, ఆర్టీసీ వైఎస్సార్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ ప్రతినిధులు సమావేశమయ్యారు. ప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ తిరుపతి వేదికగా శ్రీ వేంకటేశ్వరస్వామి పాదాల చెంత తమ ఆర్టీసీ వైఎస్సార్ మజ్దూర్ అసోసియేషన్‌ను ఆర్టీసీ వైఎస్సార్ ఎంప్లాయీస్ ఫెడరేషన్‌లో విలీనం చేస్తున్నామని చెప్పారు. కొద్దిరోజులుగా రెండు యూనియన్ల మధ్య నెలకొన్న మైత్రి నేపథ్యంలో ఉద్యోగుల సమస్యలపై కలిసి పోరాటం చేయాలని నిర్ణయించుకున్నామని తెలిపారు. వైఎస్సార్ యూనియన్‌ను మరింత బలోపేతం చేయడానికి, ఉద్యోగులకు మంచి జరగాలనే ఉద్దేశంతోనే విలీనం చేసినట్లు వెల్లడించారు. త్వరలో జిల్లాల వారీగా రెండు యూనియన్ల సంయుక్త సమావేశాలు నిర్వహించి సమస్యలపై ఐక్య పోరాటాలకు శ్రీకారం చుడతామని వివరించారు. ఆర్టీసీ వైఎస్సార్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు రాచపల్లి దేవరాజులు, కార్యదర్శి ఘట్టం శ్రీనివాసరావు మాట్లాడుతూ రెండు యూనియన్లు ఒక్కటి కావడంతో మరింత బలంగా పోరాటాలు చేస్తామని తెలిపారు.

చెక్‌బౌన్స్, ఫోర్జరీ నిందితుడికి టీడీపీ ఎమ్మెల్యే ఆశ్రయం!

ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల ఇంటికొచ్చిన తెలంగాణ పోలీసులు



విజయభాస్కర్

సాక్షి ప్రతినిధి, ఒంగోలు : చెక్‌బౌన్స్ కేసులో విజయవాడకు చెందిన విజయభాస్కర్ అనే వ్యక్తిని అరెస్టుచేయడానికి ఒంగోలు టీడీపీ ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్ ఇంటికి శనివారం తెలంగాణ పోలీసులు రాగా.. ఎమ్మెల్యే అనుచరులు వారిని అడ్డుకున్నారు. వారితో వాదనకు దిగి ఎదురు కేసు పెడతామని బెదిరించారు. జిల్లాలో ఇప్పుడీ విషయం చర్చనీయాంశంగా మారింది. వివరాలివీ.. విజయభాస్కర్ రియల్ ఎస్టేట్ వ్యాపారి. హైదరాబాద్‌కు చెందిన మల్లికార్జునరావు, ప్రసాదరావులతో కలిసి మింట్ ఎన్విరాన్‌మెంట్ అనే కంపెనీ నిర్వహిస్తున్నట్లు సమాచారం. త్రిపురలో కాంట్రాక్టు పనులు దక్కించుకున్న వీరిమధ్య కొంతకాలంగా ఆర్థిక లావాదేవీల విషయంలో మనస్పర్థలు తలెత్తాయి. దీంతో మింట్ సీఈఓ వెంకటేష్ 2023లో మాదాపూర్ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. రూ.6.50 కోట్ల చెక్ బౌన్స్‌తో పాటుగా కంపెనీకి చెందిన ఎంఓయూ ఫోర్జరీ చేసినట్లు విజయభాస్కర్ మీద కేసు పెట్టారు. కోర్టు ఆదేశాలతో ఇటీవలే మాదాపూర్ పోలీసులు కేసు నమోదు చేశారు. అయితే, విజయభాస్కర్ విజయవాడ, గుంటూరు, ఒంగోలు నగరాల్లో సంచరిస్తున్నట్లు తెలుసుకుని నిఘా పెట్టారు. రెండ్రోజులుగా ఒంగోలులో ఉన్నట్లు తెలుసుకున్న పోలీసులు శుక్రవారం రాత్రి నగరానికి చేరుకున్నారు. నగరంలోని బీకే అపార్ట్‌మెంటులోని ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ నివాసంలో విజయభాస్కర్ ఉన్నట్లు లొకేషన్ చూపిస్తుండడంతో పోలీసులు శనివారం అక్కడికెళ్లారు. సెర్చ్ వారెంట్‌తో వెళ్లిన పోలీసు బృందాన్ని టీడీపీ శ్రేణులు అడ్డుకున్నారు. తెలంగాణ పోలీసులతో వాదనకు దిగారు. వారి మీద ఎదురు కేసు పెడతామని బెదిరించి స్థానిక పోలీసులను పిలిపించారు. అయితే, అప్పటికే తెలంగాణ పోలీసులు స్థానిక పోలీసులకు సమాచారం ఇచ్చినట్లు తెలుస్తోంది. ఇది జరుగుతున్న సమయంలో ఎమ్మెల్యే తన కుటుంబ సభ్యులతో కలిసి హైదరాబాద్ వెళ్లినట్లు సమాచారం.

కిలో చికెన్‌కు రూ.10 మామూళ్లు!

ఇస్తేనే వ్యాపారం.. లేదంటే దుకాణం బంద్

ఆళ్లగడ్డలో టీడీపీ ఎమ్మెల్యే భర్త హుకుం

సాక్షి టాస్క్ ఫోర్స్ : వ్యాపారం ఏదైనా ఆయనకు పర్సంటేజీ ఇవ్వాల్సిందే. ఈ విషయంలో రికమండేషన్లు ఏమీ పని చేయవు. ఆ నేత ఎంత చెబితే అంత ఇచ్చుకోవాల్సిందే. లేకుంటే ముప్పుతిప్పలు పెట్టి మూడు చెరువుల నీరు తాగించేందుకు ఆయన బినామీలు, అధికారులు రంగంలోకి దిగుతారు. అయితే పర్సంటేజీ.. లేకుంటే గుడ్‌విల్. ఏదో ఒకటి సెటిల్‌మెంటు చేసుకోవాలి. ఇదీ నంద్యాల జిల్లా ఆళ్లగడ్డ నియోజకవర్గంలో ఎమ్మెల్యే భర్త భార్గవరామ్ సాగిస్తున్న కమీషన్ల బాగోతం. తాజాగా చికెన్ అంగళ్ల నిర్వాహకులు పర్సంటేజీ/గుడ్‌విల్ ఇవ్వడానికి ససేమిరా అనడంతో అధికారులపై ఒత్తిడి తెచ్చి.. అనుమతులు లేవంటూ నోటీసులిచ్చి, దుకాణాలకు తాళం వేయించడం విస్తుగొలుపుతోంది. ఎన్నికల ఫలితాలు వెలువడిన వెంటనే హోల్‌సేల్ చికెన్ దుకాణాల వారిని టీడీపీ నేత పిలిపించారు. నియోజకవర్గంలో ఎంత చికెన్ అమ్మినా కిలోకు రూ.10 చొప్పున మామూలు ఇవ్వాలని, అది కూడా గోవా నుంచి తాము తెప్పించే చికెన్‌ను మాత్రమే కొనుగోలు చేసి రిటైల్ వ్యాపారులకు విక్రయించాలని హుకుం జారీ చేశారు. ఇందుకు చికెన్ అంగళ్ల నిర్వాహకులు ఒప్పుకోలేదు. దీనికంతటికి కారకుడు ఏఎస్ఆర్ హోల్‌సేల్ చికెన్ సెంటర్ నిర్వాహకుడే అని అతన్ని పిలిపించి రూ.కోటి ఇవ్వాలని, లేకుంటే నీ వ్యాపారం జరగనివ్వమని బెదిరించారు. అంత ఇచ్చుకోలేమని అతను తెగేసి చెప్పినట్లు సమాచారం. దీంతో మీకు వ్యాపారం నిర్వహించుకునేందుకు అనుమతులు లేవని మున్సిపల్ కమిషనర్‌తో నోటీసులు ఇప్పించి సీజ్ చేయించారు. నోటీసులు అందుకున్న చికెన్ సెంటర్ యాజమాన్యం.. ట్రేడ్ లైసెన్స్ ఇవ్వాలని మున్సిపల్ కార్యాలయం వద్దకు పలుమార్లు తిరిగినా స్పందించలేదు. దీంతో కోర్టుకు వెళ్లి అనుమతులు తెచ్చుకున్నారు. అయినప్పటికీ లైసెన్స్ ఇవ్వక పోవడంతో జిల్లా ఎస్పీ, కలెక్టర్ దృష్టికి విషయం తీసుకెళ్లారు. కలెక్టర్ మందలించడంతో ఎట్టకేలకు అనుమతులు ఇచ్చారు. అయితే సమస్య సద్దు మణిగిందని అందరూ అనుకుంటున్న సమయంలో శనివారం రాత్రి ఒక్కసారిగా ఆళ్లగడ్డలో కలకలం రేగింది. పట్టణంలో విక్రయిస్తున్న చికెన్ మసుషులు తినేందుకు పనికి రాదని, ఈ మేరకు విజయవాడలోని పశు సంవర్ధక శాఖ లేబరేటరీ నివేదిక ఇచ్చిందని మున్సిపల్, ఫుడ్, రెవెన్యూ అధికారులు.. పోలీసులను వెంటబెట్టుకుని నాలుగు చికెన్ దుకాణాలకు నోటీసులు ఇచ్చారు. అంతటితో ఆగక తాళాలు వేయించడం చర్చనీయాంశం అయింది. అధికార పార్టీ నేతతో బేరం కుదరక పోవడం వల్లే ఇలా జరిగిందని పట్టణంలో ప్రజలు చర్చించుకుంటున్నారు.

సాక్షి ఫ్యామిలీ
చెన్నై
సోమవారం ॥ 24-3-2025

సన్నిధి

మంచిమాట

మనకు మేలు చేసిన వారికి కృతజ్ఞులై ఉండడం మన కనీస ధర్మం... మనం ఎవరి నుంచైతే మేలు పొందుతున్నామో, వారు ప్రత్యుపకారాన్ని ఆశించకపోయినా, వారి ఉదారతను గుర్తించి వారికి కృతజ్ఞతలు తెలుపుకోవడం మన విధిగా భావించాలి. ఎందుకంటే అలా కృతజ్ఞతలు తెలియ చేసినపుడే మన సంస్కారం ఏమిటో ఇతరులకు అర్థమవుతుంది. అంతేకాదు అది మనసుకు కూడా ఎంతో సంతోషాన్ని, ఆనందాన్ని ఇస్తుంది.



కృతజ్ఞత కనీస సంస్కారం

మనం ఇతరుల నుంచి ఎలాంటి సహాయం పొందినా వారికి కృతజ్ఞులై ఉండాలి. తల్లితండ్రులు మనకి జన్మనిస్తారు.. మన భవిష్యత్ కు పునాదులు వేస్తారు.. అందువల్ల మనం వారికి జీవితాంతం కృతజ్ఞులై ఉండాలి. మన గురువులు మన భవిష్యత్‌కు దిశానిర్దేశం చేస్తారు, మన స్నేహితులు మనకు చేదోడు వాదోడుగా ఉంటారు, ఇలా అనేక మంది పరోక్షంగా మన భవిష్యత్‌కు ఎంతగానో సహకరిస్తున్నారన్నమాట.. మన భవిష్యత్‌ను వారంతా తీర్చి దిద్దుతున్నపుడు వారికి మనం కృతజ్ఞతలు చూపించుకోవాలి కదా.. కృతజ్ఞతలు తెలియ చేయడం మన వ్యక్తిత్వాన్ని చాటి చెబుతుంది.. మనం ఎవరి దగ్గర నుంచైనా సహాయం పొందినపుడు నవ్వుతూ థాంక్సండీ.. మీ మేలు మరచి పోలేను అని చెప్పి వారి కళ్లలోకి ఒక్కసారి తొంగి చూస్తే, వారి కళ్ళల్లో ఏదో తెలియని ఆనందం మనకు కనిపిస్తుంది.. వారికి మన పట్ల మంచి అభిప్రాయం కూడా ఏర్పడుతుంది. దానివల్ల అవతలి వారు భవిష్యత్‌లో వారితో మనకేదైనా పని పడ్డప్పుడు, వారు ఇక ఆలోచించకుండా మనకు సహాయం చేస్తారు.

శ్రీరామచంద్రుడ్ని మనం దేవుడిగా పూజిస్తాం.. అయితే రామచంద్రుడు సాక్షాత్తు పరమాత్ముడే అయినా 'ఆత్మానాం మానుషం మన్యే' అన్నట్లు తనను ఒక మానవమాత్రునిగానే భావించుకున్నాడు. అందరిలో తాను ఒకడిగా, అందరికోసం తాను అన్నట్లుగా మెలిగాడు. మానవతా విలువలకు, కృతజ్ఞతా భావానికి నిలువెత్తు నిదర్శనంగా నిలిచాడు. అలా రాముడు ప్రతీ విషయంలోనూ కృతజ్ఞతను చాటుకోవడం వల్లనే ఆయనను మనం పూజిస్తున్నాం.. ఆరాధిస్తున్నాం...

మనం భూమి మీద నడుస్తున్నాం. పంటలను పండించుకుంటున్నాం... కనుక భూమిని భూదేవి' అనీ, మనం బతికుండడానికి ముఖ్య పాత్ర వహిస్తున్న నీటిని 'గంగాదేవి' అనీ, గాలిని వాయుదేవుడు అనీ పిలుస్తూ కృతజ్ఞతలు అర్పిస్తున్నాం. ఉదయం నిద్రలేచినప్పటి నుంచి రాత్రి పడుకునే వరకూ, మన నిత్య జీవితంలో అనేకానేకం మనకు ఉపయోగపడుతూంటాయి. వాటన్నింటి పట్ల, మనకు జన్మనిచ్చిన తల్లిదండ్రులు పట్ల, విద్య నేర్పిన గురువుల పట్ల, అందరి పట్ల కృతజ్ఞతతో వుండాలి. సమస్త ప్రకృతి మన భావాలను గ్రహించి తదనుగుణంగా స్పందిస్తుంది కనుక మనకు చక్కగా ఆక్సిజన్ ఇస్తున్న చెట్లకూ, నీటికీ కృతజ్ఞతలు చెప్పాలి. మన జీవితానికి ఉపయోగపడే ప్రతి వ్యక్తికీ, వస్తువుకు, జీవికి మనం కృతజ్ఞులై ఉంటే, అదే మన భావి జీవితానికి కొత్త బాటలు వేస్తుంది. మన జీవితాన్ని నందనవనం చేస్తుంది.

ఉదయం నిద్రలేచినప్పటి నుంచి రాత్రి పడుకునే వరకూ, మన నిత్య జీవితంలో అనేకానేకం మనకు ఉపయోగపడుతూంటాయి. వాటన్నింటి పట్ల, మనకు జన్మనిచ్చిన తల్లిదండ్రులు పట్ల, విద్య నేర్పిన గురువుల పట్ల, అందరి పట్ల కృతజ్ఞతతో వుండాలి.

– దాసరి దుర్గా ప్రసాద్, ఆధ్యాత్మిక పర్యాటకులు

ఆత్మదర్శిని

ఆత్మచైతన్యానికే ధ్యానం

దైవం అనేది బయట వెదికే విషయమే కాదు. సమాజం లోని నియమాలతో, నమ్మకాలతో పద్ధతులతో దానికి సంబంధమే లేదు. ఇప్పుడు సమాజంలో కనిపిస్తున్న ఆధ్యాత్మికత అంతా సమాజానికి చూపించుకోవడానికి, నలుగురిలో మంచి అనిపించుకోవడానికి చేసే ప్రయత్నాలు. నిజానికి ఆధ్యాత్మిక ప్రయాణం నీలోనికి నీవుచేసే ప్రయాణం. గర్భగుడిలోనికి ఒక్కరినే అనుమతించడంలోని అంతరార్థం ఇదే. సత్యాన్ని తెలుసుకోవడానికి బయటి వ్యక్తులు, మధ్యవర్తుల ప్రమేయమే అవసరం లేదు. సత్యం ఒకరు చెబితే అర్థమయ్యే విషయం కాదు. నీకు నీవుగానే సత్యాన్ని తెలుసుకోవాలి. నీ నమ్మకాల నుండి, అహం నుండి పూర్తిగా బయట పడాలి. నేను శరీరం కాదు. వీటికి సాక్షిగా ఉన్న దివ్య చైతన్యాన్ని అని తెలుసుకోవాలి. ఆత్మ చైతన్యవంతమవ్వడమే ధ్యానం.

విజ్ఞాన భైరవ తంత్రంలో శివుడు పార్వతికి 112 ధ్యానపద్ధతులను బోధిస్తాడు. మనం వాటిని పాటిస్తే దైవత్వాన్ని పొందుతామేమో గాని ఆరాధించడం వల్ల కాదు. శివుడు, బుద్ధుడు మొదలైన వారందరూ తాము దైవమని తెలుసుకొని ద్రష్టలైనారు. వారు తమ లోని దైవత్వాన్ని తెలుసుకుని ఆ మార్గాన్ని మనకు బోధించారు. కానీ మనం ఆ మార్గాలను అనుసరించకుండా కేవలం వారిని ఆరాధించటం చేస్తున్నాము. దేవుడు భౌతికం కానే కాదు. శుద్ధచైతన్య స్థితిలోనే దైవగుణాలు ఉంటాయి. అది చావు పుట్టుకలు లేని స్థితి. తనను తాను తెలుసుకున్నవాడేస్వామి. నీ నిజస్థితిలో కేంద్రీకృతమై ఉంటే నీవే స్వామి. ఈ నిజమైన అర్థాలు తెలియకపోవడం వల్లనే కొందరు గడ్డాలు పెంచి విచిత్ర వేషాలతోగురువులుగా, స్వాములుగా చలామణి ఔతున్నారు. అసలు దైవత్వానికి భౌతిక వేషధారణతో సంబంధమే లేదు. సంసారాన్ని భౌతికంగావదలవలసిన అవసరం అస్సలు లేదు. సామాన్య జీవితంలో ఉంటూ,రోజువారీ పనులు చేస్తూనే నీ ఆత్మలో నీవు కేంద్రీకృతమై సాక్షిగా ఉండ



దేవుణ్ణి నమ్ముతున్నాను అన్నంతమాత్రాన దేవునికి దగ్గర ఉన్నట్టు కాదు. నమ్మకాలకు అతీతమైన స్థితే దైవత్వం. మనస్సుకు అతీతమైన స్థితే దైవత్వం. అందుకు మార్గమే ధ్యానం.దేవుడు ఒక మనిషి కాదు. దైవత్వం ఒక స్థితి, నీ నిజస్థితి. తనను తాను తెలుసుకున్నవాడే దేవుడు. నీ నిజస్థితిని తెలుసుకుంటే నీవే దైవం.

డానికి రూపంతో పనిఏముంది? భాషతో, మాయలతో, అద్భుతాలతో మతంతో దైవత్వాన్ని ముడిపెట్టినంతవరకు ఎన్నటికీ దైవత్వాన్ని చేరలేవు. వీటన్నింటికీ అంటని స్వచ్ఛమైన చైతన్యస్థితే దైవత్వమని తెలుసుకో. సాక్షీభూతుడవై ఉండు. ఆ స్థితిని చేరుకున్నారు కనుకే కృష్ణుడిని, బుద్ధుడిని, క్రీస్తును దేవుళ్ళన్నారు. నీలోని కల్మషాలను తొలగించుకొని స్వచ్ఛమైన చైతన్యంగా మిగిలిపో. ఆధ్యాత్మిక ప్రయాణాన్ని ఒంటరిగానే చేయాలి. మధ్యవర్తులెవ్వరూ నీకు సహాయం చేయలేరు. యాంత్రికమైన పద్ధతులను పాటిస్తూ, గుడ్డి నమ్మకాలతో ఉంటే మనస్సు ఉచ్చులో చిక్కుకుపోతావు కానీ ఆత్మవైపు వెళ్ళలేవు. ఆత్మ చైతన్యాన్ని మాత్రం పొందలేవు.

– స్వామి మైత్రేయ, ఆధ్యాత్మిక బోధకులు



కోవిడ్ రోజులు



క్యాన్సర్‌తో పోరాడుతూ చివరిదశలో ఉన్నవారికి స్వస్థత చేకూర్చుతుంది హైదరాబాద్‌లోని స్పర్శ్ హాస్పిస్. కోవిడ్ టైమ్‌లో క్యాన్సర్ పేషంట్లకు సేవలు అందించడానికి, బయటి నుంచి వచ్చిన పేషంట్లను అడ్మిట్ చేసుకోవడానికి, భయాందోళనలో ఉన్న వారికి ధైర్యం చెప్పడానికి ఒక బృందంగా తామంతా ఎలా సిద్ధమయ్యారో హాస్పిస్ అడ్మినిస్ట్రేటర్ శారద లింగరాజు వివరించారు.

ఇళ్లకు వెళ్లి మరీ సేవలు చేశాం

''ఇలాంటి సందర్భం వచ్చినప్పుడే ఒకరికొకరు ఉన్నామా, మన వరకే బతుకుతున్నామా.. అనే నిజాలు వెలుగులోకి వచ్చేది. మేం అందించేది ఎమర్జెన్సీ కేర్ కాదు. చనిపోయేదశలో ఉన్నవారికి ఉపశమనాన్ని ఇవ్వడం. కోవిడ్ సమయంలో అప్పటికే అంతటా భయాందోళనలు. ఎవరి వల్ల ఎవరికి కోవిడ్ వస్తుందో చెప్పలేం. ఎవరికి ఎవరు సాయంగా ఉంటారో తెలియదు. అలాంటప్పుడు రిస్క్ ఎందుకని, మేం 'చేయలేం' అని చెప్పవచ్చు. చేయూతనివ్వలేమని వదిలేయచ్చు. హాస్పిస్ తలుపులు మూసేయచ్చు. కానీ, మానవతా ధర్మంగా చూస్తే వారిని అలా వదిలేయడం సరికాదు అనిపించింది. అందుకే, క్యాన్సర్‌తో పోరాటం చేస్తూ కొన ఊపిరితో ఉన్నవారిని తీసుకువస్తే వారికి 'లేదు' అనకుండా కోవిడ్ జాగ్రత్తలు తీసుకుంటూ మాకు చేతనైన సేవలు అందించాం.


శారద లింగరాజు

నేరుగా వారి ఇళ్లకే..

క్యాన్సర్ పేషంట్స్‌కి వారి స్టేజీలను బట్టి పెయిన్ ఉంటుంది. సరైన మందులు అందక వారు బాధపడిన సందర్భాలు ఎన్నో. వారు మమ్మల్ని కాంటాక్ట్ చేసినప్పుడు ఆ మందులను వారి ఇళ్లకే వెళ్లి అందజేశాం. వారికి కావల్సిన స్వస్థతను ఇంటికే వెళ్లి అందించాం. ఈ సేవలో పాలిచ్చే తల్లులైన నర్సులూ పాల్గొన్నారు. ఆయాలు పేషంట్స్‌కు దగ్గరగా ఉండి, సేవలు అందించారు. పేషంట్స్ చనిపోతే అప్పటికప్పుడు బాడీ తీసేయమని చెప్పిన వారున్నారు. కనీసం వారి పిల్లలు వచ్చేంత టైమ్ ఇవ్వమన్నా కుదరదనేవారు. వాళ్లు కోవిడ్‌తో కాదు క్యాన్సర్‌తో చనిపోయారు అని కన్విన్స్ చేయడానికి టైమ్ పట్టేది.

వీడియోలలో దహన సంస్కారాలు..

ఒక బెంగాలియన్ క్యాన్సర్ చివరి దశలో చనిపోయాడు. మృతదేహాన్ని హాస్పిస్ నుంచి వారి స్వస్థలానికి తీసుకువెళ్లాలి. కోవిడ్ కాకుండా క్యాన్సర్‌తో చనిపోయాడనే లెటర్‌తో పాటు అంబులెన్స్‌ను సిద్ధం చేయించి పంపాం. వాళ్లు కూడా ఏమీ ఆలోచించకుండా అప్పటికప్పుడు వెళ్లి దహనసంస్కారాలు చేయించి వచ్చారు. మా దగ్గర సేవ పొందుతున్న వారు చనిపోతే కనీసం చివరి చూపు చూడటానికి కూడా వారి పిల్లలు రాలేని పరిస్థితి. అందువల్ల దహన సంస్కారాలు చేసే సమయంలోనూ, ఆ తర్వాత వారికి వీడియోలు చూపించేవాళ్లం. పసుపు, కుంకుమలు, చెట్లకు ఉన్న కాసిన్ని పూలు పెట్టి సాగనంపేవాళ్లం. వారి ఏడుపులు, మేం సమాధాన పరచడం.. ఆ బాధ.. ఆ సందర్భంలో ఎలా తట్టుకున్నామో.. ఇప్పుడు తలుచుకుంటే అదంతా ఒక యజ్ఞంలా చేశామనిపిస్తోంది.

ప్రతి వారిలోనూ మంచితనాన్నే చూశాం..

ఒక తల్లి చనిపోయే చివరి దశ. ఆమె కొడుకు తల్లిని చూడటానికి జార్ఖండ్ నుంచి వచ్చాడు. గచ్చిబౌలిలో ఉండేవాడు. రెండు మూడుసార్లు బైక్ మీద వచ్చాడు. కొడుకును చూడాలని ఆ తల్లి ప్రాణం కొట్టుకులాడేది. కొడుకు చూసి వెళ్లిన పది నిమిషాల్లో ఆమె చనిపోయింది. నిజంగా జబ్బు ముదిరిపోయి చివరిదశలో ఉంటే ఆ కష్టాన్ని ఒకలా చూస్తాం. కానీ, కోవిడ్ భయంతో చుట్టూ ఉన్న మానవసంబంధాల కష్టం అప్పుడే చూశాం. తమ వారిని చూసుకోవడానికే కాదు, బాడీని తమ స్వస్థలాలకు చేర్చుకోవడానికి వేలకు వేలు ఖర్చు పెట్టాల్సి వచ్చేది.

డబ్బు కాదు బంధాలే ముఖ్యం అనిపించాయి ఆ రోజులు. చివరి రోజుల్లో ఉన్న క్యాన్సర్ పేషంట్లకు కోవిడ్ టైమ్‌లో ఏ దారీ లేదనే పరిస్థితుల్లో కూడా 'మేం ఉన్నాం' అనే ధైర్యాన్ని ఇచ్చాం. ప్రతి వాళ్లలో మంచితనాన్ని చూశాం' అని గడిచిన కాలపు జ్ఞాపకాలలోని మానవతను కళ్లకు కట్టారు.

– నిర్మలారెడ్డి, సాక్షి ఫీచర్స్ ప్రతినిధి

సాక్షి సినిమా

జపాన్‌లో దేవర

జపాన్ వెళ్లారు ఎన్టీఆర్. ఆయన హీరోగా కొరటాల శివ దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'దేవర'. కల్యాణ్ రామ్, మిక్కిలినేని సుధాకర్, కె. హరికృష్ణ నిర్మించిన ఈ సినిమాలోని తొలి భాగం 'దేవర: పార్ట్ 1' 2024 సెప్టెంబరు 27న విడుదలైంది. ఈ చిత్రంలో తండ్రీకొడుకులుగా (తండ్రి పాత్ర దేవర, కొడుకు పాత్ర వర) నటించి, ప్రేక్షకులను మెప్పించారు ఎన్టీఆర్. ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద రూ. 500 కోట్లు పైగా గ్రాస్ కలెక్షన్స్‌ను సాధించినట్లుగా మేకర్స్ పేర్కొన్నారు. ఇక ఈ నెల 28న 'దేవర: పార్ట్ 1' సినిమా జపాన్‌లో రిలీజ్ కానుంది. ఈ సినిమా ప్రమోషనల్ టూర్‌లో భాగంగా ఎన్టీఆర్ జపాన్ వెళ్లారు. ఈ ప్రమోషనల్ టూర్ నుంచి తిరిగొచ్చిన తర్వాత ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో తాను హీరోగా చేస్తున్న 'డ్రాగన్' (ప్రచారంలో ఉన్న టైటిల్) సినిమా షూట్‌లో ఎన్టీఆర్ పాల్గొంటారని సమాచారం. అలాగే ఎన్టీఆర్, హృతిక్ రోషన్ లీడ్ రోల్స్‌లో నటిస్తున్న 'వార్ 2' సినిమా ఆగస్టు 14న విడుదల కానున్న సంగతి తెలిసిందే. ఇక ఎన్టీఆర్ ప్రస్తుత కమిట్‌మెంట్స్ పూర్తయ్యాక 'దేవర 2' సినిమా షూట్‌లో పాల్గొంటారని, ప్రస్తుతం ఈ సినిమా స్క్రిప్ట్ పనుల్లో కొరటాల శివ బిజీగా ఉన్నారని సమాచారం.


ఎన్టీఆర్


వెంకీ కుడుముల, కేతికా శర్మ, డేవిడ్ వార్నర్, నితిన్, శ్రీలీల, వై. రవిశంకర్, నవీన్ ఎర్నేని

మీ ఫ్యామిలీలోకి ఆహ్వానించినందుకు థ్యాంక్స్ - డేవిడ్ వార్నర్

''నమస్కారం... 'రాబిన్ హుడ్'లో నటించే చాన్స్ రావడాన్ని గౌరవంగా ఫీలవుతున్నా. మీ ఫ్యామిలీలోకి నన్ను ఆహ్వానించినందుకు థ్యాంక్స్. ఈ సినిమాలోని నా కోస్టార్స్ చాలా కష్టపడ్డారు. సినిమా అద్భుతంగా వచ్చింది. 'రాబిన్ హుడ్' పెద్ద సక్సెస్ కావాలి'' అని ఆస్ట్రేలియన్ క్రికెటర్ డేవిడ్ వార్నర్ పేర్కొన్నారు. నితిన్, శ్రీలీల జంటగా నటించిన చిత్రం 'రాబిన్ హుడ్'. రాజేంద్రప్రసాద్, 'వెన్నెల' కిశోర్ ముఖ్య పాత్రల్లో నటించారు. మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై నవీన్ ఎర్నేని, వై. రవిశంకర్ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 28న విడుదల కానుంది. ఆదివారం హైదరాబాద్‌లో ఈ చిత్రం ప్రీ రిలీజ్ ఈవెంట్‌ని నిర్వహించారు. ఈ సినిమాలో అతిథి పాత్ర చేసిన ఆస్ట్రేలియన్ క్రికెటర్ డేవిడ్ వార్నర్ ఈ వేడుకకు అతిథిగా హాజరై, ట్రైలర్‌ను రిలీజ్ చేశారు.

ఈ సందర్భంగా **నితిన్ మాట్లాడుతూ–** ''రాబిన్ హుడ్ విజయంపై కాన్ఫిడెంట్‌గా ఉన్నాను. ఒక సినిమాకు రియల్ హీరోలు నిర్మాతలే. ఇండియాలో మైత్రీ టాప్ ప్రొడక్షన్ హౌస్ అని 'పుష్ప' సినిమాతో నిరూపితమైంది. 'రాబిన్ హుడ్'ని మైత్రీ వాళ్లు కాబట్టే ఇంత భారీగా తీశారు. నాపై ఉన్న ప్రేమను వెంకీ ఈ సినిమా రూపంలో చూపించాడు. డేవిడ్ వార్నర్‌గారి వల్ల ఈ సినిమా నెక్ట్స్ లెవల్‌కి వెళ్లింది. ప్రపంచ క్రికెట్‌లో ఆయన పెద్ద లెజెండ్ క్రికెటర్. కానీ తెలుగువారికి వార్నర్‌గారు.. డేవిడ్ భాయ్... వార్నర్ మామానే'' అన్నారు.

''రాబిన్ హుడ్' మంచి ఫ్యామిలీ ఎంటర్‌టైనర్. ఈ ట్రైలర్ చూడగానే ఈ సినిమా ష్యూర్ షాట్ బ్లాక్‌బస్టర్ అని వెంకీతో చెప్పాను'' అన్నారు **నవీన్ ఎర్నేని.** ''నితిన్, డేవిడ్ వార్నర్ గార్లు, చాలా బిజీగా ఉండి కూడా ఈ సినిమా చేసిన శ్రీలీల, 'అదిదా సర్‌ప్రైజ్' పాట చేసిన కేతికా, ఇతర టీమ్‌కి థ్యాంక్స్'' అని తెలిపారు **వై. రవిశంకర్.** ''భీష్మ' తర్వాత నితిన్ అన్న, నేను 'రాబిన్ హుడ్'తో వస్తున్నాం. ఈ సినిమా ఇంత బాగా రావడానికి కారణం నితిన్ అన్న, బాగా తీయడానికి కారణం నవీన్, రవిగార్లు. ఈ సినిమాకు బజ్ రావడానికి ఒక కారణం కేతికా 'అదిదా సర్‌ప్రైజ్' సాంగ్.. రెండోది డేవిడ్ వార్నర్‌గారు ఇండియన్ సినిమాకు రావడం'' అని చెప్పారు **వెంకీ కుడుముల.** ''రాబిన్ హుడ్'తో హీరోగా కమర్షియల్ స్పేస్‌లో నితిన్ మరో లెవల్‌కి వెళ్తాడు. ఇలాంటి మరిన్ని సినిమాలు చేసి, వెంకీ మరింత ఉన్నత స్థాయికి చేరుకోవాలని కోరుకుంటున్నాను. మైత్రీ మూవీ మేకర్స్ లిస్ట్‌లోని పెద్ద హిట్స్ మూవీల్లో 'రాబిన్ హుడ్' ఉండాలని కోరుకుంటున్నా'' అని తెలిపారు **రాజేంద్రప్రసాద్.** ''ఆల్మోస్ట్ ఏడాది తర్వాత నేను హీరోయిన్‌గా వస్తున్న 'రాబిన్ హుడ్'ని ఆదరించాలని కోరుకుంటున్నాను'' అన్నారు **శ్రీలీల.** ఈ వేడుకలో 'పుష్ప' సినిమాలోని ఫుట్ స్టెప్, 'రాబిన్ హుడ్'లోని 'అదిదా సర్‌ప్రైజ్' పాట హుక్ స్టెప్స్ ట్రై చేసి, అలరించారు డేవిడ్ వార్నర్.


అనుపమా పరమేశ్వరన్

అందాల సిరి

'మా అందాల సిరి మీద పడనీకు ఏ కళ్లు... ఆ చిరునవ్వే పచ్చంగా ఉండాలి నూరేళ్లు... వేయాలి పరదాలు... చేయాలి సరదాలు... అమ్మా... నీ దీవెనలు తోడుంటే అంతే చాలు... మా ఊరి పొలిమేర దాటవుగా సంతోషాలు' అంటూ సాగుతుంది 'పరదా' సినిమాలోని 'మా అందాల సిరి' పాట. అనుపమా పరమేశ్వరన్, దర్శనా రాజేంద్రన్, సంగీత లీడ్ రోల్స్‌లో నటించిన 'పరదా' సినిమాలోని పాట ఇది. 'సినిమా బండి' ఫేమ్ ప్రవీణ్ కాండ్రేగుల దర్శకత్వంలో ఆనంద మీడియా పతాకంపై విజయ్ డొంకాడ, శ్రీనివాసులు పీవీ, శ్రీధర్ మక్కువ ఈ సినిమాను నిర్మించారు. త్వరలో ఈ సినిమా విడుదల కానుంది. ఈ సినిమాలోని 'మా అందాల సిరి...' పాట లిరికల్ వీడియోను ఆదివారం రిలీజ్ చేశారు. సంగీత దర్శకుడు గోపీసుందర్ స్వరపరచిన ఈ పాటకు వనమాలి సాహిత్యం అందించగా, శ్రీ కృష్ణ, రమ్య బెహరా పాడారు.

బ్రిటిష్ పాత్రలో...

సాయిదుర్గా తేజ్ హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'సంబరాల యేటిగట్టు'. ఈ చిత్రంలో ఐశ్వర్యా లక్ష్మి హీరోయిన్‌గా నటిస్తున్నారు. నూతన దర్శకుడు కేపీ రోహిత్ తెరకెక్కిస్తున్న ఈ సినిమాను కె. నిరంజన్ రెడ్డి, చైతన్య రెడ్డి నిర్మిస్తున్నారు. ఈ సినిమా షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. కాగా ఈ సినిమాలో బ్రిటిష్ అనే పాత్రలో శ్రీకాంత్ నటిస్తున్నట్లుగా వెల్లడించి, ఆయన ఫస్ట్ లుక్‌ను ఆదివారం రిలీజ్ చేశారు. రగ్డ్ హెయిర్, బ్లాక్ కోట్‌తో బ్రిటిష్ పాత్రలో శ్రీకాంత్ లుక్ వినూత్నంగా ఉంది. ఆదివారం (మార్చి 23) శ్రీకాంత్ బర్త్ డే సందర్భంగా ఆయన ఫస్ట్ లుక్‌ను రిలీజ్ చేశారు. తెలుగు, తమిళ, హిందీ, కన్నడ, మలయాళం భాషల్లో 'సంబరాల ఏటి గట్టు' చిత్రం సెప్టెంబర్ 25న విడుదల కానుంది.


శ్రీకాంత్

రాజకీయం... సందేశం

ఇంద్రజ, అజయ్, జయసుధ, సుమన్ ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'సీఎం పెళ్లాం'. గడ్డం రమణా రెడ్డి దర్శకత్వంలో బొల్లా రామకృష్ణ నిర్మించిన ఈ చిత్రం త్వరలోనే విడుదల కానుంది. ఈ సినిమా ప్రమోషనల్ సాంగ్ లాంచ్ కార్యక్రమంలో ఇంద్రజ మాట్లాడుతూ– ''మీ రియల్ లైఫ్‌లో చూసినవి, విన్నవి, జరిగిన కొన్ని సంఘటనలను ఈ సినిమాలో దర్శకుడు చక్కగా చూపించారు. ఎంటర్‌టైన్‌మెంట్ ఇస్తూనే ఆలోచింపజేసే చిత్రం ఇది'' అన్నారు. ''ఈ సినిమాలో నేను సీఎంగా నటిస్తే, నా భార్య పాత్రలో ఇంద్రజ నటించారు. ఈ ప్రమోషనల్ సాంగ్ చూసి ఎమోషనల్ అయ్యాను'' అని తెలిపారు అజయ్. ''రాజకీయ నేపథ్యంలో సాగే సందేశాత్మక చిత్రం ఇది'' అని పేర్కొన్నారు బొల్లా రామకృష్ణ. ''మన నగరం ఎలా ఉంది? అనేది ఈ పాటలో చూపించాను. నేను అమెరికాలో ఉంటాను. కుండపోత వర్షం వచ్చినా చుక్క నీరు నిలవదు. ఇక్కడ వర్షం వస్తే అంతే. నేను ఎవరినీ విమర్శించడం లేదు. నగరం బాగుండాలనే తపనతో చెబుతున్నాను. సామాజిక నేపథ్యం ఉన్న చిత్రం 'సీఎం పెళ్లాం'' అని అన్నారు గడ్డం రమణారెడ్డి.


అజయ్, ఇంద్రజ

ఓటీటీ ఇది చూడొచ్చు

అప్పు ఎప్పుడైనా నిప్పే

ఓటీటీలో ఇది చూడొచ్చు అనే ప్రాజెక్ట్స్ చాలా ఉంటాయి. ప్రస్తుతం స్ట్రీమ్ అవుతున్న వాటిలో మలయాళ చిత్రం పాన్ మేన్ ఒకటి. ఈ చిత్రం గురించి తెలుసుకుందాం.

ఈ రోజుల్లో అప్పు చేయని వాళ్లు చాలా తక్కువ. మరీ మధ్యతరగతి వాళ్లు అవసరాల కోసం అప్పులకై తిప్పలు పడతారు. ఒకవేళ అప్పు దొరికినా దానిని తీర్చడం మరో ఎత్తు. ఈ కసరత్తు మీదనే 'పాన్ మేన్' సినిమా రూపొందింది.



ఇదో మలయాళ సినిమా. జియో హాట్ స్టార్ వేదికగా తెలుగు డబ్బింగ్ వెర్షన్ కూడా లభ్యమవుతోంది. జ్యోతిష్ శంకర్ దీనికి దర్శకత్వం వహించారు. ప్రముఖ మలయాళ నటుడు బసిల్ జోసెఫ్ ప్రధాన పాత్రలో నటించిన ఫ్యామిలీ డ్రామా ఇది. జీవితంలో అప్పు చేసిన ప్రతివారూ చూడవలసిన సినిమా. అలా అని ఇదేదో మెసేజ్ ఓరియంటెడ్ సినిమా కాదు, ఓ ఫ్యామిలీ థ్రిల్లింగ్ డ్రామా అని చెప్పుకోవచ్చు. ఇక 'పాన్ మేన్' కథ విషయానికొస్తే... కేరళ రాష్ట్రంలోని తీర ప్రాంతమైన కొల్లమ్‌లో బ్రూనో అనే వ్యక్తితో ఈ కథ మొదలవుతుంది. చెల్లెలు స్టెఫీ, తల్లితో పాటు ఓ చిన్న కుటుంబం బ్రూనోది. సంపాదన లేకున్నా రాజకీయాలపై ఇష్టంతో ఓ పార్టీలో చేరతాడు బ్రూనో. తన నోటి దురుసుతనం వల్ల పార్టీ నుంచి సస్పెండ్ కూడా అవుతాడు. బ్రూనో తల్లి తన కూతురు స్టెఫీకి త్వరగా పెళ్లి చేయాలన్న తాపత్రయంలో పక్క ఊరిలోని మరియానోతో 25 సవర్ల బంగారం కట్నకానుకలు ఇచ్చే విధంగా సంబంధం కుదురుస్తుంది. దానికి గాను అజేష్ అనే బంగారు బ్రోకర్‌ను సంప్రదించి పెళ్లికి ముందు బంగారం తీసుకుని... పెళ్లిలో వచ్చే చదివింపులతో తిరిగి అప్పు తీర్చే విధంగా ఏర్పాటు చేస్తుంది. అజేష్ ఇచ్చిన నగలతో స్టెఫీ, మరియానో పెళ్లి అంగరంగ వైభవంగా జరుగుతుంది. కానీ అనుకోకుండా అంత డబ్బులు రావు. దీనితో అజేష్ తానిచ్చిన బంగారం కోసం పెళ్లి వారితో పాటు స్టెఫీ అత్తగారింటికి వెళతాడు. స్టెఫీ వేసుకున్న బంగారం అప్పుకు తెచ్చిందన్న విషయం అత్తవారింట్లో ఎవరికీ తెలియదు. ఈ పరిస్థితిలో అజేష్ తన బంగారం స్టెఫీ నుండి తీసుకోగలడా? లేదా అన్నది మాత్రం 'పాన్ మేన్' చూస్తేనే తెలుస్తుంది. ఈ సినిమా మొత్తం థ్రిల్లర్ జోనర్‌తో ఫ్యామిలీ బ్యాక్‌గ్రౌండ్‌లో నడుస్తుంది. అప్పు తీసుకునే ప్రతి వాళ్లూ తీసుకునేటపుడు బరువుగాను తిరిగి ఇచ్చేటపుడు బాధ్యతగాను ఉంటే ఏ సమస్యా ఉండదు. అలా కాని పక్షంలో ఈ సినిమాలో చూపిన ఇబ్బందులు పడాల్సి వస్తుంది. వర్త్‌ఫుల్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్.

– హరికృష్ణ ఇంటూరు

286 ఐపీఎల్‌లో ఇది రెండో అత్యధిక స్కోరు. గత ఏడాది రాయల్ చాలెంజర్స్ బెంగళూరుపై సన్‌రైజర్స్ చేసిన 287 పరుగుల స్కోరు అగ్రస్థానంలో ఉంది. ఐపీఎల్ చరిత్రలో టాప్-5 అత్యధిక టీమ్ స్కోర్లలో నాలుగు సన్‌రైజర్స్ పేరిటే ఉండటం విశేషం.

76 జోఫ్రా ఆర్చర్ ఇచ్చిన పరుగులు. ఐపీఎల్‌లోని ఒక మ్యాచ్‌లో ఒక బౌలర్ ఇచ్చిన అత్యధిక పరుగులు ఇవే. గత ఏడాది ఢిల్లీ క్యాపిటల్స్‌తో మ్యాచ్‌లో గుజరాత్ టైటాన్స్ బౌలర్ మోహిత్ శర్మ అత్యధికంగా 73 పరుగులు ఇచ్చాడు. మోహిత్ పేరిట ఉన్న రికార్డును ఆర్చర్ తన పేరిట లిఖించుకున్నాడు.

34 టి20 ఫార్మాట్‌లో ఒక మ్యాచ్ ఇన్నింగ్స్‌లో అత్యధిక ఫోర్లు (34) కొట్టిన జట్టుగా సన్‌రైజర్స్ రికార్డు నెలకొల్పింది. గతంలో ఈ రికార్డు మిడిల్‌సెక్స్ కౌంటీ (33 ఫోర్లు; సర్రే జట్టుపై 2023లో) జట్టు పేరిట ఉంది. ఐపీఎల్ టోర్నీ మ్యాచ్‌లో ఒక ఇన్నింగ్స్‌లో అత్యధిక బౌండరీలు కొట్టిన రికార్డు ఢిల్లీ డేర్‌డెవిల్స్ (31 ఫోర్లు; 2017లో గుజరాత్ లయన్స్‌పై) జట్టు పేరిట ఉంది. దానిని కూడా సన్‌రైజర్స్ బ్రేక్ చేసింది.

3 ఐపీఎల్‌లో ఫాస్టెస్ట్ సెంచరీ చేసిన మూడో భారత ప్లేయర్‌గా ఇషాన్ కిషన్ (45 బంతుల్లో) గుర్తింపు పొందాడు. తొలి స్థానంలో యూసుఫ్ పఠాన్ (37 బంతుల్లో ముంబై ఇండియన్స్‌పై 2010లో) ఉన్నాడు. తాజా ఇన్నింగ్స్‌తో మయాంక్ అగర్వాల్ (45 బంతుల్లో; రాజస్తాన్ రాయల్స్‌పై 2020లో) సరసన ఇషాన్ కిషన్ చేరాడు.

ఐపీఎల్‌లో నేడు

ఢిల్లీ X లక్నో
వేదిక: విశాఖపట్నం
రాత్రి 7: 30 గంటల నుంచి
స్టార్ స్పోర్ట్స్, జియో హాట్‌స్టార్‌లో ప్రత్యక్ష ప్రసారం

మరిన్ని క్రీడా వార్తలు సాక్షి ప్లస్ స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో

ఇషాన్‌దార్ రైజర్స్

హైదరాబాద్ సూపర్ బ్యాటింగ్

- 286 పరుగుల స్కోరు నమోదు
- 44 పరుగులతో రాజస్తాన్‌పై గెలుపు
- ఇషాన్ కిషన్ అజేయ సెంచరీ
- చెలరేగిన ట్రావిస్ హెడ్
- సామ్సన్, జురేల్ మెరుపులు వృథా



ఇషాన్ కిషన్
పరుగులు 106
బంతులు 47
ఫోర్లు 11
సిక్సలు 6
స్ట్రయిక్‌రేట్ 225.53

తొలి 42 బంతుల్లో 100 పరుగులు... 87 బంతుల్లో 200 పరుగులు... ఇక మిగిలింది 300 లక్ష్యమే... ఐపీఎల్‌లో 300 పరుగులు సాధ్యమా అనే ప్రశ్నకు జవాబిచ్చేలా ఆడిన సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టు దానిని ఈసారి అందుకోలేకపోయినా దాదాపు చేరువగా వచ్చింది. తమ అత్యధిక టీమ్ స్కోరుకు ఒక పరుగు మాత్రమే తక్కువ చేసి ఐపీఎల్ టోర్నీ చరిత్రలో రెండో అత్యధిక స్కోరును తమ పేరిటే లిఖించుకుంది. మారింది సీజన్ మాత్రమే తాము కాదు అంటూ సన్‌రైజర్స్ బ్యాటర్లు చెలరేగిపోయారు. గత ఏడాది లాగే అభిషేక్ శర్మ, ట్రావిస్ హెడ్ మెరుపులకు తోడు ఈసారి కొత్తగా జట్టులో చేరిన ఇషాన్ కిషన్ కూడా దూకుడుగా ఆడడంతో జట్టు ఆకాశమే హద్దుగా చెలరేగింది. ఛేదనకు ముందే ఓటమిని అంగీకరించినట్లు కనిపించిన రాజస్తాన్ కొంత పోరాడినా లక్ష్యం మరీ పెద్దది కావడంతో చివరకు ఆ జట్టుకు ఓటమి తప్పలేదు. మొత్తానికి 528 పరుగుల మ్యాచ్‌తో హైదరాబాద్ అభిమానులు ఆదివారం పండుగ చేసుకున్నారు.

హెడ్

సామ్సన్

జురేల్

సాక్షి, హైదరాబాద్: ఐపీఎల్-18 సీజన్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ తమదైన రీతిలో మెరుపు బ్యాటింగ్‌తో చెలరేగింది. ఘన విజయంతో టోర్నీని మొదలు పెట్టింది. ఆదివారం ఉప్పల్ స్టేడియంలో జరిగిన మ్యాచ్‌లో గత ఏడాది రన్నరప్ సన్‌రైజర్స్ 44 పరుగుల తేడాతో మాజీ చాంపియన్ రాజస్తాన్ రాయల్స్‌ను ఓడించింది. టాస్ ఓడి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన హైదరాబాద్ 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 286 పరుగులు చేసింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' ఇషాన్ కిషన్ (47 బంతుల్లో 106 నాటౌట్; 11 ఫోర్లు, 6 సిక్స్‌లు) సెంచరీతో కదం తొక్కాడు. ట్రావిస్ హెడ్ (31 బంతుల్లో 67; 9 ఫోర్లు, 3 సిక్స్‌లు) అర్ధసెంచరీ సాధించాడు. హెన్రిచ్ క్లాసెన్ (14 బంతుల్లో 34; 5 ఫోర్లు, 1 సిక్స్), నితీశ్ కుమార్ రెడ్డి (15 బంతుల్లో 30; 4 ఫోర్లు, 1 సిక్స్) కూడా దూకుడుగా ఆడారు. సన్‌రైజర్స్ టాప్-5 బ్యాటర్లంతా 200కు పైగా స్ట్రయిక్‌రేట్‌తో పరుగులు సాధించడం విశేషం. అనంతరం 287 పరుగుల విజయలక్ష్యంతో బరిలోకి దిగిన రాజస్తాన్ రాయల్స్ 20 ఓవర్లలో 6 వికెట్లకు 242 పరుగులు చేసి ఓడిపోయింది. ధ్రువ్ జురేల్ (35 బంతుల్లో 70; 5 ఫోర్లు, 6 సిక్స్‌లు), సంజూ సామ్సన్ (37 బంతుల్లో 66; 7 ఫోర్లు, 4 సిక్స్‌లు) మెరుపు అర్ధ సెంచరీలతో ఆకట్టుకున్నారు. సన్‌రైజర్స్ బౌలర్లలో సిమర్‌జీత్ సింగ్, హర్షల్ పటేల్ రెండు వికెట్ల చొప్పున తీశారు. సన్‌రైజర్స్ జట్టు తమ తదుపరి మ్యాచ్‌ను ఈనెల 27న ఉప్పల్ స్టేడియంలోనే లక్నో సూపర్ జెయింట్స్ జట్టుతో ఆడుతుంది.

మెరుపు బ్యాటింగ్...

అభిషేక్ శర్మ (11 బంతుల్లో 24; 5 ఫోర్లు), హెడ్ ఎప్పటిలాగే రైజర్స్‌కు శుభారంభం అందించారు. ఫారుఖీ ఓవర్లో అభిషేక్ మూడు ఫోర్లు కొట్టగా, అదే ఓవర్లో హెడ్ సిక్స్ కొట్టాడు. తొలి వికెట్‌కు 19 బంతుల్లో 45 పరుగుల భాగస్వామ్యం తర్వాత అభిషేక్ వెనుదిరిగాడు. అభిషేక్ స్థానంలో వచ్చిన ఇషాన్ కిషన్ కూడా అదే జోరును కొనసాగించాడు. ఆర్చర్ వేసిన ఐదో ఓవర్లో హెడ్ చెలరేగిపోయాడు. ఈ ఓవర్లో అతను 4 ఫోర్లు, సిక్స్ బాదడంతో మొత్తం 23 పరుగులు వచ్చాయి. పవర్‌ప్లే ముగిసే సరికి సన్‌రైజర్స్ స్కోరు 94 పరుగులకు చేరగా, 21 బంతుల్లోనే హెడ్ హాఫ్ సెంచరీ పూర్తయింది. ఎట్టకేలకు హెడ్‌ను తుషార్ అవుట్ చేసినా... కిషన్ తనదైన శైలిలో ధాటిగా ఆడాడు. హెడ్, కిషన్ రెండో వికెట్‌కు 39 బంతుల్లోనే 85 పరుగులు జోడించారు. ఆర్చర్ ఓవర్లో రెండు వరుస సిక్స్‌లతో కిషన్ 25 బంతుల్లో హాఫ్ సెంచరీని అందుకున్నాడు. అదే ఓవర్లో అతను మరో సిక్సర్ బాదాడు. మరోవైపు నితీశ్ రెడ్డి, క్లాసెన్ ఎక్కడా తగ్గలేదు. వీరిద్దరు దూకుడుతో స్కోరు వేగంగా దూసుకుపోయింది. సందీప్ ఓవర్లో వరుసగా 6, 4 కొట్టిన క్లాసెన్, ఆర్చర్ ఓవర్లో మూడు ఫోర్లు కొట్టాడు. సందీప్ ఓవర్లో వరుసగా రెండు సిక్స్‌లు బాది 98కి చేరిన కిషన్ తర్వాతి బంతికి రెండు పరుగులు చేసి సెంచరీ (45 బంతుల్లో)తో విజయనాదం చేశాడు.

శతక భాగస్వామ్యం...

దాదాపు అసాధ్యమైన లక్ష్య ఛేదనకు బరిలోకి దిగిన రాజస్తాన్ 50 పరుగులకే 3 కీలక వికెట్లు కోల్పోయింది. యశస్వి జైస్వాల్ (1), రియాన్ పరాగ్ (4), నితీశ్ రాణా (11) వెనుదిరగడంతో జట్టు ఛేదనావకాశాలు తగ్గిపోయాయి. అయితే సామ్సన్, జురేల్ కొద్దిగా ప్రయత్నం చేశారు. సిమర్‌జీత్ ఓవర్లో సామ్సన్ 2 ఫోర్లు, సిక్స్ కొట్టగా, కమిన్స్ ఓవర్లో జురేల్ 3 ఫోర్లు, సిక్స్ కొట్టడం హైలైట్‌గా నిలిచాయి. రాయల్స్ బ్యాటర్లు కూడా అక్కడక్కడా మెరుపులు మెరిపించినా హైదరాబాద్ ఇన్నింగ్స్ ముందు అవన్నీ దిగదుడుపుగా కనిపించాయి. నాలుగో వికెట్‌కు 60 బంతుల్లో 111 పరుగులు జత చేసిన అనంతరం ఒకే స్కోరు వద్ద సామ్సన్, జురేల్ అవుట్ కావడంతో రాజస్తాన్ ఆశలు అడుగంటాయి. చివర్లో హెట్‌మైర్ (23 బంతుల్లో 42; 1 ఫోర్, 4 సిక్స్‌లు), శుభమ్ దూబే (11 బంతుల్లో 34 నాటౌట్; 1 ఫోర్, 4 సిక్స్‌లు) పోరాడినా లాభం లేకపోయింది.

స్కోరు వివరాలు

ఐపీఎల్-2025: అప్‌డేట్, వివరాలు, విశ్లేషణ కోసం స్కాన్ చేయండి

సన్‌రైజర్స్ హైదరాబాద్ ఇన్నింగ్స్: అభిషేక్ శర్మ (సి) యశస్వి జైస్వాల్ (బి) తీక్షణ 24; హెడ్ (సి) హెట్‌మైర్ (బి) తుషార్ దేశ్‌పాండే 67; ఇషాన్ కిషన్ (నాటౌట్) 106; నితీశ్ కుమార్ రెడ్డి (సి) యశస్వి జైస్వాల్ (బి) తీక్షణ 30; క్లాసెన్ (సి) పరాగ్ (బి) సందీప్ 34; అనికేత్ (సి) ఆర్చర్ (బి) తుషార్ దేశ్‌పాండే 7; అభినవ్ మనోహర్ (సి) పరాగ్ (బి) తుషార్ దేశ్‌పాండే 0; కమిన్స్ (నాటౌట్) 0; ఎక్స్‌ట్రాలు 18; **మొత్తం (20 ఓవర్లలో 6 వికెట్లకు) 286. వికెట్ల పతనం:** 1-45, 2-130, 3-202, 4-258, 5-279, 6-279. **బౌలింగ్:** ఫారుఖీ 3-0-49-0, తీక్షణ 4-0-52-2, ఆర్చర్ 4-0-76-0, సందీప్ శర్మ 4-0-51-1, నితీశ్ రాణా 1-0-9-0, తుషార్ దేశ్‌పాండే 4-0-44-3.

రాజస్తాన్ రాయల్స్ ఇన్నింగ్స్: యశస్వి జైస్వాల్ (సి) మనోహర్ (బి) సిమర్‌జీత్ 1; సంజూ సామ్సన్ (సి) క్లాసెన్ (బి) హర్షల్ పటేల్ 66; పరాగ్ (సి) కమిన్స్ (బి) సిమర్‌జీత్ 4; నితీశ్ రాణా (సి) కమిన్స్ (బి) షమీ 11; ధ్రువ్ జురేల్ (సి) ఇషాన్ కిషన్ (బి) ఆడమ్ జంపా 70; హెట్‌మైర్ (సి) మనోహర్ (బి) హర్షల్ పటేల్ 42; శుభమ్ దూబే (నాటౌట్) 34; ఆర్చర్ (నాటౌట్) 1; ఎక్స్‌ట్రాలు 13; **మొత్తం (20 ఓవర్లలో 6 వికెట్లకు) 242. వికెట్ల పతనం:** 1-20, 2-24, 3-50, 4-161, 5-161, 6-241. **బౌలింగ్:** మొహమ్మద్ షమీ 3-0-33-1, సిమర్‌జీత్ సింగ్ 3-0-46-2, కమిన్స్ 4-0-60-0, అభిషేక్ 2-0-17-0, ఆడమ్ జంపా 4-0-48-1, హర్షల్ పటేల్ 4-0-34-2.

లక్నో సూపర్ జెయింట్స్ జట్టులో శార్దుల్ ఠాకూర్



న్యూఢిల్లీ: దేశవాళీ క్రికెట్ టోర్నమెంట్ రంజీ ట్రోఫీలో తన ప్రదర్శనతో ఆకట్టుకున్న భారత పేస్ ఆల్‌రౌండర్ శార్దుల్ ఠాకూర్‌ను ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) ఫ్రాంచైజీ లక్నో సూపర్ జెయింట్స్ (ఎల్‌ఎస్‌జీ) తీసుకుంది. లెఫ్టార్మ్ పేసర్ మొహసిన్ ఖాన్ గాయంతో ఈ సీజన్‌కు దూరం కావడంతో అతడి స్థానంలో శార్దుల్ ఠాకూర్‌ను ఎంపిక చేసుకుంది. ఇప్పటి వరకు ఐపీఎల్‌లో 5 వేర్వేరు ఫ్రాంచైజీలకు ప్రాతినిధ్యం వహించి 95 మ్యాచ్‌లాడిన ఈ ముంబైకర్‌ను లక్నో కనీస ధర రూ. 2 కోట్లకు తీసుకుంది. మూడు ఫార్మాట్లలో భారత జట్టుకు ప్రాతినిధ్యం వహించిన 33 ఏళ్ల శార్దుల్... ఇటీవల రంజీ ట్రోఫీలో అటు బ్యాట్‌తో, ఇటు బంతితో ఆకట్టుకున్నాడు. మీడియం పేస్‌తో 35 వికెట్లు పడగొట్టడంతో పాటు... లోయర్ ఆర్డర్‌లో బ్యాటింగ్‌కు దిగి 505 పరుగులు సాధించాడు. కాగా, గత ఏడాది జరిగిన ఐపీఎల్ మెగా వేలంలో శార్దుల్ ఠాకూర్‌ను ఏ ఫ్రాంచైజీ కొనుగోలు చేసుకోలేదు. దీంతో కౌంటీ క్రికెట్ ఆడేందుకు మొగ్గు చూపిన ఈ ముంబైకర్... రిజిస్టర్డ్ అవైలబుల్ ప్లేయర్ పూల్ (ఆర్‌ఏపీపీ)లో తన పేరు నమోదు చేసుకున్నాడు. 'మోకాలి గాయం కారణంగా ఈ సీజన్ మొత్తానికి అందుబాటులో లేకుండా పోయిన ఎడంచేతి వాటం పేసర్ మొహసిన్ ఖాన్ స్థానంలో లక్నో జట్టు శార్దుల్ ఠాకూర్‌ను ఎంపిక చేసుకుంది' అని ఐపీఎల్ పాలక మండలి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపింది.

డబుల్స్‌లో భారత నంబర్‌వన్‌గా యూకీ



న్యూఢిల్లీ: మయామి ఓపెన్ మాస్టర్స్ సిరీస్-1000 టెన్నిస్ టోర్నీ పురుషుల డబుల్స్ విభాగంలో భారత అగ్రశ్రేణి ప్లేయర్ యూకీ బాంబ్రీ శుభారంభం చేశాడు. అమెరికాలోని ఫ్లోరిడాలో ఈ టోర్నీ జరుగుతోంది. పురుషుల డబుల్స్ తొలి రౌండ్ మ్యాచ్‌లో యూకీ బాంబ్రీ (భారత్)-నూనో బోర్జెస్ (పోర్చుగల్) ద్వయం 4-6, 6-3, 10-7తో 'సూపర్ టైబ్రేక్'లో రోహన్ బోపన్న (భారత్)-ఇవాన్ డోడిగ్ (క్రొయేషియా) జంటను ఓడించి ప్రిక్వార్టర్ ఫైనల్లోకి ప్రవేశించింది. ఈ గెలుపుతో యూకీ బాంబ్రీ డబుల్స్‌లో భారత నంబర్‌వన్ ప్లేయర్‌గా అవతరించనున్నాడు. 32 ఏళ్ల యూకీ వచ్చే ఈనెల 31న విడుదలయ్యే ఏటీపీ ర్యాంకింగ్స్‌లో 29వ స్థానానికి చేరుకొని భారత నంబర్‌వన్‌గా నిలుస్తాడు. 2019 నుంచి పురుషుల డబుల్స్‌లో భారత నంబర్‌వన్‌గా కొనసాగుతున్న రోహన్ బోపన్న 22 స్థానాలు దిగజారి 43వ ర్యాంక్‌కు చేరుకుంటాడు. గత ఏడాది మాథ్యూ ఎబ్డెన్ (ఆస్ట్రేలియా)తో కలిసి బోపన్న మయామి ఓపెన్‌లో డబుల్స్ టైటిల్ సాధించాడు. ఈ ఏడాది బోపన్న తొలి రౌండ్‌లోనే ఓడిపోవడంతో అతని ర్యాంక్‌పై ప్రభావం చూపింది.

వరుసగా 13వ ఏడాది...


నూర్ అహ్మద్

సీజన్ ఆరంభ మ్యాచ్‌లో పరాజయం పాలయ్యే ఆనవాయితీని ముంబై ఇండియన్స్ మరోసారి కొనసాగించింది. వరుసగా 13వ ఏడాది ముంబై జట్టు ఐపీఎల్‌లో తాము ఆడిన తొలి మ్యాచ్‌లో ఓటమి పాలైంది. గతేడాది పాయింట్ల పట్టిక అట్టడుగున నిలిచిన ముంబై ఇండియన్స్ ఆదివారం జరిగిన మ్యాచ్‌లో చెన్నై సూపర్ కింగ్స్ చేతిలో నాలుగు వికెట్ల తేడాతో ఓడింది. బ్యాటింగ్‌లో మెరుపులు మెరిపించలేకపోయిన ముంబై... బౌలింగ్‌లోనూ ఎలాంటి ప్రభావం చూపలేకపోయింది.

- ఐపీఎల్ తొలి మ్యాచ్‌లో ఓడిన ముంబై ఇండియన్స్
- 4 వికెట్లతో చెన్నై సూపర్ కింగ్స్ గెలుపు
- తిప్పేసిన నూర్ అహ్మద్
- రాణించిన రచిన్, రుతురాజ్

చెన్నై: ఐదుసార్లు చాంపియన్ చెన్నై సూపర్ కింగ్స్ ఐపీఎల్ 18వ సీజన్‌లో శుభారంభం చేసింది. ఆదివారం జరిగిన తమ తొలి మ్యాచ్‌లో చెన్నై నాలుగు వికెట్ల తేడాతో ఐదుసార్లు చాంపియన్ ముంబై ఇండియన్స్‌పై గెలిచింది. 2012 ఐపీఎల్‌లో చివరిసారి తాము ఆడిన తొలి మ్యాచ్‌లో నెగ్గిన ముంబై జట్టు ఆ తర్వాత ఇప్పటి వరకు మొదటి పోరులో శుభారంభం చేయలేకపోయింది. మొదట ముంబై ఇండియన్స్ 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 155 పరుగులు చేసింది. హైదరాబాద్ యువతార ఠాకూర్ తిలక్ వర్మ (25 బంతుల్లో 31; 2 ఫోర్లు, 2 సిక్స్‌లు) టాప్ స్కోరర్ కాగా... తాత్కాలిక కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ (26 బంతుల్లో 29; 2 ఫోర్లు, 1 సిక్స్), దీపక్ చాహర్ (15 బంతుల్లో 28 నాటౌట్; 2 ఫోర్లు, 2 సిక్స్‌లు) తలా కొన్ని పరుగులు చేశారు. స్టార్ ఓపెనర్ రోహిత్ శర్మ (0) డకౌట్ కాగా... రికెల్టన్ (13), విల్ జాక్స్ (11) ఎక్కువసేపు నిలవలేకపోయారు. చెన్నై బౌలర్లలో 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' నూర్ అహ్మద్ 4, ఖలీల్ అహ్మద్ 3 వికెట్లు పడగొట్టారు. అనంతరం చెన్నై 19.1 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి 158 పరుగులు చేసింది. రచిన్ రవీంద్ర (45 బంతుల్లో 65 నాటౌట్; 2 ఫోర్లు, 4 సిక్స్‌లు), కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్ (26 బంతుల్లో 53; 6 ఫోర్లు, 3 సిక్స్‌లు) అర్ధశతకాలతో రాణించారు.

స్కోరు వివరాలు

ముంబై ఇండియన్స్ ఇన్నింగ్స్: రోహిత్ (సి) దూబే (బి) ఖలీల్ 0; రికెల్టన్ (బి) ఖలీల్ 13; జాక్స్ (సి) దూబే (బి) అశ్విన్ 11; సూర్యకుమార్ (స్టంప్డ్) ధోని (బి) నూర్ 29; తిలక్ వర్మ (ఎల్బీ) (బి) నూర్ 31; రాబిన్ (సి) జడేజా (బి) నూర్ 3; నమన్ (బి) నూర్ 17; సాంట్నర్ (ఎల్బీ) (బి) ఎలీస్ 11; దీపక్ చాహర్ (నాటౌట్) 28; బౌల్ట్ (సి) రుతురాజ్ (బి) ఖలీల్ 1; సత్యనారాయణ రాజు (నాటౌట్) 1; ఎక్స్‌ట్రాలు 10; **మొత్తం (20 ఓవర్లలో 9 వికెట్లకు) 155. వికెట్ల పతనం:** 1-0, 2-21, 3-36, 4-87, 5-95, 6-96, 7-118, 8-128, 9-141. **బౌలింగ్:** ఖలీల్ అహ్మద్ 4-0-29-3; స్యామ్ కరన్ 1-0-13-0; ఎలీస్ 4-0-38-1; అశ్విన్ 4-0-31-1; జడేజా 3-0-21-0; నూర్ అహ్మద్ 4-0-18-4. **చెన్నై సూపర్ కింగ్స్ ఇన్నింగ్స్:** రచిన్ (నాటౌట్) 65; రాహుల్ త్రిపాఠి (సి) రికెల్టన్ (బి) చాహర్ 2; రుతురాజ్ (సి) జాక్స్ (బి) విఘ్నేశ్ 53; దూబే (సి) తిలక్ వర్మ (బి) విఘ్నేశ్ 9; దీపక్ హుడా (సి) సత్యనారాయణ (బి) విఘ్నేశ్ 3; కరన్ (బి) జాక్స్ 4; జడేజా (రనౌట్) 17; ధోని (నాటౌట్) 0; ఎక్స్‌ట్రాలు 5; **మొత్తం (19.1 ఓవర్లలో 6 వికెట్లకు) 158. వికెట్ల పతనం:** 1-11, 2-78, 3-95, 4-107, 5-116, 6-152. **బౌలింగ్:** బౌల్ట్ 3-0-27-0; చాహర్ 2-0-18-1; సత్యనారాయణ 1-0-13-0; సాంట్నర్ 2.1-0-24-0; జాక్స్ 4-0-32-1; విఘ్నేశ్ 4-0-32-3; నమన్ 3-0-12-0.


సూర్యకుమార్ యాదవ్‌ను స్టంపౌట్ చేస్తున్న ధోని

సాక్షి ప్రాఫిట్ ప్లస్
సోమవారం
24-3-2025

స్టాక్ మార్కెట్లు (శుక్రవారం ముగింపు)

దేశీ సూచీలు	
సెన్సెక్స్ ▲ 557	నిఫ్టీ ▲ 160
76,906	23,350

విదేశీ సూచీలు			
నాస్‌డాక్	17,784	▲	92
డోజోన్స్	41,985	▲	32
ఎఫ్‌టీఎస్‌ఈ 100	8,647	▽	55
డాక్స్	22,892	▽	107
షాంఘై	3,365	▽	44
నికాయ్ (శుక్రవారం ముగింపు)	37,677	▽	75

●అమెరికా ●బ్రిటన్ ●జర్మనీ ●చైనా ●జపాన్

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎఫ్‌ఈఐ	85.80	86.82
£	బ్రిటన్ పౌండ్	ఎఫ్‌ఈఐ	110.40	113.24
€	యూరో	ఎఫ్‌ఈఐ	92.23	94.89
¥	జపాన్ ఎన్ (100)	ఎఫ్‌ఈఐ	57.17	58.64
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఎఫ్‌ఈఐ	51.68	56.54
S$	సింగపూర్ డాలర్	ఎఫ్‌ఈఐ	62.13	66.80
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	22.03	23.58
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	22.52	24.30
¥	చైనా యువాన్	థామస్‌కుక్	10.98	12.81


మీ స్కోర్ ఎంత..?

రుణ అర్హతలకి క్రెడిట్ స్కోర్ ప్రామాణికం
క్రెడిట్ రిపోర్ట్‌లో తప్పులతో తగ్గిపోవచ్చు
లోపాలు, మోసపూరిత లావాదేవీ ఎంట్రీలు
అందుకే ఏటా రుణ చరిత్రను తిరగేయాలి
తప్పులుంటే సరిచేసుకోవాలి
చివరిగా అంబుడ్స్‌మన్‌ను ఆశ్రయించాలి

ముంబైకి చెందిన అజయ్ వర్మ (31) తన పర్సనల్ లోన్‌ను పూర్తిగా తీర్చేసి నాలుగు నెలలు గడిచిపోయింది. ఇటీవలే క్రెడిట్ రిపోర్ట్‌ను పరిశీలించగా.. ఆ రుణం ముగిసిపోయిన విషయం తన రుణ చరిత్రలోకి చేరలేదన్న విషయం అర్థమైంది. క్రెడిట్ స్కోర్‌ను తెలుసుకోండంటూ 'పైసాబజార్' నుంచి వచ్చిన సందేశం చూసి, హైదరాబాద్‌కు చెందిన అఖిలేశ్ (45) లింక్‌పై క్లిక్ చేశాడు. మొబైల్ నంబర్, ఓటీపీతో లాగిన్ అయిన తర్వాత క్రెడిట్ రిపోర్ట్ తెరుచుకుంది. అందులో తాను తీసుకోని రుణాల సమాచారం ఉండడాన్ని చూసి ఆందోళన చెందాడు. ఆర్జించే ప్రతి వ్యక్తి క్రెడిట్ రిపోర్ట్‌ను తరచుగా ఎందుకు తనిఖీ చేసుకోవాలి? అన్న దానికి ఇవి నిదర్శనాలుగా నిలుస్తాయి.

మనలో కొందరు ఏటా ముందస్తు వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేయించుకుంటూ ఉంటారు. అనారోగ్యాలు ఏవైనా ఉంటే ఆరంభంలోనే గుర్తించి నయం చేసుకునేందుకు ఈ పరీక్షలు వీలు కల్పిస్తాయి. అదే మాదిరి క్రెడిట్ రిపోర్ట్‌ను ఏడాదికోసారి అయినా తనిఖీ చేసుకోవడం ద్వారా అందులో తప్పులు, పొరపాట్లు, మోసపూరిత లావాదేవీలకు చోటు లేకుండా చూసుకోవచ్చు. మెరుగైన క్రెడిట్ స్కోర్‌తో రుణ పరపతిని గణనీయంగా పెంచుకోవచ్చు.

– సాక్షి, బిజినెస్ డెస్క్





గతంలో ఎంతో ముఖ్యమైన అవసరం ఉంటేనే అరువు తీసుకునేవారు. కానీ, నేడు మెరుగైన జీవనం కోసం, కోరికలు తీర్చుకోవడానికి, సొంతింటి కల సాకారానికి ఇలా ఒకటేమిటి.. అన్ని అవసరాలకు రుణాలను ఆశ్రయించే సంస్కృతి విస్తరిస్తోంది. 2024 ఫిబ్రవరి నాటికి మన దేశంలో 10 కోట్ల మందికి పైగా క్రెడిట్ కార్డులున్నట్టు గణాంకాలు తెలియజేస్తున్నాయి. ఇల్లు, కారు, ఇంట్లో ఖరీదైన ఎలక్ట్రానిక్ పరికరాలను ఈఎంఐలపై తీసుకోవడానికి ఎంత మాత్రం సంకోచించడం లేదు. ప్రతి రుణానికి గీటురాయి మెరుగైన క్రెడిట్ స్కోరే. తీరా రుణం అవసరమైన పరిస్థితుల్లో క్రెడిట్ రిపోర్ట్‌లో లోపాలు అడ్డంకిగా మారొచ్చు. అందుకే క్రెడిట్ రిపోర్ట్‌ను అప్పుడప్పుడూ పరిశీలించుకోవడం అవసరం. 'గతంలో రుణం తీసుకుని, అన్ని ఈఎంఐలను సకాలంలో చెల్లించేశాను. కనుక, భవిష్యత్తులో సులభంగా రుణం లభిస్తుంది' అని అనుకోవడానికి లేదు. మీకున్న క్రెడిట్ స్కోర్? మీ అర్హతలను నిర్ణయిస్తుంది.

క్రెడిట్ రిపోర్ట్..

వ్యక్తులు, వ్యాపార సంస్థల పేరిట (పాన్ ఆధారంగా) అన్ని రుణాలు, వాటి చెల్లింపుల వివరాలతో కూడిన సెంట్రల్ డేటాను నిర్వహించేవే క్రెడిట్ బ్యూరోలు. బ్యాంక్‌లు, ఎన్‌బీఎఫ్‌సీలు ప్రతీ రుణానికి సంబంధించి చెల్లింపుల వివరాలను ఎప్పటికప్పుడు క్రెడిట్ బ్యూరోలకు తెలియజేస్తుంటాయి. ట్రాన్స్‌యూనియన్ సిబిల్, ఎక్స్‌పీరియన్, ఈక్విఫాక్స్, క్రిఫ్ హైమార్క్ సంస్థలు ప్రస్తుతం ఈ సేవలను అందిస్తున్నాయి. రుణం కోరుతూ చేసే విచారణలు, రుణానికి చేసే దరఖాస్తులు, రుణాల జారీ, వాటికి చెల్లింపులు, ఈఎంఐలను సకాలంలో చెల్లించలేకపోవడం, రుణ చెల్లింపులను ఎగవేయడం ఇలా ప్రతీ సమాచారం క్రెడిట్ బ్యూరో రికార్డుల్లో నమోదవుతుంటుంది. ఇప్పటి వరకు ఒక వ్యక్తి లేదా సంస్థ ఎన్ని రుణాలు తీసుకున్నారు, వాటిని పూర్తిగా చెల్లించారా? లేదా? అన్న సంపూర్ణ సమాచారం ఉంటుంది.

ప్రతి రుణ ఖాతాకు సంబంధించి తాజా సమాచారాన్ని 15 రోజులకు ఒకసారి (గతంలో నెలకోసారి) క్రెడిట్ బ్యూరోలకు అందించాలని ఆర్థిక సంస్థలు, బ్యాంక్‌లను ఇటీవలే ఆర్‌బీఐ ఆదేశించడం గమనార్హం. ఇలా అన్ని మార్గాల ద్వారా వచ్చే సమాచారం ఆధారంగానే ప్రతి వ్యక్తి/సంస్థ పేరిట క్రెడిట్ రిపోర్ట్‌ను క్రెడిట్ బ్యూరోలు రూపొందిస్తుంటాయి. ఈ సమాచారం ఆధారంగానే స్కోర్‌ను కేటాయిస్తుంటాయి. వివిధ రకాల రుణ సాధనాలను వినియోగించుకోవడం.. వాయిదాలను సకాలంలో చెల్లిస్తూ ఆర్థిక క్రమశిక్షణ చూపించే వారికి బలమైన స్కోర్ లభిస్తుంది. రుణం మంజూరు చేస్తే ఎంత రిస్క్ ఉంటుందన్న విషయాన్ని బ్యాంక్‌లు, ఎన్‌బీఎఫ్‌సీలు క్రెడిట్ రిపోర్ట్, స్కోర్ ఆధారంగా సులభంగా అంచనాకు వస్తాయి. కేవలం రుణదాతలే క్రెడిట్ స్కోర్/రిపోర్ట్‌కు పరిమితం కావడం లేదు. బీమా కంపెనీలు పాలసీల జారీకి ముందు సంబంధిత దరఖాస్తుదారుడి క్రెడిట్ స్కోర్‌ను ఇటీవలి కాలంలో పరిశీలిస్తున్నాయి. కంపెనీలు ఉద్యోగ నియామకాల సమయంలోనూ అభ్యర్థుల క్రెడిట్ స్కోర్‌ను గమనిస్తున్నాయి. తద్వారా వారు ఆర్థిక విషయాల్లో ఎంత క్రమశిక్షణగా ఉంటున్నారో తెలుసుకోవాలని అనుకుంటున్నాయి. క్రెడిట్ రిపోర్ట్‌లో ఒక్కోసారి తప్పులు, పొరపాట్లకు అవకాశం లేకపోలేదు. ప్రతి ఒక్కరూ తమ క్రెడిట్ రిపోర్ట్‌ను పరిశీలించుకోవడం ద్వారానే వీటి గురించి తెలుస్తుంది. లేదంటే రుణ దరఖాస్తు తిరస్కారానికి గురైనప్పుడే వాటి గురించి తెలుస్తుంటుంది.

మెరుగైన స్కోర్‌తో లాభాలు..



■ చక్కని ఆర్థిక క్రమశిక్షణ, సకాలంలో రుణ చెల్లింపులతో క్రెడిట్ స్కోర్‌ను మెరుగ్గా కాపాడుకోవచ్చు. దీనివల్ల రుణాలను ఇతరులతో పోల్చితే తక్కువ రేటుకే సొంతం చేసుకోవచ్చు. వ్యాపార సంస్థల విషయంలోనూ ఇంతే. రుణ షరతుల్లో వెసులుబాటు లభిస్తుంది.

■ ఒకేసారి ఒకటికి మించిన రుణాలు తీసుకోవడం క్రెడిట్ స్కోర్‌పై ప్రతికూల ప్రభావం చూపిస్తుంది. అలాగే, తరచూ రుణాల కోసం చేసే విచారణలు సైతం క్రెడిట్ స్కోర్‌ను తగ్గించేస్తాయి.

■ రుణ బకాయిలను జాప్యం లేకుండా నిర్ణీత కాలవ్యవధిలో తీర్చేయాలి. ఒక్క రుణ వాయిదా చెల్లింపులోనూ ఆలస్యం లేకుండా చూసుకోవాలి. చెల్లించడం కష్టమని భావిస్తే రుణ కాల వ్యవధిని పెంచుకుని, ఈఎంఐ తగ్గించుకోవాలి.

■ ఒకేసారి ఒకటికి మించి ఒకే తరహా రుణాలు తీసుకోకూడదు. ఒకటికి మించిన పర్సనల్ లోన్‌లు, వాహన రుణాలు స్కోర్‌ను తగ్గించేస్తాయి. దీనికి బదులు క్రెడిట్ కార్డ్, పర్సనల్ లోన్, వెహికల్ లోన్, హౌసింగ్ లోన్ ఇలా రుణాలు మిశ్రమంగా ఉంటే స్కోర్‌కు నష్టం చేయదు.

■ క్రెడిట్ కార్డుపై క్రెడిట్ లిమిట్‌లో వినియోగం (యుటిలైజేషన్ రేషియో) 30–40 శాతం మించకుండా చూసుకోవాలి.

తప్పులు సరిచేసుకోవడం ఎలా?

■ రుణాలకు సంబంధించి ఏవైనా తప్పులను గుర్తించినట్టయితే, క్రెడిట్ బ్యూరో దృష్టికి తీసుకెళ్లాలి. ఆన్‌లైన్‌లో దరఖాస్తు దాఖలు చేయొచ్చు. తమ క్లెయిమ్‌కు ఆధారాలను కూడా జత చేయాలి.

■ రుణాలను సరిగ్గానే చెల్లించినప్పటికీ తప్పులు చోటుచేసుకుంటే బ్యాంక్ లేదా ఎన్‌బీఎఫ్‌సీ దృష్టికి తీసుకెళ్లాలి. క్రెడిట్ బ్యూరోలోని సమాచారం అప్‌డేట్‌కు బ్యాంక్, ఎన్‌బీఎఫ్‌సీ సహకరిస్తాయి.

■ అయినప్పటికీ సమస్య పరిష్కారం కాకపోతే ఆర్‌బీఐ అంబుడ్స్‌మన్ వద్ద ఫిర్యాదు దాఖలు చేయాలి.

■ క్రెడిట్ రిపోర్ట్‌లో మీ పేరు, చిరునామా, డేట్ ఆఫ్ బర్త్, గుర్తింపు వివరాల్లో పొరపాట్లు ఉంటే అదే విషయాన్ని సంబంధిత క్రెడిట్ బ్యూరో దృష్టికి తీసుకెళ్లి సరిచేసుకోవచ్చు.



ఏమి చూడాలి..?



క్రెడిట్ స్కోర్‌ను సరిగ్గా అర్థం చేసుకోవడం, మెరుగైన స్కోర్ కొనసాగేలా చూసుకోవడం ఎంతో ముఖ్యమని సిబిల్ మాజీ ఎండీ, అథేనా క్రెడ్ఎక్స్‌పర్ట్ వ్యవస్థాపకుడు సతీష్ మెహతా పేర్కొన్నారు. నాలుగు క్రెడిట్ బ్యూరోల నుంచి ఏడాదికోసారి ఉచితంగా క్రెడిట్ రిపోర్ట్‌ను పొందొచ్చు. అంటే ప్రతి బ్యూరో నుంచి ఒకటి పొందే అవకాశం ఉంటుంది. ప్రతి మూడు నెలలకు ఒక బ్యూరో నుంచి రిపోర్ట్‌ను ఉచితంగా పొందడం ద్వారా అందులో సమాచారం సరిగ్గా ఉందా? లేదా అన్నది నిర్ధారించుకోవచ్చు. మరీ ముఖ్యంగా ఏదైనా రుణం తీసుకోవాలని అనుకుంటుంటే, దానికంటే ముందుగానే క్రెడిట్ రిపోర్ట్‌ను పరిశీలించుకుని, అందులోని సమాచారం అంతా సవ్యంగా ఉందో లేదో అన్నది ధ్రువీకరించుకోవాలి. లేదంటే రుణ అర్హతపై ప్రభావం పడుతుంది. కనీసం ఏడాదిలో ఒకసారి పరిశీలించుకోవడం ద్వారా తప్పులు సరిదిద్దుకునేందుకు అవకాశం ఉంటుందని నిపుణులు సూచిస్తున్నారు.

■ గతంలో ఎప్పుడో వాడి పడేసిన క్రెడిట్ కార్డ్‌పై రూ.100 బకాయి ఉన్నా సరే అది ఏళ్లపాటు క్రెడిట్ స్కోర్‌ను ప్రభావితం చేస్తుంది.

■ రుణం పూర్తిగా చెల్లించినప్పటికీ.. సంబంధిత రుణ ఖాతాను 'ఓపెన్' అని (ఇంకా తీరిపోలేదు) చూపించొచ్చు. బాకీ మొత్తాన్ని తప్పుగా చూపించొచ్చు. తాము తీసుకోని రుణాలు తీసుకున్నట్టుగా క్రెడిట్ రిపోర్ట్‌లోకి చేరొచ్చు.

■ మోసపూరిత రుణ ఖాతాలు సైతం ఒకరి రుణ చరిత్రను దెబ్బ తీసే ప్రమాదం ఉంది. అంటే ఒకరి పాన్‌పై వేరొకరు/సంస్థలు మోసపూరితంగా రుణాలు తీసుకుని ఎగ్గొట్టడం వంటివి చోటు చేసుకోవచ్చు.


■ రుణ ఖాతా వర్గీకరణను చూడాలి. అన్ని రుణ ఖాతాలకూ 'స్టాండర్డ్' అనే ఉండాలి. 'ఓవర్ డ్యూ', 'ఎస్ఎంఏ' అన్న ట్యాగ్‌లు ఉండకూడదు.

■ ఒక్కోసారి ఒకే రుణం రెండు రుణ ఖాతాలుగా క్రెడిట్ రిపోర్ట్‌లో నమోదు కావచ్చు.

■ క్రెడిట్ రిపోర్ట్‌లో ప్రతి లోపం మోసం కాకపోవచ్చు. రుణ గ్రహీత సకాలంలోనే చెల్లించినప్పటికీ, బ్యాంక్ లేదా ఎన్‌బీఎఫ్‌సీ జాప్యం అయినట్టు పొరపాటుగా క్రెడిట్ బ్యూరోలకు సమాచారం ఇవ్వొచ్చు. అలాంటి అవాస్తవ, తప్పులు/లోపాలు/మోసాలకు సంబంధించిన సమాచారాన్ని తొలగించుకునే హక్కు రుణ గ్రహీతలకు ఉంటుంది.

■ వ్యక్తిగత రుణాన్ని వ్యాపార రుణంగా పేర్కొనే అవకాశం లేకపోలేదు.

బంగారు ఆభరణాలు విక్రయిస్తే పన్ను చెల్లించాలా?



ధీరేంద్ర కుమార్
సీఈవో, వ్యాల్యూ రీసెర్చ్

పన్ను చెల్లింపుదారులకు స్వల్ప ఉపశమనం కల్పించినట్టు విన్నాను. కానీ, అదేమిటో అర్థం కాలేదు. వివరించగలరా? – ఉదిత్

ప్రభుత్వం ఆదాయపన్ను చట్టంలోని సెక్షన్ 87ఏ కింద పన్ను రాయితీ ఇస్తోంది. మీ పన్ను వర్తించే ఆదాయం ఒక పరిమితికి మించకుండా ఉంటే ఎలాంటి పన్ను చెల్లించక్కర్లేదు. ఈ పరిమితి దాటి రూపాయి ఆదాయం ఉన్నాసరే ఈ రాయితీని కోల్పోవాల్సి వస్తుంది. దాంతో పెద్ద మొత్తంలో పన్ను చెల్లించాలి. సెక్షన్ 87ఏ కింద పూర్తి పన్ను రాయితీకి ఆదాయ పరిమితులు ఇలా ఉన్నాయి. 2024–25 ఆర్థిక సంవత్సరానికి కొత్త విధానంలో.. రూ.7లక్షలు అంతకంటే తక్కువ ఆదాయం ఉంటే, సెక్షన్ 87ఏ కింద రూ.25,000 రాయితీ ప్రయోజనాన్ని క్లెయిమ్ చేసుకుని పన్ను కట్టక్కర్లేదు. పాత పన్ను విధానంలో అయితే ఈ సెక్షన్ కింద రాయితీ రూ.12,500కే పరిమితం. ఈ ప్రకారం రూ.5 లక్షల ఆదాయంపై పన్ను ఉండదు. వచ్చే ఆర్థిక సంవత్సరానికి (2025–26) అయితే.. కొత్త విధానంలో రూ. 12 లక్షలకు మించకుండా ఆదాయం ఉంటే సెక్షన్ 87ఏ కింద రూ.60,000 పన్ను రాయితీ లభిస్తుంది. పాత విధానంలో ఎలాంటి మార్పు లేకుండా రూ.5 లక్షలకే రాయితీ పరిమితం. వచ్చే ఆర్థిక సంవత్సరానికి కొత్త పన్ను కింద రూ.12లక్షల ఆదాయం మించని వారికి పన్ను లేదు. కానీ, ఆదాయం రూ.12,01,000 ఉంటే ఈ రాయితీని పూర్తిగా కోల్పోవాల్సి వస్తుంది. ఇక్కడ స్వల్ప ఉపశమనం అంటే.. ఆదాయం నిర్దేశిత పరిమితి దాటి కొంచెమే ఉంటే అప్పుడు భారీగా పన్ను చెల్లించే పరిస్థితి లేకుండా.. నికరంగా రూ.1,000పైనే పన్ను చెల్లిస్తే సరిపోతుంది.

నా బంగారం ఆభరణాలను విక్రయించాలనుకుంటున్నాను? మూలధన లాభానికి ఇండెక్సేషన్ ప్రయోజనం లభిస్తుందా? – జోసెఫ్ ఎరింజేరీ

ఇండెక్సేషన్ అంటే ద్రవ్యోల్బణానికి తగినట్టుగా కొనుగోలు ధరను సర్దుబాటు చేయడం. కానీ, బంగారు ఆభరణాలకు ఇండెక్సేషన్ ప్రయోజనం ఇప్పుడు లేదు. ఆభరణాలను విక్రయించగా వచ్చిన లాభంపై పన్ను ఎంత చెల్లించాలన్నది.. వాటిని ఎంత కాలం పాటు కొని ఉంచుకున్నారన్న దానిపై ఆధారపడి ఉంటుంది. రెండేళ్లకుపైగా ఉంచుకుంటే అప్పుడు దీర్ఘకాల మూలధన లాభంపై 12.5% పన్ను పడుతుంది. రెండేళ్లలోపు విక్రయిస్తే ఆ మొత్తం స్వల్పకాల మూలధన లాభం అవుతుంది. ఇది మీ వార్షిక ఆదాయానికి కలుస్తుంది. అప్పుడు మీ మొత్తం ఆదాయం ఏ శ్లాబు పరిధిలోకి వస్తే, ఆ మేరకు పన్ను చెల్లించాలి. ఆభరణాలు వారసత్వంగా మీకు సంక్రమించినా లేక బహుమతి రూపంలో వచ్చినా.. అప్పుడు ఆ ఆభరణం కొన్న అసలు తేదీ, అప్పటికి ఉన్న ధరను పరిగణనలోకి తీసుకుంటారు.



పెట్టుబడులపై..?

గోల్డ్ ఈటీఎఫ్‌ల్లో 2023 ఏప్రిల్ 1, ఆ తర్వాత ఇన్వెస్ట్ చేసి.. 2025 మార్చి 31లోపు విక్రయిస్తే.. లాభం మొత్తం వార్షికాదాయానికి కలుస్తుంది. 2025 ఏప్రిల్ 1, ఆ తర్వాత విక్రయిస్తే.. హోల్డింగ్ పీరియడ్ (ఉంచిన కాలం) ఏడాదికి మించితే లాభంపై 12.5% పన్ను పడుతుంది. ఆభరణాల హోల్డింగ్ పీరియడ్ ఏడాదిలోపు ఉంటే లాభం మొత్తం వార్షిక ఆదాయానికి కలుస్తుంది. గోల్డ్ ఫండ్స్‌లో 2023 ఏప్రిల్ 1, ఆ తర్వాత ఇన్వెస్ట్ చేసి.. 2025 మార్చి 31లోపు విక్రయిస్తే, వచ్చిన లాభం వార్షికాదాయానికి కలుస్తుంది. 2025 ఏప్రిల్ 1 తర్వాత విక్రయిస్తే, హోల్డింగ్ పీరియడ్ రెండేళ్లకు పైన ఉంటే లాభంపై 12.5% పన్ను చెల్లించాలి. ఆలోపు ఉంటే లాభం వార్షిక ఆదాయానికి కలుస్తుంది.

'సాక్షి ప్లస్' ఈ-పేపర్‌లో..
మార్కెట్లకు విదేశీ జోష్ | రెండింటిలోనూ పెట్టుబడులు కోటక్ ఈక్విటీ హైబ్రిడ్ ఫండ్

సుందరం ఫైనాన్స్ | బ్రోకరేజ్: ఐడీబీఐ క్యాపిటల్ | కొనొచ్చు

షేర్ ఖాన్

ప్రస్తుత ధర: రూ. 4,905 టార్గెట్: రూ. 5,570

ఎందుకంటే: ప్రయివేట్ రంగ ఎన్‌బీఎఫ్‌సీ దిగ్గజం సుందరం ఫైనాన్స్ ఈ ఆర్థిక సంవత్సరం (2024–25) మూడో త్రైమాసికంలో పటిష్ట ఫలితాలు సాధించింది. రుణ విడుదలలో వృద్ధి ప్రభావంతో వార్షికంగా, త్రైమాసికవారీగా నిర్వహణలోని ఆస్తుల విలువ(ఏయూఎం) 20 శాతం జంప్‌చేసింది. రుణ మంజూరీ 19 శాతం పుంజుకోవడంతో వివిధ రుణ విభాగాలలో మార్కెట్ వాటా బలపడింది. అయితే ఆస్తుల(రుణాలు) నాణ్యత స్వల్పంగా బలహీనపడింది. అయినప్పటికీ పరిశ్రమలోనే అత్యుత్తమ రుణ నాణ్యతను కలిగి ఉంది. ప్రస్తుత రుణ వసూళ్లు 91 శాతంగా నమోదయ్యాయి. ఆస్తులపై రాబడి(ఈల్డ్) పుంజుకోవడంతో త్రైమాసికవారీగా నికర వడ్డీ మార్జిన్లు(ఎన్ఐఎం) 0.4 శాతం మెరుగుపడ్డాయి. దీంతో నికర వడ్డీ ఆదాయం(ఎన్ఐఐ) వార్షికంగా 28 శాతం జంప్‌చేసింది. భవిష్యత్‌లో వడ్డీ రేట్లు దిగివస్తే ఎన్ఐఎం మరింత బలపడవచ్చని భావిస్తున్నాం. వార్షికంగా నిర్వహణ వ్యయాలు 9 శాతానికే పరిమితంకావడంతో ప్రొవిజన్లకు ముందు నిర్వహణ లాభం(పీపీవోపీ) 36 శాతం ఎగసింది. మూడు రెట్లు అధిక ప్రొవిజన్ల నేపథ్యంలో నికర లాభం వార్షికంగా 16 శాతం వృద్ధి చూపింది. ఈ నేపథ్యంలో త్రైమాసికవారీగా ఆర్‌వోఏ స్థిరత్వాన్ని ప్రదర్శిస్తూ 2.5 శాతంగా నమోదైంది. బడ్జెట్‌లో మౌలికసదుపాయాలకు కేంద్ర ప్రభుత్వ కేటాయింపుల కారణంగా వాణిజ్య వాహన విభాగానికి మద్దతు లభించనుంది. వెరసి ఆటో విడిభాగాల దిగ్గజ గ్రూప్ టీఎస్ఎఫ్‌కు చెందిన సుందరం ఫైనాన్స్ దీంతో లబ్ధి పొందే అవకాశముంది. మరోపక్క వాణిజ్య వాహనేతర విభాగాలలో విస్తరించడంతోపాటు అనుబంధ సంస్థల ప్రోత్సాహకర పనితీరు కంపెనీ షేరుకి ప్రీమియాన్ని ఆపాదిస్తున్నాయి.



పీఐ ఇండస్ట్రీస్ | బ్రోకరేజ్: కీనోట్ క్యాపిటల్స్ | కొనొచ్చు

ప్రస్తుత ధర: రూ. 3,457 టార్గెట్: రూ. 4,477

ఎందుకంటే: ప్రయివేట్ రంగ అగ్రో కెమికల్స్ దిగ్గజం పీఐ ఇండస్ట్రీస్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024–25) మూడో త్రైమాసికంలో అంచనాలకు అటూఇటుగా ఫలితాలు ప్రకటించింది. అక్టోబర్–డిసెంబర్(క్యూ3)లో ఆదాయం వార్షిక ప్రాతిపదికన నామమాత్ర(0.2 శాతం) వృద్ధి సాధించింది. ఇందుకు ఎగుమతులు 0.7 శాతం క్షీణించడం కొంతమేర ప్రభావం చూపింది. అయితే దేశీ బిజినెస్ 5 శాతం పుంజుకోవడం కొంతమేర ఆదాయంలో వృద్ధికి మద్దతిచ్చింది. నిర్వహణ లాభ(ఇబిటా) మార్జిన్లు వార్షికంగా 2.24 శాతం నీరసించాయి. ముడిసరుకులతోపాటు.. నిర్వహణా సంబంధ వ్యయాలు మార్జిన్లపై ప్రతికూల ప్రభావం చూపాయి. అయితే వరుసగా నాలుగో త్రైమాసికంలోనూ కంపెనీ ఎగుమతి మార్కెట్లలో 2 కొత్త ప్రొడక్టులను వాణిజ్య ప్రాతిపదికన ప్రవేశపెట్టింది. ఈ బాటలో దేశీయంగానూ మరో 2 ప్రొడక్టులను బ్రాండెడ్ బిజినెస్‌లో విడుదల చేసింది. సవాళ్లు విసురుతున్న స్థూల ఆర్థిక వాతావరణంలోనూ అమ్మకాలలో 8–9 శాతం వృద్ధిని కంపెనీ యాజమాన్యం అంచనా వేస్తోంది. భవిష్యత్‌లో పటిష్ట బిజినెస్ మిక్స్ నేపథ్యంలో 26–27 శాతం ఇబిటా మార్జిన్లు సాధించే వీలున్నట్లు విశ్వసిస్తోంది. ప్రపంచవ్యాప్తంగా ఆగ్రోకెమికల్స్ పరిశ్రమ సమస్యలు ఎదుర్కొంటున్నప్పటికీ పటిష్ట మార్జిన్లను అంచనా వేస్తోంది. ఈ ఏడాది క్యూ3లో అంతంతమాత్ర పనితీరు ప్రదర్శించినప్పటికీ సమర్థవంతంగా ప్రణాళికలను అమలు చేయగలదని భావిస్తున్నాం. ఫార్మా విభాగానికి జోష్‌నివ్వడంతోపాటు.. కస్టమర్ల అవసరాలకు అనుగుణంగా చేపట్టే కస్టమ్ సింథసిస్ తయారీ(సీఎస్ఎం) బిజినెస్‌ను క్రమంగా పెంచుకోనుంది. ఈ విభాగంలో మరింత లోతుగా విస్తరించే అవకాశముంది.



ఏంజెల్ వన్ నిఫ్టీ 1డీ రేట్ లిక్విడ్ ఈటీఎఫ్

ఏంజెల్ వన్ అసెట్ మేనేజ్‌మెంట్ తాజాగా నిఫ్టీ 1డీ రేట్ లిక్విడ్ ఈటీఎఫ్–గ్రోత్ ఫండ్‌ను ప్రవేశపెట్టింది. ఇది మార్చి 24 వరకు అందుబాటులో ఉంటుంది. ఇది నిఫ్టీ 1డీ రేట్ సూచీని ప్రతిబింబిస్తుంది. కనీసం రూ. 1,000 ఇన్వెస్ట్ చేయాల్సి ఉంటుంది. ఎక్కువగా రిస్కులను ఇష్టపడక, రోజువారీ కాంపౌండెడ్ రాబడులను అందించే సాధనాలను కోరుకునే ఇన్వెస్టర్లకు ఈ ఈటీఎఫ్ అనువుగా ఉంటుంది. ఇది ఓవర్‌నైట్ మెచ్యూరిటీ ఉండే ప్రభుత్వ సెక్యూరిటీలు లేదా ట్రెజరీ బిల్స్ సంబంధ ట్రై-పార్టీ రెపోస్ (టీఆర్ఈపీఎస్)లో ఇన్వెస్ట్ చేస్తుంది. ఇటు ఆదాయం అటు లిక్విడిటీపరంగా ఇది సురక్షితమైన సాధనంగా ఉంటుంది. దీనికి ఎంట్రీ, ఎగ్జిట్ లోడ్ ఉండవు. యూనిట్ల క్రయ, విక్రయాలపై సెక్యూరిటీస్ ట్రాన్సాక్షన్ ట్యాక్స్ ఉండదు.



నివా బూపా 'రైజ్' హెల్త్ ఇన్సూరెన్స్ పాలసీ



మధ్యతరగతి వర్గాల ఆదాయాలు, జీవన విధానాలకు అనుగుణంగా ఉండేలా హెల్త్ ఇన్సూరెన్స్ సంస్థ నివా బూపా 'రైజ్' పేరిట ఆరోగ్య బీమా పథకాన్ని ప్రవేశపెట్టింది. స్వయం ఉపాధి పొందుతున్నవారు, చిన్న వ్యాపారాలు చేసే వారు, స్థిరంగా నెలవారీ ఆదాయం ఉండని వర్గాలకు కూడా ఉపయోగపడే విధంగా అందుబాటు ప్రీమియంలతో ఇది ఉంటుంది. ఫ్లెక్సీ–పే బెనిఫిట్ ఫీచరుతో కస్టమర్లు ముందుగా ప్రీమియంలో 20 శాతమే చెల్లించి పాలసీ తీసుకుని, మిగతా మొత్తాన్ని పాలసీ వ్యవధిలో చెల్లించవచ్చు. ఎంత త్వరగా చెల్లించేస్తే అంత ఎక్కువగా డిస్కౌంటు పొందవచ్చు. ప్రభుత్వాసుపత్రిలో ఉచితంగా చికిత్స పొందినా స్మార్ట్ క్యాష్ బెనిఫిట్‌తో, చికిత్సానంతర వ్యయాల కోసం నిర్దిష్ట మొత్తాన్ని క్లెయిమ్ చేసుకోవచ్చు. ప్రీమియంలో 50 శాతం మొత్తానికి సరిపడేంతగా సమ్ ఇన్సూర్డ్‌ను పెంచే రిటర్న్ బెనిఫిట్, 16 ప్రాంతీయ భాషల్లో డాక్టర్లతో డిజిటల్ కన్సల్టేషన్లు తదితర ప్రయోజనాలను కూడా దీనితో పొందవచ్చు.


దీర్ఘకాలిక పొదుపు కోసం ఐసీఐసీఐ ప్రూ గిఫ్ట్ సెలెక్ట్



ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ లైఫ్ ఇన్సూరెన్స్ దీర్ఘకాలిక పొదుపు ప్రొడక్టు అయిన ఐసీఐసీఐ ప్రూ గిఫ్ట్ సెలెక్ట్‌ను ప్రవేశపెట్టింది. ఒకవైపు పెట్టుబడిని సంరక్షిస్తూనే మరోవైపు గ్యారంటీ రాబడిని అందించే విధంగా ఇది ఉంటుంది. ఏటా 5 శాతం చొప్పున పెరిగే ఆదాయం ఫీచరును జోడించడం వల్ల ద్రవ్యోల్బణాన్ని ఎదుర్కొనడంలో ఇది సహాయకరంగా ఉంటుందని సంస్థ చీఫ్ ప్రొడక్ట్ అండ్ డిస్ట్రిబ్యూషన్ ఆఫీసర్ అమిత్ పల్టా తెలిపారు.

టాటా ఏఐఏ ట్యాక్స్ బొనాంజా కన్జంప్షన్ ఫండ్

టాటా ఏఐఏ లైఫ్ ఇన్సూరెన్స్ కొత్తగా రెండు ఫండ్స్‌ను ఆవిష్కరించింది. ట్యాక్స్ బొనాంజా కన్జంప్షన్ ఫండ్, ట్యాక్స్ బొనాంజా కన్జంప్షన్ పెన్షన్ ఫండ్ వీటిలో ఉన్నాయి. ఇందులో మొదటిది సంపద సృష్టికి అలాగే ఆర్థిక భద్రతకు తోడ్పడుతుంది. రెండోది, రిటైర్మెంట్ తర్వాత ఆర్థిక అవసరాల కోసం పొదుపు చేసుకునేందుకు ఉపయోగపడుతుంది. ఈ రెండు న్యూ ఫండ్ ఆఫర్లు మార్చి 31తో ముగుస్తాయి. యూనిట్ ధర రూ. 10గా ఉంటుంది. పెరుగుతున్న వినియోగం వల్ల లబ్ధి పొందే కంపెనీల్లో ఇన్వెస్ట్ చేయడం ద్వారా వచ్చే ప్రయోజనాలను మదుపరులకు అందించే విధంగా ఈ ఫండ్స్ ఉంటాయి. ప్రధానంగా ఎఫ్ఎంసీజీ, రిటైల్..ఈ-కామర్స్, ఆటోమొబైల్స్.. ప్రీమియం ఉత్పత్తుల రంగాల సంస్థల్లో ఇవి ఇన్వెస్ట్ చేస్తాయి.



క్లుప్తంగా...

విశాఖలో నేటి ఐపీఎల్ మ్యాచ్‌కు గవర్నర్ రాక

- త్వరలో ఇక్కడ టీ20 మ్యాచ్‌ల నిర్వహణ
- ఉమెన్ వరల్డ్ కప్ మ్యాచ్‌లు కూడా..

శాఖ స్పోర్ట్స్ : ఢిల్లీ క్యాపిటల్స్, లక్నో సూపర్ జెయింట్స్ మధ్య విశాఖపట్నం వైఎస్సార్ ఏసీఏ–వీడీసీఏ స్టేడియంలో సోమవారం జరగనున్న ఐపీఎల్ క్రికెట్ మ్యాచ్‌ను గవర్నర్ అబ్దుల్ నజీర్ వీక్షించనున్నారు. ఇందుకోసం ఆయన ఆదివారం రాత్రి నగరానికి చేరుకున్నారు. ఈ సీజన్‌కు సంబంధించి ఇక్కడ జరగనున్న ఈ తొలి మ్యాచ్ నేపథ్యంలో.. ఏసీఏ అపెక్స్ కౌన్సిల్ అధ్యక్షుడు, ఎంపీ కేశినాని శివనాథ్ (చిన్ని) ఆదివారం మీడియాతో మాట్లాడుతూ.. ప్రారంభ మ్యాచ్‌ను వీక్షించేందుకు ముఖ్యమంత్రిని ఆహ్వానించగా పలు కార్యక్రమాలవల్ల ఆయన రావట్లేదని.. కానీ, గవర్నర్ అంగీకారం తెలిపినట్లు చెప్పారు. మరోవైపు.. ఉమెన్ వరల్డ్‌కప్ మ్యాచ్‌లకు విశాఖ ఆతిథ్యమివ్వనుందని, అయితే.. బీసీసీఐ నుంచి ఇంకా వివరాలు అందాల్సి వుందన్నారు. త్వరలోనే టీ20 మ్యాచ్‌ల్ని కూడా విశాఖలో నిర్వహించేందుకు ప్రయత్నాలు చేస్తున్నామన్నారు. ఇక విజయవాడలో అతిపెద్ద స్టేడియం నిర్మాణం అసంభవమని.. మోదీ స్టేడియంని మించి స్టేడియం కట్టడం సాధ్యపడే విషయం కాదని కేశినేని తేల్చిచెప్పారు. అమరావతి స్పోర్ట్స్ సిటీలో భాగంగా స్టేడియం నిర్మిస్తామని చెప్పారు. మంగళగిరి స్టేడియం కన్‌స్ట్రక్టింగ్ స్ట్రక్చర్లు పాడవడంతో కొన్ని స్టాండ్స్‌ను తొలగించాల్సి వస్తోందన్నారు. స్టేడియంను రంజీ మ్యాచ్‌లు, అకాడమి అవసరాలకే తప్ప అంతర్జాతీయ మ్యాచ్‌లకు వాడలేమన్నారు. ఏసీఏ అపెక్స్ కౌన్సిల్ కార్యదర్శి సానా సతీష్‌బాబు మాట్లాడుతూ.. ఏపీఎల్ నాలుగో సీజన్‌ను కొనసాగిస్తామన్నారు. మరింత మెరుగ్గా నిర్వహించేందుకు విధివిధానాలు మారుస్తున్నామని తెలిపారు. గవర్నింగ్ బాడీ ఎన్నికలు జరుగుతున్నాయని.. త్వరలోనే వాటి వివరాలు వెల్లడిస్తామన్నారు.

ముగిసిన ట్రిపుల్ ఐటీ విద్యార్థుల సమ్మేళనం

నూజివీడు: రాష్ట్రంలోని ట్రిపుల్ ఐటీల ద్వారా దేశానికి ఉపయోగపడే పౌరులను తీర్చేదిద్దే అవకాశం తనకు రావడం ఎంతో గర్వంగా ఉందని ఆర్జీయూకేటీ పూర్వ వైస్ చాన్స్‌లర్ ఆచార్య వి.రాజకుమార్ తెలిపారు. ఏలూరు జిల్లా నూజివీడు ట్రిపుల్‌ఐటీలో రెండు రోజుల పాటు నిర్వహించ తలపెట్టిన 2008 తొలి బ్యాచ్ విద్యార్థుల సమ్మేళనం ఆదివారంతో ముగిసింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న రాజ్‌కుమార్ మాట్లాడుతూ ఆనాటి సీఎం డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి సంకల్ప బలంతో వీటిని ఏర్పాటు చేశారని తెలిపారు. పూర్వ విద్యార్థులందరూ ప్రస్తుతం చదువుకుంటున్న విద్యార్థుల, ఆర్జీయూకేటీ అభివృద్ధికి తోడ్పాటును అందించాలని కోరారు. ప్రస్తుత వైస్ చాన్స్‌లర్ ఆచార్య ఎం.విజయ్‌కుమార్ మాట్లాడుతూ ట్రిపుల్ ఐటీల్లోని విద్యావిధానాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో నూజివీడు, ఒంగోలు, శ్రీకాకుళం డైరెక్టర్‌లు ఆచార్య సంద్ర అమరేంద్రకుమార్, భాస్కర పటేల్, కేవీడీజీ బాలాజీ తదితరులు పాల్గొన్నారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

ఉల్లాస్ పరీక్షకు 94.4 శాతం హాజరు

సాక్షి, అమరావతి: వయోజన విద్యను ప్రోత్సహించడంలో భాగంగా కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఉల్లాస్ (అండర్‌స్టాండింగ్ ఆఫ్ లైఫ్ లాంగ్ లెర్నింగ్ ఫర్ ఆల్ ఇన్ సొసైటీ) పరీక్ష విజయవంతమైనట్లు ఏపీ వయోజన విద్య డైరెక్టర్ కృతికా శుక్లా ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా సెప్టెంబర్ నుంచి 4,15,000 మంది అభ్యాసకులకు శిక్షణ తరగతులు నిర్వహించామని పేర్కొన్నారు. వారికి ఆదివారం పరీక్ష నిర్వహించగా 3,91,837 మంది (94.4 శాతం) హాజరైనట్టు వెల్లడించారు. రాష్ట్రంలో పరీక్ష నిర్వహణను ఢిల్లీ అడల్ట్ ఎడ్యుకేషన్ విభాగం అధికారి కుల్దీప్ పరిశీలించినట్లు పేర్కొన్నారు.

క్రికెట్ బెట్టింగ్‌లపై కఠిన చర్యలు

డీజీపీ హరీశ్‌కుమార్ గుప్తా

సాక్షి, అమరావతి: క్రికెట్ బెట్టింగ్‌లు నిర్వహించేవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని డీజీపీ హరీశ్‌కుమార్ గుప్తా హెచ్చరించారు. ఐపీఎల్ క్రికెట్ సీజన్ నేపథ్యంలో ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లలో బెట్టింగ్‌లు నిర్వహించేవారిని ఏమాత్రం ఉపేక్షించేది లేదని ఆయన ఆదివారం ఒక ప్రకటనలో స్పష్టం చేశారు. ఈ మేరకు విస్తృతంగా దాడులు నిర్వహించేందుకు ప్రత్యేక పోలీసు బృందాలను ఏర్పాటు చేశామని తెలిపారు. ప్రజలు వినోదం కోసమే క్రికెట్ చూడాలని, బెట్టింగ్‌లు వంటి వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. ఈ విషయంలో తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలని, తమ పిల్లల కదలికలపై ఓ కన్నేసి ఉంచాలని సూచించారు. బెట్టింగ్ కార్యకలాపాలకు సంబంధించిన సమాచారం ఉంటే పోలీసులకు తెలియజేయాలని ఆయన కోరారు.

పడిపోతే.. ఫట్

మారుతున్న జీవన శైలి, ఆహారపు అలవాట్లు ప్రజల ఆరోగ్యాన్ని తీవ్రంగా దెబ్బ తీస్తున్నాయి. ముఖ్యంగా శరీర నిర్మాణానికి ఆధారంగా నిలిచే ఎముకలు చాలా త్వరగా పటుత్వాన్ని కోల్పోతున్నాయి. చిన్నగా కాలు తడబడి కింద పడితే చాలు.. ఫట్‌మంటూ విరిగిపోతున్నాయి. ఇక ద్విచక్ర వాహనాల పైనుంచి పడితే మల్టిపుల్ ఫ్రాక్చర్లు అవడం అనేది సర్వసాధారణంగా మారిపోతోంది. చిన్నారుల నుంచి మూడు పదుల వయస్సు కూడా నిండని యువతలో సైతం ఎముకలు పటుత్వం తగ్గుతోంది. ఎముకలు గుల్లబారడం, బలహీనపడటం, తేలికగా విరిగిపోయే స్థితిని వైద్య పరిభాషలో (ఆస్టియోపారోసిస్) అంటారు. పౌష్టికాహార లోపం, వయోభారం, కాల్షియం, డి-విటమిన్ లోపం దీనికి ప్రధాన కారణాలని ఆర్థోపెడిక్ సర్జన్లు (ఎముకల శస్త్రచికిత్స నిపుణులు) చెబుతున్నారు. వీటికి తోడు హార్మోన్ల అసమతుల్యత, వారసత్వ (జెనెటిక్) ప్రభావం, మద్య పానం, ధూమపానం, శారీరక వ్యాయామం లేకపోవడం కూడా ఎముకల ఆరోగ్యంపై ప్రమాద ఘంటికలు మోగిస్తున్నాయి.

-సాక్షి ప్రతినిధి, కాకినాడ

- గుల్లబారుతున్న ఎముకలు
- వృద్ధులే కాదు.. యువతలోనూ సమస్య
- ఆస్టియోపొరోసిస్‌తో ప్రమాద ఘంటికలు
- ప్రతి ఐదుగురు మహిళల్లో ఇద్దరికి ముప్పు
- పోషకాహార లోపం, మారుతున్న జీవనశైలి కారణం



కాకినాడ ప్రభుత్వాస్పత్రి ఆర్థోపెడిక్ వార్డులో రోగులు



ఎముక పటుత్వాన్ని పరీక్షిస్తున్న నిపుణులు

అప్రమత్తతే ఆయుధం

చిన్నచిన్న గాయాలైనప్పుడు తక్కువ ఒత్తిడితో కూడా ఎముకలు విరిగిపోతుంటాయి. నడుము, వెన్నెముక, కాళ్లలో దీర్ఘకాలిక నొప్పులు, వెన్నెముక దెబ్బతినడం, ఎముకలు కుచించుకుపోయి ఎత్తు, పొడవు తగ్గడం, నడుము, మోకాళ్లు, భుజాల జాయింట్లలో నొప్పి, నిస్సత్తువ వంటి లక్షణాలున్న వారు వైద్యుల సూచనల మేరకు తప్పనిసరిగా తగిన పరీక్షలు చేయించుకోవాలి. ముఖ్యంగా బోన్ మినరల్ డెన్సిటీ (బీఎండీ), ఎముకల క్షీణతను గుర్తించే ఎక్స్‌రే, ఎంఆర్ఐ స్కాన్, కాల్షియం, విటమిన్–డి స్థాయి అంచనా వేసేందుకు రక్త, మూత్ర పరీక్షల వంటివి తప్పనిసరి అని వైద్యులు చెబుతున్నారు. 50 ఏళ్ల వయస్సు దాటిన మహిళలు, 65 ఏళ్లు పైబడిన పురుషులు ఆరు నెలలకోసారి వైద్యులను సంప్రదించి, ఈ పరీక్షలు చేయించుకోవాలి. కుటుంబంలో ఎవరికైనా ఆస్టియోపొరోసిస్ ఉన్నా, నీడ పట్టున, ఏసీలలో ఎక్కువ సమయం గడిపే ఉద్యోగులు, ఇతర వర్గాలు, ధూమపానం, మద్యపానం అలవాటు ఉన్న వారు, హార్మోన్ల అసమతుల్యత, పోషకాహార లోపంతో వివిధ అనారోగ్య సమస్యలు ఎదుర్కొంటున్న వారు కచ్చితంగా తగిన పరీక్షలు చేయించుకోవాలి.

యువతలో సైతం..

ఒకప్పుడు ఆరు పదుల వయస్సు మీద పడినా చాలా మందిలో ఎముకలు బలహీన పడటమనే సమస్య ఉండేది కాదు. మారిన జీవన విధానంతో ఇప్పుడా పరిస్థితి పూర్తిగా మారిపోయింది. ముఖ్యంగా ఆహార విధానంలో వస్తున్న మార్పులు ఎముకల పటుత్వాన్ని దెబ్బ తీస్తున్నాయని వైద్యులు చెబుతున్నారు. అందువల్లనే ఈ సమస్య ఇప్పుడు అన్ని వయస్సుల వారిలోనూ కనిపిస్తోందని అంటున్నారు. యువతలో ఈ సమస్య ఉంటే జువైనల్ ఆస్టియోపొరోసిస్ అని వైద్య పరిభాషలో పిలుస్తారు. ఆహారంలో పోషకాల లోపం ఉండటం, రోడ్డు పక్కన ఆహారం, జంక్ ఫుడ్ ఎక్కువగా తీసుకోవడం, హార్మోన్లు అవసరమైన స్థాయిలో ఉత్పత్తి కాకపోవడం, స్టెరాయిడ్ల వంటి మందులు అధికంగా వినియోగించడం, రుమటాయిడ్ ఆర్థ్రైటిస్, లూపస్ వంటి వ్యాధుల బారిన పడిన యువతీయువకులు ఎముకల పటుత్వం కోల్పోతున్నారని వైద్యులు నిర్ధారించారు. కాల్షియం లోపంతో పుట్టడం వలన కూడా ఎముకలు గుల్లబారుతుండటం ఇటీవల ఎక్కువైందని ఇటీవల కాకినాడ జీజీహెచ్ ఆర్థోపెడిక్ విభాగ వైద్యుల పరిశీలనలో తేలింది.

మహిళల్లో సైతం..

యువత తరువాత ఈ సమస్య మహిళల్లో తీవ్రంగా కనిపిస్తోందని వైద్యులు నిర్ధారించారు. ప్రతి ఐదుగురు మహిళల్లో కనీసం ఇద్దరు ఆస్టియోపొరోసిస్‌తో బాధ పడుతున్నారని చెబుతున్నారు. ముఖ్యంగా 50 సంవత్సరాలు దాటిన మహిళల్లో రుతుచక్రం ఆగిపోయే (మెనోపాజ్) దశలో ఈస్ట్రోజన్ హార్మోన్ ఉత్పత్తి తగ్గిపోతూ ఉంటుంది. దీనివలన ఎముకల సాంద్రత తగ్గిపోతుంది. అదే పురుషుల్లో అయితే 60 సంవత్సరాలు దాటిన వారిలో ఈ పరిస్థితి కనిపిస్తోంది. మహిళల్లోనే ఎక్కువగా ఎముకలు గుల్లబారడానికి హార్మోన్ల లోపం, శారీరక నిర్మాణం, జీవనశైలి ప్రధాన కారణాలని వైద్యులు చెబుతున్నారు. పురుషులతో పోలిస్తే మహిళల్లో ఎముకలు సన్నగా, సున్నితంగా ఉండటం కూడా మరో కారణమని అంటున్నారు. గర్భిణుల్లో ఉండే కొద్దిపాటి కాల్షియాన్ని గర్భంలో ఉండే బిడ్డకు కూడా అందుతుంటుంది. దీనివల్ల కూడా వారిలో ఎముకల పటుత్వం తగ్గుతుంది. అలాగే, పిల్లలకు పాలిచ్చే సమయంలో పోషకాహారం లేకపోవడంతో శరీరంలో కాల్షియం నిల్వలు తగ్గిపోయి, ఎముకలు గుల్లబారుతుంటాయి. పాలిసిస్టిక్ ఓవరీ డిజార్డర్ (పీసీఓడీ), థైరాయిడ్, గర్భాశయ తొలగింపు (హిస్టరెక్టమీ) వంటి వాటి వలన హార్మోన్లలో విపరీతమైన అసమతుల్యత ఏర్పడి, మహిళల్లో ఎముకలు గుల్లబారుతున్నాయని వైద్యులు చెబుతున్నారు.

ప్రతి నెలా 3 వేల మంది పైనే..

ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో కాకినాడ ప్రభుత్వ సామాన్య ఆస్పత్రి (జీజీహెచ్) ఎంతో ప్రధానమైనది. ఇక్కడకు కోనసీమ, రాజమహేంద్రవరం ప్రాంతాల నుంచే కాకుండా పొరుగున ఉన్న ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి సైతం అనేక మంది చికిత్స కోసం వస్తుంటారు. కేవలం ఈ ఒక్క ఆసుపత్రికే ప్రతి నెలా 3 వేల మందికి పైగానే రోగులు ఎముకల సంబంధిత సమస్యలతో వస్తున్నారు. ఇతర ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రులు కూడా కలిపితే ఈ సంఖ్య మరింత అధికంగా ఉంటుంది. దీనినిబట్టి సమస్య ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు.



నిర్లక్ష్యం చేయకండి



ఎముకల బలహీనత ఉందనే అనుమానం ఎవరికైనా ఉంటే తక్షణం కాకినాడ జీజీహెచ్‌కు రావాలి. బీఎండీ పరీక్షలు జీజీహెచ్‌లో ఉచితంగా చేస్తున్నాం. మందులు ఉచితంగా అందిస్తున్నాం. బీఎండీ పరీక్షల కోసం ప్రత్యేక క్యాంపులు కూడా నిర్వహిస్తున్నాం. ఆస్టియోపొరాసిస్ చిన్న సమస్య అని నిర్లక్ష్యం చేయకండి. దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తుల జీవిత కాలాన్ని కూడా ఇది ప్రభావితం చేస్తుంది. కాల్షియం, విటమిన్–డి ఉన్న పోషకాహారం తీసుకోవాలి. అధిక ప్రొటీన్ ఉండే ఆహారంతో పాటు సూర్యరశ్మిలో గడపడం, తగినంత నిద్ర మేలు చేస్తాయి. వయస్సును బట్టి కనీసం ఏడు గంటల నిద్ర ఉండాలి. వయస్సుతో సంబంధం లేకుండా వ్యాయామాలు కచ్చితంగా చేయాలి.

- డాక్టర్ ఎం.పాండురంగ విఠల్, ఆర్థోపెడిక్ విభాగాధిపతి, జీజీహెచ్, కాకినాడ

ఏడు నెలలుగా ఎముకల సమస్యలతో కాకినాడ జీజీహెచ్‌కు వచ్చిన రోగులు

నెల	రోగులు
2024 ఆగస్టు	2,891
సెప్టెంబర్	3,001
అక్టోబర్	3,169
నవంబర్	2,929
డిసెంబర్	3,315
2025 జనవరి	3,474
ఫిబ్రవరి	3,602

కోర్టు ప్రక్రియ అధ్యయనం న్యాయ విద్యార్థులకు కీలకం

హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ చీమలపాటి రవి, జస్టిస్ వెంకట జ్యోతిర్మయి





మాట్లాడుతున్న హైకోర్టు న్యాయమూర్తులు

విశాఖలీగల్ : న్యాయ విద్యార్థులు విద్యార్థి దశ నుంచే కోర్టు ప్రక్రియను అధ్యయనం చేయడం, న్యాయమూర్తులు ఎదుట తమ వాదన వినిపించడం వంటివి చేస్తే అవి వారి భావి జీవితానికి మేలు చేస్తాయని రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ చీమలపాటి రవి చెప్పారు. ఏయూలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ న్యాయ కళాశాలలో రెండు రోజులుగా నిర్వహిస్తున్న జాతీయ స్థాయి మూట్ కోర్టు పోటీలు ఆదివారం ముగిశాయి. దేశంలోని పలు విశ్వవిద్యాలయాల నుంచి విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆదివారం జరిగిన సభలో జస్టిస్ చీమలపాటి రవి మాట్లాడుతూ ప్రాథమిక స్థాయి నుంచే విద్యార్థులు తమ నైపుణ్యాలను మెరుగుపరుచుకోవాలన్నారు. న్యాయశాస్త్రం అధ్యయనం, ఉన్నత న్యాయస్థానాల తీర్పులపై విశ్లేషణల వంటివి న్యాయ విద్యార్థుల ఉజ్వల భవితకు పునాదిగా నిలుస్తాయని తెలిపారు. రాష్ట్ర హైకోర్టు మరో న్యాయమూర్తి జస్టిస్ వెంకటజ్యోతిర్మయి మాట్లాడుతూ న్యాయ పరిజ్ఞానం, సాంకేతిక విజ్ఞానం కలిగి ఉంటే న్యాయ విద్యార్థులకు మంచి అవకాశాలుంటాయన్నారు. వాక్పటిమ, అంశాల విశ్లేషణ, వివిధ సెక్షన్లపై సంపూర్ణ అవగాహన వంటివి న్యాయ విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దుతాయని చెప్పారు. కార్యక్రమంలో న్యాయ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య కె.సీతామాణిక్యం, పోటీల సమన్వయకర్త డాక్టర్ ఎల్‌వీకే ప్రసాద్, న్యాయమూర్తులు ఆలపాటి గిరిధర్, సాయి కళ్యాణ్‌చక్రవర్తి, జునైద్ అహ్మద్ మౌలానా, నేతి సత్యశ్రీ, విశాఖ న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు బెవర సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. కాగా, మూట్ కోర్టు పోటీల్లో ప్రథమ విజేతగా గీతం, ద్వితీయ స్థానంలో కేఎల్‌యూ న్యాయ కళాశాలల జట్లు నిలిచాయి. వీరికి హైకోర్టు న్యాయమూర్తులు బహుమతులను ప్రదానం చేశారు.

డీలిమిటేషన్‌తో దక్షిణాదికి అన్యాయం

సినీ నటుడు, దర్శకుడు నారాయణమూర్తి



నరసన్నపేట: జనాభా ప్రాతిపదికన పార్లమెంటరీ స్థానాలను నిర్ణయించేందుకు కేంద్రం చర్యలు తీసుకోవడాన్ని అన్ని పార్టీలు వ్యతిరేకించాలని, ఎన్డీఏ పార్టీలు కేంద్రం నిర్ణయాన్ని ప్రశ్నించాలని సినీ నటుడు, దర్శకుడు ఆర్.నారాయణమూర్తి కోరారు. శ్రీకాకుళం జిల్లా నరసన్నపేట మండలం కోమర్తిలో ఆదివారం నిర్వహించిన నక్సలైట్ నాయకుడు మామిడి అప్పలసూరి జీవిత చరిత్ర పుస్తకావిష్కరణ సభలో ఆయన మాట్లాడారు. జనాభా ప్రాతిపదికన ఎంపీ స్థానాలు పునర్వ్యవస్థీకరిస్తే దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం జరుగుతుందని, ఉత్తరాది రాష్ట్రాల ఆధిపత్యం మరింత పెరుగుతుందని అభిప్రాయపడ్డారు. టీడీపీ, జనసేన ఎన్డీఏ భాగస్వామ్య పార్టీలుగా ఉన్నందున వీరు కేంద్రాన్ని నిలదీయాలని కోరారు. డీలిమిటేషన్ వల్ల తెలుగు రాష్ట్రాలకు మేలు జరగాలే తప్ప నష్టం జరిగితే అన్ని రాజకీయ పార్టీలు ఏకమై కేంద్రం నిర్ణయాలను వ్యతిరేకించాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్, రచయిత అట్టాడ అప్పలనాయుడు పాల్గొన్నారు.

పాఠశాలల మూసివేత వెనుక మౌనం ఎందుకు!

నేషనల్ దళిత ఫోరం అధ్యక్షుడు ఆనగల్లు మునిరత్నం

సాక్షి, అమరావతి: ప్రభుత్వ పాఠశాలలను రాజకీయ కారణాలతో మూసివేసే ప్రయత్నాలు జరుగుతున్నాయని నేషనల్ దళిత ఫోరం అధ్యక్షుడు ఆనగల్లు మునిరత్నం ఓ ప్రకటనలో ఆరోపించారు. ప్రాథమిక పాఠశాలలు మూసివేసి కొన్ని సామాజిక వర్గాల విద్యార్థులను విద్యకు దూరం చేసి, వారిని పాలేర్లుగా మార్చే కుట్ర జరుగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం తీసుకువచ్చిన జీవో 117ను తీవ్రంగా వ్యతిరేకించిన ఉపాధ్యాయ సంఘాలు అదే విధానం చంద్రబాబు ప్రభుత్వం మరింత ఉగ్రరూపంలో అమలు చేస్తున్నా ఎందుకు మౌనంగా ఉన్నాయో తెలియడం లేదన్నారు. ప్రభుత్వ పాఠశాలల సంఖ్య తగ్గించడం వెనుక ప్రైవేట్ విద్యా సంస్థలకు లాభం చేకూర్చే విధానాలున్నాయన్నారు.

• తెలంగాణ

సొ‘రంగం’ వదిలేస్తారా?

- నెల రోజులైనా కానరాని గల్లంతైన కార్మికుల జాడ
- ఇప్పటివరకు ఎస్‌ఎల్‌బీసీ సొరంగం కూలిన చోటుకు పక్కనే తవ్వకాలు
- ఇక మిగిలింది సరిగ్గా ప్రమాదం జరిగిన చోట తవ్వకాలు జరపడమే
- అక్కడ తవ్వితే మళ్లీ సొరంగం కూలుతుందనే భయాందోళనలు
- నేడు సీఎం నేతృత్వంలో సమీక్ష.. సహాయక చర్యల కొనసాగింపుపై నిర్ణయం!



సొరంగంలోని ప్రమాదస్థలంలో మట్టి, శిథిలాలను తొలగిస్తున్న సహాయక బృందాలు

సాక్షి, హైదరాబాద్/నాగర్‌కర్నూల్: శ్రీశైలం ఎడమ గట్టు కాల్వ (ఎస్‌ఎల్‌బీసీ) సొరంగం సరిగ్గా ఎక్కడ కుప్పకూలిందో అక్కడ తవ్వకాలు జరిపేందుకు అవకాశాలు లేవా?.. సహాయక చర్యల్లో పాల్గొంటున్న కొందరు అధికారులు ఈ ప్రశ్నలకు అవుననే సమాధానమిస్తున్నారు. ఇప్పటివరకు సొరంగం పైకప్పు కూలిన ప్రాంతం నుంచి పక్కకు కొట్టుకువచ్చిన బండరాళ్లు, మట్టి, బురద, తుక్కును తొలగించారు. ఇక సొరంగం ఎక్కడైతే కూలిందో అక్కడ శిథిలాలను తొలగించాల్సి ఉండగా, అక్కడ తవ్వకాలు జరిపితే మళ్లీ సొరంగం కుప్పకూలి సహాయక సిబ్బందికి ప్రమాదం వాటిల్లవచ్చనే భయాందోళనలు వ్యక్తమవుతున్నాయి. ఈ పరిస్థితుల్లో సహాయక చర్యలు కొనసాగించాలా? లేక నిలుపుదల చేయాలా? అన్న ఆలోచనలో ప్రభుత్వం ఉన్నట్టు తెలిసింది. మొత్తం 12 ఏజెన్సీలు సహాయక చర్యల్లో పాల్గొంటుండగా, వారికి తోడుగా రాడార్లు, డ్రోన్లు, రోబోలు, ఎక్స్‌కవేటర్లను వాడినా ఆశించిన ఫలితాలు రాలేదు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం ఆలోచనలో పడినట్టు తెలుస్తోంది. సీఎం రేవంత్‌రెడ్డి అధ్యక్షతన సోమవారం హైదరాబాద్‌లో నిర్వహించనున్న ఉన్నత స్థాయి సమీక్షలో సహాయక చర్యల కొనసాగింపుపై స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

నెలరోజులు గడిచినా..

ఎమ్మార్పీ–ఎస్‌ఎల్‌బీసీ ప్రాజెక్టులో భాగంగా నాగర్‌కర్నూల్ జిల్లా దోమలపెంట (ఇన్‌లెట్) వద్ద నుంచి 13.94 కిలోమీటర్ల లోపలి వరకు సొరంగం–1 తవ్వకాలు పూర్తయ్యాయి. టన్నెల్ బోరింగ్ మెషిన్ (టీబీఎం)తో తవ్వకాలను అక్కడి నుంచి ముందుకు కొనసాగిస్తుండగా గత నెల 22న సొరంగం పైకప్పు కూలి 8 మంది కార్మికులు/ఉద్యోగులు గల్లంతైన విషయం తెలిసిందే. ప్రమాదం జరిగి నెల రోజులు గడిచిపోగా ఇప్పటివరకు ఒక కార్మికుడి మృత దేహాన్ని మాత్రమే వెలికితీయగలిగారు. భూగర్భంలో 400 మీటర్ల దిగువన సొరంగాన్ని నిర్మిస్తున్నారు. దీంతో పైకప్పు కూలినప్పుడు భారీ పరిమాణంలో బండరాళ్లు, మట్టి, శిథిలాలు ప్రమాద స్థలానికి రెండువైపులా గుట్టల్లా ఏర్పడ్డాయి. బయటికి వెళ్లే మార్గం వైపు పేరుకుపోయిన శిథిలాల తొలగింపు పనులు మాత్రమే చేపట్టగా, శనివారం నాటికి కార్మికుల ఆచూకీకి సంబంధించి డీ1 నుంచి డీ2గా గుర్తించిన ప్రాంతాల వరకు తవ్వకాలు పూర్తయ్యాయి. దీంతో ఆదివారం కన్వేయర్ బెల్ట్ నుంచి డీ2 ప్రాంతం దిశగా తవ్వకాలు ప్రారంభించారు. ఈ ప్రాంతాల్లో తవ్వకాలు కొంత ప్రమాదకరమైనా కొన్ని జాగ్రత్తలు తీసుకుని సింగరేణి రెస్క్యూ బృందాలు సాహసించి పనులు కొనసాగిస్తున్నాయి.

కూలిన చోట శిథిలాల కిందే మిగతా కార్మికులు!

కేరళ నుంచి రప్పించిన కడావర్ డాగ్స్ పసిగట్టిన ప్రాంతాలన్నింటిలో తవ్వకాలు పూర్తి చేయగా, డీ2 ప్రాంతంలో ఓ మృతదేహం లభ్యమైంది. మిగిలిన ప్రాంతాల్లో తవ్వకాలు జరిపినా ఇతర కార్మికుల జాడ తెలియరాలేదు. దీంతో గల్లంతైన వారు కచ్చితంగా సొరంగం కూలిన ప్రాంతంలో శిథిలాల కిందే ఉండవచ్చని సహాయ చర్యల్లో పాల్గొంటున్న అధికారులు అనుమానిస్తున్నారు. అయితే అక్కడ తవ్వకాలు జరిపితే సొరంగానికి పైన 400 మీటర్ల వరకు ఉన్న బండరాళ్లు, మట్టి మళ్లీ కూలి పడతాయా అనే ఆందోళన వ్యక్తం అవుతోంది. సొరంగానికి రక్షణలో భాగంగా కాంక్రీట్ సెగ్మెంట్లతో లైనింగ్ చేశారు. అయితే డీ1 ప్రాంతం నుంచి ఆవలి వైపు ఏర్పాటు చేసిన ఓ కాంక్రీట్ సెగ్మెంట్‌కి పగుళ్లు వచ్చాయి. రెండు వైపులా పేరుకుపోయిన ఉక్కు, ఇతర శిథిలాలు సపోర్టుగా ఉండడంతో ప్రస్తుతానికి ఆ సెగ్మెంట్ కూలిపోకుండా ఉంది. ఒకవేళ శిథిలాలను తొలగిస్తే వెంటనే దానితో పాటు సొరంగం కుప్పకూలే ప్రమాదం ఉంటుందని, సహాయక సిబ్బంది ప్రాణాలకు ముప్పు వాటిల్లవచ్చని అధికారులు పేర్కొంటున్నారు. ఈ నేపథ్యంలోనే సహాయక చర్యలు ఒకట్రెండు రోజులు నిలిపివేసి ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషించాలనే భావనలో ప్రభుత్వం ఉన్నట్టు తెలిసింది.

ఎన్జీఆర్ఐ నివేదిక కోసం నిరీక్షణ

సొరంగం కూలిన ప్రాంతంలో ఉపతరితల భాగం ఎంత మేర పటిష్టంగా ఉంది? ఎక్కడ బలహీనంగా ఉంది? తవ్వకాలను ముందుకు కొనసాగించవచ్చా? అనే అంశాలపై స్పష్టత వస్తేనే సహాయక చర్యలు ముందుకు కొనసాగనున్నాయి. దీనిపై ఇప్పటికే ఉపగ్రహ సహాయంతో అధ్యయనాలు నిర్వహించిన నేషనల్ జియోఫిజికల్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ (ఎన్జీఆర్ఐ) నిపుణులు ఈ నెల 25 లేదా 26న నివేదిక ఇస్తామని పేర్కొన్నట్టు తెలిసింది. కాగా ప్రత్యామ్నాయంగా సొరంగానికి ఉపరితలం నుంచి బోర్‌హోల్ చేసి గల్లంతైన కార్మికులను బయటకి తెచ్చేందుకు ఉన్న అవకాశాలను పరిశీలించాలని ప్రభుత్వం భావిస్తోంది. ఎన్జీఆర్ఐ ఇవ్వనున్న నివేదికపై ఈ నిర్ణయం ఆధారపడి ఉంది. సోమవారం నాటి సమీక్షకు ఎన్జీఆర్ఐ నిపుణులను సైతం ప్రభుత్వం ఆహ్వానించింది.

ప్రమాదం నుంచి రక్షణ కోసం ఫెన్సింగ్

సహాయక చర్యలు చేపడుతున్న సమయంలో సొరంగంలో పేరుకుపోయిన బురద, మట్టి శిథిలాలు ఒక్కసారిగా కొట్టుకువచ్చి సిబ్బందిని ముంచెత్తే ప్రమాదం ఉంది. అలాంటి పరిస్థితి ఏర్పడితే తప్పించుకోవడానికి బురదకు ఫెన్సింగ్ చేస్తున్నారు. బురద లోపల ఒత్తిడి పెరిగినప్పుడు ఫెన్సింగ్ ఉబ్బినట్టు అవుతుంది. దీనిని సంకేతంగా భావించి సహాయక సిబ్బంది అక్కడినుంచి తప్పించుకోవాల్సి ఉంటుంది. అలాగే ఫెన్సింగ్ వల్ల బురద ఒక్కసారిగా జారిపడకుండా సిబ్బందికి కొంత సమయం లభిస్తుందని అధికారులు అంటున్నారు. ప్రస్తుతం డీ2 ప్రాంతంలో ఫెన్సింగ్ ఏర్పాటు చేస్తున్నారు.

Published and printed by Dhananjaya Reddy Rakkasi on behalf of Jagati Publications Limited, Published from Vishnu Motor Plaza,2nd Floor, 31-A, Jawaharlal Nehru Road, Ekkattuthangal, Chennai -600 032 and Printed MNS Printers Private Limited, Survey no. 76/1, Noombal Village, Velappanchavadi, Poonamallee High Road, Chennai - 600 077. Jagati Publications Limited, Survey No.172, Vegata Village, Jadigenalhalli, Hoskote Taluk,Bangaluru Rural Dist, Impression Printing & Packaging Limited, C-18-19-20, Sector -59, Noida, Uttar Pradesh-201 301, Dangat Media Pvt Ltd.,22.Dighe MIDC, Navi Mumbai, Maharashtra- 400708.
EDITOR: Dhananjaya Reddy Rakkasi, (Responsible for selection of News under the PRB Act) RNI No:TNTEL/2008/25943